12-7Pg1exHMNWJQE.qxd:12-7Pg1exHMNWJQE.qxd 1/1/02 6:46 AM Page 1

సంచిక
సకల సాహిత్య సంకలనం
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విశాఖపట్నం
fb.com/vaartha Digital
Published from Visakhapatnam,Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
12-7-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 162 పేజీలు: 16 వెల: 8.00

భారత్‌లో భారీగా న్యూజిలాండ్ పెట్టుబడులు
నన్ను చంపితే ఇరాన్ పూర్తిగా ధ్వంసమే: ట్రంప్
5లో

## వియత్నాం విషాదం
# సముద్రంలో పడవ బోల్తా

15 మంది భారతీయులు మృతి

వారిలో ఎపికి చెందిన ముగ్గురు

పడవలో మొత్తం 36 మంది

బాధితులకోసం సహాయక కేంద్రాలు ఏర్పాటు

తమ పంపిణీదార్లను వియత్నాం ట్రిప్‌కు తీసుకెళ్లిన ఓ మొబైల్ కంపెనీ



సముద్రంలో బోల్తా పడిన పడవ

**హనోయ్/న్యూఢిల్లీ:** వియత్నాంలోని ఫు క్వోక్ ద్వీపం సమీపంలో శనివారం జరిగిన ఘోర పడవ ప్రమాదంలో కనీసం 15 మంది భారతీయులు మృతి చెందారు. మృతుల్లో 13 మంది పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నట్లు సమాచారం. మృతుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు ఉన్నారు.కడపజిల్లాకు చెందిన డిస్ట్రిబ్యూటర్ శ్రీధర్, మచిలీపట్నంకు చెందిన జయశ్రీలు మరణించినట్లు ధృవీకరించారు.మరో కడప పంపిణీదారు తీరంలోనే ఉండటంతో ప్రాణాలుదక్కించుకున్నాడు. మరోముగ్గురు ఎపి వాసులు >>2

**కడప, మచిలీపట్నం, హిందూపురం వాసులు ముగ్గురు మృతి** 2లో

## 'మైక్రో' వద్దు..
# ఉమ్మడి ముద్దు



## జనంతోనే అభివృద్ధి, భవిష్యత్తు

యువత నైపుణ్యం, వృద్ధుల అనుభవం సమాజానికి ఆస్తి

పిల్లలే సంపద కార్యక్రమానికి నాంది

ప్రపంచ జనాభా దినోత్సవంలో సీఎం చంద్రబాబు

**విజయవాడ, జూలై 11,ప్రభాతవార్తప్రతినిధి:** జనాభా నియంత్రణ కాకుండా జనాభా సంరక్షణ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సమీప భవిష్యత్తులోనే 'పిల్లలే సంపద' అనే మాటను నిజం చేసి చూపుతామని సిఎం అన్నారు. విజయవాడలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. గతంలో జనాభా నియంత్రణ కోసం ప్రభుత్వాలు పనిచేశాయని దీని కోసం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు కలిగిన వారిని అనర్హులు చేస్తూ నిబంధనలు కూడా తెచ్చామని... ప్రస్తుతం పరిస్థితులు మారాయని సిఎం స్పష్టంచేశారు. దీనికి అనుగుణంగా ఇప్పుడు విధానాలను మార్చుకోవాల్సిన తరుణం వచ్చేసిందని ఆయన స్పష్టం చేశారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ ఫెర్టిలిటీ రేట్ గణనీయంగా పెరగాల్సిన అవసరం ఉందని... భవిష్యత్తులో జనంతోనే అభివృద్ధి, జనాభా ఉంటేనే భవిష్యత్తుగా పరిస్థితులు మారతాయని ఆయన అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 40కి పైగాదేశాల్లో జనాభా తగ్గిపోతోందని ఆయనఅన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "పిల్లలే సంపద కార్యక్రమానికి ఇవాల్టి నుంచే నాంది పలకాలని భావిస్తున్నాం. దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని గురజాడ చెప్పిన మాటల్ని మరో మారు గుర్తు చేసుకోవాల్సిన అవసరం వచ్చింది. జనాభా నియంత్రణ కాదు జనాభా సంరక్షణ కార్యక్రమాల్ని ప్రభుత్వం చేపడుతుంది. గతంలో జనాభా నియంత్రణపై ఆలోచన చేశాం. దానికి అనుగుణంగా ప్రభుత్వాలు కార్యక్రమాలు చేపట్టాయి.

మహిళల్లో అక్షరాస్యత పెరిగితేనే జనాభా నియంత్రణ సాధ్యమని అప్పట్లో ఆలోచన చేశాం. స్థానిక సంస్థల్లో ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలుఉంటే పోటీకి అనర్హత అనే నిబంధనలు కూడా పెట్టాం. ఒక్కరు ముద్దు, ఇద్దరితో సరి, ముగ్గురు వద్దు అనే లాంటి ప్రచారాలు కూడా >>2



దిగ్గజ గాయని 'నైటింగేల్ ఆఫ్ సౌత్ ఇండియా'
# ఎస్ జానకి ఇక లేరు

## మైసూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత

48 వేలు పైగా పాటలు పాడిన గొప్ప గాయని

4 జాతీయ, 10 నంది అవార్డులు ఆమె సొంతం

కేరళం ప్రభుత్వం నుంచి 11 అవార్డులు

**హైదరాబాద్, జులై 11, ప్రభాతవార్త:** సుప్రసిద్ధ నేపథ్య గాయని ఎస్.జానకి కన్నుమూశారు. మైసూరులోని తన సొంత ఇంట్లో వుండగా శనివారం సాయంత్రం గుండెపోటుకు గురవడంతో కుటుంబ సభ్యులు వెంటనే అపోలో ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆమె వయస్సు 88 యేళ్లు. జానకి పూర్తి పేరు శిష్టా శ్రీరామమూర్తి జానకి. ఎపిలోని గుంటూరు జిల్లా రేపల్లె మండలం పల్లపట్లలో ఆమె 1938 ఏప్రిల్ 23న శ్రీరామ మూర్తి, సత్యవతి దంపతులకు జన్మించారు. జానకి తండ్రి ఉపాధ్యాయుడుగా ఆయుర్వేద వైద్యుడి గా సేవలందించారు. ఆ సమయంలో జానకి తండ్రి ఉద్యోగరీత్యా కొంత కాలం కరీంనగర్‌లోని సిరిసిల్లాలో పనిచేశారు. చిన్నతనం నుంచే సంగీతంపై మక్కువ పెంచుకున్న జానకి మూడేళ్ల వయస్సులోనే వేదికలపై పాటలు పాడేవారు. నాదస్వర విద్వాంసుడు పైడిస్వామి వద్ద జానకి సంగీత సాధన చేసి గాయనిగా పేరు సంపాదించారు. అప్పట్లో లతా మంగేష్కర్, జిక్కి, లీల వంటి గాయకులు ఆలపించిన పాటలను జానకి వివిధ కార్యక్రమాల్లో ఆలపించి అందరి మన్ననలు అందుకున్నారు. 19 ఏళ్ల వయస్సులో తన మామయ్య సూచన మేరకు చెన్నై చేరుకున్న జానకి ఎవిఎం స్టూడియోలో తొలిసారిగా గాత్రాన్ని విపించారు. దక్షిణాది భాషలైన తెలుగు, తమిళం, కన్నడ, మలయాళంలో 50 వేల పాటలు పాడిన >>2



## డి.సిఎం పవన్‌కు ముంబయిలో శస్త్రచికిత్స

కుడి భుజానికి మూడున్నర గంటలు సర్జరీ

**విజయవాడ,జులై11, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి శనివారం ఉదయం ముంబయిలో శస్త్ర చికిత్స జరిగింది. ఆయన రెండు భుజాలకు రొటేటర్ కఫ్ ఇంజ్యూరీస్ తీవ్రంగా ఉన్నాయి. ఇటీవల వైద్య పరీక్షలు నిర్వహించినప్పుడు వీలైనంత త్వరగా శస్త్ర చికిత్స అవసరమని వైద్య నిపుణులు స్పష్టం చేశారు. అప్పటికే పవన్ కల్యాణ్ నిర్వహించాల్సిన అధికారిక కార్యక్రమాలు నిర్ణయం అయినందున వాటిని ముగించుకొన్న తరువాత శస్త్రచికిత్స చేయించుకొంటాను అని పవన్ కల్యాణ్ వైద్యులకు >>2

# సముద్ర రక్షణలో భారత్‌కు కొత్త శక్తి

అత్యాధునిక స్టెల్త్ యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ మహేంద్రగిరి'ని నౌకాదళంలో ప్రవేశపెట్టిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

ఆత్మనిర్భర్ భారత్‌కు మరో మైలురాయి



'ఐఎన్ఎస్ మహేంద్రగిరి'



శనివారం విశాఖలో 'ఐఎన్ఎస్ మహేంద్రగిరి'ని నౌకాదళానికి అందజేసిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్

**విశాఖపట్నం, జులై 11, ప్రభాతవార్త :** భారత నౌకాదళ శక్తిని మరింత పటిష్ఠం చేస్తూ స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన అత్యాధునిక స్టెల్త్ యుద్ధనౌక 'ఐఎన్ఎస్ మహేంద్రగిరి' శనివారం విశాఖలో ఘనంగా భారత నౌకాదళంలో చేరింది. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమక్షంలో జరిగిన కమిషనింగ్ కార్యక్రమం భారత రక్షణ రంగ స్వావలంబనకు మరో చారిత్రక ఘట్టంగా నిలిచింది.75 శాతానికి పైగా స్వదేశీ విడిభాగాలతో నిర్మితమైన ఈ యుద్ధనౌక ప్రాజెక్ట్ 17ఎ కింద రూపొందించిన ఆరో స్టెల్త్ ఫ్రిగేట్. భారత నౌకాదళ వార్‌షిప్ డిజైన్ బ్యూరో రూపకల్పన చేయగా, మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ నిర్మించింది. సుమారు 6,670 టన్నుల సామర్థ్యంతో, గంటకు 28 నాట్స్ వేగంతో ప్రయాణించే ఈ యుద్ధనౌక వైమానిక, సముద్ర ఉపరితల, జలాంతర్గామి దాడులను సమర్థంగా తిప్పి కొట్టే అత్యాధునిక సామర్థ్యాలనుకలిగిఉంది. ఈ సంద >>2

## ఉద్యోగుల సమస్యలు
# పరిష్కరిస్తాం

మంత్రులు పార్థసారధి, సత్యప్రసాద్ హామీ

21న జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం



శనివారం మీడియా సమావేశంలో మంత్రులు పార్థసారధి, సత్యప్రసాద్

**విజయవాడ:జూలై 11,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం పూర్తి సానుకూలంగా ఉందని సమాచారపౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి,రాష్ట్ర రెవెన్యూ,రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ లు స్పష్టం చేశారు.ఎపి సచివాలయంలో ఎపి జెఎసి అమరావతి ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో శనివారం ఇరువురు మంత్రుల నేతృత్వంలో సమావేశమై ఉద్యోగులకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రాధమికంగా చర్చించారు.ఈసమావేశం అనంతరం మంత్రులు ఇరువురు మీడియాతో మాట్లాడగా ముందుగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ ఈసమావేశంలో రాష్ట్ర ఆర్థిమంత్రి వర్యులు పయ్యావుల కేశవ్ హాజరు కావాల్సిఉండగా ముందస్తు కార్యక్రమాలు మూలంగా ఆయన రాలేక పోయారని స్పష్టంచేశారు.గత ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పట్టించుకోకుండా సమస్యలను ప్రక్కన పెట్టడంతో ఈసమస్య వచ్చిందని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మొత్తం 23 డిమాండ్లను ఇవ్వడం జరిగిందని వాటన్నిటినీ మంత్రులు ఇరువురం క్షుణ్ణంగా పరిశీలించడం జరిగిందని ఉద్యోగుల సమస్యల పట్ల ముఖ్యమంత్రి పూర్తి సానుకూలంగా ఉన్నారని అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను కూడా >>2

## నాగరాజు పోలీస్ కస్టడీ విచారణపై సుప్రీంకోర్టుకు సిట్

**విజయవాడ.జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో తీవ్ర సంచలనం సృష్టించిన సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసు విచారణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా ఒక కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కృష్ణలంక మాజీ సిఐ నాగరాజు పోలీస్ కస్టడీ విచారణపై రాష్ట్ర హైకోర్టు విధించిన కఠినమైన నిబంధనలను సవాలు చేస్తూ ప్రత్యేక దర్యాప్తు బృందం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు పెట్టిన కొన్ని నిబంధనలు దర్యాప్తు స్వేచ్ఛను హరించేలా ఉన్నాయంటూ ప్రభుత్వం ఈ పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేసింది. ముఖ్యంగా నిందితుడి ట్రాన్సిట్ సమయంలో పూర్తి నిడివి వీడియో రికార్డింగ్ చేయాలన్న హైకోర్టు షరతును సిట్‌అధికారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీనివల్ల అత్యంత కీలకమైన ఈ కేసు దర్యాప్తులో గోప్యతదెబ్బతినే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# కరోనా వ్యాప్తికి అడ్డుకట్ట వేయండి

## నిబంధనలు కచ్చితంగా పాటించండి: మంత్రి సవిత

**విజయవాడ, జులై 11,ప్రభాతవార్తప్రతినిధి:** కడప జిల్లాలో కరోనా మహమ్మారి వ్యాప్తి చెందకుండా అడ్డుకట్ట వేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత ఆదేశించారు. అదే సమయంలో కరోనా నివారణపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, కొవిడ్ 19 నిబంధనలు అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ శ్రీధర్‌ను, డిఎంహెచ్ఒ రవిబాబును ఫోన్లో ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కడపలో ఎనిమిది కరోనా కేసులు నమోదు కావడమే కాకుండా ఇద్దరు మృతి చెందడంపై జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత ఆందోళన వ్యక్తంచేశారు. తక్షణమే కరోనా కేసులు నమోదైన ప్రాంతాల్లో కొవిడ్ 19 నిబంధనలు అమలు చేయాలని ఆదేశించారు. స్థానికుల్లో కరోనా నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రద్దీగా ఉండే ప్రదేశాలు, ఆసుపత్రుల వద్ద మాస్కులు వాడకం తప్పనిసరి చేయాలన్నారు. జ్వరం, దగ్గు, ఇతర కోవిడ్ లక్షణాలున్న వారిని గుర్తించి ఐసోలేషన్ వార్డుకు తరలించాలన్నారు. కలెక్టర్ శ్రీధర్, డిఎంహెచ్ఒ రవిబాబు మాట్లాడుతూ, ఎనిమిది కరోనా కేసులు మినహా కొత్తగా కేసులు నమోదు కాలేదన్నారు. ప్రస్తుత కరోనా వెరియంట్ వ్యాప్తిపై శాంపిళ్లను పూణే ల్యాబ్‌కు పంపామన్నారు. ప్రస్తుతం నమోదైన కరోనా వేగవంతంగా వ్యాప్తి చెందుతుందా... నెమ్మదిగా సోకుతుందా? అనేది ల్యాబ్ నుంచి వచ్చే రిపోర్టులో వెల్లడవుతుందన్నారు. ఇప్పటికే కరోనా కేసులు నమోదైన ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టామని, బ్లీచింగ్ వెదజల్లామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, కరోనా నమోదైన కుటుంబాల్లో సభ్యులకు కూడా తక్షణమే పరీక్షలు నిర్వహించి, పాజిటివ్ >>2

# తుపాకీ కంటే కలం గొప్పది



శనివారం 3వ అంతర్జాతీయ తెలుగు రచయిత్రుల మహాసభలో ప్రసంగిస్తున్న మంత్రి అనిత

పుస్తకమే సమాజాన్ని మారుస్తుంది

తెలుగు భాష, మహిళా గౌరవ పరిరక్షణ ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడి బాధ్యత

3వ అంతర్జాతీయ తెలుగు రచయిత్రుల మహాసభల్లో హోంమంత్రి అనిత

**విజయవాడ,జూలై 11వ,ప్రభాతవార్త ప్రతినిధి:** మహిళలకు మాత్రమే కాదు... అబ్బాయిలకు కూడా విలువలు, గౌరవం నేర్పించే సమయం వచ్చిందని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు.'అమ్మ' అనే ఒక్క పదంలోనే తెలుగు మమకారం, సంస్కృతి, ఆత్మీయత అంతా నిక్షిప్తమై ఉంది"ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత విద్యాశాఖా మండలి వెంకట కృష్ణారావు శతజయంతి సందర్భంగా నిర్వహించిన 3వ అంతర్జాతీయ తెలుగు రచయిత్రుల మహాసభలు-2026'లోహోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలుగు భాష, సాహిత్యం, మహిళా సాధికారత, పుస్తక పఠనం, సామాజిక విలువలు, మహిళల గౌరవ పరిరక్షణ వంటి అంశాలపై మంత్రి మాట్లాడుతూ దివిసీమ గాంధీగా పేరుపొందిన మండలి వెంకట కృష్ణారావు తెలుగుభాష, తెలుగు సంస్కృతి, సామాజిక సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. 1975లో హైదరాబాద్‌లో జరిగిన తొలి ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణలో కీలకపాత్రపోషించి, ప్రపంచవ్యాప్తంగాఉన్న తెలుగు వారిని ఒకే వేదికపైకి తీసుకురావడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. తెలుగు భాషకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకురావడంలో ఆయన సేవలు తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. మండలి కుటుంబం తెలుగు భాషా పరిరక్షణను వారసత్వంగా కొనసాగిస్తోందని పేర్కొంటూ మండలి బుద్ధప్రసాద్ గారిని అభినందించారు. 2014లో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో డిప్యూటీ స్పీకర్‌గా >>2

12-7pg2exHMNWJQE.qxd:12-7pg2exHMNWJQE.qxd 1/1/02 6:45 AM Page 1





శనివారం విశాఖపట్నంలో ఐఎన్ఎస్ మహేంద్రగిరి ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

# సముద్రంలో పడవ బోల్తా

>> ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పర్యాటకులతో ప్రయాణిస్తున్న పడవ బలమైన గాలులు, అలల కారణంగా బోల్తా పడింది. ప్రమాద సమయంలో పడవలో మొత్తం 36 మంది ఉన్నారు.ప్రమాదం అనంతరం 21 మందిని సహాయక బృందాలు రక్షించి ఆస్పత్రులకు తరలించాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వియత్నాం ప్రభుత్వ మీడియా వెల్లడించింది. మిగిలిన వారి కోసం స్థానిక అధికారులు గాలింపు, సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు.స్థానిక మీడియా కథనాల ప్రకారం పడవలో 32 మంది భారతీయ పర్యాటకులు, ముగ్గురు సిబ్బంది, సహాయకుడు ప్రయాణిస్తున్నారు. హోన్ మే రుట్ స్గోయి ద్వీపం నుంచి ఆన్ థోయ్ నౌకాశ్రయానికి బయలుదేరిన కొద్దిసేపటికే బలమైన గాలులు, ఎత్తైన అలల కారణంగా పడవ బోల్తా పడింది. దీంతో ప్రయాణికులు, సిబ్బంది అంతా నీటిలో పడిపోయారు.ఈ ఘటనపై భారత రాయబార కార్యాలయం స్పందించింది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, స్థానిక అధికారులు సహాయక చర్యలు కొనసాగిస్తున్నారని తెలిపింది. బాధితులకు అవసరమైన కాన్సులర్ సేవలు అందించేందుకు భారత రాయబారి, రాయబార కార్యాలయ అధికారులు ఫు క్వోక్ ద్వీపానికి బయలుదేరినట్లు వెల్లడించింది. దక్షిణ భారతానికి చెందిన మొబైల్ డిస్ట్రిబ్యూటర్లు, ఉద్యోగులు మొత్తం 110 మంది విహారయాత్ర కోసం వియత్నాం వెళ్లినట్లు సమాచారం.ఈ విషాద ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. సహాయక చర్యలను మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం, విదేశాంగ మంత్రిత్వ శాఖ వియత్నాం అధికారులతో సన్నిహితంగా పనిచేయాలని కోరారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఇంకా గల్లంతైన వారి కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు ధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ఈ ప్రమాదంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. బాధితుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పర్యాటకులు ఉన్నారనే సమాచారం నేపథ్యంలో ఢిల్లీలోని ఏపి భవన్ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల నుంచి వివరాలు కోరారు. విహారయాత్రకు వెళ్లిన రాష్ట్రానికి చెందిన కొందరు ఈ ప్రమాదంలో చిక్కుకుని ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపినట్లు సమాచారం.బాధితులు, వారి కుటుంబాలకు అవసరమైన సహాయం అందేలా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని నారా లోకేష్ అధికారులను ఆదేశించారు.

ఒక మొబైల్‌కంపెనీ భారత్‌నుంచి తమ పంపిణీదార్ల కుటుంబాలను వియత్నాం ట్రిప్‌కు తీసుకెళ్లింది. మొత్తం 250 మంది ఈ యాత్రకువెళ్లారు. ఎపినుంచి 35, తెలంగాణనుంచి 40 మందివరకూ ఉన్నారు. ట్రిప్‌లోభాగంగా మూడుపడవల్లో సముద్రంలో విహార యాత్రకువెళ్లారు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో హాన్‌మేరుట్‌నుంచి అన్‌థోయ్‌పోర్టుకు ఒక స్పీడ్‌బోట్ బయలుదేరింది. అందులో 32 మంది భారతీయులు నలుగురు సిబ్బంది ఉన్నారు. పడవ తీరానికి 400మీటర్ల దూరంలోఉండగా ఒక్కసారిగా బోల్తాపడింది. దీనితోప్రయాణీకులు నీటిలోమునిగిపోయారు. సమీపంలోని ఇతర పార్యటక బోట్లనిర్వాహకులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలుచేపట్టారు. గల్లంతయిన వారికోసం గాలింపు జరుగుతోంది. బోటులో ప్రయాణించిన 32 మంది ప్రయాణీకుల జాబితాను భారత రాయబార కార్యాలయం విడుదలచేసింది.

# కడప, మచిలీపట్నం, హిందూపురం వాసులు ముగ్గురు మృతి

**విజయవాడ, జులై 11, ప్రభాతవార్తప్రతినిధి:** వియత్నాం ఫూ క్వాక్ ద్వీపం సమీపంలో స్పీడ్ బోటు బోల్తా పడింది. ఈ ఘటనలో 15 మంది భారత టూరిస్టులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ప్రాథమిక సమాచారాన్ని అనుసరించి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు టూరిస్టులున్నారు. ఇద్దరి పరిస్దితి విషమంగా ఉంది.కడప జిల్లాకు చెందిన డిస్ట్రిబ్యూటర్ శ్రీధర్, మచిలీపట్నంకు చెందిన జయశ్రీ, హిందూపురానికి చెందిన రవితేజ మరణించారు. కడపకుచెందిన మరో డిస్ట్రిబ్యూటర్ నయీం ఒడ్డునఉండటంతో ప్రాణాలు దక్కించుకున్నారు. మరొకరు బందరువాసి గెల్లి కిశోర్‌కు తీవ్ర అస్వస్థతకుగురై పరిస్థితి విషమంగా ఉంది.



మృతి చెందిన శ్రీధర్ (ఫైల్)



మృతిచెందిన జయశ్రీ (ఫైల్)

**సంఘటనపై మంత్రి లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి, తక్షణ సాయం కోసం ఆదేశాలు**

వియత్నాంలో జరిగిన బోటు ప్రమాదంపై అక్కడి భారత ఎంబసీ అధికారులతో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌మాట్లాడారు. తక్షణ సాయం అందేలా చూడాలని లోకేష్ కోరారు. తెలుగు వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. బాధితులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందన్నారు. వియత్నాంలో జరిగిన బోటు ప్రమాద ఘటనపై దేశ, రాష్ట్ర ఉన్నతాధికారు లతో మంత్రి నారా లోకేష్ మాట్లాడారు. ఢిలీంలలోని ఎపి భవన్ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బోటు ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన వారు ప్రాణాపాయంలో చిక్కుకున్నారన్న సమాచారంపై అధికారులను వివరాలు ఆరా తీశారు. ఎపినుంచి విహారయాత్రకు వెళ్లిన పర్యాటకులు ప్రమాదంలో చిక్కుకున్నట్లు తెలుస్తోందని అధికారులు తెలిపారు. బోటు ప్రమాదంపై వియత్నాంలోని భారత రాయబార కార్యాలయంతో మాట్లాడుతున్నట్లు మంత్రి దృష్టికి తెచ్చారు. కేంద్రం ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని బాధితులకు సహాయం అందించాలని లోకేష్ సూచించారు.

# కరోనా వ్యాప్తికి అడ్డుకట్ట వేయండి

>>నమోదయితే వారిని కూడా ఐసోలేషన్ వార్డుకు తరలించాలన్నారు. నెగిటివ్ వస్తే... కొద్ది రోజుల పాటు వారి ఇళ్లల్లోనే ఐసోలేషన్‌లో ఉంచాలని తెలిపారు. మరోమరణం సంభవించకుండా, ప్రస్తుతం ఐసోలేషన్ వార్డులో ఉన్నవారికి మెరుగైన వైద్యసేవలుఅందించాలని, జిల్లా కలెక్టర్ సీహెచ్ శ్రీధర్‌ను, డిఎంహెచ్ఓ రవిబాబుకు మంత్రి సవిత ఫోన్లో స్పష్టంచేశారు. వియత్నాం సందర్శనకు వెళ్లిన కడప వాసి, ఆ దేశంలో జరిగిన బోటు ప్రమాదంలో మృతి చెందడంపై జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆ దేశంలో జరిగిన బోటు ప్రమాదంలో ముడియం శ్రీధర్ సహా 15 మంది మృత్యువాతపడడం బాధాకరమన్నారు. సంతోషంగా ముగియాల్సిన విదేశీ టూర్ విషాదంగా ముగియడంపై ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని మంత్రి సవిత వ్యక్తంచేశారు.

# 'మైక్రో' వద్దు.. ఉమ్మడి ముద్దు

>> చేశాం. 20 యేళ్ల క్రితం ఐటి లాంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని సంపద సృష్టించాం. అప్పుడు ఐటి, ఇప్పుడు ఎఐ గురించి మాట్లాడుతున్నాను. జనాభా నిర్వహణ గురించి కూడా చర్చిస్తున్నాం. ఆడబిడ్డల్ని చదివిస్తేనే కుటుంబానికి ఆస్తి, గతంలో వరకట్నం ఉండేది ఇప్పుడు ఎదురు కట్నం అనే పరిస్థితి వచ్చింది. అందుకే మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ గురించి మాట్లాడుతున్నాం. టోటల్ ఫెర్టిలిటీ రేటు మన రాష్ట్రంలోనూ పెరగాల్సి ఉంది. ఎలాంటి అభివృద్ధి అయినా జనాభా ఉంటేనే అది సార్ధకం అవుతుంది" అని ముఖ్యమంత్రి అన్నారు.

ప్రపంచవ్యాప్తంగా 40 దేశాల్లో జనాభా గణనీయంగా తగ్గిపోతోంది. భారత్‌లో దక్షిణాది రాష్ట్రాల పరిస్థితి కూడా అదే. మన అభివృద్ధి సంతులనం కావాలంటే జనాభా నిర్వహణ చాలా కీలకం. అంగన్‌వాడీలు, పాఠశాలల్లోనూ చిన్నారుల సంఖ్య తగ్గుతోంది. వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. ప్రతీ వంద మంది జనాభాలో 89శాతం మందికి రెండో సంతానం లేదు. ఎపిలోని విశాఖ లాంటి జిల్లాల్లోనూ ఫెర్టిలిటీ రేటు అతి తక్కువగా ఉంది. ఎపి విస్తీర్ణంలో 7 స్థానంలో ఉన్నా పాపులేషన్ డెన్సిటీలో దిగువన ఉన్నాం. పిల్లలే మన రాష్ట్ర సంపద. వారితోనే ఆర్థిక ప్రగతి. సరిపడా జనాభా లేకుంటే అనేక సమస్యలు ఉత్పన్నం అవుతాయి. ఆర్థిక ప్రగతి సాధించేలా రాష్ట్రంలో వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నాం. మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తున్నాం. పీ4 ద్వారా పేదల జీవన ప్రమాణాలు పెంచుతున్నాం. అభివృద్ధి ప్రాజెక్టులు కూడా సమతూకంలో జరగాలనే అన్ని ప్రాంతాలకూ పరిశ్రమలు, ప్రాజెక్టులు వచ్చేలా చూస్తున్నాం. ఆర్థిక అసమానతలు తగ్గించి అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. జనాభా సంరక్షణ అనేదే ఈ సమయంలో కీలకం. జనాభా పెంచాలని మాట్లాడితే విమర్శలు వచ్చాయి. పిల్లలను పెంచటం అనేది కేవలం మహిళలు ఒక్కరిదే బాధ్యత మాత్రమే కాదు అది ఉమ్మడి బాధ్యత. కాన్పుల్లో సిజేరియన్ ఆపరేషన్లు తగ్గాలి. మహిళల ఆరోగ్య రక్షణ అత్యంత కీలకం. జనాభా నిర్వహణ ఇక ఓ వాస్తవిక అంశం అని గుర్తించాలి. సంతానం వద్దనుకునే దంపతులు పెరగటం దురదృష్టకరం. మైక్రో ఫ్యామిలీలు వద్దుభారతీయ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ప్రపంచానికి ఆదర్శం. పిల్లలే సంపద ఉమ్మడి కుటుంబమే శ్రీరామ రక్ష" అని ముఖ్యమంత్రి వివరించారు

**సామాజిక మాధ్యమాలతో మానసిక సమస్యలు..**

"ఇవాళ తెలంగాణాలో జరిగిన ఘటన అత్యంత బాధాకరం. పోక్సో కేసులో ఉన్న నిందితుడు తనపై కేసు పెట్టిన వారి కుటుంబంలో 6 గురిని హత్య చేశాడు. అత్యంత దారుణమైన ఘటన ఇది. సామాజిక మాధ్యమాలు బాధ్యతారహితంగా వినియోగించటం, అసభ్యకరమైన, హింసాత్మక దృశ్యాల కారణంగా మానసిక సంతులన కోల్పోతున్నారు. విలువైన సమయాన్ని కూడా వృధా చేసుకుంటున్నారు. సోషల్ మీడియా వ్యసనంగా మారితే ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తుతాయి. టెక్నాలజీ స్పిర్చువాలిటీ ద్వారా యువతకు ప్రపంచాన్ని జయించే శక్తి సొంతం అవుతుంది. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం సంజీవని కార్యక్రమం చేపట్టాం. యువతతో పాటు వృద్ధులు సమాజానికి ఆస్తిగా తయారు కావాలి. త్వరలో ప్రభుత్వం వృద్ధుల కోసం క్షేమం అనే కార్యక్రమాన్ని తీసుకురావాలని ఆలోచన చేస్తోంది. నిరంతరం నైపుణ్యాలను అందిపుచ్చు కుంటేనే అత్యుత్తమ మానవ వనరులు దేశానికి అందుతాయి. టెక్నాలజీ నాలెడ్జి ఉన్నా దేశంలో చాలా రంగాల్లో నాయకత్వ లేమి ఉంది. అంగన్‌వాడీల నుంచే పిల్లల ఆరోగ్యంతో పాటు పౌష్టిక ఆహారం అందిస్తున్నాం. పాఠశాలల్లో విద్య అందించేందుకు తల్లికి వందనం కింద ప్రతీ ఒక్కరికీ రూ.15వేల చొప్పున ఇస్తున్నాం. 2047 నాటికి మన తలసరి ఆదాయం రూ.55 లక్షలకు చేర్చాలన్నదే నా సంకల్పం. జనాభా లేకపోతే మనం చేసుకున్న అభివృద్ధి లక్ష్యాలను సాధించలేం. 2040కే స్వర్ణాంధ్ర సాధించే సత్తామనకుంది." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అనంతరం పాపులేషన్ మేనేజ్మెంట్ ఫ్రేమ్ వర్క్ డాక్యుమెంటేషన్‌ను ముఖ్యమంత్రి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు శాసనసభ్యులు గద్దే రామ్మోహన్ రావు, వైద్యారోగ్యం కుటంబ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీషా తదితరులు హాజరయ్యారు.

# సముద్ర రక్షణలో భారత్‌కు కొత్త శక్తి

>> ర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, "ఐఎన్ఎస్ మహేంద్రగిరి కేవలం యుద్ధనౌక మాత్రమే కాదు.. సాంకేతికంగా అత్యాధునిక, యుద్ధ సన్నద్ధ భారత నౌకాదళ నిర్మాణానికి ప్రతీక. ఇది ఆత్మనిర్భర్ భారత్ సంకల్పానికి మరో గర్వకారణం" అని పేర్కొన్నారు.ఈ నౌకలో బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్షిపణులు, మధ్యశ్రేణి వైమానిక రక్షణ క్షిపణులు, జలాంతర్గామి నిరోధక ఆయుధాలు, అత్యాధునిక రాడార్ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ పరికరాలు, మల్టీ రోల్ హెలికాప్టర్, అత్యాధునిక స్టెల్త్ సాంకేతికతను అమర్చారు. దీంతో భారత సముద్ర సరిహద్దుల రక్షణతో పాటు హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత వ్యూహాత్మక ఆధిపత్యం మరింత బలోపేతం కానుంది.డ్రోన్లు, కృత్రిమ మేధస్సు, సైబర్ యుద్ధం, హైపర్‌సోనిక్ ఆయుధాలు వంటి ఆధునిక సవాళ్లు పెరుగుతున్న నేపథ్యంలో తదుపరి తరం సాంకేతికతలో భారీగా పెట్టుబడులు పెడుతూనే సంప్రదాయ సైనిక సామర్థ్యాలను కూడా మరింత బలోపేతం చేస్తామని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. "భవిష్యత్ యుద్ధాలు కృత్రిమ మేధస్సుతో సాగవచ్చు.. కానీ విజయాన్ని అందించేది దేశభక్తి, శిక్షణ పొందిన సైనికులే" అని అన్నారు.భారత్ హిందూ మహాసముద్ర ప్రాంతంలో విశ్వసనీయ భద్రతా భాగస్వామిగా ఎదిగిందని, సముద్ర దోపిడీ నిరోధక చర్యలు, విపత్తు సహాయక కార్యక్రమాలు, సంక్షోభ ప్రాంతాలనుంచి భారతీయులు, విదేశీయుల తరలింపులో భారత నౌకాదళం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని ఆయన కొనియాడారు.తూర్పు కనుమల్లోని మహేంద్రగిరి పర్వత శ్రేణి పేరుతో నామకరణం చేసిన ఈ యుద్ధనౌక నిర్మాణంలో 200కు పైగా భారతీయ పరిశ్రమలు, అనేక సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు భాగస్వామ్యం కావడం దేశీయ రక్షణ తయారీ రంగానికి నూతన ఉత్సాహాన్ని అందించిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్, తూర్పు నౌకాదళ కమాండ్ ఇన్‌చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా, మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ ప్రతినిధులు, నౌకాదళ ఉన్నతాధికారులు, మాజీ సైనికాధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.



# రాధా గాయత్రి భర్త శ్రీచరణ్ అరెస్ట్

**అదుపులోకి తీసుకున్న డెహ్రాడూన్ పోలీసులు**

**విశాఖపట్నం, జులై 11, ప్రభాతవార్త :** మస్సోరీ లోని కియానాహోమ్‌స్టేలో అనుమానాస్పద పరిస్థితుల్లో రాధాగాయత్రి మృతిచెందిన కేసులో ఆమెభర్త శ్రీచరణ్‌ను డెహ్రాడూన్ పోలీ సులు అరెస్టు చేశారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు డెహ్రాడూన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, చరణ్‌పై నాన్‌బెయిలబుల్ వారెంట్ పొందారు. అనంతరం నిందితుడిని న్యూఢిల్లీలో అదుపులోకి తీసుకుని మసూరీకి తరలించారు. కోర్టులో హాజరుపరచగా,న్యాయస్థానం 14రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధిస్తూ జిల్లా కారాగారం సుద్ధోవాలాకు తరలించాలని ఆదేశించింది.

## వారం - వర్జ్యం

12-07-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
త్రయోదశి రా.10.29
రోహిణి ఉ.8.28, మృగశిర తె.5.41
వర్జ్యం : మ.1.25-మ.2.50
శుభసమయం : ఉ.8.00-9.00
దు.సా.4.55-సా.5.47
రాహుకాలం - సా.4.30-6.00

## వారఫలం

**మేషం:** అవకాశాలు సద్వినియోగం చేసుకుంటారు. నూతన వ్యక్తులతో పరిచయాలు మిత్రత్వానికి దారితీస్తాయి. వస్త్రలాభం కలదు.

**వృషభం:** సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. రాజకీయ, కళారంగాల వారికి విదేశీ పర్యటనలు వుంటాయి.

**మిథునం:** విమర్శలను లెక్కచేయక మీ ఆలోచనలకు రూపకల్పన చేస్తారు. జీవిత భాగస్వామితో సంయమనం పాటించడం మంచిది.

**కర్కాటకం:** వ్యవహారాలలో విజయం సాధిస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు సాగిస్తారు. ఋణాలు తీరుస్తారు.

**సింహం:** పాతబాకీలు వసూలవుతాయి. ఓర్పుతో ముందుకు సాగుతారు. విలువైన వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**కన్య:** జీవిత భాగస్వామితో సంయమనం పాటించి సానుకూల ఫలితాలు సాధిస్తారు. వృత్తిలో పురోభివృద్ధి సాధిస్తారు.

**తుల :** పనులలో ఆటంకాలు ఎదురైనా అభివృద్ధి కూడా అంతర్లీనంగా ఉంటుంది. స్వల్పధన లాభం పొందుతారు.

**వృశ్చికం:** ఉద్యోగంలో అదనపు బాధ్యతలు పెరుగుతాయి. పై అధికారులతో మెలకువగా వ్యవహరించండి.

**ధనుస్సు:** ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. ముఖ్యమైన విషయాలు వాయిదా వేయడం మంచిది.

**మకరం:** సోదర, సోదరీ వర్గంతో కలిసి ఇష్టాగోష్ఠి సాగిస్తారు. ఏకాంత చర్చలకు అనుకూలమైన సమయం కలదు.

**కుంభం:** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలుగుతుంది. కోర్టుకేసుల నుండి బయటపడతారు.

**మీనం:** ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. స్త్రీ మూలంగా ధనలాభం పొందుతారు. స్థలాలు కొనుగోలుచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# తుపాకీ కంటే కలం గొప్పది

>> ఆయన అందించిన మార్గదర్శకత్వాన్ని ఎన్నటికీ మరిచిపోలేనని, "ఆయన నాకు గురువులాంటి వారు... శిరసు వంచి నమస్కరిస్తున్నాను" అని మంత్రి అన్నారు.తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన యద్దనపూడి సులోచనారాణి పేరును సభా ప్రాంగణానికి పెట్టడం ఆమె సాహిత్య సేవలకు దక్కిన గొప్ప గౌరవమని మంత్రి పేర్కొన్నారు. అలాగే రంగనాయకమ్మ, ఓల్గా (పి.లలిత కుమారి), వాసిరెడ్డి సీతాదేవి, డి.కామేశ్వరి వంటి ప్రముఖ రచయిత్రుల సేవలను కొనియాడారు.

అదే సమయంలో మహిళా సాధికారత, ప్రజాజీవితం, సామాజిక చైతన్యానికి విశేష సేవలందించిన నన్నపనేని రాజకుమారి గారిని ప్రత్యేకంగా అభినందిస్తూ, "నాకు మాత్రమే కాదు... రాష్ట్ర మహిళలందరికీ ఆమె స్ఫూర్తిదాయక నాయకురాలు" అని పేర్కొన్నారు.జస్టిస్ జ్యోతిర్మయి సమాజం పట్ల అంకితభావం కలిగిన వ్యక్తి అని పేర్కొన్నారు., ఈ కార్యక్రమంలో తనతో పాటు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు."తెలుగు తనం అనేది కేవలం భాష కాదు... అది మన సంస్కృతి, మన ఆత్మ" అని మంత్రి అన్నారు. పిల్లలు ఇతర భాషల్లో మాట్లాడినా, ప్రేమలోనైనా, బాధలోనైనా, ఆప్యాయతలోనైనా వారి నోట మొదట వచ్చే పదం "అమ్మ" అని పేర్కొన్నారు. 'అమ్మఅనే ఒక్క పదంలోనే తెలుగు మాధుర్యం, మమకారం, అనుబంధం, ఆత్మీయత నిక్షిప్తమై ఉన్నాయి" అని తెలిపారు. తెలుగు భాషలో యాసలు మారినా మనసులు ఒక్కటేనని పేర్కొంటూ, శ్రీకాకుళం, కృష్ణా, రాయలసీమ, నెల్లూరు ప్రాంతాల యాసలు వేరైనా భాష గొప్పతనం మారదని అన్నారు. "ప్రాంతాలు వేరైనా... పలుకు వేరైనా... మనల్ని ఏకం చేసేది తెలుగు భాష, తెలుగు మమకారమే" అని పేర్కొన్నారు.హోంమంత్రిగా తన భద్రత కోసం తుపాకులు ఉన్నప్పటికీ, సమాజాన్ని మార్చే అసలైన శక్తి కలానిదేనని మంత్రి స్పష్టం చేశారు. "కత్తి కన్నా కలం గొప్పది... గన్ కన్నా పుస్తకం గొప్పది. తుపాకి భయాన్ని సృష్టిస్తుంది... పుస్తకం వ్యక్తిత్వాన్ని నిర్మిస్తుంది" అని అన్నారు.

చిన్నతనంలో తన తండ్రి పుస్తకాలు చదివే అలవాటు పెంచారని, అదే తన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దిందని గుర్తు చేసుకున్నారు. యువత పుస్తక పఠనాన్ని జీవనశైలిగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు. మహిళలపై జరుగుతున్న వేధింపులు, సోషల్ మీడియాలో పెరుగుతున్న అసభ్యకర వ్యాఖ్యలపై ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి, మహిళలకు మాత్రమే కాదు... అబ్బాయిలకు కూడా మహిళలను గౌరవించడం, సంస్కారవంతంగా ప్రవర్తించడం, బాధ్యతతో వ్యవహరించడం నేర్పించే ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు.

"నేడు సోషల్ మీడియాలో తల్లి ఎదుట కూడా మాట్లాడలేని భాషను, భార్యతో కూడా ఉపయోగించలేని భాషను, సోదరి లేదా కుమార్తె ఎదుట పలకలేని పదాలను కొందరు ఉపయోగిస్తున్నారు. అలాంటి వికృత సంస్కృతికి సమాజంలో స్థానం ఉండకూడదు" అని మంత్రి అన్నారు.



పాట్నాలో శనివారం భారీ వరదల మధ్య రోడ్లపై అవస్థలు పడుతున్న జనం

# పవన్‌కు ముంబయిలో శస్త్రచికిత్స

>> తెలియచేశారు. రెండు భుజాలకు ఒకేసారి శస్త్ర చికిత్స చేయడం వల్ల నొప్పి తీవ్రత భరించలేని స్థాయిలో ఉంటుందని వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో కుడి భుజానికి సంబంధించిన రొటేటర్ కఫ్ ఇంజ్యూరీకి శనివారం ఆపరేషన్ చేశారు. ముందస్తుగా చేయాల్సిన వైద్య పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. శనివారం రోజున నిర్వహించిన ఆపరేషన్‌కు మూడున్నర గంటల సమయం పట్టినట్లు వైద్యులు తెలిపారు. మరో భుజానికి రెండు నెలల వ్యవధిలో శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుంది. పవన్ కల్యాణ్ 2016లో భుజానికి గాయాలు అయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు తగిన విశ్రాంతి అవసరం అని సూచించినా సమావేశాలలో పాల్గొన్నారు. 2018లో చేపట్టిన పోరాట యాత్ర సందర్భంలో జనసేన పార్టీ శ్రేణులు తమ అభిమాన నాయకుడికి దగ్గరగా వెళ్లి చేతులు కలపాలి అనే ఉద్దేశంతో చేతులు పట్టి లాగేవారు. ఆ సందర్భంలో నొప్పి కలిగినా భరించేవారు. ఈ యాత్రల్లో అభిమానులు దూసుకువచ్చి మరీ పవన్ కల్యాణ్‌తో కరచాలనం చేయాలని ఉత్సాహంతో చేతులు గుంజేవారు. అప్పుడు నొప్పి విపరీతంగా వచ్చినా పంటి బిగువున భరించారు. ఆ తరవాత కూడా ఆ గాయాలను అశ్రద్ధ చేశారు. 2019 ఎన్నికల అనంతరం రాయలసీమ జిల్లాల్లో.. ముఖ్యంగా మదనపల్లెలో టమోటా రైతుల సమస్యలు తెలుసుకోవడానికి వెళ్లిన సందర్భంలో పార్టీ శ్రేణులు, అభిమానులు పవన్ కల్యాణ్‌కి చేరువగా వెళ్లి కరచాలనం చేయడం, ఆప్యాయంగా హత్తుకొనే సందర్భాల్లో గాయాలు తిరగబెట్టాయి. అయినా పట్టించుకోలేదు. గత సార్వత్రిక ఎన్నికలు, అంతకు ముందు వారాహి యాత్ర సందర్భంలోను అభిమానులు కరచాలనం కోసం దూసుకు వచ్చేవారు. గాయాల వల్ల నొప్పి వస్తున్నా భరించారు. ఏప్రిల్ మాసంలో పవన్ కల్యాణ్ ముక్కుకి శస్త్ర చికిత్స చేసే సందర్భంలో పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంలో భుజాలకు రొటేటర్ కఫ్ ఇంజ్యూరీస్, మజిల్ టేర్స్ తీవ్ర స్థాయిలో ఉన్నట్లు గుర్తించారు. ఇంత తీవ్ర గాయాలు ఉన్నప్పటికీ ఏ విధంగా భరిస్తున్నారు అని వైద్యులు ఆశ్చర్యపడ్డారు. వీటికి వీలైనంత త్వరగా ఆపరేషన్ చేయాలని అప్పుడే వైద్యులు సూచించారు. ఈ క్రమంలోనే కొద్ది వారాల కిందట ముంబయిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో భాగంగా శనివారం కుడి భుజానికి ఆపరేషన్ నిర్వహించారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణ కొనసాగుతోంది.

# వియత్నాం బోటు ప్రమాదంపై సిఎం తీవ్ర విచారం

**విజయవాడ,జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** వియత్నాంలో జరిగిన పర్యాటక బోటు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు పర్యాటకులు మృతి చెందడం పట్ల సిఎం చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి మొత్తం 33 మంది వియత్నాం పర్యటనకు వెళ్లగా, వారిలో 19 మంది ప్రమాదానికి గురైన బోటులో ఉన్నారు. ఈ ప్రమాదంలో కడప జిల్లాకు చెందిన ముడియం శ్రీధర్, కృష్ణా జిల్లాకు చెందిన గెల్లి జయలక్ష్మి, సత్యసాయి జిల్లాకు చెందిన నల్లపేట ఆదిశేషయ్య రవి తేజ మృతి చెందారు. కృష్ణా జిల్లాకు చెందిన గెల్లి కిశోర్ తీవ్ర అస్వస్థతతో ఐసియులో చికిత్స పొందుతున్నారు. మిగిలిన వారందరూ సురక్షితంగా ఉన్నారు. విహారయాత్రకు వెళ్లిన రాష్ట్రానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందేలా చూడాలని, ప్రాణాలతో బయటపడిన వారిని సురక్షితంగా రాష్ట్రానికి తీసుకురావడానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉండాలని, వారికి అవసరమైన సహాయ సహకారాలు వెంటనే అందించాలని సిఎం ఆదేశించారు. ఢిల్లీలోని ఎపి భవన్ అధికారులు వియత్నాం ప్రభుత్వ అధికారులు, అక్కడి భారత రాయబార కార్యాలయంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే మృతదేహాలను స్వదేశానికి త్వరితగతిన తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# ఎస్ జానకి ఇక లేరు

>> జానకి 'సౌత్ ఇండియా నైటింగేల్'గా ప్రసిద్ధి పొందారు. గత జనవరి నెలలో ఆమె కుమారుడు మురళీకృష్ణ (65) మరణించడంతో మనో వేదనతో బాధపడుతున్న జానకి చివరకు ఇదే కారణంగా గుండెపోటుకు గురై కన్ను మూశారు. దక్షిణాది దిగ్గజ గాయకులు ఎస్‌పి బాలసుబ్రమణ్యం, పి. సుశీలతో కలిసి జానకి వేలాది పాటలు పాడిన ఘనాపాటిగా పేరొందారు. 1957లో చెన్నైలోని ఎవిఎం స్యూడియోలో స్టాఫ్ సింగర్‌గా తన గాన ప్రయాణాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె పాడిన తొలిపాట తమిళంలో విదియిన్ విలయాట్టు సినిమాలోని విషాద గీతం. తెలుగులో తొలి పాట పెండ్యాల నాగేశ్వరరావు సంగీత దర్శకత్వంలో వచ్చిన ఎంఎల్ఎ సినిమాలోని నీ ఆశ అడియాస అనే పాట. ఈ పాటను ఘంటసాలతో కలిసి పాడారు. 1970 నుంచి 1990 వరకు దక్షిణాది రాష్ట్రాలలో మహిళా గాత్రానికి ప్రధాన స్తంభంగా ఆమె నిలిచారు. నా దస్వరం, వేణువు, షెహనాయ్ వంటి సంగీత వాయిద్యాలతో పోటీపడి పాడగల అరుదైన గాత్ర ప్రతిభ జానకి సొంతం. కాగా జానకికి నాలుగుసార్లు జాతీయ పురస్కారాలు అందాయి. దీంతో పాటు వివిధ రాష్ట్రాలు ప్రత్యేకంగా అవార్డులు ఇచ్చి సన్మానించాయి. 2017లో వయో భారంతో ఆమె పాటలు పాడడం మానేశారు. 2013 కేంద్రం ప్రకటించిన పద్మభూషన్ అవార్డును ఆమె తిరస్కరించడం సంచలనం రేపింది. తెలుగు భాషలో వేలాది పాటలు పాడిన ఆమెకు ప్రత్యేకంగా అభిమానులున్నారు. ఆదివారం ఆమె అంత్యక్రియలు జరగనున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

# సమస్యలు పరిష్కరిస్తాం

>> దృష్టిలో ఉంచుకుని అన్ని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగిన ప్రయత్నం చేస్తుందని స్పష్టం చేశారు.ఉద్యోగుల సమస్యలపై చర్చిచేందుకు ఈనెల 21వ తేదీన సచివాలయంలో అన్ని ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వారి అధ్యక్షతన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రులు ఇరువురూ ప్రకటించారు.ఈలోగా రాష్ట్ర ఆర్ధికమంత్రి వర్యులతో కూడా ఉద్యోగ సంఘాల సమస్యలపై మరొక సారి చర్చిస్తామని వారి పేర్కొన్నారు.కావున ఉద్యోగులు వారి ఆందోళన కార్యక్రమాల కార్యాచరణను వాయిదా వేసుకోవాలని మంత్రులిరువురు ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు సూచించారురాష్ట్ర రెవెన్యూ మరియు రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖామాత్యులు అనగాని సత్య ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగ సంఘాలతో నిర్వహించిన సమావేశం పూర్తి సహృద్భావ వాతావరణంలో జరిగిందని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వర్యులు పూర్తి సానుకూలంగా ఉన్నారని పునరుద్ఘాటించారు.గత ప్రభుత్వం చేసిన నిర్వాకంతోనే నేడు ఉద్యోగులకు ఈపరిస్థితి వచ్చిందని ఉద్యోగ సంఘాలు ఇచ్చిన 23 డిమాండ్లను పరిశీలించామని వాటన్నిటినీ ఏవిధంగా పరిష్కరించాలనే దానిపై ఈనెల 21న సిఎస్ అధ్యక్షతన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

# ఎరువుల కోసం క్యూలో వృద్ధురాలి పడిగాపులు అస్వస్థతకు గురై మృతి

**టెక్కలి (శ్రీకాకుళం జిల్లా), జూలై 11 ప్రభాతవార్త :** శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం పెద్దలవునిపల్లి గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు ఎరువులు కోసం క్యూలైన్‌లో పడిగాపులు పడి అస్వస్థతకు గురై మృతి చెందిన విషాద ఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. కూటమి ప్రభుత్వంలో ఎరువులు వస్తాయో రావో అనే ఆందోళనతో ఆర్‌బికేల్లో ఉన్న ఎరువులు కొనుగోలు చేసేందుకు శుక్రవారం లవునిపల్లిలో ఉన్న ఆర్బికే కేంద్రానికి రైతులంతా చేరుకున్నారు. ఈ ఆర్‌బికే లో కేవలం 200 బస్తాలు మాత్రమే ఉండడం, ఒక్కో రైతుకి కేవలం ఒక బస్తా ఇస్తామని అధికారులు చెప్పడంతో రైతులు తమకు యూరియా దొరుకుతుందో లేదో అని రైతులంతా ఒకేసారి అక్కడికి చేరుకున్నారు. ఇరుకు ప్రదేశం కావడం రైతులు అధికంగా చేరుకోవడంతో అందులో చిక్కుకున్న పినకాన కాంతమ్మ (70) అస్వస్థతకు గురైంది. వెంటనే అక్కడ ఉన్న రైతులు కాంతమ్మను టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే కాంతమ్మ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గంలో గత ఏడాది ఎరువులు కొరత ఏర్పడడంతో ఈ ఏడాది కూడా ఎరువులు దొరుకుతాయో లేదో అని ఆందోళనతో రైతులు ఉండడం శనివారం ఈ ఘటన జరగడం ఎరువుల కొరతకు ప్రత్యేక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని, మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

12-7Pg3exHMNWJQEBPGOTRLC.qxd:12-7Pg3exHMNWJQEBPGOTRLC.qxd 1/1/02 7:13 AM Page 1



# రాష్ట్రానికి మరిన్ని కొరియా పెట్టుబడులు




## 50కి పైగా కంపెనీలతో చర్చలు జరిపిన మంత్రి లోకేష్

## పల్లి..పల్లి మంత్రి అంటూ కొరియన్ ప్రతినిధుల ప్రశంసలు

**విజయవాడ, జులై11, ప్రభాతవార్తప్రతినిధి:** భారత్-కొరియా సంబంధాల బలోపేతమే లక్ష్యంగా రిపబ్లిక్ ఆఫ్ కొరియా (సౌత్ కొరియా) ఆహ్వానం మేరకు రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చేపట్టిన సౌత్ కొరియా పర్యటన విజయవంతమైంది. మంత్రి లోకేష్ బృందానికి దక్షిణ కొరియా ప్రభుత్వంతోపాటు అక్కడి పారిశ్రామికవేత్తల నుంచి సముచిత గౌరవం లభించింది. ఎల్జీ లాంటి గ్లోబల్ కంపెనీలు ప్రత్యేకంగా తమ హెడ్ క్వార్టర్స్‌కు ఆహ్వానించి ఉన్నతస్థాయి బృం దంతో గౌరవార్థ విందు ఇవ్వడం మంత్రి లోకేష్‌కు దక్కిన అరుదైన గౌరవం. ఈనెల 5నుంచి 11వరకు నిర్వహించిన అధికారిక పర్యటనలో 50కి పైగా కార్పొరేట్ సంస్థల నాయకత్వాన్ని కలిసి ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా లోకేష్ కోరారు. తొలిరోజు సియోల్ లో తెలుగు ప్రజలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంతో ప్రారంభమైన పర్యటన శుక్రవారం సీఐఐ ఆధ్వర్యాన పెట్టుబడిదారులతో నిర్వహించిన రోడ్‌షోతో ముగిసింది. రాష్ట్రంతో ద్వైపాక్షిక, రాజకీయ, వాణిజ్య సహకారాన్ని బలోపేతం ప్రాధాన్యతను గుర్తిస్తూ, దక్షిణ కొరియా విదేశాంగ మంత్రిత్వశాఖ మంత్రి లోకేష్‌ను అధికారికంగా ఈ పర్యటనకు ఆహ్వానించింది. ఈ సందర్భంగా మంత్రి లోకేష్‌తో నిర్వహించిన భేటీల అనంతరం ఎల్జీ, హ్యుందయ్, శాంసంగ్, బీఎన్ కే ఫైనాన్షియల్ వంటి దిగ్గజ కొరియన్ కార్పొరేట్ సంస్థలు, తమ ఉన్నత నాయకత్వంతో సంప్రదించి ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చాయి. ఆం ధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న స్పష్టమైన పారిశ్రామిక విధానాలు, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, అందజేస్తున్న ప్రోత్సాహకాలపై మంత్రి లోకేష్ ఇచ్చిన ప్రజెంటేషన్‌తో వివిధ సంస్థల ప్రతినిధి బృందాలు ఫిదాఅయ్యాయి. పర్యటన తొలిరోజున సియోల్ లో భారత్ రాయబారి గౌరంగలాల్ దాస్‌తో నిర్వహించిన మర్యాదపూర్వక భేటీలో కొరియా ప్రాధాన్యతారంగ పరిశ్రమలను ఏపీకి తీసుకొచ్చేందుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తూ ఆంధ్రప్రదేశ్ విజన్‌ను ఆవిష్కరించారు. దక్షి ణ కొరియా ప్రముఖ వాణిజ్య కేంద్రమైన బుసాన్‌లో ఏపీఈడీబీ ఆధ్వర్యాన అపెక్స్ - కొరియా పేరిట పెట్టుబడిదారుల సహాయక, అనుసం ధాన విభాగంను ప్రారంభించడం ఆంధ్రప్రదేశ్ ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలకు నిదర్శనం. శ్రీసిటీ పరిసరాల్లో ఇప్ప టికే కొలువై ఉన్న 40కిపైగా కొరియన్ కంపెనీలతోపాటు కొత్తగా వచ్చేందుకు ఆసక్తి చూపే సంస్థలకు భరోసా ఇచ్చినట్లయింది. ఆంధ్రప్రదేశ్‌లో కేవలం రెండేళ్ల వ్యవధిలో 'కియా' సాధించిన విజయాన్ని ఉదహరిస్తూ, ఏపీ ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలు, 3ఎస్ మోడల్ (స్పీడ్, స్కెబిలిటీ, సర్వీస్), వేగవంతమైన అనుమ తులపై మంత్రి లోకేష్ వివరించిన తీరుపై కొరియా మీడియా, దిగ్గజ కంపెనీలు సానుకూలంగా స్పందిం చాయి. ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బృందం పర్యటనపై కోట్రా దక్షి ణాసియా విభా గాధిపతి క్యుంగ్‌హూన్ కిమ్ ప్రశంసల వర్షం కురిపిస్తూ నారా లోకేష్ బృందానికి హ్యాట్సాఫ్ అంటూ ట్విట్టర్ లో అభినందనలు తెలపడం పర్యటన విజయవంతానికి నిదర్శనం. కొరియన్ ప్రతినిధులు మంత్రి లోకేష్ వేగం చూసి పల్లి..పల్లి మంత్రిఅని కొత్త పేరు పెట్టారు. పల్లి.. పల్లి అనే కొరియన్ పదానికి అర్థం త్వరగా..త్వరగా అని. వారంరోజుల అధికారిక పర్యటనను పెట్టుబడుల యాత్రగా మార్చిన మంత్రి లోకేష్ లౌక్యం రాష్ట్రా భివృద్ధిపై ఆయనకున్న చిత్తశుద్ధి, కమిట్ మెంట్‌ను తెలియజేస్తోంది. ఇక తన సౌత్ కొరియా పర్యటన ముగింపు సందర్భంగా 'ఎక్స్' వేదికగా తన టూర్ విజయవంతం కావడానికి సహకరించిన దక్షి ణ కొరియా విదేశాంగ శాఖ, సియోల్‌లోని భారత రాయబార కార్యాలయం, ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'మళ్లీ కలుద్దాం సియోల్ అంతవరకు కమ్సహమ్నిదా!' అంటూ కొరియన్ భాషలో పోస్ట్‌ను ముగించారు. కమ్సహమ్నిదా అనేది కొరియన్ భాషా పదం. ఎవరికైనా అత్యంత మర్యాదపూర్వకమైన రీతిలో కృతజ్ఞతలు తెలిపేటప్పుడు ఈ పదం (కమ్సహమ్నిదా) ఉపయోగిస్తారు.

# పడవ ప్రమాదంపై మంత్రి లోకేష్ దిగ్భ్రాంతి

## బాధితులకు తక్షణ సహాయం అందించాలని అధికారులకు ఆదేశం

**విజయవాడ,జూలై11, ప్రభాతవార్తప్రతినిధి:** వియత్నాం లో జరిగిన పడవ ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్రంగా స్పందించారు. ఈ ప్రమాద ఘటనను అత్యంత సీరియస్‌గా తీసుకున్న మంత్రి, అందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పర్యాటకులు చిక్కుకున్నారనే ప్రాథమిక సమాచారంపై తక్షణమే రంగంలోకి దిగారు. ఈ విషయమై ఢిల్లీలోని ఏపీ భవన్ సీనియర్ అధికారులతో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో మంత్రి లోకేష్ అత్యవసరంగా మాట్లాడారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను, తాజా పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సరదాగా విహారయాత్ర (టూరిజం) కోసం వియత్నాం వెళ్లిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పర్యాటకులు ఈ ప్రమాదంలో చిక్కుకున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఈ ప్రమాదంపై వియత్నాంలోని భారత రాయబార కార్యాలయంతో ఏపీ భవన్ అధికారులు నిరంతరం టచ్‌లో ఉన్నట్లు మంత్రికి తెలిపారు. పమాదంలో చిక్కుకున్న తెలుగు పర్యాటకులకు అన్ని రకాల అత్యవసర సహాయాలు అందేలా కేంద్ర విదేశాంగ శాఖతో పాటు సంబంధిత కేంద్ర ప్రభుత్వ విభాగాలతో పూర్తి స్థాయిలో సమన్వయం చేసుకోవాలని మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు.

# ప్రభుత్వ వైద్యుల పదవీ విరమణ వయసు పెంపునకు జూడా వ్యతిరేకం

**విజయవాడ,జూలై 11,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ వైద్యుల రిటైర్మెంట్ వయసు 70 యేళ్లకు పెంపు ప్రతిపాదనలను ఏపీ జూనియర్ డాక్టర్ల సంఘం (జూడా) వ్యతిరేకించింది. దీనివల్ల యువ వైద్యుల ఉపాధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేసింది. వైద్యుల కొరతకు అర్హులు లేకపోవడం కారణం కాదని, ఖాళీలను భర్తీ చేయకపోవడమే అసలు సమస్య అని స్పష్టం చేసింది. వెంటనే పోస్టులన్నీ భర్తీ చేయాలని డిమాండ్ చేసింది. రోగుల రద్దీకి తగ్గట్లు అదనపు పోస్టులు ఇవ్వాలంది. స్పెషలిస్టుల నియా మకంతో ఆసుపత్రులను బలోపేతం చేయాలని సూచించింది. వైద్యులకు సకాలంలో ప్రమోషన్లు ఇవ్వాలని, సీనియర్ వైద్యులను కేవలం సలహాదారులు, మెంటార్లుగా మాత్రమే వాడుకోవాలని జూడా ప్రభుత్వానికి సూచించింది.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలం

## శ్రీకాకుళంలో ఉద్యమ సన్నద్ధ సభ తాత్కాలికంగా వాయిదా

**విజయవాడ, జూలై 11 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై మంత్రుల కమిటీ సానుకూలత వ్యక్తం చేసినందున ఈ నెల 12వ తేదీన శ్రీకాకుళంలో నిర్వహించనున్న ఉద్యమ సన్నద్ధ సభను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు అమరావతి ఏపీ జేఏసీచైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు శనివారం ప్రకటించారు. ప్రభుత్వంతో త్వరలో జరగబోయే సమావేశం అనంతరం ఉద్యమ కార్యాచరణ పై తమ తుది నిర్ణయాన్ని ప్రకటిస్తామని ఆయన తెలిపారు. గత రెండేళ్లుగా ఉద్యోగుల సమస్యలపై తీవ్ర జాప్యం జరుగుతున్న నేపథ్యంలో, ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించి, అన్ని జిల్లాలలో ఉద్యమ సన్నాహక పర్యటనలు చేస్తున్న విషయం తెలిసిందే. కాగా, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకురెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, గృహ నిర్మాణ మరియు సమాచార,పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సమక్షంలో అమరావతి ఏపీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, అసోసియేట్ చైర్మన్ టి.వి. ఫణిపేర్రాజు, కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావు, ఇతర నాయకులతో గత రెండు రోజులుగా జరిపిన చర్చలు ఫలించాయి.

# బ్రాహ్మణికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు

## 'మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్-2026' జాబితాలో చోటు

### అభినందనలు తెలిపిన సిఎం చంద్రబాబు, హర్షం వ్యక్తం చేసిన మంత్రి లోకేష్




న్యూఢిల్లీలో ఫార్చ్యూన్ ఇండియా మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ సదస్సులో అవార్డు అందుకుంటున్న నారా బ్రాహ్మణి

**విజయవాడ,జూలై 11,ప్రభాతవార్తప్రతినిధి:** హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారాబ్రాహ్మణికి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు దక్కింది. ప్రముఖ బిజినెస్ మ్యాగజైన్ ఫార్చ్యూన్ ఇండియా ప్రకటించిన 'మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ -2026' జాబితాలో ఆమె చోటు సంపాదించుకున్నారు. భారతదేశ ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళా పారిశ్రామికవేత్తల జాబితాలో బ్రాహ్మణి నిలిచారు. ఢిల్లీలో జరిగిన ఫార్చ్యూన్ ఇండియా మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ 2026సదస్సులో బ్రాహ్మణికి ఈ అవార్డును అంద జేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెరిటేజ్ ఫుడ్స్ ప్రస్థా నంలో రైతుల పాత్రఎనలేనిదని, పాలఉత్పత్తిలో నూతన సాంకేతికతను జోడిస్తూనే అన్నదాతల జీవనోపాధిని మెరుగుపరచడమే తమ ప్రధాన ఆశయమని స్పష్టంచేశారు. ఈ అరుదైన గుర్తింపును హెరిటేజ్ ఫుడ్స్ కుటుంబానికి, రైతులకు, సంస్థ ఉద్యోగులకు అంకితమిస్తున్నట్లు ఆమె ప్రకటించారు. ఫార్చ్యూన్ ఇండియా ప్రతిష్ఠాత్మక జాబితాలో తన కోడలు, హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి స్థానం సంపాదించడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా స్పందించారు. జాతీయ స్థాయిలో లభించిన ఈ అరుదైన గౌరవంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ, తన 'ఎక్స్' వేదికగా అభినందనలు తెలియ జేశారు. ఫార్చ్యూన్ ఇండియా 100 మంది అత్యంత శక్తిమంతమైన మహిళల జాబితాలో గుర్తింపు పొందిన బ్రాహ్మణికి నా హృదయపూర్వక అభినం దనలు. ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు కేవలం ఒక అవార్డు మాత్రమే కాదు. వ్యాపార రంగంలో ఆమెకున్న తిరుగులేని నాయకత్వ పటిమ, అంకితభావం, నిబద్ధతకు దక్కిన నిదర్శనం అని ముఖ్యమంత్రి కొనియాడారు. తన భార్య సాధించిన ఘనతపై మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఇలాగే ప్రతిభను చాటుతూ, నాయకత్వ లక్షణాలతో మరిన్ని అవరోధాలను అధిగమించాలని మంత్రి లోకేష్ ఆకాంక్షించారు.




# తీరం మాదే,ఇక్కడ వేట మాదే

## సీజ్ చేసిన 7బోట్లు వదిలే ప్రసక్తే లేదు

### రాష్ట్ర మత్స్యకారులకు జరుగుతున్న నష్టాన్ని తమిళనాడు అధికారులకు ఆధారాలతో వివరించాం: కలెక్టర్ హిమాన్షు శుక్ల

**నెల్లూరు, జులై 11, ప్రభాతవార్త - కలెక్టరేట్ :** ఆంధ్రప్రదేశ్ తీరానికి 23 కిలోమీటర్ల పరిధిలోకి ఇతర రాష్ట్రాలకు చెందిన చేపల వేట బోట్లు ప్రవేశించడం చట్టవిరుద్ధమని, రాష్ట్ర మత్స్యకారుల జీవనోపాధి, సముద్ర జీవవైవిధ్యాన్ని పరిరక్షించేందుకు అక్రమంగా ప్రవేశించే బోట్లపై కఠిన చర్యలు కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల స్పష్టం చేశారుశనివారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ - తమిళనాడు అంతర్‌రాష్ట్ర జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల, జిల్లా అటవీశాఖ అధికారి షేక్ మహబూబ్ బాషా, మెరైన్ మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు డా. పి. సురేష్, జిల్లా మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు పి. లక్ష్మణరావు, ప్రకాశం జిల్లా సంయుక్త సంచాలకులు శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ చాంద్ బాషాతో పాటు మెరైన్ పోలీసు అధికారులు పాల్గొన్నారు. తమిళనాడు రాష్ట్రం నుంచి మత్స్యశాఖ, మత్స్యకారుల సంక్షేమ శాఖ డైరెక్టర్ డా. విజయ కార్తికేయన్, చెన్నై జిల్లా కలెక్టర్ మాలతి హెలెన్, రాయపురం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పరమనాథం, స్టేట్ ఇంటెలిజెన్స్ వింగ్ డీఎస్పీ కరియప్పన్, అదనపు మత్స్యశాఖ డైరెక్టర్ నూర్‌జహాన్ బీవి, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఎలంగో సమావేశానికి హాజరయ్యారు. తమిళనాడు, పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మత్స్యకారుల సమస్యలు, సముద్ర జలాల్లో అక్రమ ప్రవేశాల వల్ల కలుగుతున్న నష్టం తదితర అంశాలపై ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల ప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్, ఎస్పీ తమిళనాడు అధికారులకు వివరించారు. సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మీడియాతో మాట్లాడుతూ, గత మూడు నెలలుగా మన జిల్లా సరిహద్దు తీర ప్రాంతంలోని సముద్ర జలాల్లో అక్రమంగా చేపల వేట సాగిస్తున్న తమిళనాడు, పుదుచ్చేరికి చెందిన మత్స్యకారుల వల్ల మన రాష్ట్ర మత్స్యకారులకు కలుగుతున్న నష్టాన్ని తమిళనాడు అధికారులకు సమావేశంలో సవివరంగా వివరించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఆదే శాల మేరకు మే నెల నుంచి ప్రత్యేక సముద్ర గస్తీ ప్రారంభించిన అనం తరం అక్రమ ప్రవేశాలపై కఠిన నిఘా కొనసాగుతోందని పేర్కొన్నారు. మత్స్యకారుల సమస్యలను నాలుగు విభాగాలుగా వర్గీకరించి తమిళనాడు ప్రతినిధులకు వివరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బోట్లు, తమిళనాడుకు చెందిన బోట్లు, తమిళనాడు బోట్లలో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, చిన్న అవుట్‌బోర్డ్, ఇన్‌బోర్డ్ ఇంజిన్ బోట్ల ద్వారా అక్రమంగా ప్రవేశించే వారి సమస్యలను విడివిడిగా వివరించామని, ముఖ్యంగా నాలుగో కేటగిరీ వల్లే అధిక సమస్యలు ఎదురవుతున్నాయని చెప్పారు.

# బాలికపై అత్యాచారం: నిందితునికి జీవిత ఖైదు



**వడమాలపేట, జూలై 11 ప్రభాతవార్త:** మైనర్ బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడికి సహజ మరణం వరకు జీవిత ఖైదు కఠిన కారాగార శిక్ష విధిస్తూ చిత్తూరు జిల్లా ఫోక్సో కోర్టు తీర్పు ఇచ్చింది. తిరుపతి జిల్లా వడమాలపేట మండలం ఏఎం పురం గ్రామంలో 2024లో మూడు సంవత్స రాల బాలికకు వరుసకు మామ అయిన నిందితుడు పాముల నాగరాజు అనే సుశాంత్ బిస్కెట్లు తీసిస్తానని ఆశ చూపించి గ్రామంలోని దుకాణానికి తీసుకెళ్లాడు. అనంతరం గ్రామ చివరిలో కొత్తగా నిర్మించిన సచివాలయ భవనం సమీపంలోని పొదల్లోకి తీసుకెళ్లి అమానుషంగా లైంగిక దాడి చేసి గొంతు నులిమి హత్య చేశాడు. అత్యంత హీనమైన ఈ చర్యను తీవ్రమైన నేరంగా పరిగణించిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్వయంగా సంఘటన జరిగిన ప్రదేశాన్ని సందర్శించి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి నిందితుడిని త్వరగా అరెస్టు చేసి కచ్చితంగా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని చెప్పడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు నేతృత్వంలో దర్యాప్తు అధికారిగా పుత్తూరు డీఎస్పీ జి.రవికుమార్ శాస్త్రీయ ఆధారాలు, ప్రత్యక్ష సాక్ష్యాలు, వైద్య నివేదికలు, క్లూజ్ టీంసేకరించిన సాక్ష్యాలతో పటిష్టంగా దర్యాప్తు కొనసాగించారు. నేరం రుజువు కావడంతో చిత్తూరు జిల్లా ఫోక్సో కోర్టు ముద్దాయి కి శిక్ష ఖరారు. ముద్దాయి జీవించి ఉన్నంత వరకు కఠిన కారాగార శిక్షతో పాటు బాధిత కుటుంబానికి 10 లక్షల రూపాయల పరిహారం చెల్లించేలా ఆదేశాలు ఇచ్చారు.

# డిసిఎం పవన్ శస్త్రచికిత్స విజయవంతంపై మంత్రి దుర్గేష్ హర్షం

## త్వరగా కోలుకుని ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్ష

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై11,ప్రభాతవార్త:** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ముంబయిలో శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి కావడం పట్ల రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, వైద్యులు కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాలని తెలిపినట్లు మంత్రి దుర్గేష్ శనివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అచంచలమైన నిబద్ధత, పట్టుదల గల ప్రజా నాయకుడని, నిరంతరం ప్రజల శ్రేయస్సు, ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా శ్రమిస్తున్నా రన్నారు. శస్త్రచికిత్స అనంతరం ఆయన త్వరితగతిన పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని, మళ్లీ యథావిధిగా ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఆయన పరిపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు.సమస్య ఏదైనా, ప్రజల్లో ఉంటూ వారి కన్నీళ్లు తుడవాలనే తపన ఉన్న జనసేనాని పవన్ కళ్యాణ్ కు కోట్లాది మంది ప్రజల ఆశీస్సులు, అభిమానుల ప్రార్థనల బలం అండగా ఉన్నాయని, ఆయన తనశారీరక ఇబ్బందులను సైతం లెక్కచేయకుండా నిరంతరం ప్రజల కోసమే తపించే నిఖార్సైన ప్రజా నాయకుడని కొనియాడారు. రాష్ట్ర ప్రగతి ప్రయాణంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కీలక పాత్ర పోషిస్తు న్నారని, ఆయన త్వరలోనే పూర్తి శక్తి సామర్థ్యాలతో,రెట్టింపు ఉత్సాహంతో విధుల్లోకి చేరుకుంటారని ఆశిస్తున్నట్లుమంత్రి దుర్గేష్ వెల్లడించారు. ఆయన అనారోగ్యంతో ఉన్నా ప్రజాసమస్యలపై ఆలోచన నిరంతరం సాగుతూనే ఉంటుందని, అలసట ఎరుగని ఆయన పోరాట పటిమ, దృఢ సంకల్పం మనందరికీ ఎల్లప్పుడూ ఆదర్శప్రాయమని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

# మహిళల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

## రాష్ట్ర ప్రసూతి మరియు స్త్రీ వైద్యశాస్త్ర సదస్సులో మంత్రి డాక్టర్ డోల బాల వీరాంజనేయ స్వామి




**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రసూతి మరియు స్త్రీ వైద్య శాస్త్ర సొసైటీ ఆధ్వర్యంలో "ఉమెన్స్ హెల్త్ - నేషన్స్ ప్రైడ్" అనే నినాదంతో ఒంగోలులో నిర్వహిస్తున్న మూడు రోజుల రాష్ట్రస్థాయి సదస్సు రెండో రోజు శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, ఎస్ఎన్ పాడు ఎమ్మెల్యే బి.ఎన్. విజయ్‌కుమార్, ప్రముఖ ప్రసూతి, స్త్రీరోగ వైద్య నిపుణులు, వైద్య అధ్యాపకులు, వైద్య విద్యార్థులు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం ఒక కుటుంబానికే కాకుండా సమాజం, రాష్ట్ర అభివృద్ధికి కూడా కీలకమని అన్నారు. గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సదుపాయాలు, ప్రసూతి సేవలు, అవసరమైన పరికరాలు, నిపుణుల సేవలను మరింత విస్తరిస్తున్నామని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడంతో పాటు తల్లి, శిశు మరణాలను తగ్గించే దిశగా ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆరోగ్య రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ "ఆరోగ్య ఆంధ్రప్రదేశ్" లక్ష్యంగా పలు సంస్కరణలు చేపడుతున్నామని వివరించారు.ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు మాట్లాడుతూ ఆధునిక వైద్య విజ్ఞానం ప్రజలకు చేరువ కావడంలో ఇలాంటి రాష్ట్రస్థాయి సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలకు నాణ్యమైన ప్రసూతి వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం, సురక్షిత ప్రసవాలకు ప్రభుత్వ ఆసుపత్రులను వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.ఎస్ఎన్ పాడు ఎమ్మెల్యే బి.ఎన్. విజయ్‌కుమార్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం పట్ల ప్రతి కుటుం బం ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సులో కీనోట్ ఉపన్యాసాలు, శాస్త్రీయ పత్రాల ప్రదర్శనలు, ప్రత్యక్ష శిక్షణా కార్యక్రమాలు, వైద్య చర్చలు నిర్వహించారు. అధిక ప్రమాద గర్భధారణలు, వంధ్యత్వ చికిత్స, ప్రసూతి అత్యవసర పరిస్థితుల నిర్వహణ, గర్భాశయ క్యాన్సర్ నివారణ, నవజాత శిశు సంరక్షణ, ఆధునిక శస్త్రచికిత్స విధానాలపై నిపు ణులు సవివరంగా వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన వైద్యులు తమ అనుభవాలను పంచుకుని వైద్య రంగంలో వస్తున్న నూతన మార్పులపై చర్చించారు.

# వైసిపి మహిళా నేత ఆత్మహత్యాయత్నం: రంగంలోకి రాయపాటి శైలజ



**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త:** ఒంగోలుకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మహిళా నాయకురాలు పేరం ప్రసన్న ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన జిల్లా రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపింది. ఇటీవల జిల్లా పార్టీ కార్యాలయంలో తనపై జరిగిన దాడి, వేధింపుల అనంతరం తీవ్ర మనోవేదనకు గురైన ఆమె నిద్రమాత్రలు మింగుతూ సెల్ఫీ వీడియో రికార్డు చేశారు. అనంతరం కుటుంబ సభ్యులు ఆమెను ఒంగోలు రిమ్స్ ఆస్పత్రికి తరలించగా ప్రస్తుతం చికిత్స కొనసాగుతోంది. సెల్ఫీ వీడియోలో పార్టీ నాయకత్వం తనకు న్యాయం చేయలేదని, పోలీసులకు ఫిర్యాదు చేసినప్ప టికీ స్పందన లేకపోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ వాట్సాప్ గ్రూపుల నుంచి తనను తొలగించడం, తాను పంపిన వీడియోలు, వాయిస్ మెసేజ్‌లను డిలీట్ చేయడం ద్వారా తనను అవమానించారని ఆరోపించారు. కొందరు తనపై అసభ్య వ్యాఖ్యలు చేసినప్పటికీ వారిపైన చర్యలు తీసుకోకుండా నాయకత్వం వారికి మద్దతు ఇస్తోందని విమర్శించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఒంగోలు రిమ్స్ ఆస్పత్రికి చేరుకుని ప్రసన్నను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకోవడంతో పాటు బాధితురాలితో ప్రత్యేకంగా మాట్లాడి పూర్తి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పద్మ సునంద, వన్ స్టాప్ సెంటర్ మేనేజర్ ఎన్. సుప్రియ పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన రాయపాటి శైలజ మాట్లాడుతూ, మహిళలు గౌరవంగా, భద్రంగా పనిచేసే వాతావరణాన్ని కల్పించడం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని అన్నారు. గత ఏడాదిగా ప్రసన్న లైంగిక వేధింపులు, అసభ్య వ్యాఖ్యలు, అనుచిత ప్రవర్తనను ఎదుర్కొన్నట్లు తనకు వివరించిందన్నారు.


కార్మిక రాజ్య బీమా సంస్థ
(కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం)
कर्मचारी राज्य बीमा निगम
(श्रम एवं रोजगार मंत्रालय, भारत सरकार)
Employees' State Insurance Corporation
(Ministry of Labour & Employment, Govt. of India)
క.రా.బీ.ని. E.S.I.C.

ప్రాంతీయ కార్యాలయం/क्षेत्रीय कार्यालय /Regional Office
ఈ ఎస్ ఐ రోడ్డు, గుణదల, విజయవాడ – 520 004
ईएसआई रोड, गुणदला, विजयवाड़ा–520 004
ESI Road, Gunadala, Vijayawada-520 004
Telephone: 0866-2453498
e-mail : rd-andhrapradesh@esic.gov.in

అడ్వకేట్స్ ఎంపానెల్మెంట్ కోసం దరఖాస్తుల ఆహ్వానం ప్రకటన

ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం, చిత్తూరు, కర్నూలు, కడప, అనంతపురం, ఆదోని మరియు తిరుపతిలోని వివిధ న్యాయస్థానాలు, ట్రిబ్యునల్స్ మరియు ఇతర జ్యుడీషియల్ / క్వాజీ-జ్యుడీషియల్ ఫోరంల ముందు కార్పొరేషన్ తరపున వాదించడానికి ఎంప్లాయీస్ స్టేట్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసి), ప్రాంతీయ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్, విజయవాడతో ఎంపానెల్మెంట్ కోసం అర్హులైన అడ్వకేట్ల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి.

అర్హతా ప్రమాణాలతో కూడిన వివరణాత్మకమైన నోటిఫికేషన్, నియమ నిబంధనలు, మరియు నిర్దేశించిన దరఖాస్తు పత్రంను ఈ క్రింది ఈఎస్ఐసి వారి ప్రాంతీయ వెబ్ సైట్ల నుండి డౌన్ లోడ్ చేయవచ్చు:

https://roap.esic.gov.in; https://srovisakhapatnam.esic.gov.in; https://srotirupati.esic.gov.in

సంబంధిత డాక్యుమెంట్లతో డాక్యుమెంట్లతో పాటు పూర్తిగా నింపిన దరఖాస్తులు **31.07.2026వ** తేదీ నాడు సాయంత్రం 5.00 గంటలకు లేదా అంతకంటే ముందు ప్రాంతీయ కార్యాలయానికి చేరాలి.

ఎలాంటి కారణం లేకుండానే ఈఎస్ఐసి ఏదైనా దరఖాస్తు పత్రాన్ని ఆమోదించడానికి లేదా తిరస్కరించడానికి హక్కును కలిగి ఉంది.

**ప్రాంతీయ సంచాలకులు**



కార్మిక రాజ్య బీమా సంస్థ
(కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం)
कर्मचारी राज्य बीमा निगम
(श्रम एवं रोजगार मंत्रालय, भारत सरकार)
Employees' State Insurance Corporation
(Ministry of Labour & Employment, Govt. of India)
క.రా.బీ.ని. E.S.I.C.

ప్రాంతీయ కార్యాలయం/क्षेत्रीय कार्यालय /Regional Office
ఈ ఎస్ ఐ రోడ్డు, గుణదల, విజయవాడ – 520 004
ईएसआई रोड, गुणदला, विजयवाड़ा–520 004
ESI Road, Gunadala, Vijayawada-520 004
Telephone: 0866-2453498
e-mail : rd-andhrapradesh@esic.gov.in

సవరణ/బహిరంగ ప్రకటన

అడ్వకేట్ల ఎంపానెల్మెంట్ కోసం దరఖాస్తులు సమర్పించడానికి గడువు తేదీ పొడిగింపు

**అడ్వకేట్ల ఎంపానెల్మెంట్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తూ గతంలో చేసిన 10.06.2026కి** చెందిన ప్రకటనను అనుసరించి, **దరఖాస్తుల సమర్పణకు సంబంధించిన గడువు తేదీని 10.07.2026 నుండి 31.07.2026 వరకు సమర్థ అధికారి పొడిగించారని** ఇందుమూలంగా తెలియచేయడమైంది.

తదనుగుణంగా, సంబంధిత అన్ని డాక్యుమెంట్లతో పాటు పూర్తిగా నింపిన దరఖాస్తు పత్రాలు **ప్రాంతీయ కార్యాలయం, ఎంప్లాయీస్ స్టేట్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసి), ఆంధ్రప్రదేశ్, విజయవాడకు 31.07.2026 తేదీన సాయంత్రం 5.00 గంటలకు లేదా అంతకంటే ముందు చేరాలి.**

అసలు ప్రకటనలో ఉన్న అన్ని ఇతర నియమ నిబంధనలలో **ఎటువంటి మార్పు లేదు.**

వివరణాత్మమైన ప్రకటన, అర్హత ప్రమాణాలు, నియమ నిబంధనలు, మరియు నిర్దేశించిన దరఖాస్తు పత్రం వివరాలు ఈఎస్ఐసి ప్రాంతీయ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ వెబ్ సైట్ : **https://roap.esic.gov.in**నందు లభిస్తాయి

**ప్రాంతీయ సంచాలకులు**

12-7Pg7exHMNWJQE.qxd:12-7Pg7exHMNWJQE.qxd 1/1/02 6:28 AM Page 1



# దేశంలోనే ఆదర్శంగా గోదావరి పుష్కరాలు

## సమన్వయంతో శాశ్వత అభివృద్ధి పనులు: రాష్ట్ర మంత్రులు నారాయణ,దుర్గేష్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై11,ప్రభాతవార్త:** గత గోదావరి పుష్కరాల్లో సుమారు 4 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు చేయగా, ఒక్క రోజే 68 లక్షల మంది స్నానాలు చేసిన నేపథ్యంలో ఈసారి 12 రోజుల పుష్కరాల్లో దాదాపు10 కోట్ల మంది యాత్రికులు గోదావరి తీరం చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని పురపాలక శాఖ మంత్రి డా. పి. నారాయణ, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఆ స్థాయికి తగిన విధంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు రూపొందించి నిర్మాణాత్మకంగా పనిచేయాలని వారు సూచించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ (ఆర్ఎంసీ) కార్యాలయ సమావేశ మందిరం లో గోదావరి పుష్కరాలు–2027 ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రులు అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పురపాలక శాఖ మంత్రి డా. పి. నారాయణ మాట్లాడుతూ,రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వంలో గత పుష్కరాల నిర్వహణలో ఉన్న అనుభవాన్ని సమర్థంగా వినియోగించి ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. పుష్కరాల కోసం చేపట్టే పనులు తాత్కాలిక ఏర్పాట్లకే పరిమితం కాకుండా నగరానికి శాశ్వత ఆస్తులుగా నిలిచే విధంగా ఉండాలని స్పష్టం చేశారు. హైబ్రిడ్ అన్యుటీ మోడల్ ద్వారా నిధులను సమీకరించి దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రూ.48 కోట్ల ఆర్ఎంసీ నిధులతో పాటు,ఎల్ఆర్ఎస్ ద్వారా మరో రూ.32 కోట్లు సమీకరించి, అదనంగా రూ.120 కోట్ల గ్రాంట్ పొందేలా చర్యలు చేపడుతున్నామని,తద్వారా సుమారు రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టే కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.టీడీఆర్ బాండ్లకు సంబంధించిన సమగ్ర వివరాల ను వెంటనే సమర్పించాలని అధికారు లను ఆదేశించారు.

అమృత్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన పనులను వేగవంతం చేయాలని, అందుకు అవసరమైన అంచనాల ను వెంటనే సిద్ధం చేయాలని మంత్రి నారాయణ సూచించారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో జాతీయ రహదారులు, ప్రధాన రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ, మురుగునీటి పారుదల వ్యవస్థ, జంక్షన్ల ఆధునీకరణ, శానిటేషన్, విద్యుత్, తాగునీటి వంటి అన్ని అంశాలపై తాజా ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణం గా సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులకు ఆదేశించారు.

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, పుష్కరాల విజయవంతమైన నిర్వహణకు రాజమహేంద్రవరం నగరంతో పాటు కొవ్వూరు, నిడదవోలు, ధవళేశ్వరం,పరిసర ప్రాంతాల్లో సమగ్రఅభివృద్ధిఅవసరమన్నారు. నిడదవోలు పరిధిలోని పెండ్యాల, ముక్కామల, తిప్పర్రు ఘాట్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, కొవ్వూరు, నిడదవోలు పురపాలక సంఘాల కు తగిన నిధులు విడుదల చేయాలని కోరారు.అలాగే కొవ్వూరు– రాజానగరం మండలం విజ్జేశ్వరం – నిడదవోలు వరకు 38 కిలోమీటర్ల రహదారిని అభివృద్ధి చేస్తే పర్యాటక, రవాణా పరంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎంఎల్ఏలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, అసిస్టెంట్ కలెక్టర్ కే. ఆదిత్య శర్మ అధికారులు పాల్గొన్నారు.

# సామాజిక మాధ్యమాలతో విధ్వంసం

**ప్రత్యర్థి పార్టీల నేతలు మానసిక ఉన్మాదంతో వ్యవహరిస్తున్నారు**
**టీడీపీ కార్యాలయంలో మీడియాతో సీఎం చంద్రబాబు**

**విజయవాడ,జూలై11, ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీకి ఒక రాజకీయ పార్టీకి ఉండాల్సిన లక్షణాలు ఏమాత్రం లేవని అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. అందుకే ఆ పార్టీని గొడ్డలితో పోలుస్తున్నామన్నారు. దౌర్జన్యం,దోపిడి,దాష్టీకం తప్ప ఆ పార్టీ నేతలు వారి పరిపాలనలో చేసిం దేమిటంటూ తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. తప్పుడు ప్రచారాలు, హత్యారాజకీయాలు ఆ పార్టీ అస్త్రాలన్నారు.వైసిపి నేతలను గమనిస్తే వారిదంతా రక్త చరిత్రేనని విమర్శించారు. తెలంగాణలో ఆరుగురిని కిరాతకంగా హత్య చేసిన హంతకుడి మనస్తత్వానికి, జగన్ వైఖరికి చాలా దగ్గరి పోలికలు ఉన్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. కడప స్టీల్ ప్లాంట్ పేరుతో ఒక వ్యక్తి అవినీతి దాహానికి లక్షల కోట్ల విలువైన సహజ సంపద ఆవిరైందని ఆరోపించారు. స్టీల్ ప్లాంట్ ఏర్పాటు పేరుతో అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారని దుయ్యబట్టారు. బ్రహ్మణీ స్టీల్స్‌కు కేటాయించిన భూములను ప్రభుత్వం ఇప్పటికే వెనక్కి తీసుకుందని,అయితే ఓబులాపురం మైనింగ్ అంశం ఇంకా ముగియలేదని స్పష్టం చేశారు. జగన్, ఆయన కుటుంబం వల్ల ఎందరో ఐఏఎస్ అధికారులు బలయ్యారని, ఎంతోమంది వ్యాపారవేత్తలు సర్వనాశనమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.ఆంధ్రప్రదేశ్‌లో ఏదో ఒక విధ్వంసం సృష్టించి, పక్క రాష్ట్రంలోని బెంగళూరులో తలదాచుకోవడం వారికి అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వాన్ని, నేతలను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సోషల్ మీడియాను వ్యక్తిత్వ హననాలకు, మహిళలను బ్లాక్ మెయిల్ చేయడానికి వాడుకుంటున్నారని, ఇది సమాజానికి అత్యంత ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఫేక్ పోస్టులను కట్టడి చేసేందుకు ఒక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నామని తెలిపారు. సొంత ప్రయోజనాల కోసం రైతుల భూములను 22ఏ జాబితాలో పెట్టి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని, తమ ప్రభుత్వం ఆ సమస్యను పరిష్కరిస్తోందని హామీ ఇచ్చారు.

**బ్రహ్మణి స్టీల్స్‌తో ఓబులాపురం మైనింగ్ బ్లాక్**

బ్రహ్మణి స్టీల్స్ దోపిడీ కథ భూముల స్వాధీనంతో ఆగలేదని చంద్రబాబు స్పష్టం చేశారు. బ్రాహ్మణి స్థలం సమస్యకే ప్రస్తుతానికి చెక్ పడినా, దీనికి లింక్ అయి ఉన్న ఓబులాపురం అంశం ఇంకా పెండింగ్‌లో ఉందన్నారు. బ్రాహ్మణి స్టీల్స్ వల్ల ఓబులాపురం మైనింగ్ బ్లాక్ అయిందని ఇవి బ్లాక్ కాకుండా ఉంటే రాష్ట్రానికి ఎన్నో ఏళ్ల నుంచి భారీ పెట్టుబడులు వచ్చేవని తెలిపారు. విశాఖ బాక్సైట్‌ను కూడా ఇలాగే చేశారన్నారు. ఇలాగే పెండింగ్‌లో ఉన్న లేపాక్షి భూముల సమస్యకు కూడా త్వరలోనే పరిష్కారం లభిస్తుందన్నారు.ఇవన్నీ కొనసాగి ఉంటే నాలుగు సిమెంట్ ఫ్యాక్టరీలతో పాటు భారీగా అనుబంధ పరిశ్రమలు వచ్చి ఉపాధి అవకాశాలు లభించేవని తెలిపారు. పెద్దఎత్తున భూమి అందుబాటులో ఉండటమే పెట్టుబడులు రావటానికి పెద్ద సానుకూలత అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావటం గొడ్డలి పార్టీ అధినేతకు ఇష్టం లేదన్న చంద్రబాబు రూ.లక్షల కోట్ల రాష్ట్ర సంపదను దోచుకునేందుకు అభివృద్ధికి అడ్డుకట్ట వేశారని ధ్వజమెత్తారు.

**పెట్టుబడులు రాకుండా చేసేందుకు మావిగన్**

జగన్ నేర మనస్తత్వానికి ఉదాహరణ మావిగన్ అని సీఎం చంద్రబాబు అన్నారు. కేవలం పారిశ్రామి కవేత్తలు, పెట్టుబడులు రాకుండా చేసేందుకు మావిగన్ తీసుకువచ్చారని పేర్కొన్నారు. అయినప్పటికీ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లామని, పోలవరం, వెలుగొండ ప్రాజెక్టులను కూడా పూర్తి చేసే దిశగా ప్రభుత్వం వేగంగా పనిచేస్తోందని తెలిపారు.

**చంద్రబాబును కలిసిన టెక్కలి మాజీ ఎమ్మెల్యే వరదా సరోజమ్మ భర్త, ఇద్దరు కుమార్తెలు**

టెక్కలి మాజీ ఎమ్మెల్యే వరదా సరోజమ్మ భర్త, ఇద్దరు కుమార్తెలు సీఎం చంద్రబాబుని కలిశారు. ఈ సందర్భంగా వరదా సరోజమ్మ ఉదంతాన్ని చంద్రబాబు మీడియా వద్ద గుర్తు చేసుకున్నారు. శ్రీకాకుళంలో మొదటి హోటల్ వరదా కుటుంబం పెడితే తాను అప్పట్లో బస చేశానని అన్నారు. ఇప్పుడు ఆ కుటుంబ దయనీయ పరిస్థితి చూసి చలించిపోయానని, సరోజ చనిపోయాక.. కొడుకు ఆస్తి లాగేసుకుని తండ్రిని, తోబుట్టువులను గెంటేశాడని అన్నారు. ఆ కుటుంబ పరిస్థితి చూసి జాలేసిందని, తప్పక న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. గొడ్డలి పార్టీ అధినేతది కూడా ఇదే మనస్తత్వం కదా అని, ఆస్తి ఇవ్వకుండా తల్లి, చెల్లిని బయటకు గెంటే సంస్కృతి పెరుగుతుండటం దురదృష్టకరమని సీఎం వ్యాఖ్యానించారు.

# గ్రామపంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించేందుకు వీలుపై నివేదిక ఇవ్వాలి

## రాష్ట్ర ఎన్నికల సంఘం

**విజయవాడ,జూలై 11,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్ని గ్రామపంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించేందుకు వీలుందో నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీరాజ్ శాఖను కోరింది. కోర్టు కేసుల కారణంగా గతంలో ఎన్నిక నిర్వహించని 331 పంచాయతీల్లో తాజా పరి స్థితి ఏమిటో తెలియ జేయాలని ఆదేశిం చింది. పుర, నగరపా లక సంస్థలు, నగర పంచాయతీల్లో విలీనం చేసిన పంచాయతీల విషయంలో వివాదాలు ఉన్నాయా అనేదీ స్పష్టం చేయాలని సూచించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిలచంద్ర పునేఠా పంచాయతీరాజ్‌శాఖ కమిషనరు లేఖ రాశారు.

పంచాయతీల్లో సర్పం చుల పదవీ కాలం ఏప్రిల్ 2న ముగియడంతో తిరిగి ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తు న్నారు. వార్డుల వారీగా ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రచురణ ప్రక్రియ పూర్తయింది. డెడికేటెడ్ కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేయాలి. ఈ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేయడంతో ఎన్నికల కమిషన్ కూడా ఏర్పాట్లు చేస్తోంది.పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు.

331 పంచాయతీలను కోర్టు కేసులు, ఇతరత్రా వివాదాల కారణంగా పక్కన పెట్టారు. ఈసారి అన్ని పంచాయతీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే ఎలా ఉంటుందని రాష్ట్ర ఎన్నికల సంఘం యోచిస్తోంది. ఈ నేపథ్యంలో ఎస్ఈసీ లేఖ రాయడంతో కమిషనర్ కార్యాలయం పెండింగ్ కోర్టు కేసుల వివరాలు బయటకు తీస్తోంది. వీటిలో 51 పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించొచ్చని అధికారులు ప్రాథ మికగా అంచనాకు వచ్చారు.

280 పంచాయ తీలకు సంబంధించి కోర్టు కేసులు పెండింగ్లో ఉన్నట్లు గుర్తించారు. పుర, నగరపాలక సంస్థల్లో విలీనం చేసిన కొన్ని పంచాయతీల విషయంలోనూ కోర్టు కేసులు నమోదైన విషయాన్ని ఎన్నికల కమిషనర్కు నివేదించనున్నారు.

# దుర్గమ్మవారి భవనాలకు ఏకరూపక రంగులతో ముస్తాబు : కమిషనర్ ఆదేశం



అన్నదానం, ప్రసాదం పోటు భవనాల పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రామచంద్రమోహన్, మంత్రి సుభాష్, దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, జులై 11, ప్రభాతవార్త :** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో నిర్మాణంలో వున్న లడ్డూపోటు, అన్నదాన భవనాలను కమీషనర్ కె రామచంద్ర మోహన్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లడ్డూపోటు సెల్లార్‌ను భక్తులకు త్వరగా అందుబాటులోకి తెవాలని ఆదేశించారు. ఈ మూడు భవనాలకు ఆహ్లాదకరమైన రంగులు ఏకరూపతతో వుండేలా వేయాలన్నారు.ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా వుండాలన్నారు. ఆయనతో పాటు చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు, పి రాఘవరాజు, డిప్యూటి ఇఓ కిషోర్ కుమార్, ఆలయ ఇంజనీరింగ్ అధికారులు ఎల్ రమ, అసిస్టెంట్‌కమీషనర్ రంగారావు,తదితరులు పాల్గొన్నారు.

**15 నుండి ఆషాఢమాస ఉత్సవాలు:** దుర్గమ్మవారిని తమ ఇంటి ఆడపడుచుగా భావిస్తూ ఆషాఢమాసంలో భక్తులు ఆరాధించే ఆషాఢమాస ఉత్సవాలు ఈనెల 15 నుండి ఆగస్టు 12 వరకు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ అమ్మవారికి ఆషాఢమాస సారె ను పలు భక్తబృందాలు అందిస్తాయని, ఆషాఢమాస ఉత్సవాల్లో భక్తులు పాల్గొనాలన్నారు.

**దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి సుభాష్:** దుర్గమ్మవారిని శనివారం మంత్రి వాసంసెట్టి సుభాష్ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన రాయపాటి కోటి సుధాకర్ రు.1,08,616ల విరాళం శనివారం డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కిషోర్ కుమార్‌కు అందించారు. వారికి దుర్గమ్మవారి దర్శన ఏర్పాటు చేసిన అనంతరం దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# ధవళేశ్వరం..మరింత పటిష్టం..

**కొత్తగేట్లు అమర్చే పనుల్ని రేపు ప్రారంభించనున్న సిఎం చంద్రబాబు**
**రూ.152.95కోట్లతో 117పాత ఫ్లడ్ గేట్ల స్థానంలో కొత్త గేట్లు**
**పిచ్చుకలంక గ్రామంలో రైతులతో సమావేశం కానున్న ముఖ్యమంత్రి**
**అదే రోజున పోలవరం ప్రాజెక్టు పరిశీలన, అధికారులతో సమీక్ష**

**విజయవాడ, జూలై 11, ప్రభాతవార్తప్రతినిధి:** ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు జీవనాడి ధవళేశ్వరం బ్యారేజీ మరో చారిత్రాత్మక ఘట్టానికి సిద్ధమవుతోంది. గోదావరి నదిపై నిర్మితమై లక్షలాది ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగు నీరు అందిస్తోన్న ధవళేశ్వరం బ్యారేజీకి ప్రభుత్వం కొత్తగేట్లు అమర్చనుంది.

బ్యారేజీకు ఉన్న 117 గేట్లను మార్చాల్సి రావడంతో వాటి స్థానాల్లో కొత్తవి ఏర్పాటు చేసేందుకు గేట్లను అమర్చే పనులకు ఈ నెల 13వ తేదీన సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టనున్నారు. ధవళేశ్వరం ఆనకట్ట కొత్తగేట్ల అమరికకు ప్రభుత్వం రూ.152.95 కోట్లు ఖర్చు చేయనుంది. ఇందులో పార్ట్1కు రూ.130.42 కోట్లు, పార్ట్2కు రూ.22.53 కోట్లు ఖర్చు చేయ నుంది. 117 పాత ఫ్లడ్ గేట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయనుంది. 12 హెడ్ స్లూయిజ్ గేట్ల బాటమ్ టియర్ షట్టర్లకు మరమ్మతులు చేయనున్నారు. 175 క్రస్ట్ గేట్లకు కొత్త రబ్బరు సీల్స్, 734 రోలర్ బేరింగ్స్ కొత్తవి అమర్చనున్నారు. 197 గేట్లకు వైర్ రోప్స్ మార్పు, సాండ్ బ్లాస్టింగ్, పెయింటింగ్, పార్ట్2 కింద 102 మాస్టర్ కంట్రోలర్ ప్యానెల్స్, 175 గేట్లకు ఎలక్ట్రికల్ కేబుల్స్ వైరింగ్ చేయనున్నారు. ఈ పనులను తీనిదివీలీ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చేపట్టింది. ఈ మొత్తం పనులను తీనిదివీలీ ఇన్ఫ్రా సంస్థ రెండేళ్లలో పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించనుంది.

**వైసీపీ ప్రభుత్వం...నిలువెత్తు నిర్లక్ష్యం**

సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతుల విషయంలో గత ప్రభుత్వం అత్యంత నిరక్ష్యంగా వ్యవహరించింది. పులిచింతల, గుండ్లకమ్మ ప్రాజెక్టుల మరమ్మతులను పట్టించుకోకపోవడంతో ఆ ప్రాజెక్టుల రెండు గేట్లు కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. అయినా ప్రాజెక్టుల నిర్వహణపై నాటి ప్రభుత్వం తీవ్ర నిరక్ష్యంతో వ్యవహరించింది. ధవళేశ్వరం ఆనకట్ట విషయానికి వస్తే 2014లో రూ.31.77 కోట్లతో 58 గేట్లకు మరమ్మతులను నాటి టీడీపీ ప్రభుత్వం చేయించింది. 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం బ్యారేజ్ రక్షణపై తీవ్ర నిరక్ష్యం చూపింది. కనీస మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టలేదు.

దీంతో 2024లో ప్రజా ప్రభుత్వం వచ్చాక ప్రాజెక్టు రిపేర్లకు గత ఏడాది జూన్ 30న పరిపాలనామోదం ఇచ్చింది. బ్యారేజీ గేట్లను అమర్చి 50 ఏళ్లు దాటడంతో ఆపరేటింగ్ మెకానిజం సర్వీస్ లైఫ్ ముగిసింది. బ్యారేజ్‌ను రెండుసార్లు సందర్శించిన సీడబ్ల్యూసీ మరమ్మతులకు సిఫార్సు చేయడంతో ప్రభుత్వ కొత్త గేట్లను అమర్చేందుకు నిర్ణయం తీసుకుంది.

**.ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన వివరాలు..**

ఉదయం 10.25 గంటలకు ఉండవల్లి నుంచి బయలుదేరి 11 గంటలకు వేమగిరి గ్రామానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్దకు చేరుకుంటారు. 11.25 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ నూతన గేట్ల ఏర్పాటు పనులను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడి నుంచి ఆత్రేయపురం మండలం పిచ్చుకలంక గ్రామానికి 11.45 గంటలకు చేరుకుని రైతులతో సమావేశమవుతారు. సుమారు గంట పాటు రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు సందర్శనకు బయలుదేరనున్నారు. మధ్యాహ్నం 1.20 గంటలకు పోలవరం ప్రాజెక్టు వద్దకు చేరుకుంటారు. ఈసీఆర్ఎఫ్ గ్యాప్ 2 పనులు, పవర్ హౌస్ నిర్మాణాన్ని పరిశీలిస్తారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం 05.20 గంటలకు పోలవరం ప్రాజెక్టు సందర్శన ముగించుకుని అమరావతికి చేరుకుంటారు.

# జాతీయ లోక్ అదాలత్‌లో 9,556 కేసుల పరిష్కారం

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రతినిధి, జూలై11,ప్రభాతవార్త:** ఇరుపక్షాలకుఆమోద యోగ్యమైన రీతిలో కోర్టు కేసులను త్వరితగతిన పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ అత్యుత్తమ ప్రత్యామ్నాయ వేదిక అని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) ఛైర్మన్ (ఎఫ్ఏసీ), ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎల్. వేంకటేశ్వర రావు అన్నారు.లోక్ అదాలత్‌ను ఒక ప్రజా ఉద్యమంలా నిర్వహించడం వల్ల ప్రజల్లో అవగాహనతో పాటు న్యాయ వ్యవస్థపై విశ్వాసం మరింత పెరుగుతుందని తెలిపారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి జిల్లా కోర్టు ఆవరణ లోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 9,556 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో 592 సివిల్ కేసులు, 8,964 క్రిమినల్ కేసులు ఉండగా, 137 ప్రీలిటిగేషన్ కేసులు కూడా రాజీ ద్వారా పరిష్కార మయ్యాయి. ఈ కేసుల పరిష్కారం ద్వారా మొత్తం రూ.55,32,21,094 (రూ.55.32 కోట్లు) విలువైన క్లెయిమ్‌లు, బకాయిలు, పరిహారాలు మరియు ఇతర వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించింది. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వై. శ్రీలక్ష్మి ,రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.హెచ్.వి. ప్రసాద్, అదనపు జిల్లా న్యాయమూర్తులు, సీనియర్ సివిల్ న్యాయమూర్తులు, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, బ్యాంకు అధికారులు,కక్షి దారులు పాల్గొన్నారు.

# నరసాపురం మున్సిపాలిటీకి రూ.212 కోట్లతో అభివృద్ధి పనులు

## పుష్కరాలకు రూ 64 కోట్లు మంజూరు

**ప్రతి ఇంటికి కుళాయి కోసం మొత్తం 125 కోట్లు**
**మీడియా సమావేశంలో మంత్రి నారాయణ వెల్లడి**



**నరసాపురం జూలై 11 ప్రభాతవార్త:** డబ్బులు లేకపోయినా.. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అపారమైన పాలనా దక్షతతో రాష్ట్రంలో అభివృద్ధి పనులకు లోటు లేకుండా పనులు జరుగుతున్నాయని గత పుష్కరాల కన్నా ఈ పుష్కరాలకు అధికంగా నిధులు ఇచ్చి పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నరసాపురం మున్సిపల్ కార్యాలయంలో శనివారం రానున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, పట్టణ అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ, పుష్కరాల ప్రధాన ఘాట్లు నరసాపురం మున్సిపల్ పరిధిలో ఉన్నందున భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని మంత్రి గారిని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి మీడియా సమావేశంలో పుష్కర నిధులు పై మాట్లాడారు. పుష్కరాల పనుల కోసం ఇప్పటికే రూ.15 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా అర్బన్ చాలెంజ్ ఫండ్ ద్వారా రూ.34.50 కోట్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని వెల్లడించారు. ఈ నిధులతో నరసాపురం పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ, పార్కులు, రహదారులు, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు.అదనంగా మరికొన్ని పథకాల ద్వారా మరో రూ.15 కోట్లు మున్సిపల్ అభివృద్ధికి కేటాయించనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలకు ప్రతి ఇంటికి కుళాయి మంజూరు చేస్తూ స్వచ్ఛమైన నీటి కోసం ఈ మున్సిపాలిటీకి 125 కోట్లు మంజూరు కానున్నాయని ఈ పథకం కూడా త్వరలో అమలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, నరసాపురం మున్సిపాలిటీ అభివృద్ధి మరియు పుష్కరాల ఏర్పాట్ల కోసం దాదాపు రూ.64.50 కోట్ల నిధులు కేటాయించడం పట్టణ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన కొత్తపల్లి సుబ్బారాయుడు తెలుగుదేశం పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు , మున్సిపల్ రీజినల్ డైరెక్టర్, రాజమహేంద్రవరం, మున్సిపల్ కమిషనర్, మెప్మా పీడీ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఇద్దరు బైక్ దొంగలు అరెస్ట్: 25 ద్విచక్ర వాహనాల స్వాధీనం

**అనంతపురం క్రైమ్ జూలై 11 ప్రభాతవార్త:** నకిలీ తాళాల సాయంతో ఇళ్లు, ఆసుపత్రులు, ఇతర రద్దీ ప్రదేశాల్లోపార్కింగ్ చేసి ఉన్న మోటార్ సైకిల్ లను దొంగతనం చేసిన ఇద్దరు దొంగలను పోలీసులు పట్టుకున్నారు. వారిని అరెస్టు చేసి వారి నుండి 25 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం అనంతపురం నగరంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అడిషనల్ ఎస్పీ మహబూబ్ బాషా సిఐ పుల్లయ్య, మాట్లాడారు. కళ్యాణదుర్గం రోడ్డు లోని నందమూరి నగర్ కు చెందిన బండారు మురళీకృష్ణ, ఇదే అనంతపురంలోని ఆర్కే నగర్ కు చెందిన హున్నూరు షేక్ అలీ అక్బర్ లు ఇద్దరూ కలిసి ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా పలు పట్టణాల్లో టూవీలర్లు దొంగతనాలకు పాల్పడేవారన్నారు. బాధితుల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ముఖ్యంగా జిల్లా ఎస్పీ జగదీష్ ప్రత్యేక చొరవ తీసుకొని సదురు దొంగలను పట్టుకునేందుకు కృషి చేశారు. ఇందులో భాగంగానే జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు అనంతపురం ఇన్చార్జి డిఎస్పి, అడిషనల్ ఎస్పీ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో అనంతపురం టు టౌన్ సిఐ పుల్లయ్య ఎస్సైలు చంద్రబాబు రామకృష్ణ పోలీస్ సిబ్బంది తమకు రాబడిన ప్రకాశ సమాచారంతో శనివారం ఉదయం నాయక్ నగర్ రైల్వే గేట్ దగ్గర వాహనాలు తనిఖీ చేయుచుండగా ప్రసన్నాయన పల్లి రైల్వే స్టేషన్ వైపు నుండి ఒక మోటార్ సైకిల్ పై ఇద్దరు నిందితులు అటువైపు అనుమానాస్పదంగా రావడానికి చూసి విచారించగా వారి విచారణలో ఇద్దరు వ్యక్తులు జల్సాలకు అలవాటు పడి చోరీలు చేసే వారమని అంగీకరించాలన్నారు. వారిని అరెస్టు చేసి వారి నుండి సుమారు 19 లక్షల రూపాయల విలువ చేసే 25 మోటార్ సైకిల్ లను రికవరీ చేశామన్నారు. ఈ కేసును సవాలుగా స్వీకరించి రికవరీ చేయడంతో పాటు ఇద్దరు దొంగలు అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన అడిషనల్ ఎస్పీ మహబూబ్ బాషా, టూ టౌన్ సీఐ పుల్లయ్య, టూ టౌన్ ఎస్ఐ లు రుశేంద్రబాబు రామకృష్ణ, సిబ్బంది అమరేశ్వర రావు, రమేష్ నాయక్, వన్నూరప్ప, పాండవ సుధాకర్, అంజన్ కుమార్, రామాంజనేయులను జిల్లా ఎస్పీ జగదీష్ ప్రశంసించారు.

# సిఎం సర్! నన్ను కాపాడండి

**తనపై 27 కేసులున్నాయని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరసన**
**అనంతలో టీడీపీ కార్యకర్త కన్నీటి ఆవేదన**



**అనంతపురం క్రైమ్ జులై 11 ప్రభాతవార్త :** సీఎం చంద్రబాబు నాయుడు సార్, మంత్రి లోకేష్ సార్, నన్ను కాపాడండి.. 2019 నుండి 2024 వరకు నాపై 27 కేసులు నమోదయ్యాయి. ఈ ఐదేళ్లలో నేను జైలు జీవితాన్ని అనుభవించాను. నా భార్య బిడ్డలు కూడా నన్ను చీదరించుకుంటున్నారు. నా జీవితం నాశనమైపోయిం దంటూ అనంపురం జిల్లా అనంతపురం నగరంలోని ఓ టిడిపి కార్యకర్త రఫీ ఆక్రందన చేశాడు. నగరంలోని జిల్లా పరిషత్తు కార్యాలయంప్రధాన ద్వారంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద శనివారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశాడు. అక్కడే వున్న టీడీపీ జెండా చేతబూని తనకు న్యాయం చేయాలంటూ కన్నీటి పర్యంతం అయ్యాడు. 27 కేసుల్లో జైలు జీవితం అనుభవించి భార్య బిడ్డలకు దూరమయ్యాయనంటూ ఎన్టీఆర్ విగ్రహం ముందు తన నిరసన గళాన్ని విప్పాడు. నా ప్రాణం పోయినా ఇక్కడి నుండి కదలనని ఆవేదన చెందాడు. 1982 టీడీపీ ఆవిర్భావం నుండి మా కుటుంబం టీడీపిలో వుంటూ పార్టీ అభివృద్ధికి పనిచేశామని వాపోయాడు. ఇక్కడ టీడీపి పార్టీకి అన్యాయం జరుగుతోందని వాపోయాడు. తమ గురించి ఏ ఒక్క నాయకుడు పట్టించుకోలేదని వాపోయాడు. ఈ విషయం తెలుసుకున్న టూ టౌన్ పోలీసులు ఇతన్ని అక్కడ నుండి స్టేషన్కు తరలించారు.

12-7Pg5.qxd:12-7Pg5.qxd 1/1/02 6:24 AM Page 1



# భారత్‌లో భారీగా న్యూజిలాండ్ పెట్టుబడులు



### వచ్చే 15 యేళ్లలో 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు హామీ

### 10 ఒప్పందాలు సహా 18 కీలక నిర్ణయాలు

### ఇండోపసిఫిక్ ప్రాంత భద్రతపై ఉభయ ప్రధానుల చర్చలు

### సముద్ర భద్రతలో వ్యూహాత్మక భాగస్వామ్యం

**ఆక్లాండ్,జులై 11:** భారత్, న్యూజిలాండ్ తమ ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తూ వ్యూహాత్మక భాగస్వామ్యంగా అప్‌గ్రేడ్ చేసుకున్నాయి. రాబోయే నాలుగేళ్లలో రెండు దేశాల మధ్య బంధాన్ని మరింత విస్తరించేందుకు వ్యూహాత్మక భాగస్వామ్య రోడ్‌మ్యాప్ 2030ని ఆవిష్కరించాయి. 2030 నాటికి వస్తువులు, సేవల రంగాల్లో వార్షిక ద్వైపాక్షిక వాణిజ్యాన్ని సుమారు రూ.35 వేల కోట్లకు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాయి. రాబోయే 15 యేళ్ల పాటు భారత్‌లో 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టేందుకు న్యూజిలాండ్ హామీ ఇచ్చింది. న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న, ప్రధాని నరేంద్ర మోడీ ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్‌తో విస్తృత చర్చలు జరిపారు. ఈ భేటీలో 10 ఒప్పందాలతో సహా మొత్తం 18 కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇద్దరు ప్రధానులు ఇండోపసిఫిక్‌ప్రాంత భద్రత, స్థిరత్వంపై విస్తృతంగా చర్చించారు. స్వేచ్ఛా యుతమైన, అందరికీ అందుబాటులో ఉండే, అభివృద్ధి చెందే ఇండోపసిఫిక్ ప్రాంత నిర్మాణానికి కలిసి పనిచేయాలనే సంకల్పాన్ని పునరుద్ఘాటిం చారు. ప్రతి దేశం సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను గౌరవించడం, అంతర్జాతీయ నిబంధనల ఆధారిత వ్యవస్థను బలోపేతం చేయడం అత్యంత అవసరమని ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ సముద్ర చట్టాలకు అనుగుణంగా సముద్ర మార్గాల్లో నౌకల రాక పోకలు, విమానాల స్వేచ్ఛాయుత ప్రయాణం నిరంతరంగా కొనసాగా ల్సిన అవసరాన్ని ఇరు దేశాలు నొక్కి చెప్పాయి.ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి సముద్ర చట్టాల ఒప్పందం సూత్రాలను గౌరవించాలని అభిప్రాయపడ్డాయి. ఇండోపసిఫిక్‌లో పెరుగుతున్న వ్యూహాత్మక సవాళ్ల దృష్ట్యా సముద్ర భద్రత రంగంలో సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని భారత్, న్యూజిలాండ్ నిర్ణయించాయి. దీనికోసం ప్రత్యేక మారిటైమ్ సెక్యూరిటీ డైలాగ్ ఏర్పాటు చేయాలని అంగీకరించాయి. ఈ వేదిక ద్వారా సమాచారమార్పిడి, సమన్వయం, సంయుక్త చర్యలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అలాగే పరస్పర లాజిస్టిక్ సహకార ఒప్పందం ద్వారా ఇరు దేశాల నౌకాదళాల మధ్య కార్యాచరణ సామర్థ్యం మరింత పెరుగుతుందనిఅధికారులు భావిస్తున్నారు.

**వాణిజ్యానికి కొత్త ఊపు**

ఇటీవల కుదిరిన భారత్-న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) అమలుకు వేగం తీసుకురావాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. ఈ ఒప్పందం త్వరగా అమల్లోకి వచ్చేలా అవసరమైన ప్రక్రియలను పూర్తి చేయాలని ప్రధానులు అంగీకరించారు. 2030 నాటికి ద్వైపాక్షిక వస్తు, సేవల వాణిజ్యాన్ని 700కోట్ల న్యూజిలాండ్ డాలర్లు, అంటే సుమారు రూ.35 వేల కోట్లకు పెంచే లక్ష్యాన్ని నిర్దేశించుకు న్నారు. పెట్టుబడులు, సాంకేతికత, వ్యవసాయం, విద్య, ఆవిష్కరణలు, సేవల రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించాలని నిర్ణయించారు.

**ఐక్యరాజ్యసమితి సంస్కరణలకు మద్దతు**

ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్య సమితిలో సమగ్ర సంస్కరణలు అవసరమని మోడీ,లక్సన్ అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ సంస్థలు మరింత సమర్థవంతంగా పనిచేయా లంటే ప్రస్తుత వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా వాటి నిర్మాణంలో మార్పులు అవసరమని పేర్కొన్నారు.

**కస్టమ్స్, పర్యాటక రంగాల్లో కీలక నిర్ణయాలు**

విశ్వసనీయ వాణిజ్యాన్ని ప్రోత్సహించేందుకు కస్టమ్స్ ప్రక్రియలను సరళీకృతం చేసే ఆథరైజ్డ్ ఎకనామిక్ ఆపరేటర్స్ మ్యూచువల్ రికగ్నిషన్ అరేంజ్‌మెంట్ అమలుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. పర్యటక రంగంలో అవగాహన ఒప్పందాన్ని స్వాగతించిన ఇరు దేశాలు, భారత్, న్యూజిలాండ్ మధ్య ప్రత్యక్ష నాన్‌స్టాప్ విమాన సర్వీసులు ప్రారంభించేందుకు విమానయాన సంస్థలు ముందుకు రావాలని కోరాయి.

**వ్యవసాయం, పాడి పరిశ్రమల్లో సహకారం**

ఉద్యానవనం, అటవీ, పశుసంవర్ధక, పాల ఉత్పత్తి రంగాల్లో సహకారాన్ని విస్తరించాలని నిర్ణయించారు. కివీ పండ్లు, యాపిల్స్, తేనె ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించనున్నారు. భారత్‌లో కివీ పరిశోధన, ఉత్పత్తి కోసం సెంటర్ ఆఫ్ ఎక్స లెన్స్‌ల ఏర్పాటుకు కూడా సహకరించనుంది న్యూజిలాండ్.

పశుసంవర్ధక, పాడి పరిశ్రమలపై ప్రత్యేక అవగాహన ఒప్పందం కూడా కుదిరింది.

ప్రధాని నరేంద్ర మోడీ మూడు దేశాల విదేశీ పర్యటనలో చివరి దశగా ఆక్లాండ్‌కు చేరుకున్నారు. ఈ పర్యటనలో ఇండోపసిఫిక్ ప్రాంతంలో భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, వాణిజ్యం, రక్షణ, వ్యూహాత్మక సహకారాన్ని విస్తరించడం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి.



## నన్ను చంపితే ఇరాన్ పూర్తిగా ధ్వంసమే

### వెయ్యి క్షిపణులను లోడ్‌చేసి పెట్టాం

### తీవ్ర హెచ్చరిక చేసిన ట్రంప్

**వాషింగ్టన్, జులై 11:** అమెరికా-ఇరాన్ మధ్య తాత్కాలిక ఒప్పందం కుదిరినప్పటికీ.. ఉద్రిక్తతలు ఏమాత్రం సమసిపోలేదు. రెండు దేశాలు పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో హెచ్చరిక చేశారు. ఒకవేళ వారు తనను హత్య చేయాలని ప్రయత్నిస్తే.. క్షిపణుల వర్షం తప్పదని హెచ్చరించారు. ఇప్పటికే వెయ్యి క్షిపణులను లోడ్ చేసి పెట్టామని వెల్లడించారు. ఆ వెంటనే వేలాదిగా విరుచుకుపడతాయని, అందుకు సంబంధించి సైన్యానికి ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ మేరకు ట్రూత్‌లో పోస్టు పెట్టారు. ఇరాన్‌లోని అన్ని ప్రాంతాలను పూర్తిగా ధ్వంసం చేయడానికి తమ సైన్యం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. అంతకుముందు మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. తనను చంపడంలో ఆ దేశం సఫలమైతే.. తదుపరి ఏం చేయాలన్న దానిపై ఇప్పటికే సూచనలు జారీ చేశానన్నారు. 'ఏదైనా జరిగితే.. ఇంతకుముందెన్నడూ లేనంత భారీ స్థాయిలో ఇరాన్‌పై బాంబుల వర్షంకురిపించాలని సూచనలు జారీచేశా. అయితే టెహ్రాన్ నన్ను చంపడంలో విఫలమవుతుందని ఆశిస్తున్నా' అని పేర్కొన్నారు. హార్ముజ్‌లో ప్రయాణిస్తోన్న నౌకలపై ఇరాన్‌పై దాడులు చేయడం.. ఆ వెంటనే ఆదేశంపై అమెరికా క్షిపణులవర్షం కురిపించడంతో మరోసారి పశ్చిమాసియాను యుద్ధ మేఘాలు కమ్మేశాయి. ఈ క్రమంలోనే డీల్ ముగిసిందంటూ ట్రంప్ ప్రకటన చేశారు. దాంతో.. ఇప్పటికే అంగీకరించిన అంశాల్లో వేటినైనా ఉల్లంఘిస్తే ప్రతిచర్య తప్పదని ఇరాన్ హెచ్చరించింది. చర్చలను కొనసాగించాలని తాము కోరినట్లు ట్రంప్‌చేసిన వ్యాఖ్యలనుకూడా ఖండించింది. తాము లొంగిపోవడంతోనే యుద్ధం ముగియదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ పేర్కొన్నారు. 'యుద్ధాన్ని ముగించడం ప్రపంచ దేశాలకు ప్రాధాన్యాంశం. ఇరాన్ లొంగిపోవడంతో ఎప్పటికీ ఈ యుద్ధం ముగిసిపోదని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి. అమెరికన్లు ఎప్పుడైతే అవగాహన ఒప్పందాన్నిఉల్లంఘిస్తారో..అప్పుడు మమ్మల్ని మేము రక్షించుకోవడానికి సిద్ధంగాఉంటాం' అని వెల్లడించారు. అలాగే యుద్ధానికి సిద్ధంగా ఉన్నవారే.. అమెరికాతో చర్చలు జరపగలరని వ్యాఖ్యానించారు.

## ఇరాన్ అణుకేంద్రాల వద్ద మళ్లీ కార్యకలాపాలు

### పశ్చిమాసియాలో భగ్గుమన్న ఉద్రిక్తతలు

**టెహ్రాన్, జులై 11:** పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమంటున్నాయి. ఈ సమయంలో ఇరాన్ అణు కేంద్రాల వద్ద మళ్లీ కార్యకలాపాలు మొదలయ్యాయని, ఈ విషయం ఉపగ్రహ చిత్రాల ఆధారంగా తెలిసిందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇటీవల అమెరికా దాడుల్లో అణుకేంద్రాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, వాటిని పునర్నిర్మించేందుకు వేగంగా ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం. ఇనిస్టిట్యూట్ ఫర్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ సెక్యూరిటీ ఈ చిత్రాలను విశ్లేషించింది. హార్మూజ్‌లో వాణిజ్య నౌకలపై దాడుల నేపథ్యంలో ఇరాన్‌తో డీల్ ముగిసిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దానికిముందే, జూన్ చివర్లోనే ఇరాన్ ఈ అవగాహన ఒప్పందాన్ని ఉల్లంఘించిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నిర్మాణ పరికరాలు, వాహనాల కదలికలు, దెబ్బతిన్న నిర్మాణాల్లో మార్పులు వంటివి అణు కేంద్రాల వద్ద కనిపించాయి. దీంతో అణు కార్యకలాపాల పునుద్ధరణ కోసం ఇరాన్ ప్రయత్నాలు ప్రారంభించిందా? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే నష్టాన్ని అంచనా వేసేందుకు శిథిలాలను తొలగించే చర్యకూడా అయి ఉండొచ్చని తెలుస్తోంది. స్పష్టంగా అక్కడ ఎలాంటి కార్యకలాపాలు జరుగుతున్నాయన్నది మాత్రం తెలియరాలేదు. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదని, శుద్ధి చేసిన యురేనియాన్ని వారి వద్ద ఉంచుకోకూడదన్న కీలక షరతులతోనే తమ మధ్య ఒప్పందం కుదిరిందని అమెరికా చెబుతోంది. హార్ముజ్‌పై నియంత్రణ కోల్పోతే అణు కార్యక్రమం వంటి కీలకాంశాల్లో అగ్రరాజ్యానికి తలొగ్గాల్సి వస్తుందనే ఆందోళన ఇరాన్‌లో ఉంది. ఈ క్రమంలోనే తన పట్టు నిలుపుకొనేందుకు హార్ముజ్‌ను ఇరాన్ ఒక ఆయుధంగా వాడుకోవాలని చూస్తోందని, తన అనుమతి లేకుండా ప్రయాణిస్తోన్న నౌకలపై దాడులు చేస్తోందనే వాదనా ఉంది. తాజా ఘర్షణలకు అదే కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## మహిళలకు ఓటు హక్కు కల్పించినదేశం న్యూజిలాండ్

### ఆక్లాండ్ సదస్సులో ప్రధాని మోడీ ప్రశంసలు

**ఆక్లాండ్,జులై 11:** మహిళలకు మొట్టమొదట ఓటు హక్కు కల్పించిన దేశం న్యూజిలాండ్ అని నేడు న్యూజిలాండ్ సమాజానికి మహిళలు పెద్ద ఎత్తున సేవలందిస్తున్నారని ప్రధాని నరేంద్రమోడీ పేర్కొన్నారు. భారతదేశం కూడా మహిళా నేతృత్వ అభివృద్ధి అనే మంత్రంతో మహిళలకు కొత్త అవకాశాల తలుపులు తెరుస్తోంది. న్యూజిలాండ్‌లో వీధులు కూడా భారతీయ నగరాలను గౌరవిస్తాయి. ఎక్కడో ఖండాలా, ఎక్కడో బొంబాయి హిల్స్, ఎక్కడో కోరమండల్, కలకత్తా స్ట్రీట్, ఢిల్లీ క్రెసెంట్, అమృత్‌సర్ స్ట్రీట్ ఇలా ఎన్నో పేర్లు ఉన్నాయి. అక్కడ నివసిస్తున్న మీరుకూడా పూర్తిగా ఒక కివీగా మారిపోయారు. నేను ఏ న్యూజిలాండ్ నాయకుడిని కలిసినా, ఆయన మిమ్మల్నందరినీ ప్రశంసిస్తారు. ఆ ప్రశంస మీకే దక్కుతుంది, నేను గర్వంగా తల ఎత్తుకుంటానని అన్నారు. ఈ సందర్భంగా న్యూజిలాండ్ ప్రధాన మంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ప్రధాని నరేంద్ర మోడీపై ప్రశంసల వర్షం కురిపించారు. ప్రధాని మోడీ బాల్యాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఒక సాధారణ నేపథ్యం నుంచి ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి నాయకత్వం వహించే స్థాయికి ఎదిగారు. ఆయన లక్షలాది మందిని పేదరికం నుంచి బయటపడేయడంలో సహాయపడ్డారు. ఆయన మన కాలంలోని అత్యంత ముఖ్యమైన నాయకులలో ఒకరు, న్యూజిలాండ్‌కు నిజమైన స్నేహితుడని కొనియాడారు.

## బహామాస్‌లో కుప్పకూలిన విమానం




### 10 మంది స్పాట్‌లోనే మృతి, పలువురికి గాయాలు

**నసావు,జులై 11:** కరేబియన్ దేశమైన బహామాస్ దీవుల్లో ఒక ఘోర విమాన ప్రమాదం సంభవించింది. ఒక చిన్న ప్రైవేట్ విమాన ప్రమాదంలో ఏకంగా 10 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ భయంకరమైన ప్రమాదం నార్త్ ఆండ్రోస్ ప్రాంతంలో చోటుచేసుకుంది. ఇది బహామాస్ రాజధాని నసావుకు పశ్చిమ దిశలో సముద్ర తీరానికి సమీపంలో ఉంటుంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక రక్షణ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. విమానంలో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు ప్రాణాలతో బయటపడినట్లు బహామాస్ ప్రధాన మంత్రి ఫిలిప్ బ్రేవ్ డేవిస్ మొదట ప్రకటించినప్పటికీ ఆ తర్వాతజరిగిన అత్యవసర ప్రెస్ కాన్ఫరెన్స్‌లో, తీవ్ర గాయాలకారణంగా ఆవ్యక్తికూడా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్లు ధృవీకరించారు. మరణించిన వారి వివరాలను అధికారులు ఇంకా అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ తీరని విషాదం దేశమంతా ఎంతో సంతోషంగా పండుగ జరుపుకుంటున్న సమయంలో ఈ ప్రమాదం జరగడం ఆ దేశాన్ని తీవ్ర శోకసంద్రంలో ముంచేసింది. ఈ ఘటనపై బహామాస్ ప్రధాన మంత్రి ఫిలిప్ బ్రేవ్ డేవిస్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బహామాస్ ప్రజలంతా దేశ 53వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఎంతో ఘనంగా జరుపుకుంటున్న తరుణంలో ఈ ప్రమాదం జరగడం దురదృష్టకరమని, ఈ పండుగ రోజు కాస్తా దేశానికి పెద్ద శోకదినంగా మారిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విమానం రాజధాని నసావులోని ప్రసిద్ధ లిండన్ పిండ్లింగ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రయాణికులతో బయలుదేరింది. ఇది సాన్ ఆండ్రోస్ వైపు వెళ్తుండగా మార్గమధ్యంలోనే అదుపుతప్పి నార్త్ ఆండ్రోస్ సమీపంలో కుప్పకూలిపోయింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే విమానంలో సాంకేతిక లోపం తలెత్తిందా లేక వాతావరణం అనుకూలించలేదా అనే కోణంలో దర్యాప్తు సంస్థలు ఆధారాలు సేకరిస్తున్నాయి. ఒకే రోజులో రెండు ప్రమాదాలు ఈ ఘోర ప్రమాదం జరిగిన కొద్దిసేపటికే బహామాస్ ఇంధన, యుటిలిటీస్, ఏవియేషన్ మంత్రిత్వ శాఖ ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రమాదానికి గురైన విమాన సంస్థ ఫ్లెమింగో ఎయిర్‌కు చెందిన ఎయిర్ ఆపరేటర్ సర్టిఫికేట్‌ను ప్రభుత్వం తక్షణమే సస్పెండ్ చేసింది. అంటే ఆ సంస్థకు చెందిన అన్ని విమానాల సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేసింది. విమాన ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై దర్యాప్తు జరుగుతున్నందున, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని మాత్రమే ఈ ముందస్తు జాగ్రత్త చర్య తీసుకున్నట్లు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అయితే కేవలం ఈ ఒక్క ప్రమాదమే కాకుండా, ఫ్లెమింగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన మరో విమానంలో కూడా భద్రతా లోపం తలెత్తడం ఈ సస్పెన్షన్‌కు దారితీసింది.

## ముందుగా వందేమాతరం, తర్వాత జనగణమన

### గీతాలను తప్పక ఆలపించాలి ఆ తర్వాతే రాష్ట్ర గీతం

### స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిన కేంద్ర హోంశాఖ

**న్యూఢిల్లీ,జులై 11:** జాతీయ గీతం జనగణమన, జాతీయ గేయం వందే మాతరం, రాష్ట్ర గీతాల ఆలాపన విషయంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తాజాగా స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలకు ఈ మేరకు ఈ నెల 9న ఆదేశాలు పంపింది. అధికారిక కార్యక్రమాలలో జాతీయ చిహ్నాల గౌరవాన్ని కాపాడటం, ఏకరూపతను పాటించడంకోసం ఈ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వులలో ఇప్పటికే ఉన్న ఆదేశాలను పునరుద్ఘాటిస్తూ, కొన్ని కీలక అంశాలపై స్పష్టతనిచ్చింది.జాతీయ గీతం పాడేటప్పుడు లేదా దాని సంగీతం వినిపించినప్పుడు ప్రేక్షకులు తప్పనిసరిగా నిలబడి అటెన్షన్‌లో ఉండాలి. అయితే, వార్తా చిత్రాలు (న్యూస్‌రీల్స్) లేదా డాక్యుమెంటరీల ప్రదర్శన సమయంలో జాతీయ గీతం వస్తే, ప్రదర్శనకు అంతరాయం కలగకుండా ఉండేందుకు నిలబడాల్సిన అవసరం లేదని మినహాయింపు ఇచ్చింది. ఇది ఎప్పటి నుంచో ఉన్న నిబంధన అయినప్పటికీ, దీన్ని మరోసారి గుర్తుచేసింది. అధికారిక కార్యక్రమాల్లో రాష్ట్ర గీతంతో పాటు జాతీయ గేయం, జాతీయ గీతం కూడా ఆలపించాల్సి వస్తే, పాటించాల్సిన క్రమంపై హోంశాఖ స్పష్టతనిచ్చింది. దీని ప్రకారం.. ముందుగా వందేమాతరం, ఆ తర్వాత జనగణమనలను పూర్తిగా ఆలపించాలి. ఈ రెండు పాడడం పూర్తయ్యాక మాత్రమే ఆయా రాష్ట్రాలకు సంబంధించిన అధికారిక రాష్ట్ర గీతాన్ని పాడాల్సి ఉంటుంది. జాతీయ గౌరవాన్ని కాపాడేందుకే ఈ ప్రాధాన్యత క్రమాన్ని నిర్దేశించినట్లు కేంద్రం పేర్కొంది. విదేశీ ప్రముఖులు, ప్రతినిధులు హాజరయ్యే కార్యక్రమాల విషయంలోనూ ప్రోటోకాల్‌ను హోం శాఖ వివరించింది. గౌరవ వందనం స్వీకరించే విదేశీ అతిథి ఉన్నప్పుడు, మొదట ఆ దేశ జాతీయ గీతాన్ని పూర్తిగా ప్లే చేసి, ఆ తర్వాత భారత జాతీయ గీతాన్ని ప్లే చేయాలి. విదేశీ దౌత్య కార్యాలయాలు నిర్వహించే సాంస్కృతిక ఉత్సవాలు, ఇతర కార్యక్రమాలకు కూడా ఇదే తరహా నిబంధనలు వర్తిస్తాయని తెలిపింది.

బంకించంద్ర ఛటర్జీ రచించిన వందేమాతరం జాతీయ గేయం హోదాను కలిగి ఉండగా, రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన జనగణమన జాతీయ గీతంగా గుర్తింపు పొందిందని ఈ ఆదేశాల్లో మరోసారి గుర్తుచేశారు. ఈ యేడాది ఫిబ్రవరిలో వందేమాతరం పూర్తి ఆలాపనపై ఇచ్చిన ఆదేశాలకు కొనసాగింపుగా తాజా మార్గదర్శకాలు జారీ అయ్యాయి. జాతీయ గీతం, గేయాలకు సంబంధించిన అధికారిక పాఠాలు, సరైన ఉచ్చారణ, లిపి వంటి వివరాలు తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని హోం శాఖ తెలిపింది. జెండా వందనం వంటి అంశాలలో ప్రజల విచక్షణకే వదిలేస్తున్నామని, సందర్భం లేకుండా విచక్షణారహితంగా జాతీయ గీతాన్ని పాడటం లేదా ప్లే చేయడాన్ని మానుకోవాలని సూచించింది. దేశ సాంస్కృతిక వారసత్వం, స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ, జాతీయ చిహ్నాల పట్ల గౌరవాన్ని, దేశ ప్రజలలో ఐక్యతను పెంపొందించడమే ఈ మార్గదర్శకాల ప్రధాన ఉద్దేశమని కేంద్రం స్పష్టం చేసింది.



## జమిలి ఎన్నికలు 2029 నుంచే

### జెపిసి ఛైర్మన్ జెపి చౌదరి

**న్యూఢిల్లీ, జులై 11:** లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికల నిర్వహణ 2029లో కచ్చితంగా సాకారమవుతుందని పార్లమెంటరీ సంయుక్త కమిటీ (జెపిసి) చీఫ్, కేంద్ర మాజీ మంత్రి పిపి చౌధరి ఆశాభావం వ్యక్తంచేశారు. ఒక దేశంఒకే ఎన్నిక బిల్లుపై గోవా సిఎం ప్రమోద్ సావంత్, మంత్రి వర్గంతో చర్చల కోసం గోవాలో జెపిసి సమావేశ మైన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లా డారు. వివిధ అవకాశాలు, ఆలోచనలపై అధ్యయనం చేస్తున్నామని అన్ని రాజకీయ పార్టీలకు ఆమోదయోగ్యమైన విధానం రూపకల్పనకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఒకేసారి ఎన్నికలకు పార్టీలు, కొందరు సిఎంలు స్వచ్ఛందంగా అంగీ కరిస్తే కొన్నిరాష్ట్రాల ఎన్నికలను ముందుగానే.. అంటే2029లో నిర్వహించడానికి ఆస్కారం ఉంటుందన్నారు. జమిలి ఎన్నికలను ఎలా నిర్వహిస్తే బాగుంటుంది ఎదురయ్యే సవాళ్లు ఏమిటి వాటిని ఎలా పరిష్కరించాలో గోవా ముఖ్యమంత్రి అభిప్రాయాలు తెలుసుకున్నామనితెలిపారు. జెపిసి ఇప్పటికే గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, హరియాణా, ఢిల్లీల్లో పర్యటించిందని రాజ్యాంగ నిపుణులు, విద్యావేత్తలు, పౌరసమాజం సంస్థలు తదితరులను కలిసిందనిచెప్పారు. తదుపరి లోక్‌సభ ఎన్నికలుజరిగే 2029నాటికి ఒక దేశం ఒకే ఎన్నిక కార్యరూపం దాలుస్తుందన్న సంకేతాలు అందుతున్నాయని తెలిపారు.

## ఆస్ట్రేలియాలో పెచ్చుమీరుతున్న జాత్యహంకారం

### ట్రక్కుడ్రైవర్లకు విద్వేషకారుల హెచ్చరికలు

**కాన్‌బెర్రా, జులై 11:** భారత్, ఆస్ట్రేలియాలు ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతానికి కృషి చేస్తున్నప్పటికీ అక్కడ భారతీయులు ఎదుర్కొంటున్న తీవ్రమైన జాత్యహంకార సమస్య ఎవరి దృష్టికి రాకుండా ఉండిపోయింది. ఆస్ట్రేలియాలోని భారతీయ ట్రక్కు డ్రైవర్లపై జాత్యహంకార దాడులు, దూషణలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి.

వారిని చంపుతామని లేదా అంతకంటే ఘోరంగా హింసిస్తామని చాలా మంది బెదిరింపులకు దిగుతున్నారు. వీరిలో చాలా మందికి ఇప్పటికే ఆస్ట్రేలియా పౌరసత్వం ఉన్నప్పటికీ జాత్యహంకార దూషణలకు గురవుతున్నారు. ఆస్ట్రేలియాలో రవాణా రంగానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. ట్రక్కులు నడకుంటే దేశ ఆర్థిక వ్యవస్థ స్తంభించిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. చాలా సాఫీగా సాగిపోతున్నట్టు కనిపించే ఈ రంగం వెనుక పరిష్కారం లేని ఓ పెద్ద సమస్య దాగి ఉంది. ఇది వలస డ్రైవర్ల మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. తాము ఎదుర్కొంటున్న జాత్యహంకార దూషణలను, వ్యవస్థాగత దోపిడీని భారతీయ డ్రైవర్లు ఎబిసి న్యూస్‌తో పంచుకున్నారు. డ్రైవర్ల కొరత తీవ్రంగా ఉన్న సమయంలో ప్రాణాలను ఫణంగా పెట్టి తాము సేవలను అందిస్తున్నందుకే ఈ వివక్ష ఎదుర్కొంటున్నామని వారు వాపోయారు. ఆస్ట్రేలియా రవాణా రంగంలో ప్రస్తుతం భారతీయ డ్రైవర్లు అత్యంత ముఖ్యమైన వలస శ్రామిక శక్తిగా మారారు.

అయినప్పటికీ వీరు నిరంతరం వేధింపులకు గురవుతున్నారు. పిప్పల్ సింగ్ అనే భారతీయ ట్రక్కు డ్రైవర్ కమ్యూనికేషన్ రేడియో ద్వారా తమకు వచ్చిన బెదిరింపులను రికార్డ్ చేశారు. 'ఇక్కడ త్వరలోనే అంతర్యుద్ధం రాబోతోంది మేము భారతీయ పురుషులందరినీ చంపేస్తాం పిల్లలను పాతిపెట్టి, మహిళలను అమ్మేస్తాం శ్వేతజాతీయుల ఎదుట మురికి భారతీయులు నిలబడలేరు' అని ఓ ఆస్ట్రేలియన్ చేసిన బెదిరింపులు అందులో రికార్డయ్యాయి.'మంచి భారతీయుడు అంటే చచ్చినవాడే అని మరొకడు మాట్లాడాడు. ఇటువంటి బెదిరింపులతో చాలా మంది భారతీయ ట్రక్కు డ్రైవర్లు ప్రస్తుతం రేడియోను ఉపయోగించడం మానేశారు. సోషల్ మీడియాలోనూ డ్రైవర్లను ఎగతాళి చేస్తూ జాత్యహంకార మీమ్స్ షేర్ చేస్తున్నారు. గత దశాబ్ద కాలంగా ఆస్ట్రేలియాలో అత్యంత వేగంగా పెరుగుతున్న వలసదారుల సమూహంలో భారతీయులు మొదటి స్థానంలో ఉన్నారు. వీరిలో చాలామంది రవాణా రంగంలో దీర్ఘకాలంగా ఉన్న కార్మికుల కొరతను తీరుస్తున్నారు. అంతర్జాతీయ రోడ్డు రవాణా సంఘం అంచనా ప్రకారం 2024లో అనుభవజ్ఞులైన డ్రైవర్లు పదవీ విరమణ చేయడం, ఆస్ట్రేలియా యువత ఈ వృత్తిపై ఆసక్తి చూపకపోవడంతో సుమారు 28వేల మంది భారీ వాహన డ్రైవర్ల కొరత ఉంది. భారత్‌లో వ్యవసాయం, రవాణా పరిశ్రమతో అనుబంధం కారణంగా, చాలా మంది సిక్కు, పంజాబీ వలసదారులకు ట్రక్కు డ్రైవింగ్ సహజంగానే అలవడింది.'ఇది నా రక్తంలోనే ఉందని జస్విందర్ అనే ట్రక్కు డ్రైవర్ అన్నారు. ఇండియాలో మా నాన్నకు సొంత రవాణా సంస్థ ఉండేది, అందుకే నాకు మొదటి నుంచీ ట్రక్కులంటే చాలా ఇష్టం అని ఆయన చెప్పారు.

## సంక్షిప్త వార్తలు

### వెనెజులా విలయం.. నాలుగు వేలు దాటిన మృతులు



**కారకస్, జులై 11:** వెనుజులాలో గత నెల 24న సెకన్ల వ్యవధిలో సంభవించిన రెండు భారీ భూకంపాలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ విలయంలో ఇప్పటివరకు 4వేలకు పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయినట్లు అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. 16,740 మంది గాయపడగా.. భవన శిథిలాల కింద వేలాది మంది చిక్కుకున్నారు. ఇంకా చాలా మంది జాడ తెలియరాలేదు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు శుక్రవారం కారకస్‌లో 3.0 తీవ్రతతో భూకంపం సంభవించడంతో స్థానికంగా ఉన్న భవనాలను ఖాళీ చేయించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

### పెళ్లివిందులో మటన్‌లేదని ఘర్షణ


**పాట్నా,జులై 11:** బీహార్‌లో ఓ నిఖా విందులో హింస చోటుచేసుకున్నది. వధూవరులకు చెందిన కుటుంబసభ్యులు కొట్టుకున్నారు. విందు సమయంలో ఈ ఘటన జరిగింది. పెళ్లి విందులో మటన్ పెట్టలేదని వరుడి వర్గం వాగ్వాదానికి దిగింది. అయితే ఆ సమయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నది. సహార్స జిల్లాలోని సిమ్రి భక్త్యార్‌పూర్ గ్రామంలో ఈ కొట్లాట జరిగింది. అమ్మాయి, అబ్బాయి తరపున బంధులు తన్నుకున్న ఘటనలో మొత్తం 12 మంది గాయపడ్డారు. విందులో మటన్ పెడుతామని చెప్పిన అమ్మాయి తరపున కుటుంబీకులు హామీ ఇచ్చారు, కానీ భోజనంలో చికెన్ పెట్టడాన్ని వ్యతిరేకించారు.

### బెటాలియన్ కమాండింగ్ అధికారిగా భారత సంతతి యువతి



**న్యూఢిల్లీ:** భారతీయ సంతతికి చెందిన 17 ఏళ్ల అమ్మాయి రిద్ధి చౌహాన్ అమెరికాలో దూసుకెళుతోంది. న్యూయార్క్‌లోని తన స్కూల్‌లో బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నది. నేవీ జూనియర్ రిజర్వ్ ఆఫీసర్స్ ట్రైనింగ్ కార్ప్స్‌కు ఆమె లీడర్ అయ్యింది. ప్రస్తుతం అమెరికా యువతకు ఆమె ఆదర్శంగా నిలుస్తున్నారు. న్యూయార్క్‌లోని బెంజిమన్ కార్డోజో హై స్కూల్‌కు నేవీ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ అయ్యారు. ఎన్‌జేఆర్‌ఓటీసీ ప్రోగ్రామ్‌లో హయ్యస్ట్ ర్యాంక్ స్టూడెంట్‌గా నిలిచిందామె. ఆ గ్రూపులోఉన్న సుమారు 300మంది క్యాడెట్లకు ఆమె నాయకత్వం వహిస్తున్నది. బెటాలియన్ ఆపరేషన్స్, ట్రైనింగ్, స్టూడెంట్ వెల్ఫేర్ చూసుకుంటా, అకాడమిక్ చదువులోనూ నిమగ్నమవుతోంది.

### ప్రశాంత్‌కిశోర్‌పై అభ్యర్థిని మార్చిన బిజెపి



**పాట్నా,జులై 11:** బీహార్‌లోని బంకీపూర్ ఉప ఎన్నిక పోరు నాటకీయ మలుపు తీసుకున్నది. నామినేషన్ దాఖలు చేసిన ఒక రోజు తర్వాత తన అభ్యర్థిని బిజెపి ఆకస్మికంగా మార్చింది. జన సూరజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్‌పై సాధారణ నేతను పోటీకి దించింది. అభిషేక్ బంటీ స్థానంలో నీరజ్ కుమార్ సిన్హాను తమ అభ్యర్థిగా బిజెపి ప్రకటించింది. దీంతో తొలిసారి ఎన్నికల్లో పోటీచేస్తున్న ప్రశాంత్ కిషోర్‌తో నీరజ్ కుమార్ సిన్హా తలపడనున్నారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాజ్యసభకు ఎన్నికైన తర్వాత బంకీపూర్ స్థానాన్ని ఖాళీ చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. బిజెపికి కంచుకోట అయిన ఈ స్థానంలో పోటీ చేసే అభ్యర్థిగా తొలుత అభిషేక్ బంటీ పేరు ప్రకటించారు. ఈ నేపథ్యంలో గురువారం సీఎం సమ్రాట్ చౌదరి, పార్టీ అగ్ర నేతల సమక్షంలో ఆయన అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. వ్యక్తిగత కారణాల్ల వల్ల ఎన్నికల్లో పోటీ చేయలేకపోతున్నట్లు అభిషేక్ బంటీ వెల్లడించారు.

# తిరుమల సమాచారం



## 17న ఆణివార ఆస్థానం

### ఎల్లుండి కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం

### రేపు విఐపి బ్రేక్‌కు సిఫార్సులు తీసుకోరు

**తిరుమల, జులై 11 ప్రభాతవార్తప్రతినిధి:** ఆపదమొక్కులవాడు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 17వతేదీ ఆణివార ఆస్థానం జరగనుండటంతో 14వతేదీ మంగళవారం ఆలయ శుద్ధి నిర్వహించనున్నారు. రానున్న మంగళవారం ఉదయం 6గంటల నుంచి 11గంటల వరకు పరమపవిత్రంగా, ఒక యజ్ఞంలా నిర్వహిస్తారు. ఆలయంలోపల ఆనందనిలయం నుంచి బంగారువాకిలి, వెండివాకిలి, మహద్వారం వరకు ఆలయంలోపల ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం పూజాసామాగ్రి తదితర వస్తువులను సుగంధద్రవ్యాలు నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గంధంపొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర వాటితో కలగలిపిన నీటితో శుద్ధిచేస్తారు. ఆ సమయంలో స్వామివారి మూలవిరాట్టును శ్వేత వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచుతారు. ఏడాదిలో నాలుగుదఫాలుగా కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం చేపడతారు. ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, ఉగాది ఆస్థానం, వైకుంఠ ఏకాదశి ముందు మంగళవారాలు ఆలయ శుద్ధి జరుగుతుంది. 17న ఆణివార ఆస్థానం వేడుకలు ఆలయంలో బంగారువాకిలిలో నిర్వహిస్తారు. 14వతేదీ అష్టదళ పాదపద్మారాధన సేవరద్దుచేశారు. సోమవారం విఐపి బ్రేక్ దర్శనాలకు సిఫార్సులు స్వీకరించరు. మంగళవారం విఐపి బ్రేక్ రద్దు చేశారు.

# అంతరాలయం అనుమతించనపుడు టిక్కట్లెందుకు జారీ చేసారు?

### సిబ్బందిపై భక్తుల ఆగ్రహం: సమాధానం చెప్పలేని అధికారులు

### సర్వర్ డౌన్‌తో తిప్పలు

**శ్రీకాళహస్తి,జూలై 11 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి వస్తున్న భక్తులు గత రెండు నెలలుగా ఆన్‌లైన్ సేవలతో తిప్పలు పడుతున్నారు. దీనికి తోడు అధికారులు రోజుకొక నిర్ణయంతో భక్తుల్ని ముప్పుతిప్పలు పెడుతున్నారు. శనివారం శనీశ్వరాభిషేకానికి వచ్చిన భక్తులు ఆన్‌లైన్ మాత్రమే ఆఫ్‌లైన్ లేదనటంతో అభిషేకాలు పూజలు జరిపించుకోకుండానే వెనుదిరిగారు. ఇక భక్తులకు సుదర్శనం కోసం ఏర్పాటు చేసిన సేవల్లో 'అంతరాలయ దర్శనం' ఒకటి. అంతరాలయ



దేవస్థానం జారి చేసిన అంతరాలయ టిక్కెట్లు

దర్శనం రూ.500లు ఖరారు చేసారు. శనివారం అంతరాలయ దర్శనం కోసం పలువురు భక్తులు టిక్కెట్లు కొనుగోలు చేసి స్వామి దర్శనానికి వచ్చారు. అయితే భక్తులు రద్దీ అధికమయ్యారని 'అంతరాలయ దర్శనం' రద్దు చేసారు. ఆన్‌లైన్‌లో అంతరాలయ టిక్కెట్లు జారి చేసారు. కానీ ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. దాంతో టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులు స్వామి గర్భగుడి వద్ద సిబ్బంది ససేమిరా అన్నారు. దాంతో భక్తుల అసహనానికి గురయ్యారు. తిరుగబడ్డారు. అనుమతించనపుడు టిక్కెట్లు ఎందుకు జారి చేసారని నిలదీసారు. సిబ్బంది మాకు సంబంధం లేదంటే భక్తులు ఎవరిని అడగాలో తెలియక ఇబ్బంది పడ్డారు. అయితే అ ంతరాలయ దర్శనం కావాలంటే మధ్యాహ్నం 3గంటల వరకు ఆగాలని ఉచిత సలహా ఇచ్చారు. అంతరాలయ దర్శన టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులు సిబ్బందితో గొడవ పడుతుంటే 'పిఆర్‌ఓ' కార్యాలయం నుంచి బ్యాచ్ గుంపులు గుంపులుగా రాజమార్గంలో వెళుతుంటే భక్తులు ఆగ్రహానికి హద్దుల్లేకుండా పోయింది.

**సమన్వయం లేని అధికారులు:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయం కొరవడింది. భక్తులకు సేవల టిక్కెట్లును ఆన్‌లైన్‌లో జారి చేసి అనుమతించకపోవటంతో గొడవ ప్రారంభం అయ్యింది. భక్తులు స్వామి గర్భగుడివద్ద గొడవ పడగా భక్తుల్ని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోమని ఉచిత సలహా ఇచ్చారు. అంటే క్యూలైన్ల నుంచి బయటకు వెళ్ళి కార్యాలయం వెతుక్కొని వెళ్ళి ఫిర్యాదు చేయటం సాధ్యమా?అని ప్రశ్నించారు. అయితే అక్కడ ఉన్న ఓయువకుడు ఎఇఓకు ఫోన్‌చేస్తే నాకేం సంబధం అని జవాబు వచ్చింది. అయితే రద్దీ సమయాల్లో ఇఓ లేనపుడు డెప్యూటిఇఓ పర్యవేక్షించాలి. అయితే ఆయన ఎక్కడా కనబడరు. కార్యాలయం నుంచి కాలు బయట పెట్టరు. సమస్యలను పట్టించుకోరు. ఇక ఎఇఓలు ఒకరిపై ఒకరు ఇలా సమన్వయం కొరవడి భక్తి భావంతో వచ్చిన భక్తుల్ని ముప్పుతిప్పలు పెడుతున్నారు.

# అలిపిరి ఆర్చికి ఆధ్యాత్మిక శోభ ఏదీ?

### మహామండపం తరహాలో మార్పులు ఎప్పుడు!

**తిరుమల, జులై 11 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు ప్రవేశించే ప్రధాన ద్వారం అలిపిరి ఆర్చికి కొత్త ఆధ్యాత్మిక శోభ తీసుకువచ్చేందుకు టిటిడి నిర్ణయించినా ఆ పనులు ఇప్పటికీ మొదలుకాలేదు. ఇందుకోసం నిర్ణయించిన ప్రణాళికలు కూడా అమలుకు నోచుకోలేదు. తిరుమల క్షేత్రం వైభవాన్ని అలిపిరిలోనే భక్తులు తెలుసుకునేలా బేస్‌క్యాంప్ ఏర్పాటుతోబాటు మహామండపంలోకి వచ్చేలాగా అనుభూతి కలిగించేలా కొత్త డిజైన్లతో మార్పులు చేయాలని ఏడాదిక్రిందట ఆమోదించినా పనులు మాత్రం మొదలుకాలేదు. ఏకంగా ఈ నూతన నిర్మాణ బాధ్యతలను ఆర్కిటెక్ ఆనందసాయికి టిటిడి పాలకమండలి అప్పగించింది. ఇప్పటికే తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి పేరును తిరుపతి(రేణిగుంట)లోని



విమానాశ్రయానికి మార్పుచేస్తూ టిటిడి పాలకమండలి కేంద్రానికి ప్రతిపాదనలతో నివేదించిన విషయం విదితమే. తిరుపతి విమానాశ్రయం, అలిపిరి ప్రవేశద్వారం ఆర్చ్‌కు కొత్తరూపు తీసుకువచ్చేలా టిటిడి నిర్ణయం అభినందించదగినదైనా ఆ దిశగా మార్పులు మాత్రం జరగలేదు. తిరుమల ఐకానిక్‌గా ఆధ్యాత్మిక శోభను తీసుకువచ్చేందుకు టిటిడి అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వాటి డిజైన్లలో పేరెన్నికగన్న ఆర్ట్‌డైరెక్టర్, టెంపుల్స్ ఆర్కిటెక్ ఆనందసాయి బాధ్యతలు తీసుకుంటారని తెలిపారు. దేశవిదేశాల నుండి తిరుమలకు వస్తున్న ప్రయాణీకుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో విమానాశ్రయంలోనూ తిరుమల శోభ కనిపించేలా మార్పుచేయనున్నారు. అలిపిరిలో మొదట ఉన్న గరుడవిగ్రహం కూడలిలోని ఆర్చిని ఆధునీ కరించాలని ఆలోచనతో టిటిడి అధికారులు నిర్ణయం తీసుకున్నారు. గతంలో కాలినడకన అలిపిరి నుండి తిరుమలకు చేరుకున్నఆనందసాయి అలిపిరి నుండి ఆనందనిలయం వరకు చేపట్టాల్సి న అభివృద్ధి, ఆధ్యాత్మిక వాతావరణంపై చర్చించారు. రోజువారీగా లక్షమందివరకు భక్తులు తిరుమలకు వస్తుంటే ఇందులో 20వేలమంది కాలినడక మార్గాల్లో, 60వేలమంది వరకు భక్తులు వాహనాల్లో ఘాట్‌రోడ్లపై ప్రయాణిస్తున్నారు. ఈ మార్గంలో భక్తులు ఒక అనుభూతిచెందేలా మార్పులు జరగనున్నాయి. అలిపిరి వద్ద ఒక ఆధ్యాత్మికంగా మహామండపంలోకి ప్రవేశిస్తున్నామనే భావన భక్తులకు కలిగించేలా అలిపిరి ఆర్చి మార్పులు చేసే పనులు మొదలుపెట్టాలని భక్తులు కోరుతున్నారు.

## రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ వైస్‌చైర్మెన్‌గా పి.షణ్ముగం నియామకం

**చిత్తూరురూరల్, జూలై 11 ప్రభాతవార్త:** రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ వైస్‌చైర్మెన్‌గా పి షణ్ముగం నియమితులయ్యారు. శనివారం విజయవాడలోని ఎసిటియు భవన్‌లో జరిగిన సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఏపి ఒలంపిక్ అసోసియేషన్‌కు అనుబంధంగా వున్న ఏపి సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో షణ్ముగం పేరును వైస్‌చైర్మెన్‌గా ప్రతిపాదించగా అనుబంధ జిల్లా సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు ఏకగ్రీవంగా ఆమోదించారు. రాష్ట్రవ్యాప్తంగా సాఫ్ట్‌బాల్ క్రీడాభివృద్ధి, క్రీడాకారులను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడంతో నియామకం చేసినట్లు అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా షణ్ముగం మాట్లాడుతూ రాష్ట్రంలో సాఫ్ట్‌బాల్ క్రీడకు మరింత ప్రోత్సాహం అందించేం దుకు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అలాగే ఆయన నియామకం పట్ల క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు, అబిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



## తిరుమల కొండపై విపరీతమైన రద్దీ

**తిరుమల, జులై 11 ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం కావడంతో తిరుమలలో క్యూ కాంప్లెక్స్‌లు దాటి క్యూలైన్లు బాటగంగమ్మఆలయం వరకు విస్తరించాయి. పెరిగిన భక్తులతాకిడితో కొండ కిటకిటలాడుతోంది. వారాంతం వరుస సెలవులతో శనివారం ఉదయానికి కొండపై విపరీతమైన రద్దీ నెలకొంది. శ్రీవారి సర్వదర్శనం కోసం భక్తులు దాదాపు 24నుండి 30 గంటల పాటు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. సామాన్య భక్తులతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. రద్దీని దృష్టిలో ఉంచుకుని, భక్తులు తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు సూచిస్తున్నారు. శుక్రవారంరాత్రి వరకు 73,265 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం 4.26 కోట్ల రూపాయలు ఆదాయం లభించింది. ఆదివారం కూడా ఈ రద్దీ కొనసాగనుంది.

# రెండేళ్లయినా పిఆర్‌సి ఛైర్మన్‌ను నియమించరా!

### రాష్ట్ర ఎస్‌టియు అధ్యక్షులు మల్లు రఘునాథరెడ్డి ధ్వజం




**చిత్తూరు, జూలై 11 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ళు పూర్తయినప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటి వరకు పిఆర్‌సి ఛైర్మన్‌ను సైతం నియమించలేదని రాష్ట్ర ఎస్టీయు అధ్యక్షులు మల్లు రఘునాథరెడ్డి ధ్వజమెత్తారు. చిత్తూరులోని ఎస్టీయు జిల్లా కార్యాలయంలో శనివారం జిల్లా ఎస్టీయు కార్యవర్గ సమావేశానికి రాష్ట్ర ఎస్టీయు అధ్యక్షులు మల్లు రఘునాథరెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇక ఆలస్యం చేయకుండా సత్వరం పిఆర్‌సి ఛైర్మన్‌ను నియమించడంతో పాటు, ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో వున్న 5 డిఎలను మంజూరు చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానంను అమలు చేయాలని, రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యూటీ, సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించాలని, ఉమ్మడి సర్వీసు నిబంధనలు అమలు చేసి అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే సర్వీసులోని ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష లేకుండా పార్లమెంటులో విద్యాహక్కు చట్టానికి చట్ట సవరణ చేయడానికి కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంను ఒప్పించడానికి కృషి చేయాలన్నారు. అలాగే ఈ నెల 14వ తేదీన ఫ్యాప్టో ఆధ్వర్యంలో అన్ని జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్ల ఎదుట ర్యాలీ, పికెటింగ్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ ఉద్యమ నేత గంటామోహన్‌ను తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఇన్‌ఛార్జ్‌గా నియమించి ఎస్టీయు తరపున భవిష్యత్తులో తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ శాసనమండలి అభ్యర్థిగా పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని తీర్మానం చేసి రాష్ట్ర సంఘానికి ప్రతిపాదనలు పంపారు. ఈ సమావేశంలో ఎస్టీయు నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, షేక్ ఇలియాజ్, పురుషోత్తం, దేవరాజులు, యువరాజు, హేమచంద్రారెడ్డి, బొబ్బిలిరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## భక్తుల రద్దీతో పోటెత్తిన కాణిపాకం

**కాణిపాకం, జూలై 11 ప్రభాతవార్త:** వరుస సెలవులతో కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయం శనివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. ఆలయంలో సాధారణంగా వారంతపు రోజులు, వరుస సెలవు రోజుల్లో తీవ్ర స్థాయిలో భక్తుల రద్దీ వుంటుంది. ఈ మేరకు శని, ఆదివారాల్లో వారాంతపు రోజులతో పాటు ప్రభుత్వ సెలవు రోజులు కావడంతో స్వామి వారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి భక్తులు పోటెత్తారు. రాష్ట్రం నలుమూలల నుండి కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి సైతం భక్తులు స్వామి దర్శనార్థం భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయంలోని క్యూ కాంప్లెక్స్, క్యూ లైన్లు పూర్తి రద్దీతో కిటకిటలాడాయి. రద్దీ కారణంగా రూ.100 శీఘ్ర దర్శనం, రూ.150అతి శీఘ్ర దర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతంగంటల తరబడి క్యూ లైన్లలో వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.



## ప్రాణదాన పథకానికి వైద్యుడి విరాళం

**తిరుమల, జులై 11 ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పథకాలు,ట్రస్టలలో ఎస్వీప్రాణదానం కూడా ప్రధానమైంది. ఎంతోమంది పేదలకు పలు రకాల అత్యాధునిక వైద్యం అందించేందుకు ఈ ట్రస్ట్ దోహదపడుతుంది. ఈ ట్రస్ట్‌కు తిరుపతికి చెందిన నారాయణాద్రి ఆస్పత్రి అధినేత డాక్టర్ సునందకుమార్ రెడ్డి, ఉషారాణి దంపతులు శనివారం 10లక్షల రూపాయల విరా ళాన్ని ఇచ్చారు. ఈ విరాళాలను డాక్టర్ సునందకుమార్‌రెడ్డి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి అందజేశారు.

## అలిపిరిమెట్ల మార్గంలో చిరుత

### మళ్లీ సంచారంతో భక్తుల్లో భయం

**తిరుమల,జులై 11ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి నుండి తిరుమలకు గోవింద నామస్మరణతో కాలినడకన వచ్చే అలిపిరి మెట్లమార్గంలో అతి సమీపంలో శుక్రవారం రాత్రి చిరుత సంచరించడంతో కాలినడక భక్తులు వణికిపోయారు. ఈ మార్గంలో తిరుమలకు వస్తున్న భక్తులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. మెట్ల మార్గానికి అతి సమీపంలో చిరుత ప్రత్యక్షం కావడంతో భయంతో బిగుసుకుపోయారు. కేకలు వేస్తూ, శబ్దం చేస్తూ దాన్ని తరిమికొట్టే ప్రయత్నం చేశారు. రాత్రి వేళ చిరుత సంచారంతో వెంటనే తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. భద్రత చర్యలు చేపట్టారు .

శనివారం తెల్లవారు జామున తిరుమలకువస్తున్న శ్రీవారి భక్తులు అలిపిరి నడకమార్గంలో లక్ష్మీ ్మ నరసింహస్వామి ఆలయానికి అతి సమీపంలో పొదల్లో చిరుతను గుర్తించారు. ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అటూ ఇటు పరుగులు తీశారు. ఆనుపరాడ్లతో శబ్దంచేశారు. చిరుత కదలికపై నిఘా పెట్టారు. అలిపిరి కాలినడక మార్గంతో పాటు వివిధ ప్రాంతాల్లో ఇదివరకే అమర్చిన ట్రాఫ్‌కెమెరాలతో చిరుత సంచారాన్ని కనిపెడుతున్నారు. గతంలో లాగే తిరుమల కాలినడక మార్గాల్లో మళ్ళీ చిరుతల సంచారం మొదలైందని భక్తులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది అలిపిరి నడక దారిలో చిరుత సంచరించిన విషయం తెలిసిందే. 350వ మెట్టు సమీపంలో, అలిపిరి ఎస్వీజూ పార్క్ మార్గంలో, శ్రీవేంకటేశ్వర యూనివర్శిటీ క్యాంపస్ ఆవరణలో చిరుతల సంచారం ఉంది.

అటవీప్రాంతంలో నీరు,ఆహారం దొరకక దారి తప్పిన చిరుతపులులు ఏకంగా ఘాట్‌రోడ్లపై, కాలినడక మార్గాల్లో భక్తులకు కనిపిస్తున్నాయి. అటవీప్రాంతం వదలి భక్తుల సంచారం ప్రాంతాల్లో వచ్చేస్తుం డటంతో భయంతో వణికిపోతున్నారు. సాధారణంగా శేషాచలంఅటవీప్రాం తంలో ఆగస్ట్-సెప్టెంబర్ మాసాలు వన్యప్రాణుల సంతానోత్పత్తి జరుపుకునే అవకాశం ఉన్నందున తిరుమల ఘాట్‌రోడ్లలో చిరుతపులుల సంచారం ఉంటుంది. అయితే వర్షాభావ పరిస్థితులతో కుంటల్లో నీరులేక,ఆహారం దొరక్క జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి. తిరుమలకు వచ్చే రెండోఘాట్‌లో లింకురోడ్డు దాటిన తరువాత గతంలో చిరుతల జాడ ఉండేది. గతంలో మొదటిఘాట్‌లోనేగాక రెండోఘాట్‌లోనూ, కాలినడక మార్గంలోనూ ఆగస్ట్, సెప్టెంబర్‌మాసాల్లో భక్తులపై చిరుతపులులు దాడిచేయడం, ఏకంగా చిన్నారులను హతమార్చిన ఘటనలు విధితమే. శేషాచలం అటవీప్రాంతం తిరుమల సప్తగిరులను ఆనుకుని ఉండటం, తిరుపతివైపు మంగళం, కరకంబాడి, మామండూరు, కుక్కలదొడ్డివరకు వ్యాపించిఉంది. ఇటు చంద్ర గిరి, శ్రీవారిమెట్టు, ఏ.రంగపేట, భాకరాపేట, పీలేరువరకు శేషాచలం అడ వులు ఉన్నాయి. ప్రధానంగా తిరుపతివైపు కపిలతీర్థం, మంగళం, కరకం బాడివైపు ఉన్న అటవీప్రాంతంలో చిరుతపులులు, ఎలుగుబంట్లు. ఏనుగులు సంచారం ఎక్కువగా ఉంది.

# రాజీ మార్గమే రాజమార్గం

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్

### సత్వర న్యాయం అందించడంలో లోక్ అదాలత్ కీలకం: కలెక్టర్ హిమాన్షు శుక్ల

**నెల్లూరు, జూలై 11, ప్రభాతవార్త - కలెక్టరేట్ :** వివాదాలను రాజీమార్గంలో పరిష్కరించుకోవడం ద్వారా సమయం, ధనం ఆదా కావడంతో పాటు త్వరితగతిన న్యాయం పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ అన్నారు. శనివారం ఉదయం నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఆయన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ.నందన్, అదనపు ఎస్పీ సౌజన్య తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ న్యాయస్థానాలపై కేసుల భారం అధికంగా ఉండటంతో అనేక కేసుల పరిష్కారానికి ఎక్కువ సమయం పడుతోందన్నారు. దీనివల్ల కక్షిదారులు సమయం, ధనం కోల్పోవాల్సి వస్తోందని, ఈ పరిస్థితిని అధిగమించేందుకే రాజీ మార్గమే రాజమార్గం అనే భావనతో నేషనల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు పక్షాలు పరస్పర అంగీకారంతో రాజీకి వస్తే ఇద్దరికీ ప్రయోజనం చేకూరడంతో పాటు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. నెల్లూరు నగరపాలక సంస్థకు ఇళ్ల




పన్ను, వ్యాపార పన్ను, నీటి పన్ను తదితరాల రూపంలో సుమారు రూ.100 కోట్ల బకాయిలు ఉన్నాయని పేర్కొన్న ఆయన, ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించినప్పుడే ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు అభివృద్ధి పనులు, ప్రజా సేవలను సమర్థవంతంగా అందించగలవని చెప్పారు. నేషనల్ లోక్ అదాలత్‌కు ముందు పంపిన నోటీసులకు స్పందించి శుక్రవారం సాయంత్రానికే సుమారు రూ. 1 కోటి పన్నుల బకాయిలు వసూలయ్యాయని వెల్లడించారు. మిగిలిన బకాయిదారులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానం ప్రపంచవ్యాప్తంగా విజయవంతంగా అమలవుతోందని, భారతదేశంలో కూడా ప్రజలు దీనిని ఎక్కువగా వినియోగించుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిసోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నప్పటికీ, కుటుంబ, ఆస్తి, సివిల్ వివాదాల పరిష్కారం న్యాయవ్యవస్థ ద్వారానే సాధ్యమవుతుందని తెలిపారు. అలాంటి వివాదాలకు లోక్ అదాలత్ అత్యంత సమర్థవంతమైన వేదికగా నిలుస్తోందన్నారు.

## వియత్నాం బోటు ప్రమాదంలో పురం యువకుడు దుర్మరణం


రవితేజ (ఫైల్)

**హిందూ పు రం జులై 11 ప్రభాతవార్త:** వియత్నం దేశంలో విహారయాత్రకు వెళ్లిన శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం పట్టణానికి చెంది న రవితేజ(40) దుర్మరణం చెందారు. స్థానిక టీచర్స్ కాలనీలో నివసిస్తున్న రవితేజ ధనలక్ష్మి రోడ్లో లక్కీ మొబైల్ షాపును నిర్వహించేవారు. లావా కంపెనీ ఫోన్లను అధికంగా సేల్ చేయడంతో విహారయాత్రకు సెలెక్ట్ అయి కంపెనీ తరఫున వియత్నానికి మూడు రోజుల క్రితం ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లారు. భారత కాలమానం ప్రకారం శనివారం ఉదయం సుమారు 11:30 గంటల ప్రాంతంలో వియత్నం దేశంలో సముద్రంలో స్పీడ్ బోట్ లో వెళ్తుండగా ఒకసారిగా అలల తాకిడి పెరిగి బోటు బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో రవితేజతో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు మృత్యువాత పడ్డారు. ఇదిలా ఉండగా రవితేజ మరణ వార్త తెలుసుకొని కుటుంబ సభ్యులు షాక్ గురయ్యారు. తల్లి, భార్య, ఇద్దరు కుమార్తెలు శోక సంద్రంలో పడిపోయారు. రవితేజ తండ్రి ఆదిశేషయ్య చాలా ఏళ్ల క్రితమే చనిపోగా ఆ కుటుంబానికి ఏకైక కుమారుడైన ఇతను కూడా మరణించడంతో మగదిక్కు లేకుండా పోయిందని ఆత్మీయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అందరితో మంచివాడిగా పేరొందిన రవితేజ అకాల మరణం చెందడంతో స్నేహితులు, పుర ప్రజలు చలించి పోయారు. వియత్నం నుంచి మృతదేహాన్ని వీలైనంత తొందరగా రప్పించేందుకు భారత ఎంబసీ ద్వారా బంధువులు ప్రయత్నాలు చేస్తున్నారు. వరు సకు అన్న అయినా భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ కన్వీనర్ ఆదర్శ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన తమ్ముడు మృతి జీర్ణించుకోలేనిదని ఆవేదన వ్యక్తం చేశారు.

# కుప్పం చిగురుగుంట 'బంగారు'గనులపై చిగురిస్తున్న ఆశలు

### గనుల ప్రారంభానికి ఊపిరి పోసిన సిఎం చంద్రబాబు ప్రకటన !!

### ముగిసిన టెండర్ల బిడ్ గడువు.. త్వరలోనే టెండర్లు ఖరారు..?

### వేలాదిమందికి ఉపాధి అవకాశాలు.. గనులు తెరచుకుంటే 'స్వర్ణకుప్పమే'

**కుప్పం, జూలై 11 ప్రభాతవార్త:** కుప్పం చిగురుగుంట బంగారు గనులకు త్వరలో మహర్దశ పట్టధం ఖాయంగా కన్పిస్తోంది. దాదాపు పాతికేళ్ల అనంతరం బంగారు గనులు తెరచుకునేందుకు మార్గం సుగమం అవుతోంది. చిగురుగుంట గనుల నిర్వహణకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించిన టెండర్ల బిడ్ ప్రక్రియ రెండు రోజుల క్రితం ముగిసింది. రేపో మాపో టెండర్లు ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇటీవలే సిఎం చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పం పర్యటనలో చిగురుగుంట బంగారు గనుల్ని మళ్లీ ప్రారంభిస్తామని ప్రకటించడంతో గనుల ప్రారంభంకు మరలా సిఎం ఊపిరిపోశారు. దీంతో ఈ ప్రాంత ప్రజల్లో బంగారు గనులు తెరచుకుంటాయని ఆశలు చిగురిస్తున్నాయి.

**1978లో మొదలై 2001లో మూత :** చిగురుగుంట బంగారు గనుల్లో బంగారం తవ్వకాలను 1978లో ఎంఇసిఎల్ అనే సంస్థ ప్రారంభించింది. ఈ సంస్థ 1982వరకు కార్యకలాపాలు కొనసాగించింది. అన ంతరం 2001వరకు ఈ గోల్డ్‌మైన్స్‌ను భారత్ గోల్డ్‌మైన్స్ సంస్థ(బిజిఎంఎల్) నిర్వహించింది. చిగురుగుంటకు సమీపంలోనే కోలార్ గోల్డ్‌ఫీల్డ్స్(కెజిఎఫ్) బంగారు గనులు, భారత్ గోల్ ్డమైన్స్(బిజిఎంఎల్) సంస్థలు ఉండేవి. చిగురు గుంట గనుల్లో తీసిన ముడి ఖనిజాన్ని కెజిఎఫ్‌కు తరలించి అక్కడ శుద్ధి చేసి బంగారాన్ని వేరుచేసేవారు. అప్పట్లోనే చిగురుగుంట గనుల్లో వేలాది మంది ఉపాధి అవకాశాలు పొందేవారు. అయితే రాను రాను గనుల్లో బంగారు నిక్షేపాలు తగ్గడం, ముడి ఖనిజం వెలికి తీసేందుకు అయ్యే వ్యయం అధికంగా ఉండడంతో చిగురుగుంట గనులతోపాటు కోలార్ గోల్డ్‌ఫీల్డ్ (కెజిఎఫ్) గనులు సైతం 2001లో మూతపడ్డాయి. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం ఈగనులను మూసేసింది.

**2011లో మైసూర్ జియోచే మరలా పరిశోధన :** 2001లోమూతపడ్డ చిగురుగుంట బంగారు గనుల ప్రాంతంలో మరలా మైసూర్ జియో సంస్థ ముడి బంగారం నిల్వలు ఉన్నాయా లేదా అనే అంశంగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో 400 హెక్టార్ల ప్రాంతంలో పరిశోధనలు చేసింది. గనుల ప్రాంతంలో చిన్నపాటి బావులు తీసి వాటి ద్వారా ముడి బంగారం ఏమేర ఉందో నిర్ధారణ చేసి ఆ నిక్షేపాలను అప్పట్లో దేశరాజధాని న్యూఢిల్లీలోని ల్యాబ్‌కు పంపింది. ఈ ప్రాంతంలో ముడి బంగారు ఖనిజం ఉందని నిర్ధారణ అయ్యాక కేంద్రం తదుపరి చర్యలు చేపట్టింది. కాగా చిగురుగుంట ప్రాంతంలో 20లక్షల టన్నులు, బిసానత్తం వద్ద 1లక్ష టన్నులకు పైగా ముడి ఖనిజ నిల్వలు ఉన్నట్లు సమాచారం.

**2018లో మరలా టెండర్లు :** చిగురుగుంట బంగారు గనుల నిర్వహణకు కేంద్రం 2018సం॥ చివర్లో టెండర్లు పిలిచింది. ఆస్ట్రేలియా దేశంకు చెందిన పలు సంస్థలతో పాటు నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ('ఎన్‌ఎండిసి) పోటీ పడ్డాయి. చివరకు ఎన్‌ఎండిసి సుమారు 500కోట్లకు టెండర్లు ఖరారు చేసుకుంది. తదనంతరం 2019లో అధికారంలో వచ్చాక వైఎస్ జగన్ సిఎంగా ఉన్న సమయంలో చిగురు గుంట గనుల్ని తెరిపిస్తామని పేర్కొన్నా ఆచరణలో సాధ్యం కాలేదు. పర్యావరణ అనుమతులు, ప్రభుత్వంచే గనుల ప్రాంతం అప్పగింత, మైనింగ్ ప్రణాళిక తదితర అంశాలు కొలిక్కి రాకపోవడంతో ఎన్‌ఎండిసి గతేడాది ఈ ప్రాజెక్టును ఉపస ంహరించుకుంది. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా చిగురుగుంట గనుల నిర్వహణకు టెండర్లు పిలిచాయి. ఈనెల 9తో బిడ్ గడువు ముగిసింది. త్వరలోనే టెండర్లను ప్రభుత్వాలు ఖరారు చేయనున్నాయని తెలుస్తోంది. ఇదే జరిగితే అతి త్వరలోనే కుప్పం గోల్డ్‌మైన్స్ మరోమారు విపణిలో మెరవడం ఖాయమే. చిగురుగుంట గనులు ప్రారంభమైతే కుప్పం ప్రాంతంలో వేలాది మందికి స్థానికంగానే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. 2011లో చిగురుగుంట గనుల్లో పరిశోధన చేసిన జియో మైసూరు సంస్థ ప్రస్తుతం రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన జొన్నగిరి గోల్డ్‌మైన్స్‌ను నిర్వహించడం విశేష ం.


చిగురుగుంట గనుల ప్రాంతం


విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
26
వార్త
ఆదివారం 12, జులై 2026



# 'గ్రేటర్'లో డిజిటల్ సేవలకు శ్రీకారం

- గాజువాక అభివృద్ధిపై మంత్రి నారాయణ సమీక్ష
- రూ.1.31 కోట్ల ఆధునిక పారిశుద్ధ్య వాహనాల ప్రారంభం
- మౌలిక సదుపాయాల అభివృద్ధికి అధికారులకు కీలక ఆదేశాలు



విశాఖపట్నం, జూలై 11, ప్రభాతవార్త : ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా, పారదర్శకంగా అందించడంతో పాటు గాజువాక నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ అధికారులను ఆదేశించారు. శనివారం జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వీఎంఆర్డీఏ కమిషనర్ ఎన్. తేజ్ భరత్‌తో కలిసి మూడు కీలక డిజిటల్ పౌర సేవలను ప్రారంభించిన (తరువాయి 8వ పేజీలో)

# సముద్ర రక్షణలో భారత్‌కు కొత్త శక్తి



- విశాఖలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా కమిషనింగ్..
- ఆత్మనిర్భర్ భారత్‌కు మరో మైలురాయి



విశాఖపట్నం, జూలై 11, ప్రభాతవార్త : భారత నౌకాదళ శక్తిని మరింత పటిష్ఠం చేస్తూ స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన అత్యాధునిక స్టెల్త్ యుద్ధనౌక 'ఐఎన్ఎస్ మహేంద్రగిరి' శనివారం విశాఖలో ఘనంగా భారత నౌకాదళంలో చేరింది. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమక్షంలో జరిగిన కమిషనింగ్ కార్యక్రమం భారత రక్షణ రంగ స్వావలంబనకు మరో చారిత్రక ఘట్టంగా నిలిచింది. 75 శాతానికి పైగా స్వదేశీ విడిభాగాలతో నిర్మితమైన ఈ యుద్ధనౌక ప్రాజెక్ట్-17ఏ కింద రూపొందించిన ఆరో స్టెల్త్ ఫ్రిగేట్. భారత నౌకాదళ వార్‌షిప్ డిజైన్ బ్యూరో రూపకల్పన చేయగా, మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ నిర్మించింది. సుమారు 6,670 టన్నుల సామర్థ్యంతో, గంటకు 28 నాట్స్ వేగంతో ప్రయాణించే ఈ యుద్ధనౌక వైమానిక, సముద్ర ఉపరితల, జలాంతర్గామి దాడులను సమర్థంగా తిప్పికొట్టే అత్యాధునిక సామర్థ్యాలను కలిగి ఉంది. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, "ఐఎన్ఎస్ మహేంద్రగిరి కేవలం యుద్ధనౌక మాత్రమే కాదు.. సాంకేతికంగా అత్యాధునిక, యుద్ధ సన్నద్ధ భారత నౌకాదళ నిర్మాణానికి ప్రతీక. ఇది ఆత్మనిర్భర్ భారత్ సంకల్పానికి మరో గర్వకారణం" అని పేర్కొన్నారు. ఈ నౌకలో బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్షిపణులు, మధ్యశ్రేణి వైమానిక రక్షణ క్షిపణులు, జలాంతర్గామి నిరోధక ఆయుధాలు, (తరువాయి 8వ పేజీలో)




## వీఎంఆర్డీఏ అధికారులపై
# అసత్య ఆరోపణలు తగవు

**వీఎంఆర్డీఏ ఉద్యోగుల సంఘం ఖండన**

విశాఖపట్నం, జులై 11, ప్రభాత వార్త : విఎంఆర్డీఏ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది నిరంతరం విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో అభివృద్ధికి అవిరాల కృషి చేస్తుంటే, కొంతమంది వ్యక్తులు విఎంఆర్డీఏపై బురద జల్లే కార్యక్రమం చేపట్టటాన్ని తీవ్రంగా ఉద్యోగుల సంఘం తరుపున ఖండిస్తున్నాము అని ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు యు వి ఎస్ ఆర్ ప్రసాద్, ఇతర ప్రతినిధులు వెంకటేశ్వరరావు, శంకరరావు , రవి కుమార్ లు ఒక ప్రకటన విడుదల చేశారు .రాష్ట్రప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చే విధంగా పలు అభివృద్ధి పనులను శరవేగంగా అనేక మౌళిక వసతుల కల్పన కోసం రెయింభవళ్లు కష్టపడి పూర్తి చేయటమే కాకుండా మరిన్ని పనులను రాబోయే రోజుల్లో పూర్తి చేస్తున్నాం అని పేర్కొన్నారు. వీంఎఆర్డీఏ బృహత్ ప్రణాళికను అత్యంత తక్కువ సమయంలో పూర్తిపారదర్శకంగా పూర్తి చేయటం జరిగింది. ఎంతో కాలంగా పెండింగ్లో ఉన్న ఎన్ఏడీ ఆర్ఓబిను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావటం జరిగిందన్నారు. పర్యాటకంగా అనేక అభివృద్ధి పనులు చేపడుతూ విశాఖను పర్యాటకంగా అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టే విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా ఆసియా లోనే పొడవైన గ్లాస్ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రారంభించటం జరిగిందన్నారు అదేవిధంగా 65 అడుగుల ఎత్తైన డమరుకంతో కూడిన (తరువాయి 8వ పేజీలో)

## అట్టహాసంగా జేఎన్‌టీయూ-జీవీ
# తొలి స్నాతకోత్సవం




- 84,896 మంది విద్యార్థులకు పట్టాలు
- గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా బంగారు పతకాలు, అవార్డుల ప్రదానం

విశాఖపట్నం, జూలై 11, ప్రభాతవార్త : జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం--గురజాడ విజయనగరం (జేఎన్‌టీయూ-జీవీ) తొలి స్నాతకోత్సవం శనివారం విశాఖ బీచ్‌రోడ్డులోని ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ హాల్‌లో అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరై 2023, 2024, 2025 విద్యా సంవత్సరాలకు చెందిన ఉత్తీర్ణ విద్యార్థులకు పట్టాలు, ప్రతిభ కనబరిచిన వారికి బంగారు పతకాలు, ఎండోమెంట్ అవార్డులు ప్రదానం చేశారు. ఈ స్నాతకోత్సవంలో మొత్తం 84,896 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. వీరిలో 32,177 మంది అండర్ గ్రాడ్యుయేట్, 2,708 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్, 11 మంది పీహెచ్‌డీ విద్యార్థులు ఉన్నారు. అలాగే 50 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, ఇద్దరికి ఎండోమెంట్ అవార్డులు, (తరువాయి 8వ పేజీలో)

## కాంగ్రెస్ పార్టీతో కాపులు కలిసి వస్తే
# ముఖ్యమంత్రిని చేస్తాం

**కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతా మోహన్**




విశాఖపట్నం, జులై 11, ప్రభాత వార్త : ఉత్తరాంధ్ర కాపులు, కోనసీమ కాపులు, రాయలసీమలోని బలిజలు కాంగ్రెస్ పార్టీతో కలిసి రండి. కాపు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రి చేస్తాం అని మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతా మోహన్ అన్నారు విశాఖ డాబాగార్డెన్స్ లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో చింతా మాట్లాడుతూ కాపులుకు అయన కాంగ్రెస్ లోకి ఆహ్వానం పలికారు. 16 సంవత్సరాలుగా జగన్ పై న్యాయస్థానాల్లో కేసు సాగుతూవుందని, దీని వల్ల న్యాయస్థానాల పై ప్రజల్లో అనుమానాలు రేకెత్తుతున్నాయన్నారు. అక్రమాస్తుల కేసులో (తరువాయి 8వ పేజీలో)

## సమస్యలపై అల్లూరు జిల్లా కలెక్టర్ ఆఫీస్
# ముట్టడించిన అంగన్వాడీలు




పాడేరు, జూలై11, ప్రభాతవార్త: అంగన్వాడీలకు వేతనం పెంచాలని అల్లూరు జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముట్టడించిన అంగన్వాడీలు. కనీస వేతనం 26,000 చెల్లించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీలు యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డిమాండ్స్ డే సందర్భంగా నల్ల చీరలతో నిరసన తెలుపుతూ పాడేరు జూనియర్ కాలేజీ గ్రౌండ్ నుండి కలెక్టర్ ఆఫీస్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయాన్ని అంగన్వాడీలు శుక్రవారం ముట్టడి చేశారు. ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.నాగమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాగ్యలక్ష్మి (తరువాయి 8వ పేజీలో)

## ప్రత్యేక జాతీయ లోక్ అదాలత్‌లో
# రూ.58 కోట్లు వసూలు




- న్యాయమూర్తి కృష్ణ గోపాల్ ద్వివేది
- ఈ నెల 25న మరో సారిఆదాలత్

విశాఖపట్నం, జులై 11, ప్రభాత వార్త: వివిధ బ్యాంకులు, ఆర్థిక సహకార సంస్థలు ఇచ్చిన రుణాలను చట్టబద్ధంగా వేగవంతమైన వసూళ్ల కోసం కేంద్ర ప్రభుత్వం ఆంధ్రరాష్ట్రంలో విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానం డీ. ఆర్. టీ లో శనివారం ప్రత్యేక జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడింది. (తరువాయి 8వ పేజీలో)

## గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు
# వైఎస్సార్‌సీపీ పరామర్శ

- ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రాణనష్టానికి కారణమని విమర్శలు..
- త్వరలో జగన్ పరామర్శిస్తారని వైఎస్సార్‌సీపీ విశాఖ సమన్వయకర్త, మాజీ మంత్రి కురసాల కన్నబాబు వెల్లడి



విశాఖపట్నం, జూలై 11, ప్రభాతవార్త : విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లి సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను వైఎస్సార్‌సీపీ నేతలు శనివారం పరామర్శించారు. ఏవీఎన్ కళాశాల రోడ్డులోని జబ్బర్ తోట జంక్షన్‌లో బాధితుల ఇళ్లకు వెళ్లిన మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, గుడివాడ అమర్‌నాథ్, డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ తదితరులు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకే తాము వచ్చామని, త్వరలోనే ఆయన స్వయంగా బాధిత కుటుంబాలను (తరువాయి 8వ పేజీలో)

## వైసీపీ కుట్ర రాజకీయాలను
# ప్రజలు తిప్పికొడతారు



విశాఖపట్నం, జూలై 11, ప్రభాతవార్త: రాష్ట్రంలో మతాలు, కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి అశాంతి సృష్టించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుట్ర రాజకీయాలకు పాల్పడుతోందని జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆరోపించారు. శనివారం సీతంపేటలోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పలు రాజకీయ, ప్రజా సమస్యలపై స్పందించారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రతి కుట్ర వెనుక వైసీపీ హస్తం ఉందని ఆరోపించిన ఆయన, ఇటీవల (తరువాయి

## ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కారి చిన్నాను
# పరామర్శించిన జి.వి.రామచంద్రరావు



విశాఖపట్నం, జూలై 11, ప్రభాతవార్త : విశాఖపట్నం సముద్ర తీరంలో ఇటీవల జరిగిన ఘోర బోటు ప్రమాదం నుండి మృత్యుంజయుడిగా ప్రాణాలతో బయటపడి, ప్రస్తుతం షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మత్స్యకారుడు, బోటు యజమాని కారి చిన్నాను వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి మరియు విశాఖపట్నం మత్స్యకార నాయకుడు జి.వి. రామచంద్రరావు శనివారం (తరువాయి 8వ పేజీలో)

## ప్రజా సంక్షేమం కాదు.. భూ పందేరానికే
# కేబినెట్ సమావేశాలు

- విశాఖలో రూ.30 వేల కోట్ల భూ కుంభకోణం జరిగిందని ఆరోపణ..
- మధురవాడ, ఎండాడ భూ వ్యవహారాలపై విచారణ జరపాలని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ డిమాండ్.



విశాఖపట్నం, జూలై 11, ప్రభాతవార్త : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరుగుతున్న మంత్రివర్గ సమావేశాలు ప్రజా సంక్షేమ నిర్ణయాల కోసం కాకుండా, బినామీలకు ప్రభుత్వ భూములను కట్టబెట్టేందుకే పరిమితమయ్యాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ గోదావరి జిల్లా ప్రాంతీయ సమన్వయకర్త, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆరోపించారు. శనివారం విశాఖపట్నంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖపట్నంలో గత రెండేళ్లలో రూ.25 వేల కోట్ల నుంచి రూ.30 వేల కోట్ల వరకు విలువైన ప్రభుత్వ భూముల కేటాయింపుల్లో భారీ అక్రమాలు జరిగాయని ఆయన ఆరోపించారు. ఇది దేశ చరిత్రలోనే అతిపెద్ద భూ కుంభకోణాల్లో ఒకటిగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన (తరువాయి 8వ పేజీలో)



## హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో
# సర్వైకల్ క్యాన్సర్‌కు అడ్డుకట్ట

**500 మంది పోలీసు కుటుంబాల బాలికలకు టీకాలు: విశాఖ సీపీ శంఖబ్రత బగ్చీ**

విశాఖపట్నం, జూలై 11, ప్రభాతవార్త : మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్‌ను నివారించడంలో హెచ్‌పీవీ (హ్యూమన్ ప్యాపిలోమా వైరస్) వ్యాక్సిన్ కీలక పాత్ర పోషిస్తుందని విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బగ్చీ అన్నారు. నాట్కో ట్రస్ట్, లయన్స్ క్లబ్ ఆఫ్ వైజాగ్ చారిటబుల్ ట్రస్ట్, చైతన్య స్రవంతి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో పోలీస్ బ్యారక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 9 నుంచి 14 ఏళ్ల వయస్సు గల బాలికలకు (తరువాయి 8వ పేజీలో)

## రాధా గాయత్రీ భర్త
# శ్రీచరణ్ అరెస్ట్


8లో

- అదుపులోకి తీసుకున్న డెహ్రాడూన్ పోలీసులు..
- శ్రీ చరణ్ ను విచారించనున్న డెహ్రాడూన్ పోలీసులు..

## అన్న పై తమ్ముడు
# కత్తితో దాడి


8లో

- పోలీస్ అదుపులో నిందితుడు

## 'గ్రేటర్'లో డిజిటల్ సేవలకు శ్రీకారం

(7వ పేజీ తరువాయి)

మంత్రి, రూ.1.31 కోట్ల విలువైన ఆధునిక పారిశుద్ధ్య వాహనాలను ప్రజలకు అంకితం చేశారు. అనంతరం గాజువాక నియోజకవర్గ అభివృద్ధి పనులపై జీవీఎంసీ, వీఎంఆర్డీఏ అధికారులతో సమీక్ష నిర్వహించారు.
సమీక్షలో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు, పార్కులు, కమ్యూనిటీ హాళ్లు, వాకింగ్ ట్రాక్‌లు, క్రీడా మైదానాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. ప్రతి ఇంటికి తాగునీరు, మురుగునీటి శుద్ధి, స్టార్మ్ వాటర్ డ్రైన్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.
ఈ సందర్భంగా ఇంటి నుంచే కొత్త నీటి కనెక్షన్లకు దరఖాస్తు, జనన--మరణాల ఆన్‌లైన్ నమోదు, ప్రకటనల అనుమతుల డిజిటల్ విధానాలను మంత్రి ప్రారంభించారు. ఆధునిక యంత్రాల వినియోగంతో నగర పారిశుద్ధ్య సేవల నాణ్యత మరింత మెరుగుపడుతుందని, డిజిటల్ గవర్నెన్స్‌లో జీవీఎంసీ రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గాజువాకలో ప్రతిపాదిత స్పోర్ట్స్ విలేజ్‌పై వీఎంఆర్డీఏ అధికారులు మంత్రికి ప్రజెంటేషన్ ఇవ్వగా, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంత్రి అధికారులకు సూచించారు.

## సముద్ర రక్షణలో భారత్‌కు కొత్త శక్తి

(7వ పేజీ తరువాయి)

అత్యాధునిక రాడార్ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ పరికరాలు, మల్టీ రోల్ హెలికాప్టర్, అత్యాధునిక స్టెల్త్ సాంకేతికతను అమర్చారు. దీంతో భారత సముద్ర సరిహద్దుల రక్షణతో పాటు హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత వ్యూహాత్మక ఆధిపత్యం మరింత బలోపేతం కానుంది.
డ్రోన్లు, కృత్రిమ మేధస్సు, సైబర్ యుద్ధం, హైపర్‌సోనిక్ ఆయుధాలు వంటి ఆధునిక సవాళ్లు పెరుగుతున్న నేపథ్యంలో తదుపరి తరం సాంకేతికతలో భారీగా పెట్టుబడులు పెడుతూనే సంప్రదాయ సైనిక సామర్థ్యాలను కూడా మరింత బలోపేతం చేస్తామని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. "భవిష్యత్ యుద్ధాలు కృత్రిమ మేధస్సుతో సాగవచ్చు.. కానీ విజయాన్ని అందించేది దేశభక్తి, శిక్షణ పొందిన సైనికులే" అని అన్నారు. భారత్ హిందూ మహాసముద్ర ప్రాంతంలో విశ్వసనీయ భద్రతా భాగస్వామిగా ఎదిగిందని, సముద్ర దోపిడీ నిరోధక చర్యలు, విపత్తు సహాయక కార్యక్రమాలు, సంక్షోభ ప్రాంతాల నుంచి భారతీయులు, విదేశీయుల తరలింపులో భారత నౌకాదళం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని ఆయన కొనియాడారు. తూర్పు కనుమల్లోని మహేంద్రగిరి పర్వత శ్రేణి పేరుతో నామకరణం చేసిన ఈ యుద్ధనౌక నిర్మాణంలో 200కు పైగా భారతీయ పరిశ్రమలు, అనేక సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు భాగస్వామ్యం కావడం దేశీయ రక్షణ తయారీ రంగానికి నూతన ఉత్సాహాన్ని అందించిందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్, తూర్పు నౌకాదళ కమాండ్ ఇన్‌చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా, మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ ప్రతినిధులు, నౌకాదళ ఉన్నతాధికారులు, మాజీ సైనికాధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా జేఎన్‌టీయూ-జీవీ తొలి స్నాతకోత్సవం

(7వ పేజీ తరువాయి)

ఒకరికి గౌరవ డాక్టరేట్ అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ విజ్ఞానం వ్యక్తి వికాసానికి, దేశాభివృద్ధికి మూలాధారం అని అన్నారు. ప్రతిభ అవకాశాలను సృష్టిస్తుందని, విద్యార్థులు తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశయాలను నిలబెట్టాలని సూచించారు. కృషి, క్రమశిక్షణ, సమయపాలన విజయానికి కీలకమని పేర్కొన్నారు. భారత్ 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంతో ముందుకు సాగుతోందని, ఆ లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని గవర్నర్ పిలుపునిచ్చారు. కృత్రిమ మేధస్సు (ఏఐ), మెషిన్ లెర్నింగ్, క్వాంటం టెక్నాలజీ, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, గ్రీన్ ఎనర్జీ, 5జీ వంటి రంగాల్లో అపారమైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.
కార్యక్రమంలో జేఎన్‌టీయూ-జీవీ వైస్ ఛాన్సలర్ ఆచార్య వి.వి. సుబ్బారావు అధ్యక్షత వహించగా, నిర్మాణ్ ఆర్గనైజేషన్ సీఈఓ మయూర్ పట్నాల, రిజిస్ట్రార్ రాజ్యలక్ష్మి, వివిధ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు, రిజిస్ట్రార్లు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం గవర్నర్‌ను విశ్వవిద్యాలయ అధికారులు ఘనంగా సత్కరించారు.

## సమస్యలపై అల్లూరు జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముట్టడించిన అంగన్వాడీలు

(7వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలని సామాజిక భద్రత పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు తీవ్రమైన పని ఒత్తిడి ఉందని తక్షణం నవజీవన్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మిగిలిన మినీ సెంటర్లను మెయిన్ సెంట్రల్ గా మార్పు చేయాలని ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు బిఎల్ఓ పేరుతో ఎన్నికల డ్యూటీలు చేయిస్తున్నారని తెలిపారు ఉద్యోగం పేరుతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించడం లేదని అన్నారు తక్షణం వెబ్సైట్లో ఉద్యోగం అనే పేరు తొలగించాలని అన్నారు గ్యాస్ సర్వై లేక వంట నిర్వహణ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు పెరిగిన ధరలకు అనుగుణంగా ఈనెల 31వ తేదీన మరోసారి కలెక్టర్ ఆఫీస్ వద్దకు ధర్నా నిర్వహిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో 11 ప్రాజెక్ట్ నుంచి నాయకులు విస్తృతంగా అంగన్వాడీలు పాల్గొన్నారు. జిల్లా కోశాధికారి చిన్నారి, మోదకొండమ్మ, కొండమ్మ, వెంకటలక్ష్మి, భారతి, పెంటమ్మ, అచ్చి అమ్మ, ఈశ్వరి, సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ ఎస్బిఐ పోతురాజు, జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ సుందర్రావు, జిల్లా కమిటీ సభ్యులు సత్యారావు, జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ పరామర్శ

(7వ పేజీ తరువాయి)

పరామర్శిస్తారని తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడిన వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రమాదం జరిగినప్పటి నుంచి ప్రభుత్వం సమర్థవంతమైన గాలింపు చర్యలు చేపట్టడంలో విఫలమైందని ఆరోపించారు. గల్లంతైన మత్స్యకారుల కోసం శోధనను త్వరగా ముగించడం, అధికారుల నివేదికల్లో పొంతన లేకపోవడం, బాధిత కుటుంబాలను మంత్రులు ప్రత్యక్షంగా పరామర్శించకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ, మత్స్యకారుల కుటుంబాల పట్ల ప్రభుత్వం కనీస మానవత్వం కూడా చూపలేదని అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో హార్బర్ ప్రమాద బాధితులకు 48 గంటల్లోనే పరిహారం అందించామని గుర్తుచేస్తూ, ప్రస్తుతం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా సరిపోదని పేర్కొన్నారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ, ప్రమాద సమాచారం ముందుగానే అందినా సకాలంలో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టలేదని విమర్శించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నప్పటికీ మత్స్యకారులను రక్షించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ, గల్లంతైన మత్స్యకారుల అంశంలో అధికారుల మధ్య సమన్వయం లోపించిందని, ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల పరిహారం తూతూమంత్రంగా ఉందని విమర్శించారు. గాలింపు చర్యలు కొనసాగించి బాధిత కుటుంబాలకు పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, తిప్పల శ్రీనివాస్ దేవన్‌రెడ్డి, మొల్లి అప్పారావు, కట్టమూరి సతీష్‌తో పాటు వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి మరియు విశాఖపట్నం మత్స్యకార నాయకుడు జి.వి. రామచంద్రరావు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రత్యేక జాతీయ లోక్ అదాలత్‌లో రూ.58 కోట్లు వసూలు

(7వ పేజీ తరువాయి)

న్యాయమూర్తి కృష్ణ గోపాల్ ద్వివేది ఆధ్వర్యంలో సభ్యులు ఏ శ్రీనివాస్, కొండా వేదవతి పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన నేటి ప్రత్యేక బెంచ్ లో సుమారు 58 కోట్ల రూపాయలు వసూలు చేయబడిందని న్యాయమూర్తి కృష్ణ గోపాల్ ద్వివేది తెలిపారు. ఈ మేరకు డీ. ఆర్. టీ కోర్ట్ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. సివిల్ కోర్ట్ తో పోలిస్తే ఇక్కడ కేసులు త్వరతగతిన పరిష్కరించబడతాయని అన్నారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, రుణగ్రహీతల పరస్పర అంగీకారంతో వివాదాలను రాజీద్వారా పరిష్కరించుకునేందుకు వేదికగా ఈ ప్రత్యేక లోక్ అదాలత్ నిలుస్తుందన్నారు. దీంతో దీర్ఘకాలం కేసుల పరిష్కారం కోసం కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండకపోవడంతో పాటు సమయం, ఖర్చు కూడా ఆదా అవుతుందని పేర్కొన్నారు. ప్రముఖ న్యాయవాది కొండా వేదవతి మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రానికి ఏకైక డీ. ఆర్. టీ కోర్ట్ విశాఖలోనే ఉందని చెప్పారు. గతంలో నిర్వహించిన లోక్ అదాలత్ ద్వారా 175 కోట్లు వసూలు కాబడిన సొమ్ము వివరాలను వెల్లడించారు. అలాగే ఈ నెల 25వ తేదీన కూడా ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నామని, రుణగ్రహీతలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రిజిస్ట్రార్ పిసి థామస్ కోరారు.

# వీఎంఆర్డీఏ అధికారులపై అసత్య ఆరోపణలు తగవు

(7వ పేజీ తరువాయి)

త్రిశూల్ను పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావటం, దీని వల్ల విశాఖకు పర్యాటకుల తాకిడి మరింత పెరిగిందని చెప్పటానికి గర్వపడుతు న్నామని పేర్కొన్నారు.అలానే నగరం నుంచి బోగాపురం విమానాశ్రయానికి చేరుకునేలా బృహత్ ప్రణాళిక రహదారుల నిర్మాణాన్ని అనుకున్న సమయానికి పూర్తి చేయటం జరిగింది.రాష్ట్ర ముఖ్య మంత్రి గౌరవనీయులు నారా చంద్రబాబునాయుడు, పట్టణ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ సూచన లతో పట్టణాలతో సమానంగా గ్రామీణా భివృద్ధిలో వీఎంఆర్డీఏ ముఖ్య భూమిక పోషిస్తుం దని చెప్పటానికి గర్వపడుతున్నాం. అనకాపల్లి పట్టణంలో రావుగోపాల రావు కళాకేంద్రంను ఆధునీకరించి ప్రజలకు అందు బాటులోకి తీసుకు రావటం జరిగిందన్నారు. వీఎం ఆర్డీఏ పరిధిలో అన్ని నియోజకవర్గాల్లోను, మున్ని పాల్టీలను మరింత బలోపేతం చేసే దిశలో అత్యంత మారుమూల ప్రాంతాల్లో రహదారులు, కాలువలు, కల్వర్టుల నిర్మాణం తదితర మౌళిక సదుపాయాల కల్పనలో రాత్రిబంవళ్లు పని చేస్తున్న మా యొక్క ఆత్మస్థైర్యం దెబ్బతీసేలా వీఎంఆర్డీఏ అధికారయంత్రాం గంపై లేనిపోని అసత్య ఆరోపణలు చేయుట తగదని సూచిస్తున్నాం. అలానే జనసేన నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణల విషయాన్ని స్థానిక జనసేన నాయకులు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతునట్టు తెలిపారు. వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా ఉన్న ఐఏఎస్ అధికారిపై కేవలం వ్యక్తిగత కక్షతో ఎలాంటి ఆధారాలు లేకుండా అసత్య ఆరోపణలు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.
దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అనేక పనులు ప్రస్తుతం ఆయన హయంలో వేగంగా ముందుకు సాగుతున్నా యని, ప్రజలకు మెరుగైన సేవలు అందిం చాలనే ఉద్దేశంతో, నిబంధనలు మరియు పారదర్శ కతకు కట్టుబడి విధులు నిర్వర్తిస్తున్నామన్నారు. గత సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో సంబంధిత అంశంపై విచారణ నిర్వ హించాల్సిందిగా ఫిర్యాదు చేసి, అదే అంశంపై ఇప్పుడు ఆరోపణలు చేయడం ఆశ్చర్యకరమని, ఏ కార్యాలయం లోనైనా ప్రతి పనికి ఒక నిర్దిష్ట ప్రక్రియ ప్రామాణిక విధానాలు మరియు అమలులో ఉన్న నిబంధనల ప్రకారమే జరుగుతుంది. అనంతరం ఆయా పనులు పూర్తి పారదర్శకతతో, చట్టబద్ధమైన విధి విధానాలను అనుసరించి అమలు చేయబడతాయని, ఒక వ్యవస్థలో అనేక స్థాయిలో పరిశీలన, పర్యవేక్షణ మరియు ఆమోద ప్రక్రియలు ఉంటాయన్నారు. వీఎంఆర్డీఏ డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తిస్థాయిలో అందిపుచ్చు కునేలా ఐటి వింగ్ను బలోపేతం చేయటం జరిగింద న్నారు.ఇందులో భాగంగా గతంలో లేనట్లుగా విస్తా అనే యాప్‌ను ప్రయోగాత్మకంగా రూపొందించి, అమల్లోకి తీసుకురావటం ద్వారా వీఎంఆర్డీఏకు నెలకు సుమారు రూ.30 లక్షలకు పైగా ఆదాయం పెరిగింది. ఎ.ఐ. కెమెరాలను ఏర్పాటుచేయటం తోపాటు విస్తా యాప్లో ప్రతీ ఒక్క సందర్శకుల వివరాలను పొందుపరపరచటం ద్వారా పూర్తి స్థాయి పారదర్శ కతతో పరిపాలనసాగుతోం దన్నారు. అదేవిధంగా వీఎంఆర్డీఏ పరిధిలోని జరిగే అన్ని రకాల అభివృద్ధి పనుల్లో నాణ్యత, పర్యవేక్షణ లోపం లేకుండా ఇటు గుత్తేదారులకు, అటు అధికారుల కు మధ్య వారధిగా పనిచేసేలా నిర్మాణ్ యాప్ ను రూపొందించటం జరిగిందని, ఇక వీఎంఆర్డీఏ అభివృద్ధి చేసిన లేఅవుట్లలో స్థలాల విక్రయాల్లో పారదర్శకత ఉండేలా పిఎంఎస్ (ప్లాట్ మేనేజ్మెంట్ సిస్టమ్)తో పాటు ప్రజలకు వీఎంఆర్డీఏ జవాబుదారీగా ఉండేలా పలు యాప్లను రూపొందిం చటం జరుగుతోందన్నారు. వీఎంఆర్డీఏలో చాలా కాలంగా ఉన్న కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు చాలా వరకు మరమ్మతులకు గురికావటంతో పాటు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునే దిశలో ఉద్యోగులు తమ విధులను చేపట్టేలా పూర్తిస్థాయిలో ఎలక్ట్రానిక్ పరికరా లను అందుబాటులోకి తీసుకురావటం జరిగిందన్నారు ఎలక్ట్రానిక్ పరికరాల కొనుగోలు వ్యవహారం టెండర్ల విధానం అంతా పారదర్శకంగా జరిగింది.రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చేలా వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయటంతో కీలకంగా వ్యవహరిస్తున్న అధికారిపై అసత్య ఆరోపణలు చేస్తున్న వారు వారి వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలిందిగా కోరుచున్నామన్నారు.

## కాంగ్రెస్ పార్టీతో కాపులు కలసి వస్తే ముఖ్యమంత్రిని చేస్తాం

(7వ పేజీ తరువాయి)

జయలలితకు ఒక న్యాయం? జగన్ కు మరో న్యాయమా? అని ఆయన ప్రశ్నిచారు. మావిగన్ అంటే మామిడి పండు అనుకున్నాడేమో జగన్, ప్రత్యేక హోదా సాధనలో జగన్, చంద్రబాబు ఇద్దరూ విఫలమయ్యారని విమర్శలు చేశారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు. కూటమి ప్రభుత్వం కాపాడలేకపోతోందని, ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు. ఈ అంశాలపై కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు లో ఎన్నికలకు వెళుతుందన్నారు. కాంగ్రెస్‌కి క్రిస్టియన్లు దూరం అయ్యార అందుకే వారు కష్టాల్లో పడ్డారన్నారు. దళిత క్రిస్టియన్లకు ఎస్సీ స్టేటస్ అంశం కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో చేరుస్తామని ఆయన హామి ఇచ్చారు. టిటిడి లో చిన్న సంఘటన జరిగితే దానిపై సిబిఐ విచారణ వేశారు. అయోధ్య రామ మందిరం నిధులు దుర్వినియోగం చేశారని దేశమంతా విమర్శలు వస్తున్నాయి. దీనిపై సుప్రీం కోర్టు నేతృత్వంలో, సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఏపీలో అభివృద్ధి ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. 23 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు తెచ్చానని చంద్రబాబు నాయుడు అన్నారు. 23 జిల్లాలు తిరిగిన నాకు ఏ ఒక్క జిల్లాలోనూ కోటి రూపాయలు అభివృద్ధి కనిపించలేదన్నారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పనితీరుపై విమర్శలు వస్తున్నాయి. పోలీస్ రాజ్యం నడుస్తోందని ప్రజలందరూ చెప్పున్నార న్నారు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు, విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లతామన్నారు. దళిత క్రైస్తవులకు కాంగ్రెస్ పార్టీని కాదని, ప్రాంతీయ పార్టీల వైపు వెళ్లారు. అందుకే కష్టాల్లో పడ్డారు. క్రిస్టియన్లు కాంగ్రెస్ కి అండగా నిలవండి. మేము అధికారంలోకి రాగానే మీరు కోరుకున్న విధంగా ఎస్సీ దళితులకు రాజ్యాంగ సవరణ చేసి, ఎస్సీ హోదా ఇస్తామన్నారు.23 వేల మంది చిన్న పిల్లలను చూపితే మోడీ గారు నోరు తెరిచి మాట్లాడలేదు. తన మిత్రుడు కేసుల్లో ఇరుక్కుపోయారు.
అతన్ని కాపాడుకునేందుకు అమెరికాకు తొత్తుగా మారిపోయారన్నారు. నెహ్రూ, ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ హయాంలో ఉన్న విదేశాంగ విధానం, బిజెపి పాలనలో బలహీనం అయిందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ విమర్శించారు. ఈ విలేకరులు సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్, సూర్యారావు, అబిదా, కనకారావు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమం కాదు.. భూ పందేరానికే కేబినెట్ సమావేశాలు

(7వ పేజీ తరువాయి)

మంత్రివర్గ సమావేశంలో ఆమోదించిన అంశాల్లో ఎక్కువ భాగం భూ కేటాయింపులకు సంబంధించినవేనని ఆరోపించిన అమర్నాథ్, ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలు, ఉపాధి కల్పన, సంక్షేమ కార్యక్రమాలపై చర్చ జరగలేదన్నారు. మధురవాడలో సుమారు రూ.2,000 కోట్ల విలువైన 9.39 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు బదలాయించడం భవిష్యత్తులో ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రక్రియలో భాగమేనని ఆరోపించారు. అలాగే ఎండాడలో రూ.600 కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ భూముల వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.
విశాఖ భూములు ప్రజల ఆస్తి అని, వాటిని రూపాయికి, 99 పైసలకు కేటాయించడం సమంజసం కాదని పేర్కొన్న ఆయన, రాష్ట్రంలో పెట్టుబడుల పేరుతో లక్షలాది ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం ప్రచారం చేసిందని, ఇప్పటివరకు ఎంతమందికి ఉద్యోగాలు కల్పించిందో శ్వేతపత్రం విడుదల చేయాలని సవాల్ విసిరారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని, సోషల్ మీడియా టాస్క్‌ఫోర్స్ పేరుతో ప్రజల గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం ఎన్ని ఒత్తిళ్లు తెచ్చినా ప్రజా సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని, రాష్ట్ర ఆస్తులను కాపాడేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున నిలబడుతుందని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ స్పష్టం చేశారు.

## ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కారి చిన్నాను పరామర్శించిన జి.వి.రామచంద్రరావు

(7వ పేజీ తరువాయి)

పరామర్శించారు. ఆస్పత్రికి చేరుకున్న రామచంద్రరావు.. చిన్నా ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నాను పరామర్శించి, ఆ భయంకరమైన ప్రమాదం ఎలా జరిగింది? సముద్రంలో ఎదుర్కొన్న పరిస్థితులు ఏమిటి? అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాణాలతో క్షేమంగా తిరిగొచ్చిన చిన్నాకు ధైర్యం చెప్తూ, అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు.

### రూ. 30 వేల తక్షణ ఆర్థిక సాయం

ప్రమాదంలో సర్వస్వం కోల్పోయి, ఆస్పత్రి ఖర్చులు, కుటుంబ అవసరాల నిమిత్తం ఇబ్బంది పడుతున్న చిన్నా కుటుంబానికి జి.వి. రామచంద్రరావు తన వంతు మానవతా సహాయంగా రూ. 30,000/- (ముప్పై వేల రూపాయలు) నగదును అందజేశారు. వైద్య ఖర్చులకు, తక్షణ అవసరాలకు ఈ మొత్తాన్ని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

### ప్రభుత్వం ఆదుకోవాలి: జి.వి. రామచంద్రరావు

ఈ సందర్భంగా జి.వి. రామచంద్రరావు మీడియాతో మాట్లాడుతూ.. సముద్రంలో వేటకు వెళ్లి ప్రమాదానికి గురైన మత్స్యకారుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదం నుండి తృటిలో తప్పించుకుని, తీవ్ర మానసిక ఆందోళనలో ఉన్న చిన్నాకు మెరుగైన ఉచిత వైద్యం అందించడంతో పాటు, ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం తక్షణమే ప్రకటించాలని కోరారు. అలాగే ప్రమాదంలో బోటు మునిగిపోవడంతో ఉపాధి కోల్పోయిన జాలర్ల కుటుంబాలకు నష్టపరిహారం అందించి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని, బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.
ఈ పరామర్శ కార్యక్రమంలో జి.వి. రామచంద్రరావుతో పాటు పలువురు ఫిషింగ్ హార్బర్ ప్రెసిడెంట్ ఎం.లక్ష్మణరావు, ఫిషింగ్ హార్బర్ జనరల్ సెక్రటరీ నరసింగ్, ఫిషింగ్ హార్బర్ కోశాధికారి చిన్న, ఆనంద్,కామేష్, గెడయ్య మరియు స్థానిక మత్స్యకార నాయకులు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో సర్వైకల్ క్యాన్సర్‌కు అడ్డుకట్ట

(7వ పేజీ తరువాయి)

హెచ్‌పీవీ బూస్టర్ డోస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.రెండు రోజుల పాటు నిర్వహించే ఈ శిబిరంలో మొత్తం 500 మంది పోలీసు కుటుంబాలకు చెందిన బాలికలకు వ్యాక్సిన్ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, చిన్న వయస్సులోనే హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు.
చైతన్య ప్రవంతి అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రహమాన్ మాట్లాడుతూ 9--14 ఏళ్ల బాలికలకు రెండు డోసులు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వారికి మూడు డోసులు అవసరమని వివరించారు. అలాగే అక్టోబర్‌లో పోలీసు కుటుంబాలకు చెందిన మహిళల కోసం బ్రెస్ట్ క్యాన్సర్‌పై ప్రత్యేక అవగాహన శిబిరం నిర్వహించాలని ప్రతిపాదించారు.
ఈ కార్యక్రమంలో డీసీపీ చౌదరి పాపారావు, అడ్మిన్ ఏడీసీపీ రామచంద్రరావు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, వైద్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో డాక్టర్ షిరీన్ రహమాన్ పోలీస్ కమిషనర్‌ను ఘనంగా సత్కరించారు.

## వైసీపీ కుట్ర రాజకీయాలను ప్రజలు తిప్పికొడతారు

(7వ పేజీ తరువాయి)

జరిగిన రౌండ్ టేబుల్ సమావేశమే అందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించి, కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, "ఎప్పటికైనా ధర్మమే గెలుస్తుంది. రాముడే విజయం సాధిస్తాడు, రావణుడు కాదు" అని వ్యాఖ్యానించారు. రావణ్, శ్రవణ్, ప్రకాష్ రాజ్ వంటి వ్యక్తుల వెనుక వైసీపీ ప్రోత్సాహం ఉందని, సనాతన ధర్మం, హిందుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న కుట్రలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మాజీ ఉన్నతాధికారి ఏబీ వెంకటేశ్వరరావు వైసీపీ నేతలతో కలిసి కనిపించడం వెనుక ఉన్న కారణాలను ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. గతంలో ఇబ్బందులు ఎదుర్కొన్న వారితో ఇప్పుడు కలిసి పనిచేయడం అనుమానాలకు తావిస్తోందన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వయసుకు తగిన విధంగా మాట్లాడాలని సూచించారు. నటుడు ప్రకాష్ రాజ్ వ్యాఖ్యలను ఖండిస్తూ, తెలుగు సినీ పరిశ్రమ దీనిపై తగిన నిర్ణయం తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ కుట్ర రాజకీయాలకు తెరలేపుతోందని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా వైసీపీ అధినేత జగన్ తన రాజకీయ వైఖరిని మార్చుకోవాలని, లేకపోతే ప్రజలు మరింత గట్టి తీర్పు ఇస్తారని హెచ్చరించారు. విశాఖ నగరంలో కాలుష్య సమస్య పరిష్కారంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. మత్స్యకారులు గల్లంతైన ఘటనలో రెండు రోజుల్లోనే రూ.10 లక్షల ఆర్థిక సాయం ప్రకటించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. అలాగే సీఎస్ఆర్ నిధులతో దక్షిణ నియోజకవర్గంలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో దక్షిణ నియోజకవర్గ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ శివ ప్రసాద్ రెడ్డి, జనసేన నాయకులు డా. మర్రివేముల శ్రీనివాస్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమ నియోజకవర్గంలో రూ. 1.80 కోట్లతో అభివృద్ధి పనులు

గాజువాక జులై 11,ప్రభాతవార్త :

విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో మౌలిక వసతుల కల్పన, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని విశాఖ పార్లమెంట్ సభ్యుడు శ్రీ భరత్, ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) అన్నారు. నియోజకవర్గంలోని 92, 90, 60, 40 వార్డులలో సుమారు రూ. 1.80 కోట్లకు పైగా వ్యయంతో నూతనంగా నిర్మించిన పలు కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ కార్యాలయాల భవనాలను శనివారం వారు ఘనంగా ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించిన నేతలు.. రిబ్బన్లు కట్ చేసి భవనాలను ప్రజలకు అంకితం చేశారు.
జీవీఎంసీ 92వ వార్డ్ గోపాలపట్నం శ్రీనుబాబునగర్‌లో రూ. 17.30 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను తొలుత ప్రారంభించారు.
90వ వార్డు ఇందిరా ప్రియదర్శిని కాలనీలో రూ. 19.80 లక్షల వ్యయంతో, కాకానినగర్ వినోద్ నగర్‌లో రూ. 14.20 లక్షలతో పూర్తి చేసిన కమ్యూనిటీ హాళ్లను ప్రారంభించారు. ఇదే వార్డు రజక కాలనీలో స్థానిక రజక సంఘం సౌకర్యార్థం రూ. 49.00 లక్షలతో నిర్మించిన ఆధునిక ధోబీ ఘాట్, కమ్యూనిటీ హాల్ భవనాన్ని అందుబాటులోకి తెచ్చారు.
జీవీఎంసీ 60వ వార్డ్ ఉడా కాలనీ ప్రజలకు పాలనా సేవలను ఒకే చోట, మరింత వేగంగా అందించేలా రూ. 60.00 లక్షల



భారీ వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాల సముదాయాన్ని (జీవీఎంసీ జోనల్ ఆఫీస్, ఎంఆర్ఓ ఆఫీస్ నేతలు ప్రారంభించారు.
జీవీఎంసీ 40వ వార్డు జై ఆంధ్ర కాలనీలో రూ. 19.85 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించడంతో ఈ పర్యటన ముగిసింది.
ఈ సందర్భంగా ఎంపీ భరత్, విప్ గణబాబు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ, అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇలాంటి మరిన్ని మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, కూటమి అనుబంధ విభాగాల ప్రతినిధులు, వార్డు ఇన్‌ఛార్జులు, స్థానిక మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాధా గాయత్రీ భర్త శ్రీచరణ్ అరెస్ట్

విశాఖపట్నం, జూలై 11, ప్రభాతవార్త :

మస్సోరీలోని కియానా హోమ్‌స్టేలో అనుమానాస్పద పరిస్థితుల్లో రాధా గాయత్రీ మృతిచెందిన కేసులో ఆమె భర్త శ్రీచరణ్ ను డెహ్రాడూన్ పోలీసులు అరెస్టు చేశారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు డెహ్రాడూన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, సేకరించిన ఆధారాల ఆధారంగా నిందితుడు సోమయాజుల చరణ్‌పై నాన్-బెయిలబుల్ వారెంట్ పొందారు. అనంతరం నిందితుడిని న్యూ ఢిల్లీలో అదుపులోకి తీసుకుని మసూరీకి తరలించారు. కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం అతడికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ జిల్లా కారాగారం సుద్ధోవాలాకు తరలించాలని ఆదేశించింది. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

## అన్నపై తమ్ముడు కత్తితో దాడి

ఆరిలోవ, జులై 11, ప్రభాతవార్త

సొంత అన్నయ్య పై తమ్ముడు కత్తితో దాడి చేసిన ఘటన ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శాంతిభద్రతల ఎస్సై రాజేశ్వరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చినగదిలి నవ్య గ్రీన్ హిల్స్ హాస్పిటల్ దగ్గరలో నివాసముంటున్న పెరుమళ్ళ సంతోష్ కుమార్ (27) తన ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఎస్ ఎస్ ఎన్ నగర్ లో ఉంటున్న తమ్ముడు పెరుమాళ్ళ రాజు అన్నయ్యపై కత్తితో దాడి చేసి ఛాతిలో పొడిచాడు. దీంతో సంతోష్ కుమార్ కు తీవ్ర రక్తస్రావం అవడంతో దగ్గరలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రాజు భార్యకు పలు మార్లు ఫోన్లు చేసి, అసభ్యంగా మాట్లాడుతున్నాడని తెలుసుకున్న రాజు కత్తితో దాడికి పాల్పడినట్లు కుటుంబ సభ్యుల నుండి సమాచారం. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంతోష్ కుమార్ ఆరోగ్యం నిలకడగానే ఉందని తెలుస్తుంది. ఈ కేసును ఆరిలోవ సీఐ ఎస్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్ ఐ రాజేశ్వరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యక్తి మృతి.!

నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త :

తీసుకోవలసిన మందులను తీసుకోకుండా అధికంగా తీసుకోవడంతో ఆ మందులు వికటించి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటనపై సీఐ జె. మురళి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నక్కపల్లి మండలం, అమలాపురం పంచాయతీ, శివారు పాటిమీద గ్రామానికి చెందిన రావి నాగేశ్వరరావు( 41 ), గతంలో మానసిక అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నంలోని మానసిక వైద్యశాలలో చికిత్స పొందినట్లు, అప్పటి నుండి వైద్యులు సూచించిన మందులను వాడుతున్నట్లు కుటుంబ సభ్యులు ఆ ఫిర్యాదులకు పేర్కొన్నారు. నాగేశ్వరరావు మద్యానికి బానిసై, మద్యం మత్తులో తన మానసిక వ్యాధికి సంబంధించిన మందులను సోమవారం రాత్రి సుమారు 9.00 గంటల సమయంలో అధిక మోతాదులో తీసుకున్నట్లు ఆయన విషయాన్ని భార్య వెంకటలక్ష్మి గమనించి హుటాహుటి నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం ఎన్టీఆర్ హాస్పిటల్‌కు తరలించగా అక్కడినుంచి కేజీహెచ్ , తరలించారు. కేజీహెచ్ లో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం సమయంలో మృతి చెందినట్లు ఇచ్చిన ఫిర్యాదు పేర్కొన్నారు.

## రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖ పోర్ట్ సిటీ నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరణ

విశాఖపట్నం, జూలై 11, ప్రభాతవార్త :

ఈ రోజు రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖ పోర్ట్ సిటీ నూతన కార్యవర్గం (2026-27) పదవీ బాధ్యతలు స్వీకరించింది. నూతన అధ్యక్షుడు రోటేరియన్ ఎన్.ఎస్.ఎన్. రాజు మరియు కార్యదర్శి రోటేరియన్ ఐ. భాస్కరరావులకు రోటరీ జిల్లా 3020 గవర్నర్ రోటేరియన్ గుత్తికొండ శ్రీరామ్ పదవీ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ సభను ఉద్దేశించి మాట్లాడుతూ, స్థానిక సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను చేపట్టి, సమాజంపై శాశ్వత ప్రభావం చూపే విధంగా క్లబ్ సభ్యులు సేవలందించాలని సూచించారు. రోటరీ బ్లడ్ బ్యాంక్ సలహాదారు రోటేరియన్ జి.ఎస్. రాజు మాట్లాడుతూ, రోటరీ బ్లడ్ సెంటర్ ఎలాంటి రీప్లేస్‌మెంట్ అవసరం లేకుండా అవసరమైన వారికి రక్తాన్ని అందిస్తూ నిరంతరం సేవలందిస్తున్నదని తెలిపారు. అసిస్టెంట్ గవర్నర్ రోటేరియన్ ఆర్. రామకృష్ణరావు మాట్లాడుతూ, రోటరీకి శాశ్వత సేవా ప్రాజెక్టులైన రోటరీ బ్లడ్ సెంటర్ మరియు




రోటరీ డయాగ్నస్టిక్ సెంటర్ విశాఖ నగరంలోని పేద, అవసరమైన ప్రజలకు అత్యల్ప ఖర్చుతో విలువైన సేవలు అందిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇతర నూతన పదాధికారులు కూడా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమం శనివారం హోటల్ దసపల్లా, విశాఖపట్నంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రోటేరియన్ ఎన్.ఎస్.ఎన్. రాజు మాట్లాడుతూ, ప్రస్తుత రోటరీ సంవత్సరంలో అవయవ దాన అవగాహన, సీపీఆర్ శిక్షణ కార్యక్రమాలు, మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన, వర్షపు నీటి సంరక్షణ వంటి సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. అదేవిధంగా, 2026--27 రోటరీ సంవత్సరంలో శ్మశానవాటిక ప్రాజెక్టును కూడా చేపట్టనున్నట్లు వెల్లడించారు.

vsp9:vsp9.qxd 11-07-2026 21:02 Page 1






## వైభవోపేతంగా శ్రీ వెంకటేశ్వర స్వామి గానామృతం





**అరకులోయ, జులై 11, ప్రభాతవార్త :**

అరకులోయ మండల కేంద్రంలోని వ్యాపారవేత్త కాపుగంటి హరిబాబు, రాజ్యలక్ష్మి దంపతుల ఇంటి వద్ద శనివారం శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి గానామృతం పూజా కార్యక్రమం గాజువాక పెద్ద నడుపూరుకు చెందిన కృష్ణవేణి బృందం నేతృత్వంలో అంగరంగ వైభవంగా జరిగింది. 11 మంది కృష్ణవేణి బృందం ప్రత్యేకంగా అరకులోయకు చేరుకుని వెంకటేశ్వర స్వామి గానామృతం కార్యక్రమంలో పాల్గొని సుమారు మూడు గంటలకు పైగా పూజా కార్యక్రమాలు నిర్వహించి, స్వామివారి గీతాలాపనలు చేశారు. కార్యక్రమంలో అరికలోయ, యండపల్లివలసకు చెందిన సుమారు 100 మంది ఆర్యవైశ్య మహిళలు , శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తులు పాల్గొని స్వామి గేయాలను ఆలపించారు. మూడు గంటలకు పైగా జరిగిన కార్యక్రమం శ్రీ వెంకన్న నామస్మరణంతో మారుమోగింది. అలాగే స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. గానామృత కార్యక్రమంలో స్వామి వారి భక్తులు కాపుగంటి కృష్ణారావు దంపతులు , కలగర్ల వెంకటరావు దంపతులు రేపాక నారాయణరావు దంపతులు, వెలగా మాణిక్యాలరావు దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియలో దూసుకుపోతున్న అల్లూరి జిల్లా



**పాడేరు,జులై11, ప్రభాతవార్త:**

ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల మేరకు చేపట్టిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియలో అల్లూరి సీతారామరాజు జిల్లా వేగంగా ముందుకు సాగుతోంది. జిల్లా యంత్రాంగం ప్రత్యేక కృషితో ఇప్పటివరకు 85.25 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసి రాష్ట్రంలో విశేష పురోగతి సాధించింది. మిగిలిన ప్రక్రియను కూడా నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో నిరంతరం చర్యలు చేపడుతోంది.అల్లూరి సీతారామరాజు కలెక్టర్ టి. నిశాంతి తెలియజేసిన వివరాలు ప్రకారం మరణించిన, గైర్హాజరైన, నకిలీ, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారినఓటర్లను గుర్తించి, వారి పేర్లను ఓటరు జాబితా నుండి తొలగించే ప్రక్రియను చేపట్టేం దుకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు.ఈ కార్యక్రమం నిర్వహణకు సంబంధించి జాయింట్ కలెక్టర్ తిరుమని శ్రీ పూజ ,పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్యవర్మ సంబంధిత అధికారులకు గ్రామ సభలను సజావుగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయడంతో పాటు కార్యక్రమాన్ని కలెక్టర్ నిశాంతి పర్యవేక్షిస్తున్నారు.గ్రామ సభల్లో బూత్ లెవల్ అధికారులు బూత్ లెవల్ ఏజెంట్లు , ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, గ్రామ పెద్దల సమక్షంలో మరణించిన, గైర్హాజరైన, నకిలీ ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన ఓటర్ల వివరాలను పరిశీలించి, నిబంధనల ప్రకారం వారి పేర్లను ఓటరు జాబితా నుండి శాశ్వతంగా తొలగించే చర్యలు చేపడతారు.ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియలో ఎక్కడా పొరపాట్లు జరగకుండా జిల్లా కలెక్టర్ నిశాంతి పర్యవేక్షిస్తూ రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ఎన్యుమరేషన్ పక్కాగా జరిగేలా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.ఎక్కడా జరగలేని విధంగా అల్లూరి జిల్లా ఎన్యుమరేషన్శరవేగంగా జరుగుతూ శత శాతం పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం అదే పనిలో నిమగ్నమై ఉన్నారు.

## ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసులు


### దండకరణ్య విమోచన సమితి రాష్ట్ర అధ్యక్షులు కొర్ర మార్క్ రాజ్

**పాడేరు,జులై11,ప్రభాతవార్త:**




1/70 చట్టం రద్దుకోరుతూ సుప్రీం కోర్టులో మైనింగ్ మాఫియా కుట్ర పన్నిందని అందులో భాగంగానే ఇటీవల 1700మంది గిరిజనేతరుల చేత చట్టం రద్దు కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేయించారని దండకరణ్య విమోచన సమితి రాష్ట్ర అధ్యక్షులు కొర్ర మార్క్‌రాజ్ ఆరోపించారు. స్థానిక ఎన్జీఓ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు.కొర్ర మార్క్ రాజ్ మాట్లాడారు.ఇటీవల 1/70 చట్టం రద్దుకోరుతూ సుప్రీం కోర్టులో 1700మంది గిరిజనేతరులు పిటిషన్ వేసినట్లు ప్రధాన పత్రికల్లో ప్రచురితమవ్వటంవలన ఆదివాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు.పై విషయం పై డిఎల్ఓ బృందం జాతీయ ఎస్టీ కమిషన్‌కు డిఎల్ఓ పిర్యాదు చేసిందన్నారు.అలాగే ఆదివాసుల పక్షాన సుప్రీం కోర్టులో కౌంటర్ పిటిషన్ వేయుటకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశించాలని కోరిందన్నారు. జాతీయ ఎస్టీ కమిషన్ స్పందించి ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు డీఎల్ఓ పిర్యాదుపై విచారణ జరిపి 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని లేని పక్షంలో ప్రత్యేక్షంగా కమిషన్ ముందు హాజరు కావాల్సి ఉంటుందని తన నోటీసులో ఆయన పేర్కొన్నారు..ఇదిలా ఉండగా 1/70 చట్టం పై మాట్లాడ వలసిన ప్రభుత్వ పెద్దలు మాట్లాడకపోతే మరో జిఓ నెం. 3 లా 1/70 చట్టాన్ని కొట్టివేసే ప్రమాదముందని కనుక రాష్ట్ర ప్రభుత్వలతో పాటు 5వ షెడ్యూల్లో ఆదివాసులకోసం పనిచేస్తున్న ఐటిడిఏ పీఓలు, ఆదివాసీ జిల్లాలో కలెక్టర్లు కూడ ఆదివాసుల పక్షాన సుప్రీం కోర్టులో కౌంటర్ పిటిషన్ వెయ్యాలని డిఎల్ఓ రాష్ట్ర అధ్యక్షులు మార్క్‌రాజ్ డిమాండ్ చేసారు. ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలని లేని పక్షంలో ఆదివాసులు మరో స్వాతంత్ర పోరాటానికి సిద్ధం కావడం తప్ప మరో మార్గం లేదని డిఎల్ఓ స్పష్టం చేసింది. ఉద్యోగ సమితి అధ్యక్షులు కోడా ఆనందారావు, డెలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండపల్లి కాంతరావు, డిఎల్ఓ జిల్లా అధ్యక్షులు కిముడు కొత్తయ్య,డిఎల్ఓ రాష్ట్ర కార్యదర్శి కవడం కాసులమ్మ, కార్యదర్శి కాగు వెంకాయమ్మ, మచ్చుమ్మ,డిఎల్ఓ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్, డిఎస్ఓ రాష్ట్ర నాయకులు నన్ని జాన్, డిఎల్ఓ నాయకులు రామ్ ప్రసాద్, బాబురావు, శోభన్, తదితరులు పాల్గొన్నారు.

## పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బదిలీ




**పాడేరు,జులై11,ప్రభాతవార్త:**

పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వనం చిట్టి అబ్బాయిను విజయనగరం జిల్లా శృంగవరపు(ఎస్.కోట) ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీ చేసారు. పాడేరు ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన చిట్టి అబ్బాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నాక్ బి గ్రేడ్ తెప్పించి కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేశారు. అలాగే పిఎం ఉషాలో భాగంగా కళాశాలకు నిధులు తెప్పించడంలో కీలకపాత్ర ఆయన పోషించారు, కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్స్, ,ప్యానల్ బోర్డ్స్, పోడియంస్, కళాశాల మొత్తం ఇంటర్నెట్ సదుపాయం కల్పించడంలో కీలక పాత్ర ప్రిన్సిపాల్ వహించారు. ఇక్కడ ప్రిన్సిపాల్ చేసిన కృషిని కళాశాల సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

## కార్మికులతో పనులు చేయిస్తున్న ముగ్గురు యజమానులకు జరిమానా

**పాడేరు,జులై11,ప్రభాతవార్త :**



14 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న బాల కార్మికులతో పనులు చేయిస్తున్న ముగ్గురు దుకాణ యజమానులకు పాడేరు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎ. రాము జరిమానా విధించారు. ఈ మేరకు చోడవరం సహాయ కార్మికాధికారి పి. సూర్యనారాయణ ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. హుకుంపేట మండలంలోని ఫాస్ట్ ఫుడ్ సెంటర్, దేవీ స్వీట్స్, సమోసా పకోడీ దుకాణాల్లో చట్టాన్ని ఉల్లంఘించి బాలలను పనిలో పెట్టుకున్నట్లు అధికారులు గుర్తించారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి సదరు యజమానులకు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.సదరు దుకాణాల్లో బాల కార్మికులకు ప్రభుత్వం నిర్దేశించిన వేతనాల కంటే తక్కువ జీతాలు చెల్లిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ తేడా జీతాన్ని యజమానుల నుండి రికవరీ చేసి బాధితులకు అందించేందుకు వీలుగా ఉన్నతాధికారుల వద్ద క్లెయిమ్ దాఖలు చేసినట్లు సహాయ కార్మికాధికారి తెలిపారు.అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎక్కడైనా, ఎవరైనా చిన్న పిల్లలతో పనులు చేయిస్తూ బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే వెంటనే 9492555018 నెంబరుకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## 31న జరిగే కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయండి

**పాడేరు,జులై11,ప్రభాతవార్త:**



ఏపీ మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల కనీస వేతన లు సాధనకై ఈనెల 31వ తేదీన జరిగే కలెక్టరేట్ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జీ. వరలక్ష్మి కార్మికులకు పిలుపునిచ్చారు.పాడేరు శ్రీ మిదకిందమ్మ అమ్మవారి కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 32 లక్షల మంది పిల్లలకు గాను 85000 మంది మధ్యాహ్న భోజనం కార్మికులు వంట చేసి పెడుతున్నారు ఎంతో కష్టపడి శ్రమించి పాఠశాలలో కార్మికులు రోజుకి ఏడు నుండి ఎనిమిది గంటలు పనిచేస్తున్న నెల తరబడి వేతనాలు చెల్లించటం లేదన్నారు. సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఎస్‌బి పోతురాజు,జిల్లా సహాయ కార్యదర్శి సుందర్ రావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల కనీస వేతనాలు అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని కార్మికులు ఎంతో కష్టపడి శ్రమించి పనిచేస్తున్న ఇచ్చే తక్కువ వేతనాలు కూడా నెలకు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. పెరుగుతున్న ధరలు అనుగుణంగా ప్రభుత్వం వేతనాలు పెంచాలని స్మార్ట్ కిచెన్ ఏర్పాటు ధరల పెరుగుదల అనుగుణంగా ఒక్కొక్క విద్యార్థికి మెనూ చార్జీ 20 రూపాయలు ఇవ్వాలి ఈ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు కనీసం వేతనం 10000 రూపాయలు చెల్లించాలి ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. కావునా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని లేనియెడల భారీ ఎత్తున ఉద్యమించవలసిన అవసరం ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి మధ్యాహ్నం భోజనం కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పాడేరులో ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ

**పాడేరు,జులై11,ప్రభాతవార్త:**



ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం పాడేరులో విస్తృత అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాడేరు అంబేద్కర్ కూడలి నుండి ఐటీడీఏ కార్యాలయం వరకు జరిగిన ర్యాలీలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, ప్రభుత్వ ఏఎన్ఎం శిక్షణ పాఠశాల విద్యార్థినులు, ఆశా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుటుంబ సంక్షేమం, తల్లి--శిశు ఆరోగ్యం, కుటుంబ నియంత్రణ, బాల్య వివాహాల నివారణ, జనాభా నియంత్రణ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. టి.ఎన్. ప్రతాప్ మాట్లాడుతూ, ప్రపంచ జనాభా దినోత్సవం కేవలం జనాభా పెరుగుదలపై చర్చించే రోజు మాత్రమే కాదని, ప్రతి కుటుంబం ఆరోగ్యంగా, ఆర్థికంగా, సామాజి కంగా అభివృద్ధి చెందేందుకు బాధ్యతాయుతమైన కుటుంబ ప్రణాళిక అవసరమని పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజన జనాభా అధికంగా ఉన్న ప్రాంతమని, ప్రతి గర్భిణి సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే సురక్షిత ప్రసవాలు జరగడం, పిల్లలకు పూర్తి స్థాయిలో టీకాలు వేయించడం, రక్తహీనత నివారణ చర్యలు పాటించడం ద్వారా తల్లి- శిశు ఆరోగ్యాన్ని మరింత మెరుగుపర చవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ అఖిల్ వెంకటేశ్వర్, డాక్టర్ సాయిశ్రీ, డిప్యూటీ డెమో పి. సింహాచలం, ఎస్.ఓ. కైలాస్, ఆరోగ్య విస్తరణ అధికారులు గుల్లేలి సింహాద్రి, ప్రభాకర్ రావు, హెల్త్ ఎడ్యుకేటర్ పి. గణేశ్వరి, పి.హెచ్.ఎన్‌లు టి. ఈశ్వరమ్మ, పి. వరలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్లు బి. కృష్ణవేణి, ఎం. సరోజిని, మినుములూరు, హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ప్రభుత్వ ఏఎన్ఎం శిక్షణా కేంద్రం విద్యార్థినులు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కూటమి నిధులతో వైసీపీ నేతల హడావుడి!

### దామనపల్లి ఎస్ఆర్ కాలనీలో ప్రోటోకాల్‌కు పాతర కూటమి నేతలను పిలవకుండానే బోరు పనుల శంకుస్థాపన



### ఇంజినీరింగ్ అధికారులు, వైసీపీ నేతలపై చర్యలకు డిమాండ్

**గూడెంకొత్తవీధి,జులై 11, (ప్రభాతవార్త):**

కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో వైసీపీ నేతలు సొంత డబ్బా కొట్టుకుంటున్నారని కూటమి నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దామనపల్లి పరిధిలోని ఎస్ఆర్ కాలనీలో కూటమి ప్రభుత్వ నిధులతో చేపట్టనున్న బోరు బావి పనుల శంకుస్థాపన కార్యక్రమం తీవ్ర వివాదానికి దారితీసింది. నియోజకవర్గ, మండల స్థాయి కూటమి ముఖ్య నాయకులకు, ప్రజాప్రతినిధులకు కనీస సమాచారం ఇవ్వకుండా, ప్రోటోకాల్ నిబంధనలను పూర్తిగా గాలికొదిలేసి వైసీపీకి చెందిన ఎంపీపీ, సర్పంచ్ ఈ శంకుస్థాపన పనులు ముగించేయడంపై కూటమి శ్రేణులు మండిపడుతున్నాయి.

**అధికారుల అండతోనే ఉల్లంఘనలు!**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం అధికారిక కార్యక్రమాలకు స్థానిక కూటమి ప్రజాప్రతినిధులను, అధికారులను ఆహ్వానించాల్సి ఉండగా, కొందరు ఇంజినీరింగ్ అధికారులు వైసీపీ నేతలతో చేతులు కలిపి ఈ డ్రామా ఆడించారని కూటమి నేతలు ఆరోపించారు. ప్రభుత్వ సొమ్ముతో పనులు చేస్తూ, కూటమి ప్రభుత్వానికి దక్కాల్సిన గుర్తింపును తాము కొట్టేయాలని వైసీపీ నేతలు చూడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిబంధనలను తుంగలో తొక్కిన సదరు ఇంజినీరింగ్ అధికారులపై, ప్రోటోకాల్‌ను ఉల్లంఘించిన వైసీపీ ఎంపీపీ, సర్పంచ్‌లపై తక్షణమే ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అధికారుల తీరుకు నిరసనగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామనిపొత్తూరు కొండలరావు, పసుపులేటి నాగమణి, కాకూరు శేఖర్, కొయ్యం బాలరాజు, గడుతూరి పరమేష్, తదితరులు హెచ్చరించారు.

## వాహన తనిఖీల్లో లీటర్ లిక్విడ్ గంజాయి పట్టివేత

### ముగ్గురు అరెస్టు ... మరొకరు పరారు

**అరకు రూరల్, జులై 11, ప్రభాతవార్త:**



అరకులోయ మండలం పద్మాపురం మేజర్ పంచాయతీ పరిధిలోకి వచ్చే యండపల్లివలస రైల్వే స్టేషన్ వద్ద శనివారం అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్. హిమగిరి నేతృత్వంలో సబ్ ఇన్స్పెక్టర్ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ముమ్మర వాహన తనిఖీల్లో కారులో అక్రమంగా తరలిస్తున్న ఒక లీటర్ గంజాయి పట్టుబడింది. పాడేరు నుండి అరకు లోయ వైపు వస్తున్న కారును వాహన తనిఖీలు చేస్తున్న పోలీస్ సిబ్బంది తనిఖీలు చేయగా ఒక లీటర్ లిక్విడ్ గంజాయి ఉన్నట్లు గుర్తించారు. అందుకు పాల్పడిన డుంబ్రిగూడ మండలం గుంటగన్నేల పంచాయతీ జామి గూడ గ్రామానికి చెందిన గుమ్మ హరికృష్ణ, అలాగే కేరళ రాష్ట్రానికి చెందిన మహిజన్, ఒరిస్సా రాష్ట్రానికి చెందిన కృష్ణ అనే ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే అక్రమ లిక్విడ్ గంజాయి రవాణాకు పాల్పడిన ఒరిస్సా రాష్ట్రానికి చెందిన లోకోయి రాజు అనే వ్యక్తి పరారీలో ఉన్నారని అతని కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై. మల్లేశ్వరరావు తెలియజేశారు. గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోవడమే లక్ష్యంగా ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు ముమ్మురా వాహన తనిఖీలను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పద్మపురం పంచాయతీ అభివృద్ధి అధికారి పాత్రుడు, వీఆర్వో రాంబాబు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సర్ విజయవంతానికి గ్రామసభలు

**అరకు రూరల్,జులై 11, ప్రభాత వార్త:**



భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ -సర్) కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ నిశాంతి టి, వారి ఆదేశాల మేరకు అరకులోయ మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించబడుతున్నాయని. కార్యక్రమంలో భాగంగా శనివారం కోడిపుంజు వలస (పోలింగ్ స్టేషన్--249), వర్ర (పోలింగ్ స్టేషన్--250), సిరిగం (పోలింగ్ స్టేషన్--251), వరతోకవలస (పోలింగ్ స్టేషన్-252) గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు.గ్రామ సభల్లో పోలింగ్ స్టేషన్ వారీగా మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన, చిరునామా మార్చుకున్న (షిఫటెడ్ ) ఓటర్ల వివరాలను గ్రామ ప్రజల సమక్షంలో పరిశీలించి ధృవీకరించారు. అదేవిధంగా గ్రామ ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించి నమోదు చేశారు. వాటర్ జాబితాను పారదర్శకంగా ఖచ్చితంగా రూపొందించేందుకు ప్రజలు తమ పూర్తి సహకారాన్ని అందించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి మరియు అదనపు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వీసం ప్రసాద్, పంచాయతీ అభివృద్ధి అధికారి సి.హెచ్. ఉమాదేవి, మాజీ సర్పంచ్‌లు జెన్ని చిరంజీవి, మాణిక్యం, పాంగి మిన్ను, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, సూపర్వైజర్ బి. రవికుమార్, బిఎల్ఓ లు కొర్రా లచ్చన్న, పాంగి మణికంఠ, గుగ్గుడి జయంతి, కిల్లో రాధాకృష్ణ, అదనపు బిఎల్ఓ లు, గ్రామ సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## 1/70 చట్ట పరిరక్షణకు దుచ్చరపాలెం గ్రామస్తుల 'లక్ష' విరాళం

### గిరిజన హక్కుల కోసం ఏకతాటిపై గ్రామం

### ఉద్యమానికి ఆర్థిక అండగా ప్రజల స్వచ్ఛంద సహకారం

**గూడెంకొత్తవీధి, జులై 11, (ప్రభాతవార్త):**



గిరిజన ప్రాంతాల భూములు, హక్కులను కాపాడే చారిత్రాత్మక 1/70 భూ బదలాయింపు నిరోధక చట్టం పరిరక్షణ కోసం దుచ్చరపాలెం గ్రామస్తులు విశేష ఐకమత్యాన్ని చాటారు. చట్టాన్ని రక్షించుకోవడం ప్రతి గిరిజనుడి బాధ్యత అనే సంకల్పంతో గ్రామంలోని ఆదివాసీలు, యువత, పెద్దలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రూ.1,00,000 (ఒక లక్ష రూపాయలు) విరాళాన్ని సేకరించి అందజేయడానికి సిద్ధమయ్యారు.ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షించే 1/70 చట్టంపై ఇటీవలి కాలంలో జరుగుతున్న వివిధ ప్రచారాలు, పరిణామాల నేపథ్యంలో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో చట్ట పరిరక్షణ కోసం అవసరమైన న్యాయపోరాటాలు, ప్రజా ఉద్యమాలకు తమ వంతు మద్దతు అందించాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. గ్రామంలోని ప్రతి కుటుంబం స్వచ్ఛందంగా స్పందించి, తమకు తోచిన మేర విరాళాలు అందించడంతో కొద్ది రోజుల్లోనే లక్ష రూపాయలు సమీకరించారు. ఈ నిధిని గ్రామ పెద్దల సమక్షంలో 1/70 చట్ట పరిరక్షణ కమిటీ ప్రతినిధులకు అందజేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.హక్కుల పరిరక్షణ కోసం ఆర్థికంగా కూడా ముందుకు వచ్చిన దుచ్చరపాలెం గ్రామస్తుల చొరవను పలువురు గిరిజన నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు అభినందించారు. ఈ స్ఫూర్తిదాయక నిర్ణయం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు."చట్టాల పరిరక్షణతోనే గిరిజనుల మనుగడ, భూముల భద్రత సాధ్యమవుతుంది. భవిష్యత్తులో కూడా గిరిజన హక్కుల కోసం జరిగే ప్రతి ప్రజాస్వామ్య పోరాటానికి మేము అండగా ఉంటాం" అని గ్రామస్తులు స్పష్టం చేశారు. గ్రామ పెద్ద సాగిన రామరాజు పడాల్, మాజీ సర్పంచ్ సాగిన పుష్పకుమారి, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు సాగిన భీమేశ్వర్ పడాల్, లక్ష్మణ్ బ్రదర్స్, కృష్ణ పడాల్, బ్రహ్మాజీ, గోపి, సోమరాజు, గుమ్మల రాంబాబు, వార్డు సభ్యుడు జోగి పడాల్తో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, యువత పాల్గొన్నారు.

## పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాల ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ

**పాడేరుజులై11,ప్రభాతవార్త:**



ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాడేరు ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి, ,పాడేరు మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచ జనాభా దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. భారతదేశంలో జననాల రేటు క్రమంగా తగ్గుతున్నప్పటికీ, మరణాల రేటు కూడా తగ్గడంతో పాటు సగటు ఆయుర్దాయం పెరగడం వల్ల జనాభా నిర్మాణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని ఆయన వివరించారు. మొత్తం సంతానోత్పత్తి రేటు ప్రస్తు తం భర్తీ స్థాయికి చేరువలో ఉందని, కుటుంబ నియంత్రణ, మహిళా విద్య, బాలికల సాధికారత , తల్లి-శిశు ఆరోగ్య సేవలు జనాభా స్థిరీకరణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని డా.శ్రీనివాసరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డా. ఎర్రయ్య , ప్రొఫెసర్, హెడ్, జనరల్ మెడిసిన్ డా. సురేశ్వరరెడ్డి ,ఇన్చార్జ్ ఆర్ఎంఓ ప్రసాద్ ,డా.నరసింగరావు సామాజిక సేవాధికారి శంకరరావు, వైద్యులు, స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బంది, విద్యార్థులు ,ఇతర సిబ్బంది పాల్గొని ప్రజలకు కుటుంబ నియంత్రణ, తల్లి- శిశు సంక్షేమం, బాలికల విద్య, ఆరోగ్యకరమైన కుటుంబ జీవన విధానంపై అవగాహన కల్పించారు.

## రావణ్ అండ్ కో వెనక ఉన్నది వైసిపియే

### ఆంధ్రప్రదేశ్ జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య

**పాడేరు,జులై11,ప్రభాతవార్త:**



ప్రశ్న రావణ్ అండ్ కో వెనుక ఉన్న నడిపిస్తున్నది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీయే అని ఆంధ్రప్రదేశ్ జానపద కళలు, సృజనాత్మక అకాడమీ చైర్మన్, జనసేన పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ వంపూరు గంగులయ్య పేర్కొన్నారు. క్రైస్తవులను రెచ్చగొట్టి మత ఘర్షణలు సృష్టించే దిశగా వైసీపీ తీవ్రమైన కుట్రలు పన్నుతోందనీ దానిలో భాగమే ప్రశ్న రావడం లాంటి వారు పుట్టుకొచ్చారన్నారు.పాడేరు జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గంగులయ్య మాట్లాడారు.రావణ్ తో కలిసి పని చేసిన శ్రావణ్ సరిపోవడం లేదని- నేరుగా వైసీపీ వాళ్లే రంగంలోకి దిగారని, ఉపా కేసులో అరెస్టు అయిన రావణ్ కి న్యాయ సహాయం చేస్తామని వైసీపీ మీడియా ముఖంగా ప్రకటించడమే దీని సాక్ష్యం అన్నారు. హే రామ్ అంటూ రావణ కోసం జగన్ తెగ బాధపడ్డాడని, వైసీపీ తాడేపల్లి ప్యాలెస్ నుంచే రావణ్, శ్రావణ్ , ప్రకాష్ రాజ్ వ్యవహారాలు మానిటర్ చేస్తున్నారన్నారను ఆయన ఆరోపించారు. ఈ క్రమంలో ప్రజలందరూ కొన్ని విషయాలు గ్రహించాలని ఆయన పేర్కొన్నారు. దళిత క్రైస్తవుల రిజర్వేషన్లకు సంబంధించినది సుప్రీం కోర్టులోని అంశమని , క్రైస్తవులను రెచ్చగొట్టే ముఠాలు రంగంలోకి దిగాయని తెలిపారు. సోషల్ మీడియాలో హిందూ దేవతలను, సనాతన ధర్మాన్ని కించపరచేలా కొన్ని పెయిడ్ యూట్యూబ్ ఛానెల్స్, రావణ్ లాంటి పెయిడ్ వ్యక్తులు పుట్టుకొచ్చారన్నారు. అభ్యంతరకరమైన భాషలో దూషిస్తున్నారని, వీరికి పొరుగు రాష్ట్రంలో నటుడు ప్రకాష్ రాజ్ తోడయ్యారని , రావణ్ ప్రకాష్ రాజ్ వీళ్లంతా క్రైస్తవులు అన్నారు. ఏలూరులో దళిత క్రైస్తవ శంఖారావం పేరుతో జడ శ్రావణ్ సభ ఏర్పాటు చేశారు. ఈ సభను అందరూ జాగ్రతగా పరిశీలన చేస్తే - ప్రధాన వక్తలంతా దళితుల గురించిగానీ, క్రైస్తవుల గురించిగానీ, దళిత క్రైస్తవుల గురించిగానీ... వారి సంక్షేమం గురించి గానీ మాట్లాడకుండా పవన్ కళ్యాణ్ మీద విమర్శలు చేయడమే అజెండాగా పెట్టుకున్నారు. పవన్ కళ్యాణ్ మీద అభ్యంతరకర భాషలో మాట్లాడారని అయన అన్నారు. పవన్ కళ్యాణ్ ని లక్ష్యంగా చేసుకున్నారనేందుకు ఈ సమయ ప్రత్యక్ష సాక్ష్యం అన్నారు. పవన్ కళ్యాణ్ ని లక్ష్యంగా చేసుకొని కొన్ని ముఠాలు పని చేస్తున్నాయనీ దేశంపట్ల బాధ్యతతో, దేశ సమైక్యత సమగ్రతల గురించి బలంగా మాట్లాడుతున్న నాయకుడు పవన్ కళ్యాణ్ అని అందుకే ఆయనపై వ్యక్తిని వ్యక్తమయ్యాలా చేస్తున్నారన్నారు. సనాతన ధర్మాన్ని పరిరక్షించాలీ అని బలంగా చెబుతున్న నాయకుడు పవన్ కళ్యాణ్‌ని, సనాతన ధర్మం అంటే గిట్టని వ్యక్తులు రాష్ట్రంలో ఘర్షణలు సృష్టించే పనిలో ఉన్నారని గంగులయ్య రన్నారు.ఈ కుట్రలో ఒక పాత్రధారి జడా శ్రావణ్ కుమార్ అని ఈ లాయర్ తో ప్యాకేజీ కుదుర్చుకొని నోటికి వచ్చినట్లు మాట్లాడిస్తున్నారు. రావణ్ అనేవాడిని ఉపా కేసులో అరెస్టు చేయగానే శ్రావణ్ అనేవాడికి మతి భ్రమించిందని పేర్కొన్నారు. జగన్ మీద పోరాటానికి రూ.25 కోట్లు సొంత డబ్బు ఖర్చుపెట్టాను అని చెప్పిన శ్రావణ్ కి అంత సొమ్ము ఎలా వచ్చిందో చెప్పాలి? అని ఒంపూరు గంగులయ్య డిమాండ్ చేశారు. ఒక సాధారణ లైన్ మెన్ కొడుకైన శ్రావణ్... చదువుకొని జడ్జి అయ్యారని ఆ ఉద్యోగం ఎక్కువ కాలం చేయని ఆ వ్యక్తికి రూ.25 కోట్లు ఎలా వచ్చాయన్నారు. కానీ అవినీతి కేసులుపడే ప్రమాదం ఉందని తెలిసి హడావిడిగా తన పదవికి రాజీనామా చేశారని ఆయన పేర్కొన్నారు. చెట్టు కింద ప్లీడర్ కి ఎక్కువ... బెయిల్ కేసులకు తక్కువ అయిన శ్రావణ్ కి పాతిక కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో సమాధానం చెప్పాలన్నారు. జడ శ్రావణ్ కుమార్ సుగాలి ప్రీతి తల్లిని మోసం చేసిన విషయం వాస్తవం కాదా అని ఆయన నిలదీశారు. ఏ ప్రాక్టీసు లేని లాయర్ అని బార్ కౌన్సిల్ రికార్డుల్లో జడ శ్రావణ్ పేరు ఉన్న మాట వాస్తవం కాదా? అన్నారు. వీటికి ఏ మాత్రం సమాధానం చెప్పలేని శ్రావణ్‌కి పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడే అర్హత లేదని పేర్కొన్నారు. జోసెఫ్ రావణ్ శ్రావణ్ -- ప్రకాష్ రాజ్ మధ్య ఉన్న క్యాష్ బంధం ఏమిటి?జోసఫ్ రావణ్ కు జడ శ్రావణ్ కుమార్ కు ప్రకాష్ రాజుకు మధ్య ఉన్న క్యాష్ సంబంధం ఏంటని గంగులయ్య నిలదీశారు. వీళ్ళ ముగ్గురితో తాడేపల్లి ప్యాలెస్ ఉన్న లింక్ ఏమిటని, తాడేపల్లి ప్యాలెస్ నుంచి కుట్ర నడుపుతున్న వారికి అంతర్జాతీయ ఫండింగ్ వస్తుంది అనే సందేహం తనకు ఉందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ లో క్రైస్తవులను రెచ్చగొట్టి మత ఘర్షణలు రేపేందుకు అంతర్జాతీయ ఫండింగ్ ఎవరికి అందుతోంది అనే కోణంలో పోలీసులు లోతుగా విచారణ చేస్తే అసలు కుట్రధారులు, పాత్రధారులు బయటకు వస్తారని గంగులయ్య అన్నారు.

## 85 శాతం ముగిసిన 'ఎస్ఐఆర్' ఓటరు సర్వే



**గూడెంకొత్తవీధి, జులై 11, (ప్రభాతవార్త):**

మండలంలోని స్థానిక సచివాలయాల పరిధిలో 'ఎస్ఐఆర్' ఓటరు సర్వే ముమ్మ రంగా సాగుతోందని జి.కె వీధి వైకాపా మం డల అధ్యక్షుడు కంకిపాటి గిరి ప్రసాద్,ఎంపీపీ బోయిన కుమారి తెలిపారు. శనివారం వారు సీలేరు, దుప్పులవాడ, ధారకొండ సచివాలయాల పరిధిలో పర్యటించారు.ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ), ఏజెంట్లతో (బీఎల్ఏ) కలిసి సర్వే ప్రగతిపై సమీక్షించారు.అనంతరం పలు గ్రామసభల్లో పాల్గొని ప్రజలకు సర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సచివాలయాల పరిధిలో ఇప్పటివరకు 85 శాతం సర్వే పూర్తయిందని చెప్పారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా బీఎల్ఏలు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఇప్పటివరకు ఎన్యూమరేషన్ ఫారాలు తిరిగి ఇవ్వని వారు.. వాటిని యుద్ధప్రాతిపదికన బీఎల్ఓలకు అందజేయాలని ఆదేశించారు.ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా, చనిపోయిన వారి వివరాలను తొలగించి పారదర్శకంగా రూపొందించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్



ఎలమంచిలి, జూలై 11, ప్రభాతవార్త

నియోజకవర్గం రాంబిల్లి మండలం అప్పారాయుడుపాలెం గ్రామంలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో సుమారు కోటి రూపాయల వ్యయంతో నూతన తారు రోడ్డు ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అప్పారాయుడుపాలెం గ్రామంలో ఇప్పటికే రహదారులు, డ్రైనేజీ వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల అభివృద్ధి మరింత ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని అయినప్పటికీ ప్రజల అవసరమైన మౌలిక వసతులు



కల్పనలో కూటమి ప్రభుత్వం ముందంజలో ఉందని అన్నారు. నియోజవర్గంలోని రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానానికి తీసుకెళ్లే బాధ్యత తమ దేనిని ఎమ్మెల్యే అన్నారు. ప్రస్తుతం పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులన్నిటిని వచ్చే మూడు సంవత్సరాల పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం జల్జీవన్ మిషన్ నిధులతో గ్రామాలలోని ప్రభుత్వ ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించే బాధ్యత తీసుకుంటామని తెలిపారు. గ్రామాలలో దేవాలయాలు, శివాలయాలు, పాఠశాలలో ఇతర ప్రజావసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## పంచదార్ల గ్రామంలో పురాతన శివాలయాలను అభివృద్ధి చేయడంతో పాటు కేంద్ర విద్యాలయం ఏర్పాటుకు కృషి : ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్



ఎలమంచిలి, జూలై 11, ప్రభాతవార్త

నియోజకవర్గ రాంబిల్లి మండలం పంచదార్ల గ్రామంలో కళ్యాణమండపంలోని రైతులకు వ్యవసాయ పరికరాలు మహిళలకు కుట్టు మిషన్లను ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్ శాఖామంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పంచదారల గ్రామంలో కోటమీ ప్రభుత్వం అధికారులకు వచ్చిన తరువాత పంట పొలాలకు నీరు అందించే కాలువలను శుభ్రపరిచి రైతులకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన సమస్యలను పరిష్కరిస్తూ రైతులకు మేలు చేసే



కార్యక్రమాలు అమలు చేస్తున్నామని అన్నారు. గ్రామంలో పురాతన శివాలయాన్ని మరింత అభివృద్ధి చేయడంతో పాటు, కేంద్ర విద్యాలయం, నవోదయ విద్యాలయాల ఏర్పాటు కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందాల అవసరమైన అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ప్రతి అర్హత కుటుంబానికి ఇంటి స్థలాలు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. గ్రామ పరిశుభ్రతను కాపాడేందుకు ప్రతి కుటుంబం తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా సేకరించి డస్ట్ బిన్లలోని వెయ్యాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గత రెండు సంవత్సరాల్లో గ్రామంలో రోడ్లు డ్రైనేజీలు మౌలిక వసతులు అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చామని, రానున్న రోజుల్లో పంచదార గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తామని ఎమ్మెల్యే సుందరు విజయకుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, దిన్ బాబు, కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## వేదురుపర్తిలో ఘనంగా పశుగ్రాస వారోత్సవాలు నిర్వహణ



కసింకోట, జూలై 11, ప్రభాతవార్త

కసింకోట మండలం, వేదురుపర్తి గ్రామంలో పశుగ్రాస వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కసింకోట పశు వైద్య అధికారిని చైతన్యమని ఆధ్వర్యంలో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు పశుగ్రాస పంటల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. వివిధ రకాల పశుగ్రాస పంటలు, వాటి సాగు విధానాలు ప్రయోజనాలను వివరించారు. నాణ్యమైన పచ్చిగడ్డి వినియోగం ద్వారా పాల ఉత్పత్తి పెరగడమే కాకుండా, పాలలో ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ శాతం కూడా పెరుగుతుందని రైతులకు వివరించారు. అదేవిధంగా కసింకోట పశువైద్యశాలలో 75% సబ్సిడీపై కాకిజొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 5 కిలోల విత్తనాల సంచి ధర రూ.420 కాగా, రైతులు కేవలం రూ.115 మాత్రమే చెల్లించి పొందవచ్చని చెప్పారు. ఈ విత్తనాలు సుమారు 20 సెంట్ల భూమికి సరిపోవడంతో పాటు నాలుగు కోతలు ఇచ్చి అధిక పశుగ్రాసాన్ని అందిస్తాయని వివరించారు. అలాగే అజొల్లా సాగు వినియోగం వల్ల పశువుల ఆరోగ్యం మెరుగుపడి, పాలలో ఫ్యాట్ శాతం పెరగడానికి దోహదపడుతుందని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర మల్లేష్,పశు సంవర్ధక శాఖ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## కసింకోటలో ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

కసింకోట, జూలై11, ప్రభాతవార్త



ప్రపంచ జనాభా దినోత్సవంలో భాగంగా శనివారం కశింకోట ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శివయ్య, డాక్టర్ యశోద ఆధ్వర్యములో నిర్వహించారు. శివయ్య మాట్లాడుతూ భారత దేశ జనాభా ప్రపంచములోనే ఒకటవ స్థానములో వున్నదని దీనిని నివారించడానికి కుటుంబ ఆర్థిక వ్యవస్థ గాడిలో పెట్టడానికి పిల్లల మధ్య ఎడము ఉండాలని దానికి కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలని, ఆడపిల్లలకు 21 సంవత్సరాలు వచ్చేవరకు పెళ్లిళ్లు చేయకూడదని చెప్పారు. త్వరగా పెళ్లిళ్లు చేయడము వలన వారి ఆరోగ్యము, కుటుంబ ఆర్థిక వ్యవస్థ సమాజ అభివృద్ధి కుంటుపడతాయని చెప్పారు. ఈ కార్యక్రములో ప్రాధమిక ఆరోగ్యకేంద్ర విస్తరణాధికారి సిహెచ్. సత్యనారాయణ, సిబ్బంది, ఆశలు, ప్రజలు పాల్గొన్నారు.

## జులై 14 లోపు సర్ సర్వే నమోదు తప్పనిసరి



గొలుగొండ జులై 11, ప్రభాతవార్త

ఓటర్ జాబితాలో ఉన్న ప్రతి ఒక్క ఓటరు సర్ సర్వే నమోదు తప్పనిసరిగా జరగాలని ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు, తహసిల్దార్ వి శ్రీనివాసరావు తెలిపారు. జులై 14తో సర్ సర్వే ముగుస్తుందని ఈలోపు వాటర్ తమ బూత్ స్థాయిలో పర్యటిస్తున్న బివిఎల్ఓ వద్ద నమోదు చేయించుకోవాలని సూచించారు. సర్వే పూర్తయిన తర్వాత తమ ఓటు హక్కు కోసం వెతుకులాడకుండా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నిర్దేశి నిర్దేశిత గడువులో తమ నమోదు ఆమోదించుకోవాలని అన్నారు. వాటర్ జాబితాలో ఉన్న ప్రతి ఒక్క ఓటరు తమ ఆధార్ కార్డు ఫోటోతో సహ బిఎల్ఓకు అందజేయాలని అప్పుడే మీ ఓటు నిర్ధారణ అవుతుందని తెలిపారు. శనివారం అన్ని పోలింగ్ బూత్ స్థాయిలో బిఎల్ఓలు సర్ సర్వేలో పాల్గొని ఓటర్ జాబితా ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. సిహెచ్ నాగపురం, సాలిక మల్లవరం తోపాటు పలుభూతుల్లో డిప్యూటీ తహసిల్దార్ సి వి చైనులు తనిఖీలు నిర్వహించారు. 14 తారీకు లోపు అన్ని బూతుల్లో సర్వే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులో సర్వే పూర్తి కాకపోతే తదుపరి వాటర్ జాబితా స్వరూపం మారుతుందని అన్నారు. ఓట్లు తొలగింపు చేర్పు కొత్త ఓట్లు నమోదు ప్రక్రియ గత నెల రోజులుగా జరుగుతూ వస్తుందని ప్రతి బిఎల్ఓ సమర్థవంతంగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో బిఎల్‌వోలు సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

## బిడ్డ, బిడ్డకు మధ్య ఎడబాటు శ్రేయస్కరం

మాకవరపాలెం జూలై 11 ప్రభాతవార్త



పిల్లల మధ్య ఎడబాటు సంతానం వలన బిడ్డకు తల్లికి శ్రేయస్కరమని మాకవరపాలెం పిహెచ్సి వైద్యాధికారి బి.శ్రీనివాసరావు అన్నారు. ఈమేరకు శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించిన బిడ్డకు, బిడ్డకు ఎడబాటు సంతానం వలన తల్లీబిడ్డలకు ఆరోగ్యకరం" అంటూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన బిడ్డతో పాటు తల్లి సురక్షితంగా ఉండాలంటే బిడ్డకు బిడ్డకు మధ్య సంతానం ఎడబాటు మంచితన్నారు. గర్భవతులైన తల్లులు, సమతుల్య ఆహారం తీసుకోవడం వలన ఆరోగ్యకరమైన బిడ్డలు జన్మిస్తారన్నారు. సిహెచ్ఓ ఎం.రమేష్, ఎంపి హెచ్ ఓ ఎల్. సత్తిబాబు, ఆరోగ్య సిబ్బంది సరస్వతి,శివకుమార్, ఎంఎల్ హెచ్ పిలు, ఆరోగ్య సిబ్బంది, ఇమ్మానుయేల్ నర్సింగ్ కాలేజీ శిక్షణ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దేవవరపు రాంబాబు దంపతులు ఆలయానికి భూమి విరాళం



పాయకరావుపేట, ప్రభాతవార్త

గజం భూమి కోసం గ్రామాల్లో కుటుంబాల మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్న ఈ రోజుల్లో ఒక కుటుంబం ఆలయ నిర్మాణానికి భూమిని దానం చేసేందుకు ముందుకు వచ్చిన సంఘటన.! ఆ భూముల దానం చేసిన కుటుంబం ఎవరో కాదు ప్రముఖ న్యాయవాది.. పాయకరావుపేట మండలం పాల్తేరు గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి ఆంగ్ల అవధాని బాబుశ్రీ చేతులు మీదగా గ్రామానికి చెందిన దేవవ రపు రాంబాబు దంపతులు 54 సెంట్ల దేవభూమి దానం చేశారు. ఇప్పటికే ఈ దేవరపు రాంబాబు కుటుంబం గ్రామంలో ఊహించిన సేవా కార్యక్రమాలకు చేస్తూ వస్తున్న విషయం తెలిసినదే.! శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి ప్రముఖ హైకోర్టు న్యాయవాది దేవవరపు రాంబాబు, మాధవి దంపతులు భూమి పూజా కార్యక్రమాలు అనంతరం గ్రామ పెద్దలు సమక్షంలో విరాళంగా అందజేశారు. తల్లిదండ్రులైన దేవవరపు లోవరాజు, అప్పలరాజుల జ్ఞాపకార్థంగా పాల్తేరు శివారు నరసాపురం దారిలో గల 54 సెంట్ల వ్యవసాయ క్షేత్రాన్ని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి పవిత్ర ఆలయమునకు కేటాయించారు.



ఆలయ పవిత్ర కార్యాల కోసం భారీ భూవిరాళం అందించడం ద్వారా తమ భక్తిప్రపత్తులను చాటుకున్నారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త బాబు శ్రీ మాస్టారి చేతుల మీదుగా భూమి పత్రాలను ఆలయంలోని అర్చకులకు, ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అర్చకులు శాస్త్రానుసారంగా పూజలు నిర్వహించి రాంబాబు దంపతులకు ఆశీస్సులు అందజేశారు. రాంబాబు దంపతులు దేవవరపు లోవరాజు చారిటబుల్ ట్రస్ట్‌ను స్థాపించి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా గ్రామస్తులకు ఉచితంగా కాశీయాత్ర నిర్వహించడమే కాకుండా శ్రీరామనవమి కళ్యాణ మహోత్సవాన్ని ప్రతి ఏటా జరిపిస్తున్నారు. గతంలో రాములవారి ఆలయానికి 60 సెంట్ల వ్యవసాయ క్షేత్రం విరాళంగా అందించిన విషయం తెలిసినదే.! భక్తిభావంతో పాటు సామాజిక బాధ్యతగా విద్యా, వైద్యం, దైవ కార్యాలకు నిరంతరం తోడ్పాటునందిస్తున్న దేవవరపు రాంబాబు దంపతుల సేవా నిరతిని కొనియాడుతూ తుని, పాయకరావుపేట పరిసర ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దాసరి గణేష్, కార్యదర్శి విశ్వనాధుని వెంకటేష్, కొమ్మిరెడ్డి సత్తిబాబు, ఆలయ కమిటీ సభ్యులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు దాసరి అప్పారావు, మాజీ గ్రామ ఉప సర్పంచ్ దేవవరపు శ్రీనివాసరావు, దాసరి దివాణం, దేవవరపు బుల్లిబాబు, విశ్వనాధుని శ్రీనివాస్, బుద్దాల చిట్టిబాబు, పాల్తేరు అంకంపేట గ్రామ పెద్దలు స్నేహితులు అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా హోం మంత్రి అనిత కుమారుడు పుట్టినరోజు వేడుకలు

నక్కపల్లి ,ప్రభాతవార్త



రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత కుమారుడు నిఖిల్ పుట్టినరోజు వేడుకలను పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ నాయకత్వంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిఖిల్‌కి నిండు నూరేళ్లు దేవుడు ప్రసాదించాలని కోరుతూ అనాధాశ్రమంలో వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేశారు. వృద్ధులు ఆశీస్సులతో అందజేయాలని వెంకటేష్ వడ్డిస్తూ వృద్ధులను కోరారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద బర్త్డే కేకును కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గం మహిళ కన్వీనర్ మునిషా బేగంతో పాటు పార్టీ నాయకులు అద్దూరి



లోవరాజు, మాజీ సర్పంచ్ మీసాల బాబులు, మెగా ఉత్తరాంధ్ర నాయకులు మీగడ సత్య నారాయణమూర్తి, తెలుగు యువత మండల శాఖ అధ్యక్షులు కమ్మెళ్ల శివరామకృష్ణంరాజు, ఐటీడీపీ నియోజకవర్గ కన్వీనర్ రమేష్, నడిగట్ల నరేష్, సీనియర్ పార్టీ నాయకులు కర్రీ వెంకట సత్యనారాయణ (కె వి), కోసూరు శీను (బిసి), బద్రి, పచ్చిపులుసు (పాము) నాగేశ్వరరావు, సకురు దుర్గ, దార్ల కృష్ణ, కొప్పిశెట్టి వీరబాబు, దేవరపు లోవరాజు తదితరులు ఉన్నారు.

## బాలికల రెసిడెన్షియల్ పాఠశాల కోసం భవనాలు పరిశీలన

నక్కపల్లి/ అడ్డు రోడ్డు, ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌ల నాయకత్వంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితమ్మ ఆదేశాల మేరకు శుక్రవారం ఎంజీబీ బీసీడబ్ల్యూ బాలికల గురుకుల పాఠశాల మంజూరు ప్రతిపాదనలో భాగంగా రాజయ్యపేట గ్రామంలో తెలుగుదేశం పార్టీ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ పాఠశాల ఏర్పాటుకు అనువైన భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజయ్యపేట గ్రామంలోని తుఫాన్ భవనం, గోపాల్ భవనం తదితర భవనాలను సందర్శించి, విద్యార్థినుల భద్రత, వసతి సౌకర్యాలు, తాగునీరు, పారిశుద్ధ్యం , ఇతర మౌలిక వసతులపై స్థానిక కూటమి నాయకులతో చర్చించారు. గురుకుల పాఠశాల ఏర్పాటు కోసం అవసరమైన అన్ని విధాల సహకారాన్ని గ్రామ పంచాయతీ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి మండలం తెలుగు యువత అధ్యక్షులు కమ్మేళ శివరామకృష్ణ రాజు, టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, సొసైటీ అధ్యక్షులు పిక్కి కోదండరావు, యూనిట్ ఇంచార్జ్ వాసుపల్లి శివాజీ, జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి కోదండరావు (బుజ్జి), మాజీ ఉప సర్పంచ్ సిరిపల్లి అప్పలరాజు, నక్కపల్లి మండల జనసేన ప్రధాన కార్యదర్శి బొంది గుర్రన్న, అంగన్‌వాడీ టీచర్ పిక్కి పైడితల్లి, యూనిట్ ఇన్‌చార్జ్ వాసుపల్లి శివాజీ, ఐటీడీపీ ప్రధాన కార్యదర్శి మైలపల్లి ప్రసాద్, దైలపల్లి శ్రీను, చోడిపల్లి కోదండరావు, పిక్కి వీర్రాబాబు, తదితరులు పాల్గొన్నారు.

## లీప్ యాప్ పరిశీలన : ఎంఈవో నరేష్




(నక్కపల్లి, ప్రభాతవార్త)

మండలంలో అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నతపాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల తల్లిదండ్రుల మొబైల్‌లలో లీప్ యాప్ సంస్థాపన (ఇన్ స్టాలేషన్) చేయాలని స్థానిక మండల విద్యాశాఖాధికారి కే.నరేష్ తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ఉపాధ్యా యులు దీనిపై మరింత శ్రద్ధ వహించి శతశాతం విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. దీనిలో భాగంగా ఆయన శుక్రవారం స్థానిక బాలికోన్నతపాఠశాల మరియు పెదబోదుగల్లం హైస్కూల్స్ తో పాటు పలు పాఠశాలలు సందర్శించి లీప్ యాప్ వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను దీనిపై చైతన్యపరచాలన్నారు. ఈ లీప్ యాప్ డౌన్లోడ్ చేసు కోవడంద్వారా మొబైల్‌లోనే విద్యార్థుల హాజరు,ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేసే విధానం,సకాలంలో సిలబస్ పూర్తి, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహణ వంటి విషయాలను తల్లిదండ్రులే నేరుగా తమ మొబైల్‌లో తెలుసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థుల సమగ్ర ప్రగతిని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు స్వయంగా తెలుసుకునేలా యాప్ రూపొందించడం శుభపరిణామం అని ఎంఈవో నరేష్ తెలిపారు. ఈ విద్యార్థుల పెన్ ఐడీ, పుట్టిన తేదీ ఆధారంగా ఓటిపితో నిర్ధారణ చేసుకోవాలన్నారు. మండలంలో ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయుల సహకారంతో వెంటనే ఈ కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పెదబోదుగల్లం హైస్కూల్ హెచ్.ఎమ్.ఎస్.జయశ్రీ, ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, ఎస్.పాల్గుణరావు పాల్గొన్నారు.

## ఆయుర్వేద వైద్యంతో ఎన్నో ప్రయోజనాలు

### -టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కురందాసు నూకరాజు

నక్కపల్లి, ప్రభాతవార్త



ఆయుర్వేద వైద్య సేవలతో ఎన్నో ప్రయోజనాలున్నాయని, అనేక దీర్ఘకాలిక వ్యాధులను కూడా సునాయాసంగా నయం చేసుకోవచ్చునని, ఇటువంటి వైద్య సేవలను ప్రజలు ఆదరించాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కురందాసు నూకరాజు సూచించారు. మండలంలోని జానక య్యపేట గ్రామంలో శుక్రవారం వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ సుమారు 120 మంది రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ కె.రఘు మాట్లాడుతూ పిల్లల నుంచి పెద్దల వరకూ అన్ని రకాల వ్యాధులకు ఆయుర్వేద ఆస్పత్రిలో మందులు పుష్కలంగా వున్నాయని చెప్పారు. ఎటువంటి సైడ్‌అఫెక్ట్స్ వుండవన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కురందాసు నాగ సత్యవేణి, సీనియర్ ఫార్మసిస్ట్ భీశెట్టి రామకృష్ణ, యోగా టీచర్ డీఎస్వీ సాయి తదితరులు పాల్గొన్నారు.




## జూలై 14 లోగా ఓటర్ల వివరాలు సమర్పించాలి

### తహశీల్దార్ వరహాలరావు

ఎలమంచిలి, జూలై 11, ప్రభాతవార్త



భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ-2027 (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, పరిశీలన, డిజిటలైజేషన్ ప్రక్రియను జూలై 14వ తేదీలోగా పూర్తి చేయాల్సి ఉందని తాసిల్దార్ వరహాలరావు అన్నారు. శనివారం పట్టణంలో గల తాసిల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ వరహాల రావు మాట్లాడుతూ మండలంలోని 67 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 56,972 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో ఇప్పటివరకు 46,751 మంది ఓటర్ల సమాచారాన్ని డిజిటలైజ్ చేయడం పూర్తయిందని అన్నారు. అదేవిధంగా 1,979 మంది ఓటర్లు మరణించినవారు, శాశ్వతంగా వలస వెళ్లినవారు లేదా ప్రస్తుతం అందుబాటులో లేనివారిగా గుర్తించడం జరిగిందని తెలిపారు. ఇంకా 8,242 మంది ఓటర్ల వివరాలను అత్యవసరంగా సేకరించి డిజిటలైజ్ చేయాల్సి ఉందని, గడువు చాలా తక్కువగా ఉన్నందున మిగిలిన ఓటర్లందరూ తమ ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే సంబంధిత బూత్ స్థాయి అధికారులకు సమర్పించాలని అన్నారు. లేదంటే ఈ నెల 21న ఎన్నికల సంఘం ప్రకటించే ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు గల్లంతుకానుందని తెలిపారు. మండలంలోని 67 పోలింగ్ కేంద్రాలలో ముఖ్యంగా పట్టణ ప్రధాన కేంద్ర పరిధిలోని 20 పోలింగ్ కేంద్రాలలో పురోగతి చాలా తక్కువగా ఉన్నట్లు గుర్తించడమైనదని అన్నారు. ఆయా ప్రాంతాలలో నివసిస్తున్న ఓటర్లు తమ వివరాలను సంబంధిత బూత్ స్థాయి అధికారి వద్ద ధ్రువీకరించుకొని, అవసరమైన పత్రాలు, సమాచారాన్ని తక్షణమే అందించాలని తెలిపారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు కూడా ముసాయిదా ఓటర్ల జాబితాలో తప్పిపోకుండా ఉండేందుకు మీడియా ప్రతినిధులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, వాలంటీర్లు, స్థానిక యువత ఎన్నికల సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని కోరారు. ముఖ్యంగా తమ పరిసర ప్రాంతాలలో ఇంకా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్లను గుర్తించి, సంబంధిత బీఎల్ ఓలను సంప్రదించేలా అవగాహన కల్పించాలని అన్నారు. మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన లేదా చిరునామాలో అందుబాటులో లేని ఓటర్లకు సంబంధించిన సరైన సమాచారాన్ని కూడా ఎన్నికల సిబ్బందికి అందించాలని తెలిపారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు ఓటు హక్కును పరిరక్షించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే యువి రమణ మూర్తి రాజు జన్మదినోత్సవం

ఎలమంచిలి, జూలై 11, ప్రభాతవార్త




అభివృద్ధి అంటే మాజీ ఎమ్మెల్యే యువి రమణమూర్తి రాజు (కన్నబాబు రాజు) అని నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. స్థానిక వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే యువి రమణమూర్తి రాజు (కన్నబాబు రాజు )75వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మ శ్రీ మాట్లాడుతూ దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిలతో అత్యంత సన్నిహితంగా మెలిగే వ్యక్తి అన్నారు. యలమంచిలి పట్టణంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి, రాజీవ్ క్రీడా కాంప్లెక్స్, ఇండోర్ స్టేడియం, దిమిలి రోడ్డు, స్టేషన్ రోడ్డు అభివృద్ధితోపాటు పలు సేవా కార్యక్రమాలు చేశారన్నారు. నియోజకవర్గంలో అన్ని మండలాల్లో యు వి రమణ మూర్తి రాజు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ కన్నబాబురాజుది రాజకీయంలో ప్రత్యేక స్థానమన్నారు. సామ దాన భేద దండోపాయ తెలిసిన రాజకీయ నాయకుడని అని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్ఆర్సిపి సంయుక్త కార్యదర్శి బోద్ధపు ఎర్రయ్య దొర, మునగపాక జెడ్పిటిసి సోమేశ్వరరావు, పార్టీ అధ్యక్షులు అచ్చి నాయుడు, మండల యూత్ అధ్యక్షులు దంతులూరి సంతోష్ వర్మ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అరేపు గుప్తా, వైఎస్ఆర్సిపి నాయకులు కొటారు కొండబాబు, దూది నరసింహమూర్తి, పిల్లా త్రినాథ్, దాసరి కుమార్, కోడిగుడ్డు రమణ, పిట్టా సత్తిబాబు, గొర్ల వెంకట్, కడప అప్పలనాయుడు, మర్రి రాజబాబు, దాసరి కుమార్, ఉప్పలూరు కిరణ్ కుమార్, గోన్నబత్తుల శివ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనకాపల్లి జిల్లాలో లోకేష్ కృషి వల్ల పారిశ్రామిక ప్రగతి

### మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్

అనకాపల్లి, జూలై 11, ప్రభాతవార్త



కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ నిరుద్యోగ యువతీ యువకులకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామనే లక్ష్యంగా పని చేస్తామని, దీనికోసం రాష్ట్రంలో పెట్టుబడి పెట్టే విధంగా పారిశ్రామికవేత్తలకు నమ్మకం కలిగించే విధంగా స్పీడ్ అప్ డూయింగ్ విధానాల్లో అనుమతులు మంజూరు చేసి అనకాపల్లి జిల్లాలో 2,55,775 కోట్లతో పెట్టుబడులు తీసుకురావడం వల్ల 1,32,557 మంది నిరుద్యోగులకు ఉద్యోగాల అవకాశాలు కల్పించారని మాజీ ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆనందం వ్యక్తం చేశారు. శనివారం తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా పరిశ్రమలు రావడం వల్ల నిరుద్యోగ యువతీ యువకులకు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం 1,32,557 ఉద్యోగాలు రాబోతున్నాయని, పరోక్షంగా మరొక లక్ష మందికి ఉపాధి వచ్చే అవకాశం ఉందని నాగ జగదీష్ అన్నారు. అనకాపల్లి జిల్లా ప్రజలకు నిరుద్యోగులకు మంచి భవిష్యత్తుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విశేష కృషి ఫలితంగా యువతకు మంచి భరోసా కల్పించి వారి కుటుంబాలను ఆదుకునే విధంగా కూటమి ప్రభుత్వం జిల్లా శాసనసభ్యులు మంత్రులు ఇన్చార్జి మంత్రి అందరూ సమిష్టి కృషితో జిల్లాకే వెన్నె తెచ్చే విధంగా కూటమి ప్రభుత్వం కృషిని జిల్లా ప్రజలు ఆనందాన్ని కూటమి ప్రభుత్వం కృషిని హర్షం అభినందనలు వ్యక్తపరుస్తున్నారని నాగ జగదీష్ అన్నారు. విలేకరుల సమావేశంలో శ్రీ భోగలింగేశ్వర దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు కొమ్మోజు రామకృష్ణ పాల్గొన్నారు.

## శ్రీ భోగి లింగేశ్వర స్వామి దేవస్థానంలో అభివృద్ధి పనులపై సమీక్ష

అనకాపల్లి జూలై 11, ప్రభాతవార్త



గవరపాలెం: శ్రీ భోగి లింగేశ్వర స్వామి దేవస్థానానికి విచ్చేసిన జనసేన పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ భీమరశెట్టి రామ్కికి ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేసి, శాలువాతో సత్కరించి వేద ఆశీర్వచనాలు అందించారు. అనంతరం దేవస్థానంలో చేపట్టనున్న అభివృద్ధి పనుల అమలుపై దాతలు, పాలక మండలి సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సూచనలు, పర్యవేక్షణలో శాంతి మండపం, దేవస్థానం ప్రాంగణంలో ఫ్లోరింగ్, గర్భాలయ ముఖద్వారం నిర్మాణం తదితర అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం కానున్నట్లు పాలక మండలి చైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా భీమరశెట్టి రామ్కి మాట్లాడుతూ, దాతల సహకారంతో దేవస్థానం అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసేలా పాలకమండలి సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించి, విరాల దాతలను సత్కరించి గౌరవించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలకమండలి సభ్యులు, విరాళదాతలు, అర్చకులు, వివిధ దేవస్థానాల చైర్మన్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఉద్యోగార్హతకు నైపుణ్యాలే పెట్టుబడి నాంది ఫౌండేషన్ శిక్షణ అధికారి కె.గౌతమ్



ఆనందపురం, జూలై 11, ప్రభాతవార్త

మారుతున్న ఉద్యోగ రంగ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని నాంది ఫౌండేషన్ శిక్షణ అధికారి కె.గౌతమ్ సూచించారు. మహీంద్రా అండ్ మహీంద్రా గ్రూప్ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా నాంది ఫౌండేషన్ సహకారంతో ఆనందపురం గాయత్రి డిగ్రీ కళాశాలలో వారం రోజులుగా నిర్వహించిన కెరీర్ గైడెన్స్, ఉద్యోగార్హత నైపుణ్యాల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, సమయపాలన, నాయకత్వ లక్షణాలు, టీమ్‌వర్క్ వంటి అంశాలు భవిష్యత్ ఉద్యోగ జీవితానికి బలమైన పునాది నిలుస్తాయన్నారు. కళాశాల కరస్పాండెంట్ దుక్క అప్పలరాజు మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న విషయాలను నిరంతరం సాధన చేస్తే ఉద్యోగ లక్ష్యాలను సులభంగా చేరుకోగలరన్నారు. కళాశాల డైరెక్టర్ బెల్లాన రామకృష్ణ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తాయని చెప్పారు. వారం రోజుల శిక్షణలో విద్యార్థులకు ఇంటర్వ్యూ నైపుణ్యాలు, రెజ్యూమె తయారీ, గ్రూప్ డిస్కషన్, మాక్ ఇంటర్వ్యూలతో పాటు ఉద్యోగాలకు అవసరమైన పలు అంశాలపై ప్రాయోగిక శిక్షణ అందజేశారు. వారం రోజుల పాటు జరిగిన వర్క్ షాప్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ సునీత, బి. సత్యనారాయణ, జి. లక్ష్మణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సింహాద్రినాదుని దర్శించుకున్న ప్రముఖులు



సింహాచలం, జూలై 11, ప్రభాతవార్త

శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి వారిని శనివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆలపాటి గిరిధర్, ఒరిస్సా రాష్ట్ర మంత్రి గోకులా నంద మల్లిక్, విజయనగరం జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు అదనపు జిల్లా మేజిస్ట్రేట్ సేదు మాధవన్, ఐఏఎస్, గిరిజన సహకార సంస్థ వైస్ చైర్‌పర్సన్ ఉ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.ఎస్. శోభిక, ఐఏఎస్ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన వారికి దేవస్థాన కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు ఘన స్వాగతం పలికారు. అనంతరం దంపతులు ఆలయ సంప్రదాయం ప్రకారం కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దర్శనం అనంతరం వేదపండితులు వారికి వేద ఆశీర్వచనం అందజేయగా, దేవస్థాన కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు శేషవస్త్రంతో సత్కరించి, స్వామివారి ప్రసాదాలు, జ్ఞాపికగా స్వామివారి చిత్రపటం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది పాల్గొని విశిష్ట అతిథులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఉక్కుపాదం

### 213 మందికి రూ.21.30 లక్షల జరిమానా

ఆనందపురం, జూలై 11, ప్రభాతవార్త

మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ఆనందపురం ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. ప్రీ లోక్ అదాలత్, లోక్ అదాలత్ సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 213 మందిని భీమిలిలోని 15వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయ మూర్తి పి.స్వాతి భవానీ ఎదుట శనివారం హాజరుపరిచారు. కేసులను విచారించిన న్యాయమూర్తి ప్రతి ఒక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. దీంతో 213 కేసులకు కలిపి మొత్తం రూ.21.30 లక్షల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ ఐ పాపారావు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమే కాకుండా, ప్రమాదాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. రోడ్డు భద్రత అందరి బాధ్యత అని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ మద్యం సేవించిన తర్వాత వాహనాలు నడపకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

## సీపీఎం సీనియర్ నేత సనపల రంగనాథ స్వామి కన్నుమూత



మాధవధార, ప్రభాతవార్త

మాధవధారకు చెందిన సీపీఎం సీనియర్ నేత, సిపిఎం తొలితరం పార్టీ సీనియర్ సభ్యులు కామ్రేడ్ సనపల రంగనాథ స్వామి(94) ఆరోగ్య సమస్య లతో శనివారం మృతిచెందారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందారు. రంగనాథ స్వామి మృతికి యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వివిఎస్ పద్మనాభ రాజు, 78వ వార్డు మాజీ కార్పొరేటర్ గంగారావు, సిపిఎం పార్టీ నాయకులు సనపల రామ్ గోపాల్‌రావు, కే సుధాకర్ రావు, సనపల నరసింగరావు, డివైఎఫ్ఐ నాయకులు సనపల శ్రావణ్ కుమార్, యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి కూన సత్యనారాయణ, పప్పల రామచంద్రరావు, పప్పల శ్రీదేవి, సనపల అమ్మలు నివాళులు అర్పించారు. తన పార్థీవ దేహాన్ని ఆదివారం ఉదయం జ్యోతిబసు అవయదాన ట్రస్టు ద్వారా కేజీహెచ్‌కి దేహదానం చేస్తామని ఆయన కుటుంబ సభ్యులు తెలియజేశారు. రంగనాథ స్వామి ఏపీఈపీడీసీఎల్‌లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే యునైటెడ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఏర్పాటు చేయడంలో ముఖ్య పాత్ర పోషించారు. అతని కుమారుడు సనపల నరసింహస్వామి ప్రముఖ న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఒక కుమార్తె ఉన్నారు.

## అయోధ్య రామమందిర విరాళాల్లో భారీ అవకతవకలు

### సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలి -సిడబ్ల్యూసి మెంబర్, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీ చంద్ రెడ్డి డిమాండ్



విశాఖపట్నం, ప్రభాతవార్త

అయోధ్యలోని రామ మందిర నిర్మాణానికి దేశ వ్యాప్తంగా ఉన్న పేదలు, రైతులు, సామాన్య ప్రజలు ఎంతో పవిత్రమైన భావనతో, ధర్మమే ముఖ్యమని భావించి వేలాది కోట్ల రూపాయలను విరాళాలుగా ఇచ్చారని మాజీ ఎమ్మెల్యే, ఏఐసిసి ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీ చంద్ రెడ్డి అన్నారు. శనివారం విశాఖపట్నం కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అంతటి పవిత్రమైన విరాళాల వ్యవహారంలో అవకతవకలు జరిగాయనే మాట వింటేనే సహించలేక పోతున్నామని, ఇందులో బాధ్యులుగా ఉన్నవారు క్షమించరాని నేరానికి ఒడిగట్టారని మండిపడ్డారు.

### రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ ఆరాటం

రాముడు ఏ ఒక్క పార్టీకో చెందినవాడు కాదని, ఆయన అందరివాడని వంశీ చంద్ రెడ్డి స్పష్టం చేశారు. ఇంతటి సున్నితమైన ఆధ్యాత్మిక వ్యవహారాన్ని బీజేపీ పార్టీ తమ రాజకీయ లబ్ధి కొరకు వాడుకుందని ఆయన విమర్శించారు. ఇంత పెద్ద ఎత్తున చందాల దందాలు, అక్రమాలు జరుగుతున్నా ప్రధాని నరేంద్ర మోడీ ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. అలాగే, ఈ వ్యవహారాల నేపథ్యంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలు ఎందుకు రాజీనామా చేయాల్సి వచ్చిందో సమాధానం చెప్పాలన్నారు.

### ఇదొక 'ఆర్గనైజ్డ్ క్రైమ్'.. యూపీ సిట్‌పై నమ్మకం లేదు

రామమందిరం నిధుల దుర్వినియోగం వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉందని, ఇది ముమ్మాటికీ ఒక 'ఆర్గనైజ్డ్ క్రైమ్' (వ్యవస్థీకృత నేరం) అని ఆయన అభివర్ణించారు. క్షేత్రస్థాయిలో కేవలం ఏడుగురిని మాత్రమే అరెస్ట్ చేసి, ఈ మొత్తం ఉదంతాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ మీద తమకు నమ్మకం లేదని, ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. నిందితులందరినీ అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు దోషులుగా నిలబెట్టాలన్నారు.

### ఖర్చుల పేరిట కోట్లాది రూపాయల దుబారా?

ఆలయ ప్రారంభోత్సవ ఖర్చుల వివరాలపై వంశీ చంద్ రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేవలం ఒక్కరోజు దేవాలయం ప్రారంభోత్సవంలో 8,000 మంది అతిథుల కోసం రూ.11,300 లక్షలు (113 కోట్లు) ఖర్చు చూపించారని మండిపడ్డారు. అలాగే, అయోధ్య రామ మందిరంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ఏకంగా రూ.12,000 లక్షలు (120 కోట్లు) ఖర్చు చూపించడం విస్మయానికి గురిచేస్తోందన్నారు. దేవాలయం ప్రారంభం నాటి నుండి జరిగిన ప్రతి ఖర్చును దేశ ప్రజల ముందు పారదర్శకంగా ఉంచాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

### సీసీ కెమెరాల డేటా డిలీట్ వెనుక మర్మమేంటి?

రామ మందిరంలోని హుండీ లెక్కింపు ప్రాంతంలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని వంశీ చంద్ రెడ్డి ఆరోపించారు. అంతేకాకుండా, గత 45 రోజులకు ముందున్న సీసీ కెమెరాల డేటాను ఎందుకు డిలీట్ చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఆధారాలను రూపుమాపడానికే ఈ చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ మొత్తం వ్యవహారంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వయంగా దేశ ప్రజల ముందుకు వచ్చి సమాధానం చెప్పాలని, తక్షణమే ప్రత్యేక విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు హాసిని వర్మతో పాటు పిసిసి ఉపాధ్యక్షులు వేగి వెంకటేశ్, పిసిసి సెక్రెటరీ గాదం మహేష్,యూత్ లీడర్ లక్కరాజు రామారావు, మహిళా ప్రెసిడెంట్ కందవ గాయత్రి, సౌత్ ఇంచార్జి కేవీ సూర్యనారాయణ,ఈస్ట్ ఇంచార్జి ప్రియాంక దండి, బీమిలి ఇంచార్జి సవరివిల్లి రామకృష్ణ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గౌతం,జిల్లా ప్రధాన కార్యదర్శి వంకర ఆనందకుమార్,ఎస్సీ సెల్ కస్తూరి వెంకట రావు,యూత్ కాంగ్రెస్ శివ, మణికంఠ, మోహన్, కే.జాహ్నవి, ఓబీసీ నాయకులు,మైనారిటీ నాయకులు, భాషా, అభిద, వార్డు ప్రెసిడెంట్లు కనకరావు, కాకర అప్పారావు,సేవాదళ్ అప్పారావు, విజయ్, సబ్బవరపు శ్రీధర్, సంతోష్, సౌత్, నార్త్, వెస్ట్,ఈస్ట్ నాయకులు ఇంకా ఉత్తరాంధ్ర అధ్యక్షులు,కాంగ్రెస్ నాయకులు, వార్డు ప్రెసిడెంట్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

## హెచ్పీవీ వ్యాక్సిన్‌తోనే సర్వైకల్ క్యాన్సర్ నియంత్రణ

### పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ



విశాఖపట్నం, జూలై 11, ప్రభాతవార్త

హ్యూమన్ పాపిలోమా వైరస్ వల్ల మహిళల్లో వచ్చే సర్వయికల్ క్యాన్సర్‌ను సెర్వావ్యాక్ వ్యాక్సిన్ వేయడం ద్వారానే నియంత్రించ గలమని పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చీ చెప్పారు. నాట్కో ట్రస్ట్, లయన్స్ క్లబ్ ఆఫ్ వైజాగ్ చారిటబుల్ ట్రస్ట్,చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా పోలీస్ బ్యారేక్స్ లోని టెంపుల్ ఆఫ్ లెర్నింగ్ హాల్లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 9నుండి 14ఏళ్ల లోపున్న ఆడపిల్లకు హెచ్పీవీ బూస్టర్ డోస్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్, చైతన్య స్రవంతి అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రహమాన్ ప్రారంభించారు. రెండు రోజులు పాటు ఈ శిబిరం జరుగుతుంది. మొత్తం 500 మంది పోలీసుల పిల్లలకు ఈ వ్యాక్సిన్ వేస్తారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీసులకు చెందిన ఆడపిల్లలకు క్యాన్సర్ వ్యాక్సిన్ వేసేందుకు ముందుకొచ్చిన సంస్థలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ బూస్టర్ డోసు ద్వారా జ్వరం వచ్చినట్లయితే డా.షిరీన్ రహమాన్‌ను సంప్రదించాలని మొదటి డోసు వేయడం ద్వారా ఎటువంటి ఇబ్బందులు రానందున ఈ విడత కూడా ఆడపిల్లకు ఏ సమస్య ఉండదని అన్నారు. ఈ డోస్ వేయడంతో ఆడపిల్లలు పెరిగి పెద్దయ్యాక కూడా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వచ్చే ప్రమాదం లేదని కమిషనర్ పేర్కొన్నారు. చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షిరీన్ రహమాన్ మాట్లాడుతూ 9 నుండి 14 ఏళ్ల లోపున్న ఆడపిల్లలకు రెండు డోసులు ఆ పై వయసుగల వారైతే మూడు డోసులు వేయాలన్నారు. పోలీసులకు చెందిన మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు అక్టోబర్లో ఒక శిబిరం ఏర్పాటు చేయమని పోలీస్ కమిషనర్ను ఆమె కోరారు సర్వయికల్ క్యాన్సర్ బ్రెస్ట్ క్యాన్సర్ రెండు ప్రమాదకరమైనవి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ పాపారావు ఏడీసీపీ అడ్మిన్ రామచంద్రరావు లయన్స్ క్లబ్ కార్యదర్శి బి.రవిచంద్ర డాక్టర్ సత్యవేణి, చైతన్య స్రవంతి ఉపాధ్యక్షులు విజయ్ శేఖర్ తనయుడు అవినీస్, సీరం ఇనిస్టిట్యూట్ ఏరియా మేనేజర్ రాం రతన్ తదితరులు పాల్గొన్నారు ముందుగా పోలీస్ కమిషనర్ను డాక్టర్ షిరీన్ రహమాన్ ఘనంగా సన్మానించారు.

## సత్తెమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్న సాయికృష్ణ

విశాఖపట్నం, జూలై 11, ప్రభాతవార్త



యలమంచిలి నియోజకవర్గం మునగ పాక మండలం మునగపాక గ్రామంలోని చెరువు కాలువ మూల సంఘంలో ఇటీవల శ్రీ సత్తెమ్మ తల్లి నూతన దేవా లయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఈరోజు టీడీపీ యువ నాయ కులు, శ్రీ ధర్మ ఫౌండేషన్ చైర్మన్ కర్రి సాయికృష్ణ అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని మనస్ఫూర్తిగా ప్రార్థించారు. అనంతరం దేవాలయ అభివృద్ధికి తనవంతు సహాయంగా ఆలయ నిర్మాణం కోసం రూ.50,000 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, జనసేన నాయకులు బొడ్డేటి అప్పలనాయుడు కర్రి సాయికృష్ణను ఘనంగా సన్మానించి, దేవాలయ నిర్మాణానికి అందించిన ఆర్థిక సహకారానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయం



(నక్కపల్లి / అడ్డు రోడ్డు, అనకాపల్లి, జూలై 11, ప్రభాతవార్త

జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో రహదారి భద్రతను మెరుగు పరచడానికి, రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి సీఐ జూ రెడ్డి మురళి సారథ్యంలో నక్కపల్లి పోలీస్ లు ప్రత్యేక ముందస్తు చర్యలు చేపట్టారు. సీఐ మురళి, ఎస్సై సన్నీబాబుల ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై భద్రతా పరికరాలను వ్యూహాత్మకంగా ఏర్పాటు చేశారు. ప్రమాదాల తీవ్రతను తగ్గించేందుకు 20 పెద్ద సైజు టైర్లు, 20 డ్రమ్ములను పోలీస్ సిబ్బంది సేకరించారు. వీటికి ఆకర్షణీయమైన రంగులు వేసి, రాత్రి వేళల్లో మెరిసేలా ప్రత్యేక రేడియం రిఫ్లెక్టర్లను అమర్చారు. వాహన చోదకులకు, ముఖ్యంగా రాత్రి సమయాల్లో రహదారి మలుపులు, జంక్షన్లు స్పష్టంగా కనిపించేలా డ్రమ్ములపై రిఫ్లెక్టివ్ రేడియం పెయింట్‌తో నెమ్మదిగా వెళ్ళుము అని స్పష్టంగా రాయించారు. నక్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి దాదాపు 16 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఈ 16 కి.మీ. పరిధిలోని అన్ని ప్రధాన జంక్షన్లు, మలుపులు తరచూ ప్రమాదాలు జరిగే ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, అక్కడ ఈ రక్షణ పరికరాలను అమర్చారు. ఈ సందర్భంగా నక్కపల్లి పోలీస్ అధికారులు మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు వేగ నియంత్రణ పాటించాలని, రాత్రి వేళల్లో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన రేడియం సూచికలను గమనిస్తూ, సురక్షిత ప్రయాణం చేయడం ద్వారా ప్రమాదాల నివారణకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఓటు కోల్పోకండి.. రెండు రోజులే సమయం ఉంది:" గొర్ల గోవిందు"

(నక్కపల్లి ,ప్రభాతవార్త)



కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మక నిర్వహిస్తున్న ఓటర్లు ఎన్యూమరేషన్ కార్యక్రమానికి రెండు రోజులు మాత్రమే సమయం ఉందని, ఆ రెండు రోజులు దాటితే ఓటు కోల్పోయే పరిస్థితి ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని ఓటు కోల్పోవద్దని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు గొర్ల గోవిందు ప్రజలకు పిలుపునిచ్చారు. ఓటు పరిశీలన పత్రాలను పూర్తిచేసే 14వ తేదీలోగా మీ మీ వార్డుల పరిధిలో ఉన్న బీఎల్ఓ లకు సమర్పించాలి కోరారు. గడువులోగా చేయకపోతే ఓటు కోల్పోయే ప్రమాదం ఉంటుందని,.కావున నక్కపల్లి మండలం లో ఉన్న ప్రతి ఒక్క పి ఎల్ ఎ లు కూడా మీ గ్రామాల్లో ఉన్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయవలసిందిగా సూచించారు.రాబోయే రెండు రోజుల నుండి సర్వర్ చాలా స్లోగా ఉంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు పూర్తి చేయాలని అన్నారు.ఎంత త్వరగా చేస్తే అంత మంచిదని పిలుపునిచ్చారు.

## గొలుగొండలో శ్రీ నూకాంబిక జాతర మహోత్సవం



గొలుగొండ జులై 11, ప్రభాతవార్త

మండల కేంద్రం గొలుగొండలో శ్రీ నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులు పాటు నిర్వహించే జాతర మహోత్సవం వైభవంగా నిర్వహిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు. జాతర మహోత్సవంకు భారీ విద్యుత్ అలంకరణ, డప్పుల మోత,పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. శనివారం ఆదివారం సోమవారం మూడు రోజులు జాతర మహోత్సవం కొనసాగుతుందని భక్తులంతా విచ్చేసి అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

## ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

### జేపీసీ ప్రతినిధులతో ప్రభుత్వ విప్ డాక్టర్ వేపాడ చిరంజీవిరావు



విశాఖపట్నం, జులై 12 ప్రభాతవార్త

శాసన మండలి ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు ని ఎపి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ఉ పెన్షనర్ల జేఏసీ విశాఖ జిల్లా కమిటీ ప్రతినిధులు శనివారం కలుసుకుని తమ సమస్యలను విన్నవించారు. పిఆర్సీ కమిటీ నియామకం, ఐఆర్ ప్రకటన, పెండింగ్ డిఏ ల మంజూరు, సీపీఎస్ రద్దు, ఉద్యోగుల హెల్త్ కార్డులను అన్ని కార్పోరేట్ ఆసుపత్రులలో అనుమతించాలని కోరారు. పెన్షనర్లకు గత ప్రభుత్వం తగ్గించిన అడిషనల్ క్వాంటం పెన్షన్ ను పెంపుదల చేయాలని, సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, ఆటోమేటిక్ అడ్వాన్స్ మెంట్ స్కీం అమలు చేయాలని విన్నవించారు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని విప్ డాక్టర్ . వేపాడ చిరంజీవిరావు తెలియజేసారు. ప్రభుత్వ విప్ డాక్టర్ వేపాడను కలిసిన వారిలో జేఏసీ చైర్మన్ కె. ఈశ్వరరావు, కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు, రొంగలి రవిశంకర్, ఉపాధ్యాయ సంఘ నేతలు బి.వెంకటపతిరాజు,టి. రామకృష్ణ, ఇ.పైడిరాజు ఉన్నారు.

## నాట్యం గొప్ప కళ

### సంప్రదాయానికి ప్రతీక -ఔన్నత్యాన్ని పెంచే సాధనం -ఫిల్మ్ డైరెక్టర్ సువశ్రీ బాగ్చీ




ప్రభాతవార్త- విశాఖపట్నం

నాట్య కళ గొప్పదనం మన సంస్కృతి అంత గొప్పదని ప్రముఖ ఫిలిం డైరెక్టర్ సువశ్రీ బాగ్చీ అన్నారు. అయిదు రోజుల 37వ అఖిల భారత నృత్యోత్సవం 2026 కళాభారతి ప్రాంగణంలో 4వ రోజు అఖిల భారత నృత్యపోటీలు నాట్య రవళి మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ ఉమ్మడి మహేష్ నేతృత్వంలో జరిగాయి. ఈ సందర్భంగా సువశ్రీ బాగ్చీ మాట్లాడుతూ చిన్నారులు చేసిన నృత్యాలు ఎంతో గొప్ప శోభను, వారిలోని ప్రతిభను చాటాయన్నారు. ఇలాంటి నృత్య పోటీలు చిన్నారుల్లో స్ఫూర్తిని, పోటీ తత్వాన్ని పెంచుతున్నారు. సాంస్కృతిక సంస్థల వారధి కొణతాల రాజు మాట్లాడుతూ నాట్య రవళి మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ 37 ఏళ్లుగా నిర్వహిస్తున్న పోటీలు మహేష్ కు మాత్రమే సాధ్యం అవుతుందని ఈ పోటీలు చాటాయన్నారు. ఫిల్మ్ మేకర్, లియో 9 విఎఫెక్స్ సినీ స్టూడియో అధినేత అడ్డూరి సునీల్ చరణ్ మాట్లాడుతూ వైజాగ్ లో గొప్ప టాలెంట్ ఉన్న వారికి కొదవ లేదన్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఎంవి రాజశేఖర్, నాట్యాచార్యులు బాబుల్ మాస్టర్ లు అతిథులుగా పాల్గొన్న కార్యక్రమంలో ప్రఖ్యాత వ్యాఖ్యాత భీశెట్టి వెంకటేశ్వరావు మాస్టర్ ఆఫ్ శర్మనీ గా వ్యవహరించిన కార్యక్రమంలో ఉమ్మడి మహేష్ బాబు మాట్లాడుతూ 4 రోజులు దిగ్విజయంగా అఖిలభారత స్థాయిలో నృత్య పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా నాట్యాచార్యులు విజయ వేణి, కూచిపూడి నాగ చందన, కొమ్మన బోయిన శ్రీవాణి వ్యవహరించారు. 138 పాల్గొన్న పోటీల విజేతలకు ముఖ్య అతిథి ఫిల్మ్ మేకర్ సువశ్రీ బాగ్చీ తదితరులు బహుమతులు ప్రదానం చేసారు.

## జాతీయ లోక్ అదాలత్‌తో 47 కేసులు పరిష్కారం

### ప్రజలు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి: ఆనందపురం సీఐ ఎర్రం నాయుడు

ఆనందపురం, జూలై 11, ప్రభాతవార్త

జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా ఆనందపురం లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న 47 కేసులను పరస్పర రాజీ ద్వారా విజయవంతంగా పరిష్కరించినట్లు ఆనందపురం సీఐ వి.వి.సి.ఎం. ఎర్రం నాయుడు తెలిపారు. భీమిలి 15 వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ శ్రీమతి స్వాతి భవాని పొట్ల సమక్షంలో కేసులకు రాజీ ద్వారా పరిష్కారం లభించిందన్నారు. జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి పోలీసు సిబ్బంది, న్యాయ విభాగం అధికారులు సమన్వయంతో పనిచేశారని సీఐ తెలిపారు. తన ఆధ్వర్యంలో ఏఎస్ఐ ఎం.వి. రమణ, కోర్టు పీసీ రమణ, కోర్టు పీసీ పైడిరాజు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) ఎం. అవతారం కలిసి ఇరు పక్షాలతో చర్చలు జరిపి రాజీ కుదిరేలా కృషి చేయడంతో 47 కేసులు పరిష్కారమయ్యాయని వివరించారు. పరస్పర అవగాహన, సామరస్యం, రాజీ ద్వారా వివాదాలను పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనం ఆదా కావడంతో పాటు న్యాయస్థానాలపై భారం కూడా తగ్గుతుందని సీఐ ఎర్రం నాయుడు పేర్కొన్నారు. ప్రజలు జాతీయ లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకొని తమ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


కెనరా బ్యాంక్ Canara Bank
భారత ప్రభుత్వ రంగ సంస్థ
A Government of India Undertaking

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్ (13591), విశాఖపట్నం
మెలోడీ సినిమా థియేటర్ ఎదురుగా, సూర్యాభాగ్, విశాఖపట్నం-530020.
ఫోన్: 8332956773, 7095199455, ఇ-మెయిల్: cb13591@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) & 9(1) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన.

కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విశాఖపట్నం వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే లాంఛనంగా/భౌతికంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 29.07.2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు తెలియజేయడమైనది. బ్యాంకు వారి పరిజ్ఞానం మేరకు తాకట్టు రుణభారాలు లేని స్థిరాస్తుల వివరములు.

ఇ-వేలం తేది & సమయం: 29.07.2026, మ॥ 01.00 గం.ల నుండి మ॥ 02.00 గం.ల వరకు (అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది: 28.07.2026, సాయంత్రం 6.00 గం॥ల లోపు

| వ. నెం. | ఋణగ్రహీత / హామీదారులు (అన్ని ఖాతాలు ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విశాఖపట్నంకు బదిలీ చేయడమైనవి) | తనఖాలో ఉన్న ఆస్తి వివరములు | రిజర్వు ధర (రూ.) | ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%) |
|---|---|---|---|---|
| 1 | M/s. జైన్ ఆగ్రో ఫుడ్స్, అధీకృత సంతకందారు/పార్ట్నర్లు: 1. శ్రీ నితేష్ కుమార్ బొహ్రా మరియు 2. శ్రీ ఆషిక్ జైన్, హామీదారు: శ్రీ ప్రకాష్ ఎమ్ జైన్ తేది 30.06.2026 నాటికి బకాయి మొత్తం: రూ. 738.45 లక్షలు + తదుపరి వడ్డీ + ఇతర ఛార్జీలు (ఏవైనా ఉంటే). | ఆంధ్రప్రదేశ్-531031, విశాఖపట్నం జిల్లా, అనకాపల్లి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, అనకాపల్లి రెవిన్యూ డివిజన్, అనకాపల్లి రిజిస్ట్రేషన్ జిల్లా, కశింకోట మండలం, జమ్మాదులపాలెం పంచాయితీ, బయ్యవరం గ్రామం, ఎస్.నెం. 663/18 లో శ్రీ ఆషిక్ జైన్ పేరున గల ఎ. 3.02 సెంట్లు లేదా 1.200 హెక్టార్లు భూమి. హద్దులు డీడ్ ప్రకారం. | రూ. 605.65 లక్షలు | రూ. 60.57 లక్షలు |
| 2 | M/s జైన్ ఆగ్రో ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్ పోర్ట్స్, అధీకృత సంతకందారు/పార్ట్నర్లు: (1) శ్రీ ఆషిక్ జైన్ మరియు (2) శ్రీ ప్రకాష్ ఎమ్ జైన్, హామీదారు: శ్రీ నితేష్ కుమార్ బొహ్రా. తేది 30.06.2026 నాటికి బకాయి మొత్తం: రూ. 405.34 లక్షలు + తదుపరి వడ్డీ + ఇతర ఛార్జీలు (ఏవైనా ఉంటే). | ఆంధ్రప్రదేశ్ - 531031, విశాఖపట్నం జిల్లా, అనకాపల్లి, అనకాపల్లి రెవిన్యూ డివిజన్ మరియు ఎస్ఆర్ఒ, కశింకోట మండలం, బయ్యవరం పంచాయితీ, బయ్యవరం గ్రామం, పట్టా నెం 1717 మరియు 1718, ఎస్.నెం. 663/17 లో ఆషిక్ జైన్ పేరునగల ఎ. 2.50 సెంట్లు లేదా 1.00 హెక్టార్లు (రెండు ఐటమ్‌లుగా ఉన్నది) మెట్ట భూమిగా మార్చబడినది. హద్దులు డీడ్ ప్రకారం. | రూ. 451.44 లక్షలు | రూ. 45.15 లక్షలు |
| 3 | M/s. మార్వెల్ ఎంటర్‌ప్రైజెస్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్: శ్రీ నిఖిల్ జైన్ (ఋణగ్రహీత) మరియు (1) శ్రీ ప్రకాష్ మూల్‌చంద్ జైన్, (2) శ్రీ ఆషిక్ జైన్ (హామీదారులు). తేది 30.06.2026 నాటికి బకాయి మొత్తం: రూ. 206.54 లక్షలు + తదుపరి వడ్డీ + ఇతర ఛార్జీలు (ఏవైనా ఉంటే). | సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 812/2017 తేది. 25.02.2017 ద్వారా కొనుగోలు చేసిన ఈ ఆస్తి శ్రీ నిఖిల్ జైన్ పేరున గలదు: ఆంధ్రప్రదేశ్-531031, అనకాపల్లి రెవిన్యూ డివిజన్ మరియు ఎస్ఆర్ఒ, విశాఖపట్నం జిల్లా, అనకాపల్లి సబ్-రిజిస్ట్రీ జిల్లా, కశింకోట మండలం, జమ్మాదులపాలెం పంచాయితీ, బయ్యవరం గ్రామం, ఎస్. నెం. 663/17 (సబ్ డివిజన్ తరువాత ఎస్.నెం.663/17A1), 1బి పట్టా నెం. 1718, మెట్ట భూమిగా మార్చబడిన ఎ. 0.85 సెంట్లు లేదా 0.340 హెక్టార్లు లేదా 4114 చ॥గ॥ భూమి. హద్దులు డీడ్ ప్రకారం. | రూ. 148.10 లక్షలు | రూ. 14.81 లక్షలు |
| 4 | M/s. శ్రీ జైన్ డ్రై ఫ్రూట్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్: శ్రీ ఆషిక్ జైన్ (ఋణగ్రహీత) మరియు (1) శ్రీ నిఖిల్ జైన్ (2) శ్రీ ప్రకాష్ మూల్‌చంద్ జైన్ (హామీదారులు). తేది 30.06.2026 నాటికి బకాయి మొత్తం: రూ. 196.07 లక్షలు + తదుపరి వడ్డీ + ఇతర ఛార్జీలు (ఏవైనా ఉంటే). | సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.813/2017 తేది. 25.02.2017 ద్వారా కొనుగోలు చేసిన ఈ ఆస్తి శ్రీ ఆషిక్ జైన్ పేరున గలదు: ఆంధ్రప్రదేశ్-531031, విశాఖపట్నం జిల్లా, అనకాపల్లి సబ్-రిజిస్ట్రీ జిల్లా, అనకాపల్లి రెవిన్యూ డివిజన్ మరియు ఎస్ఆర్ఒ, అనకాపల్లి, కశింకోట మండలం, బయ్యవరం గ్రామ పంచాయితీ, బయ్యవరం గ్రామం, ఎస్. నెం. 663/17 (సబ్ డివిజన్ తరువాత ఎస్.నెం.663/17A2), 1బి పట్టా నెం. 1718, మెట్ట భూమిగా మార్చబడిన ఎ. 0.90 సెంట్లు లేదా 0.360 హెక్టార్లు భూమి. హద్దులు డీడ్ ప్రకారం. | రూ. 156.82 లక్షలు | రూ. 15.69 లక్షలు |

ఆస్తి తనిఖీ తేది & సమయం : 22.07.2026, ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనలకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విశాఖపట్నం అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్ : 83329 56773, 70951 99455

రిజర్వు ధరలో 10% సొమ్మును ధరావత్తుగా ఆర్.టి.జి.ఎస్/నెఫ్ట్/ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా https://baanknet.com లోని E-వాలెట్‌కు బిడ్డర్ లాగిన్ అయి తేది.28.07.2026, సా॥ 6:00 గం.ల లోపుగా చెల్లించవలెను.
* బ్యాంకుకు తెలిసిన/తెలియని బకాయిలు/టాక్స్‌లు ఏవైనా ఉన్నచో అవి వేలం కొనుగోలుదారే భరించాలి మరియు తుది బిడ్ మొత్తంతోపాటు అవి కూడా చెల్లించవలసి ఉంటుంది. బిడ్డర్లు తమ ఆఫర్‌లను, ఆస్తి రిజర్వు ధర 25 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 10,000/- గుణింపులో హెచ్చించవలెను. రిజర్వు ధర 25 లక్షల నుండి 50 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 25,000/- గుణింపులో హెచ్చించవలెను. రిజర్వు ధర 50 లక్షల నుండి 100 లక్షల వరకు ఉన్నట్లయితే రూ. 50,000/- గుణింపులో హెచ్చించవలెను. రిజర్వు ధర 100 లక్షల నుండి 500 లక్షల వరకు ఉన్నట్లయితే రూ. 1,00,000/- గుణింపులో హెచ్చించవలెను మరియు రిజర్వు ధర 500 లక్షల ఎక్కువ ఉన్నట్లయితే రూ. 5,00,000/- గుణింపులో హెచ్చించవలెను.. 'ఆన్‌లైన్' వేలం ముగిసేలోపు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కన్నా ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడతారు.
ఇ-వేలం విధానం, నియమ నిబంధనల కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్(baanknet). వెబ్‌పోర్టల్ https://baanknet.com.
హెల్ప్‌డెస్క్: 7046612345/6354910172/8291220220/9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది: 06.07.2026, ప్రదేశం : విశాఖపట్నం — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్



## కొత్త వారి పెరట్లో వికసించిన బ్రహ్మ కమలం

నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త

నక్కపల్లి పట్టణంలోని కారం మిల్లు వీధిలో నివాసం ఉంటున్న కొత్త తాతాజీ పెరట్లో బ్రహ్మ కమలం వికసించింది. కొత్త తాతాజీ రాత్రి సమయంలో పెరట్లో పరిశీలించేసరికి ఒక్కసారిగా సువాసనతో వికసించిన బ్రహ్మ కమలం కనిపించడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న వీధిలో వారు ఆ వికసించిన ఆ బ్రహ్మ కమలన్నీ చూసేందుకు తరలివచ్చారు.

## గంజాయి విక్రయాలపై ఆరిలోవ పోలీసులు ఉక్కుపాదం

### ఐదుగురు నిందితులకు రిమాండ్ -5 కేజీల గంజాయి, మూడు మొబైల్ ఫోన్లో స్వాధీనం

ఆరిలోవ, జూలై 11, ప్రభాతవార్త



గుట్టుచప్పుడు కాకుండా గంజాయి రవాణా చేసి విక్రయిస్తున్న వారిపై ఆరిలోవ పోలీసులు ఉక్కు పాదం మోపారు. ఆరిలోవ ఆఖరి బస్టాండ్ వద్ద ఐదుగురును పోలీసులు అదుపులో తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఆరిలోవ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్ద నిర్మానుష్య ప్రాంతంలో నలుగురు వ్యక్తులు గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులకు అందిన సమాచారం మేరకు అక్కడికి చేరుకొని ఆ నలుగురిని అదుపులో తీసుకున్నారు. వీరు నలుగురు అరకు వెళ్లి అక్కడ ఒడిశాకు చెందిన ఉగ్రసేన్ జెమెల్ నుండి 5 కేజీలు గంజాయి కొనుగోలు చేసి సదరు గంజాయి విశాఖకు రవాణా చేసి శుక్రవారం గంజాయిని విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా ఆరిలోవ పోలీసులకు పట్టుబడ్డారు. కోరాపుట్ ఒడిస్సా కు చెందిన ఉగ్రసేన్ జిమెయిల్, ఆరిలోవ శ్రీకాంత్ నగర్ కి చెందిన కొవ్వాడ పవన్ కుమార్, పెందుర్తికి చెందిన బత్తిన రోహిత్, పెందుర్తికి చెందిన బడితమాని వెంకట సాయి సంతోష్, విజయనగరం జిల్లా కొత్తవలస మండలం కి చెందిన కింతాడ హేమంత్ కుమార్ ను పోలీసులు అదుపులో తీసుకొని వారి వద్ద నుండి మూడు సెల్ ఫోన్లు, ఐదు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని శనివారం రిమాండ్కు తరలించారు. ఎంతో చాకచక్యంతో గంజాయి రవాణా చేస్తున్న నిందితులను పట్టుకున్న ఆరిలోవ సీఐ ఎస్ శ్రీనివాస్‌తో పాటు సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అభినందనలు తెలియజేశారు.

## చినలబుడులో బిఎల్ఓల సమావేశం



అరకు రూరల్, జూలై 11, ప్రభాతవార్త

అరకులోయ మండలంలోని చినలబుడు పంచాయితీ కేంద్రంలో శనివారం బిఎల్ఓల సమావేశం జరిగింది. చినలబుడు పంచాయితీ సచివాలయంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా పంచాయతీ కార్యదర్శి మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన బిఎల్ఓల సమావేశంలో చినలబుడు పీసా కమిటీ కార్యదర్శి, వైసీపీ నాయకుడు మొశ్య రంజిత్ కుమార్, తెలుగుదేశం పార్టీ చినలబుడు గ్రామ కమిటీ అధ్యక్షులు భగత్ రామ్, కమిటీ సభ్యులు డొంబు నాయుడు, అర్జున్, భీస్నాధ్, బి ఎల్ ఓ లు రుక్మిణి, చిట్టి బాబు, రాధా, ప్రకాష్ తదితరులు ప్రత్యేకంగా పాల్గొని సర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహిస్తూ అర్హులైన ప్రతి ఓటరిని ఓటరు జాబితాలో నమోదు చేయడం, ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చర్చించారు.

## పెద్దజడుమూరులో గ్రామసభ

### ఎస్ఐఆర్ సర్వే ఫారాలు అందజేయకుంటే ఓటు హక్కు గల్లంతు

గూడెం కొత్తవీధి జూలై 11 ప్రభాతవార్త



జీకే వీధి మండలం సంకాడ పంచాయతీ పెద్దజడుమూరు గ్రామంలో ఎస్ఐఆర్ సర్వే నిమిత్తం శనివారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, గ్రామ కమిటీ ప్రతినిధులు హాజరై గ్రామస్తులకు ఎస్ఐఆర్ సర్వే యొక్క ప్రాముఖ్యతను సుదీర్ఘంగా వివరించారు.సభలో మాట్లాడిన అధికారులు, ప్రతి ఒక్కరూ తమ ఇమ్యూరేషన్ ఫారాలను తప్పనిసరిగా సమర్పించాలని స్పష్టం చేశారు. ఫారాలు అందించని పక్షంలో ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఒకవేళ ఓటు హక్కు రద్దయితే, దానిని మరల పొందడానికి చాలా సుదీర్ఘమైన ప్రభుత్వ ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు అందివచ్చిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సర్వేకు సంబంధించిన సైట్ ఈ నెల 13వ తేదీన క్లోజ్ అవుతుందని, గడువు ముగుస్తున్నందున ఇంకా ఎవరైనా ఫారాలు ఇవ్వని వారు ఉంటే వెంటనే స్పందించి, త్వరగా తమ వివరాలను అందజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు దేశగిరి గోవింద రావు, పంచాయతీ కార్యదర్శి రాజుబాబు, బీఎల్ఓలు కైలాష్ పతి, వరప్రసాద్, యూనిట్ ఇంచార్జి మామిడి చంటిబాబు, బీఎల్ఏ సద్దా బొజ్జిపడాల్, పేసా కార్యదర్శి ఊలం బాబురావు, ఉపాధి హామీ పథకం సిబ్బంది మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వీరవరం గ్రామంలో ఎస్ఐఆర్ ఓటరు ధృవీకరణ కార్యక్రమం



గూడెం కొత్తవీధి,జూలై 11 ప్రభాతవార్త

గూడెం కొత్తవీధి మండలం వంచుల పంచాయతీ పరిధిలోని వీరవరం గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా శనివారం ఓటరు ధృవీకరణ (వెరిఫికేషన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్, వీఆర్వో అచ్చిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామసభ ఏర్పాటు చేసి ఓటరు జాబితాలో నమోదైన వివరాలను పరిశీలించారు. మరణించిన వ్యక్తుల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడం, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలను నమోదు చేయడం, ఓటరు జాబితాలో ఉన్న ఇతర అభ్యంతరాలపై గ్రామస్థుల అభిప్రాయాలను స్వీకరించారు. అధికారులు అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేర్లు సరిగా నమోదయ్యాయో లేదో తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని సూచించారు. ఓటరు జాబితా పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు వనపల రాజేష్‌తో పాటు గ్రామస్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## ఇద్దరు బాధితులకు సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

విశాఖపట్నం, జూలై 11, ప్రభాతవార్త



విశాఖ దక్షిణ నియోజకవర్గం 39వ వార్డు చెందిన ఇద్దరు బాధితులకు వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులును రాష్ట్ర ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ శనివారం తన కార్యాలయంలో అందజేసారు. ఈ కార్యక్రమంలో 39వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మైలపిల్లి శ్రీను, క్లస్టర్ ఇంచార్జ్ వాసుపల్లి దానేష్, పార్లమెంటు ఉపాధ్యక్షులు అబ్దుల్ అనీఫ్, బూత్ కన్వీనర్ తిత్తి సాయి బలరాం తదితరులు పాల్గొన్నారు.

## వైద్య విద్యార్థులకు సువర్ణావకాశం

### రాష్ట్రంలో 100 ఎంబీబీఎస్ సీట్ల పెంపు -మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు బీజేపీ నేత కె.ఎన్.ఆర్ ధన్యవాదాలు



గాజువాక,జూలై 11,ప్రభాతవార్త :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2026-27 విద్యా సంవత్సరానికి గానూ అదనంగా 100 ఎంబీబీఎస్ సీట్ల పెంపునకు జాతీయ వైద్య కమిషన్ అనుమతి ఇవ్వడం పట్ల బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్, గాజువాక బీజేపీ కన్వీనర్ డాక్టర్ కరణంరెడ్డి నరసింగరావు హర్షం వ్యక్తం చేశారు. సీట్ల పెంపునకు విశేషంగా కృషి చేసిన రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కేఎన్ఆర్ మాట్లాడుతూ.. కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో 75, నెల్లూరు ఏసీఎస్ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో 25 ఎంబీబీఎస్ సీట్లు పెరిగాయని, ఇది రాష్ట్రంలోని వైద్య విద్యార్థులకు సువర్ణావకాశమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి అన్ని విధాలుగా సహకారం అందిస్తోందని కొనియాడారు. రూ.1,620 కోట్లతో మంగళగిరి ఎయిమ్స్‌ను పూర్తిగా కేంద్ర నిధులతోనే నిర్మించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న 12 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి నిధుల కొరత ఏర్పడటంతో.. కేంద్ర ప్రభుత్వం 'వైబిలిటీ గ్యాప్ ఫండింగ్' పథకం ద్వారా దాదాపు 80 శాతం వరకు నిధులు అందిస్తూ భారీ సహాయాన్ని ప్రకటించిందని వివరించారు. ఈ మేరకు విద్యార్థుల పక్షాన ప్రధాని నరేంద్ర మోదీకి, మంత్రి సత్యకుమార్‌కు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

## సాగర్ నగర్ బీచ్‌లో వ్యక్తి మృతదేహం లభ్యం



ఆరిలోవ, జూలై 11, ప్రభాతవార్త

సాగర్ నగర్ బీచ్ తీరంలో శనివారం ఉదయం ఓ వ్యక్తి మృతదేహం లభ్యం అయింది. ఆరిలోవ సిఐ ఎస్. శ్రీనివాస్ తెలిపిన వివరాలు ప్రకారం.. ఎంవిపి పోలీస్ స్టేషన్ పరిధి వెంకోజీ పాలెంలో నివాసముంటున్న తెడ్లపు అప్పారావు (59) అనే వ్యక్తి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో గొడవ పడి శుక్రవారం రాత్రి ఇంటి నుండి బయటకి వెళ్లి తిరిగి రాలేదు. శనివారం ఉదయం సాగర్ నగర్ బీచ్‌లో శవమై తేలడంతో స్థానికులు సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యం బాగా పోవడం కారణంగా మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారని సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ కేసు సిఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి ఎస్సై వై కృష్ణ దర్యాప్తు చేస్తున్నారు.

## టూ టౌన్ సిఐగా బిఏ నాయుడు



విశాఖపట్నం, జూలై 11 ప్రభాతవార్త

టూటౌన్ సీఐగా బి.అప్పలనాయుడు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎర్రం నాయుడు ఆనందపురం బదిలి అవ్వడంతో వీఆర్‌లో ఉన్న అప్పలనాయుడును టూటౌన్ సీఐగా నియమిస్తూ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఉత్తర్వులు జారీ చేశారు.

## ప్రపంచ జనాబా దినోత్సవం సందర్భంగా ర్యాలీ

పీఎం పాలెం, జూలై 11 ప్రభాతవార్త



జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.పి. జగదీశ్వర రావు వారు ప్రపంచ జనాబా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారి కార్యాలయం వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంబించారు. ఈ ర్యాలీ సత్యం జంక్షన్ మీదుగా మరలా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారి కార్యాలయం వరకు జరిగింది. డా.పి.జగదీశ్వర రావు వారు మాట్లాడతూ ఈ సంవత్సరం నినాదం "పిల్లల మధ్య ఎడం పాటిద్దాం-ఆరోగ్యకరమైన సంతోషకరమైన కుటుంబాన్ని నిర్మిద్దాం", అని నినాదం చేస్తూ ర్యాలీ కొనసాగింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.పి.జగదీశ్వర రావు మాట్లాడుతూ పట్టణ మరియు ప్రాధమిక ఆరోగ్య కేంద్రము లలో ఉన్న ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగానే కాకుండా మిగతా రోజులలో కూడా కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతులైనటు వంటి పి.పి.ఐ.యు.సి.డి., నోటిమాత్రలు, అంతర ఇంజక్షన్లు, నిరోద్‌లు, గురించి ప్రజలకు చైతన్య పరచాలని తెలియచేసారు. తదుపరి జిల్లా విస్తరణ మరియు ప్రచారణ అధికారి బి.నాగేశ్వర వారు వారు మాట్లాడుతూ టీనేజ్‌లో గర్భం దాల్చకుండా చూసుకోవాలని, వివాహ వయస్సు 20 సం"లు దాటిన తర్వాత పెళ్ళైన వారు కుటుంబ నియంత్రణ, తాత్కాలిక పద్ధతులు పాటించాలని తెలియచేసారు. తదుపరి ఇన్చార్జ్ జిల్లా గణాంక అధికారి పి.రమేష్ వారు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు పోషకాహారం, ప్రణాళిక ప్రకారం వాక్సినేషన్ చేసుకోవాలని, మరియు తాత్కాలిక పద్ధతులైన గర్భ నిరోధక మాత్రలు, పి.పి.ఐ.యు. సి.డి. పద్ధతులు వాడాలని తెలియచేసారు. తదుపరి జిల్లా ప్రోగ్రాం అధికారులు మరియు పారామెడికల్ సిబ్బంది సమక్షంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారందరూ లక్కీ డిప్ నిర్వహించారు. ఈ లక్కీ డిప్‌లో ఉత్తమ గైనకాలజిస్ట్‌గా డా.కె.హారిక, కింగ్ జార్జ్ హాస్పిటల్, రూ.8,000 ఉత్తమ వేసక్టమి సర్జన్‌గా డా.శ్రీధర్, కింగ్ జార్జ్ హాస్పిటల్, రూ.7,000లు ఎంపిక కాగా, ముగ్గురు కంటే ఎక్కువ పిల్లలున్న తల్లితండ్రులు ఉప్పాడ ఉమాదేవి, కె.ములగపాడు, మామిడి మంగ, గంభీరం, వరపుల పైడిరాజు దేవి, కుసులవాడ వారు రూ.5,000లు, తాత్కాలిక పద్ధతులైనటువంటి పి.పి.ఐ.యు.సి.డి.కి ఇద్దరు, అంతర కు ఇద్దరు, ఎన్.ఎస్.వి. కి ఇద్దరు, రూ.5,000లు, ఆనందపురం ప్రాధమిక ఆరోగ్య కేంద్రంనకు చెందిన ఉత్తమ ఏ.ఎన్.ఎం. శ్రీమతి భాగ్యలక్ష్మి, రూ.2,500లు, ఉత్తమ ఎం.ఎల్.హెచ్.పి. సౌందర్య, ఆర్.ఎం.ఎన్.సి. కౌన్సిలర్ పి.వనిత, కింగ్ జార్జ్ హాస్పిటల్, పి.వరలక్ష్మి, ఆశా కార్యకర్త రూ.2,500లు నగదు బహుమతి పొందారు. ఈ కార్యక్రమంలో డా.లూసీ, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి, డా.బి.ఉమావతి, బి.నాగేశ్వరరావు, డెమో వారు, డా.హారిక, ఆర్.బి.ఎస్.కె. జిల్లా సమన్వయకర్త, డా.ఎన్.వి.సమత, విమెన్ హెల్త్ అధికారి, జిల్లా ప్రోగ్రాం అధికారులు, ఎం.సత్యవతి, వర్ధన్, శశి భూషణ్, ఎపిడిమాలజిస్ట్, వైద్య ఆరోగ్య కార్యాలయ సిబ్బంది, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, నాగభూషణం, పాల్గొన్నారు.

## శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు

పీఎం పాలెం, జూలై 11 ప్రభాతవార్త



శిల్పరామంలో నిర్వహించు వారంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శనివారం 11న సాయంత్రం 6 గం.కు జాతర వాకర్స్ అసోసియేషన్ వారిచేసంగీత విభవారి నిర్వహించడం జరిగిందని రమణ ఇంచార్జి పరిపాలన అధికారి శిల్పరామం విశాఖపట్నం తెలిపారు.



## ప్రతి ఒక్కరు మొక్కలు నాటుదాం

నక్కపల్లి, ప్రభాతవార్త

మండలంలోని రాజయ్యపేట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇంచార్జ్ వాసుపల్లి శివ పెద్ద కుమారుడు వాసుపల్లి బాలు మహేంద్ర 13వ పుట్టినరోజు సందర్భంగా ప్రతి ఒక్కరం మొక్కలు నాటుదాం పర్యావరణ పరిరక్షణకు కష్టపడి పని చేద్దాం అనే నినాదంతో శనివారం గ్రామంలో పలుచోట్ల కొబ్బరి మొక్కను నాటారు. ఈ సందర్భంగా ప్రతి మనిషి పుట్టినరోజున ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని ప్రకృతిని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐటిడిపి అనకాపల్లి జిల్లా కమిటీ సభ్యులు మదద రాంబాబు ఉన్నారు.

## చిన్నారులకు ప్రపంచ స్థాయి గుండె వైద్య సేవలు అందించడమే మా లక్ష్యం



### మణిపాల్ ఆసుపత్రి వైద్యులు

ఆరిలోవ, జూలై 11, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి చిన్నారులకు అత్యాధునిక హార్ట్ కేర్ ని మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో మణిపాల్ హాస్పిటల్స్ విజయవాడ వారు విశాఖపట్నంలో ప్రత్యేక పీడియాట్రిక్ కార్డియాలజీ కార్డియో థొరాసిక్ అండ్ వాస్కులర్ సర్జరీ క్లినిక్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మణిపాల్ హాస్పిటల్స్ వైద్యులు మాట్లాడుతూ... పుట్టుకతోనే వచ్చే గుండె సమస్యలను ముందుగానే గుర్తిస్తే సరైన చికిత్స అందించవచ్చునని, మణిపాల్ హాస్పిటల్స్ విజయవాడలోని పీడియాట్రిక్ కార్డియాలజీ సిటీవిఎస్ విభాగం పుట్టుకతో వచ్చే గుండె సమస్యలు పెరుగుతున్న దశలో, గుండె జబ్బులతో బాధపడు చిన్నారులకు సమగ్ర వైద్య సేవలు అందిస్తుందన్నారు. గుండె పరీక్షలు, నవజాత శిశువుల గుండె సమస్యల నిర్ధారణ, అత్యాధునిక క్యాథేటర్ ఆధారిత చికిత్సలు, పీడియాట్రిక్ గుండె శస్త్ర చికిత్సలు నవజాత శిశువులు చిన్నారుల కోసం ప్రత్యేక కార్డియాక్ ఐసియు సేవలు ఒకే చోట అందుబాటులో ఉన్నాయన్నారు. మా బృందం ఇప్పుడు వరకు సుమారు 3వేల చిన్నారులకు గుండె శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో మణిపాల్ హాస్పిటల్స్ విజయవాడలో విజయవంతంగా గుండె చికిత్స పొందిన ఇద్దరు చిన్నారులు వారి కుటుంబ సభ్యులు కూడా పాల్గొని తన అనుభవాలను పంచుకున్నారు. క్లస్టర్ డైరెక్టర్ డాక్టర్ శక్తిమయ మోహపాత్ర, డాక్టర్ కే విక్రమ్, డా.దిలీప్ రట్టి పాల్గొన్నారు.

## రూ. 35 లక్షలతో శేషుకొండ లేఅవుట్‌లో ప్రారంభమైన సీసీ రోడ్ల నిర్మాణం

ఎలమంచిలి, జూలై 11, ప్రభాతవార్త:



మున్సిపాలిటీ పరిధి లోని శేషు కొండ లేఅవుట్‌లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. వీఎంఆర్‌డీఏ నిధుల నుండి మంజూరైన మొత్తం రూ. 35 లక్షల వ్యయంతో పురపాలక సంఘం ఈ పనులను చేపడుతోంది. ఇందులో భాగంగా రూ. 35 లక్షలతో లేఅవుట్‌లో సీసీ రోడ్లను నిర్మిస్తున్నారు. అనేక నెలలుగా పెండింగులో ఉన్న రోడ్డు ను మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ కు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పనుల ప్రారంభ కార్యక్రమంలో ఏఈ నానాజీ, అధికారులు, కూటమి నాయకులు, కాలనీ వాసులు లోవ తాతారావు, నాని, గాంధీ, శ్రీను, లోవరాజు, వెంకట్ పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాలను సేవాభావంతో నిర్వహించాలి

### బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు -హాజరైన బీజేపీ కన్వీనర్ కె.ఎన్.ఆర్, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు

గాజువాక,జూలై 11,ప్రభాతవార్త :



హైందవ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించాలని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నిర్వాహ కులకు సూచించారు. ఎస్వీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో శ్రీనగర్ డీ-మార్ట్ సమీపంలోని బహిరంగ మైదానంలో నిర్వహించనున్న గణేశ్ ఉత్సవాల బ్రోచర్‌ను ఆయన ప్రముఖ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉత్సవాలను పూర్తిగా ఆధ్యాత్మిక వాతావరణంలో, సేవాభావంతో నిర్వహించాలే తప్ప వ్యాపార ధోరణికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉచిత దర్శన సౌకర్యం కల్పించాలని, ఈ వేడుకల ద్వారా గాజువాక ప్రాంత ప్రతిష్ట మరింత పెరిగేలా చూడాలని కోరారు. మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు (కె.ఎన్.ఆర్), డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, ఉత్సవ నిర్వాహకుడు కొశిరెడ్డి పృథ్వి, జనసేన నాయకులు తిప్పల రమణారెడ్డి, మురళి, రౌతు గోవింద్, మాజీ కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, నల్లూరు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు ఆధునిక యంత్రాల పంపిణీ

### స్వచ్ఛాంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వ లక్ష్యం : మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక,జూలై 11,ప్రభాతవార్త



స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌ను సాకారం చేయడమే రాష్ట్ర కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ స్పష్టం చేశారు. గాజువాక మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) జోనల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు 'జాతీయ సఫాయి కర్మచారీస్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్' ద్వారా సబ్సిడీ రుణాలతో మంజూరైన పారిశుధ్య యంత్రాలను శనివారం ఆయన పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ డాక్టర్ కరణంరెడ్డి నరసింగరావు (కె.ఎన్.ఆర్), జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా మంత్రి, ఎమ్మెల్యేలు ఆధునిక వాహనాలకు కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లబ్ధిదారులైన పారిశుధ్య కార్మికులకు యంత్రాల తాళాలను అందజేశారు. పారిశుధ్య కార్మికుల శ్రమను తగ్గించడంతో పాటు నగరాలను మరింత పరిశుభ్రంగా తీర్చి దిద్దేందుకు ఈ యంత్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, కూటమి నాయకులు, పురపాలక అధికారులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## హోంమంత్రి దృష్టికి రాజయ్యపేట గ్రామ సమస్యలు



(నక్కపల్లి, ప్రభాతవార్త)

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత దృష్టికి పాయకరావుపేట నియోజకవర్గం రాజయ్యపేట గ్రామంలో వందలాది కుటుంబాలు ఎదుర్కొంటున్న అనేకమైన సమస్యలను ఆ గ్రామ జనసేన నాయకులు పిక్కీస్వామి తీసుకువెళ్లారు. ప్రజలకు నడవడానికి సరైన రహదారులు త్రాగునీటి సమస్య డ్రైనేజీ విద్యుత్ స్తంభాలు ఈ విధంగా అనేకమైన సమస్యలతో సతమతమవుతున్నారని తక్షణమే పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. స్థానిక కూటమి నాయకుడు పీక్కి స్వామి వారికి ఉన్న సమస్యలను పరిష్కారం దిశగా తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని గ్రామస్తులు పిలుపునిచ్చారు. స్వామితో పాటు బొంది విశ్వనాధ్, కుందేటి శ్రీను, పీక్కి తాతాజీ, అర్జలి మసేను ఉన్నారు.

## ప్రత్యేక ఓటర్ల జాబితా పరిశీలనలో తహశీల్దార్ చిన్ని కృష్ణ

(నక్కపల్లి,ప్రభాతవార్త)



మండలంలోని నక్కపల్లి, నక్కపల్లిలో ఉన్న వివిధ గ్రామాలతో పాటు ఉపమాక గ్రామ సచివాలయం పరిధిలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమాన్ని శనివారం తాసిల్దార్ చిన్ని కృష్ణ క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతిష్టాత్మంగా ఎన్నికల కమిషన్ నిర్వహి స్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్క బిఎల్ఓ బాధ్యతగా తీసుకొని ఉన్న సమయం మేరకు ఉపయోగించుకోవాలని సూచించారు.నక్కపల్లి గ్రామ పంచాయితీ లలో బిఎల్ఓ తో పాటు



బిజెపి మండల శాఖ అధ్యక్షులు పోలినాటి నానాజీ, మెగా ఫ్యాన్స్ ఉత్తరాంధ్ర నాయకులు మీగడ సత్యనారాయణమూర్తి తోపాటు పలువురు కూటమి నాయకులు పరిశీలన చేస్తున్నారు. అందు బాటులో లేని వారికి ఫోన్ ద్వారా సమాచారం వివరాలు సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా నూటికి నూరు శాతం పరిశీలన పూర్తి చేయాలని బిఎల్ఓలకు అధికారులు ఆదేశించిన మేరకు గ్రామంలో ఇంటింటికి వెళ్లి పరిశీలన పెద్ద ఎత్తున పూర్తి చేస్తున్నారు. ఈ ప్రత్యేక పరిశీలనలో కూటమి నాయకులు కోసూరి శ్రీనివాసరావు, కర్రీ వెంకట సత్యనారాయణ (కేవీ), పాము గణేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శిలు పీవీపీ రాజశేఖర్ , సిహెచ్ జయప్రకాష్ , నర్సింగరావు ,పలువురు సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## డీలిమిటేషన్ లేకుండా మహిళ బిల్లు 33 శాతం అమలు చేయాలి

విశాఖపట్నం, జులై 11 ప్రభాతవార్త



ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మహిళా సమాఖ్య పిలుపు భాగంగా శనివారం ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య విశాఖజిల్లా సమితి ఆధ్వర్యంన అల్లిపురం విశాఖ రైల్వే స్టేషన్ పోస్ట్ ఆఫీస్ వద్ద పార్లమెంటు వర్షాకాలం సమావేశంలో డి లిమిటేషన్ రిజర్వేషన్ బిల్లు ఈ వర్షాకాల సమావేశాల్లో ఎలాంటి కండిషన్ లేకుండా మహిళా బిల్లును 33 శాతం అమలు చేయాలని రక్తంతో ఫింగర్ ప్రింట్ వేసి మోడీ కి పోస్ట్ కార్డు ద్వారా తెలియజేసినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఏ.బేగం తెలియజేశారు. ఆమె మాట్లాడుతూ 1996లో గీతా ముఖర్జీ పార్లమెంట్లో పెట్టిన మహిళా బిల్లును పెట్టడం జరిగింది కానీ అది పూర్తిగా అమలులోకి రాకపోవడం చాలా బాధాకరం అని ఆవే దన వ్యక్తం చేశారు. 2023లో మహిళా నారి శక్తి వందనం అదినీయం అన్నీ రంగాలలో మహిళాలు ఉన్నరు దేశంలో మహిళలు సగభాగం ఉన్నా వారినీ ఓటు బ్యాకింగ్‌గా చూస్తున్నారు తప్ప వాళ్ళకు ఇవ్వవలసిన మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందినప్పటికీ ఈరోజు వరకు అమలు చేయడం లేదని మహిళా సమాఖ్య తీవ్రంగా మండి పడ్డారు. మహిళా బిల్లును ఈ వర్షాకాల సమావేశాల్లో ఎలాంటి కండిషన్ లేకుండా పూర్తిగా అమలు లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా సమాఖ్య విశాఖ జిల్లా అధ్యక్షులు కే.వనజాక్షి, జీ. జయ ఏ.దేవుడమ్మ బి.పుష్పలత ఎస్.కే సల్మా షేక్.మస్తాన్ బేబీ, సి హెచ్.నుకలమ్మ మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

PROPERTY

★ I BHK AND 2 BHK ఫ్లాట్స్ అక్కయ్యపాలెం విశాఖపట్నం నందు అమ్మకమునకు కలవు. Mobile 9492532878

(Ro.No.14170)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

12skl13:12skl13.qxd 11-07-2026 21:43 Page 1



## పశుగ్రాసంతోనే అధిక పాల ఉత్పత్తి



**కోటబొమ్మాళి, జూలై 11, ప్రభాతవార్త :**

నాణ్యమైన పశుగ్రాసం పండించి శాస్త్రీయ పద్ధతిలో పశువులకు మేపినట్లయితే అధిక పాల ఉత్పత్తి సాధించవచ్చునని స్థానిక పశుసంవర్ధశాఖ సహాయక సంచాలకులు డాక్టర్ ఎం.లోకనాధం అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా శనివారం కోటబబొమ్మాళి గ్రామంలో పశువైద్యధికారి డాక్టర్ ఎల్.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు పండించుకునే పశుగ్రాసాన్ని పశువులు సులభంగా జీర్ణం చేసుకొని విటమిన్లు అధికంగా పొందుతాయన్నారు. అలాగే మాంసకృత్తులు, పిండి పదార్థాలు, కొవ్వు పదార్థాలు, అధికంగా సమకూర్చుకోగలుగుతాయని ఆయన వివరించారు. అలాగే రైతుసేవా కేంద్రాలలో సబ్సిడీపై పశు గ్రాస విత్తనాలు లభిస్తున్నాయని వీటిని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## శ్మశానానికి విద్యుత్ లైన్ ఏర్పాటు



**కంచిలి, జూలై 11, ప్రభాతవార్త :**

అంపురం పంచాయితీ అంపురం గ్రామ స్మశానానికి శనివారం కూటమి ప్రభుత్వంలో కరెంటు లైన్ ఎమ్మెల్యే, విప్ బెందాళం అశోక్, మాదిన రామారావు సహకారంతో వేయడం జరిగింది. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మాదిన.రామారావు, కార్యదర్శి పైల రామారావు, కూటమి నాయకులు జి.క్రిష్ణరావు, ఏ.కూర్మారావు, వీ.పోల్లయ్య, జి.త్రినాధ్, పాపయ్య, జి.దండాసి, జి.శ్రీను, జి.చింతయ్య, దుర్గారావు, చంద్రయ్య గ్రామ పెద్దలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## సంతబొమ్మాళి ఎంపీడీవోకు పదోన్నతి



**సంతబొమ్మాళి, జూలై 11, ప్రభాతవార్త :**

సంతబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోగా పని చేస్తున్న పేడాడ జయంత్ ప్రసాద్ విజయనగరం జిల్లా ఎస్.కోట ఏపిడిగా (డ్వామా) పదోన్నతిపై బదిలీ చేస్తూ ఉత్తర్వులు అందాయి. మండలంలో ఎంపీడీవోగా పని చేస్తూ అందరి మన్నలను పొందారని పలువురు తెలిపారు. పదోన్నతిపై కార్యాలయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

## రణస్థలంలో ఎంపీ కలిశెట్టి 'ప్రజా దర్బార్'



### -అర్జీల తక్షణ పరిష్కారానికి ఆదేశం!

**రణస్థలం, జూలై 11 ప్రభాతవార్త :**

ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శనివారం రణస్థలం మండల కేంద్రమైన జె.ఆర్.పురంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆధ్వర్యంలో 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన ప్రజల నుంచి ఎంపీ స్వయంగా వినతులను స్వీకరించారు. సమస్యల తీవ్రతను బట్టి అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, తక్షణ పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**ఒకటి రెండు వారాల్లో సమస్యలకు పరిష్కారం: ఎంపీ కలిశెట్టి**

అనంతరం ఎంపీ అప్పలనాయుడు మీడియాతో మాట్లాడుతూ ప్రజల ముంగిటకే పాలనను చేర్చి, వారి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకే ప్రభుత్వం ఈ 'ప్రజా దర్బార' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఇదొక అద్భుతమైన వేదికగా నిలుస్తోందని హర్షం వ్యక్తం చేశారు. ఈరోజు ప్రజా దర్బార్‌లో వచ్చిన ప్రతి ఒక్క అర్జీని కూలంకషంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. బాధితులకు న్యాయం జరిగేలా, రాబోయే ఒకటి లేదా రెండు వారాల్లోగా ఆయా సమస్యలను పూర్తిగా పరిష్కరించాలని అధికారులకు గడువు విధించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు, ప్రజా సమస్యలపై ప్రజలు నిరభ్యంతరంగా తమ దృష్టికి తీసుకురావచ్చని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమంలో కూటమి పార్టీల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎన్ఎస్ఎన్ స్వామి




**ఆమదాలవలస, జులై 11, (ప్రభాతవార్త):**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు) శ్రీకాకుళంలో డాక్టర్ ఎన్ ఎస్ ఎన్ స్వామి ప్రిన్సిపాల్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆమదాలవలసలో ప్రిన్సిపాల్‌గా పని చేసి బదిలీపై రావడం జరిగింది. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన స్వామి మాట్లాడుతూ తాను ఇదే కళాశాలలో చదివి, ఈ కళాశాలలో లెక్చరర్‌గా పని చేసి, ఇదే కళాశాలకు ప్రిన్సిపాల్‌గా రావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. సీపీడీసీ కమిటీ మరియు సిబ్బంది సహకారంతో కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని స్వామి తెలిపారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ స్వామికి కళాశాల అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పుష్పగుచ్చంతో అభినందించారు.



## ఆరోగ్య సేవలపై దృష్టిసారించండి

### ఎంపీపీ కడియాల పద్మ ప్రకాష్

**కవిటి, జూలై 11, ప్రభాతవార్త :**

ఆరోగ్య సేవలపై డాక్టర్లు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలంటూ కవిటి ఎంపీపీ కడియాల పద్మ ప్రకాష్ అన్నారు. శనివారం కవిటి మండల పరిషత్ పరిధిలో గల పీహెచ్‌సీలు బొరివంక, మాణిక్యవరం గ్రామాల్లో అందుతున్న ఆరోగ్య సేవలపై ఆయా కేంద్రాల్లో సమీక్ష సమావేశం చేపట్టారు. ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో డాక్టర్లు గాని, సిబ్బంది గాని నిర్లక్ష్యం వహించరాదని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ముఖ్యంగా సి కె డి బాధ్యతలకు సకాలంలో అన్ని మందులు అందే విధంగా సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి బాధితులకు మందులు అందే విధంగా డాక్టర్లు సిబ్బంది చర్యలు చేపట్టాలని తెలిపారు. పిహెచ్‌సి కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు, మందుల పంపిణీ సక్రమంగా ఉండాలని, సిబ్బంది పని తీరు మెరుగు పరుచుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్.త్రినాధ్, మాజీ సర్పంచ్‌లు గ్రంధాలయం శ్రీరాం ప్రసాద్, లలిత, దేవరాజ్ సాహులతోపాటు డాక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్మశాన వాటిక అభివృద్ధికి రూ. లక్ష విరాళం



**అమదాలవలస, జూలై 11 (ప్రభాతవార్త):**

శ్రీ విజయలక్ష్మి కన్‌స్ట్రక్షన్స్ అధినేత కూన భరత్ విజయ్ లక్ష్మీనగర్‌లో చిక్కోలు చేయూత సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబ డుతున్న శ్మశాన వాటికలో దహనపరిచే గ్రిల్ పనుల నిమిత్తం రూ. లక్షల చెక్కును కమిటీ అధ్యక్షులు వడ్డాది గోపీకృష్ణకు శనివారం అందజేశారు. విరాళాన్ని ఆయన తన అమ్మమ్మ, తాతయ్యలైన తమ్మినైన సీతారామనుజా చార్యులు (రిటైర్డ్ ఉపాధ్యాయులు), విజయలక్ష్మి జ్ఞాపకార్థంగా అందించినట్లు భరత్ విజయ్ తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గోపి మాట్లాడుతూ సమాజ హితార్థం చేపడుతున్న సేవా కార్యక్రమాలకు అందరూ తమ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు. కమిటీ సభ్యులు భరత్ విజయ్‌ను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.



## మణికంఠ రెడ్డికి ఐదు స్వర్ణాలు

**కవిటి, జూలై 11, ప్రభాతవార్త:**

శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం బెలగాం పంచాయతీ జాడుపూడి గ్రామానికి చెందిన యువ షూటర్ మణికంఠ రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఐదు బంగారు పతకాలు సాధించి ప్రతిభ చాటారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 10 మీటర్ల పిస్టల్, 25 మీటర్ల స్టాండర్డ్, సెంటర్ ఫైర్, స్పోర్ట్స్ పిస్టల్ విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి ఈ ఘనత సాధించారు. ఈ సందర్భంగా ఐజీపీ ఆర్.కే. రవికృష్ణ స్వర్ణ పతకాలు అందజేసి అభినందించగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. మణికంఠ రెడ్డి విజయంపై ఏఎంసీ చైర్మన్ మణి చంద్రప్రకాష్, శ్రీనివాసరావు, దేవరావు, సంతోష్ పట్నాయక్ , తదితరులు అభినందనలు తెలిపారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో 687 కేసులు పరిష్కారం



**కోటబొమ్మాళి, జూలై 11 ప్రభాతవార్త :**

స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 687 కేసులు పరిష్కరించటం జరిగిందని జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి తెలిపారు. సివిల్ కేసులు 3, క్రిమినల్ కేసులు 37, ఫ్రీ బార్లయినింగ్ ద్వారా రాజీ అయిన కేసులు 8, ఎక్సైజ్ కేసులు 40, అడ్మిషన్ కేసులు 601, ఎగ్జిక్యూషన్ పిటిషన్ 1, మనోవర్తి కేసులు 5 రాజీ మార్గం ద్వారా పరిష్కరించటం జరిగిందన్నారు. ఈ లోకఅదాలత్‌లో న్యాయవాదులు బి.నారాయణరావు, ఎం.కాళేశ్వరరావు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎల్.శ్రీనివాస్, ఇతర న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం

### మాజీ క్రికెటర్ ఎం.ఎస్.కె. ప్రసాద్




**టెక్కలి, జూలై 11, ప్రభాతవార్త :**

టెక్కలి సమీపంలోని ఐతం ఇంజినీరింగ్ కళాశాలలో సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఇంటర్ కాలేజ్ క్రీడా పోటీల విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి మాజీ క్రికెటర్, బీసీసీఐ సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్ ఎం.ఎస్.కె. ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎం.ఎస్.కె. ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఐతం ఇంజినీరింగ్ కళాశాల విద్యా ర్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు క్రీడలకు విశేష ప్రాధాన్యం కల్పించడం అభినందనీయమన్నారు. విద్య, క్రీడలు, క్రమశిక్షణను సమన్వయం చేస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కళాశాల యాజమాన్యం చేస్తున్న కృషిని కొనియాడారు. ఆధునిక సౌకర్యాలు, విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే వాతావరణం ఐతం ప్రత్యేకత అని పేర్కొన్నారు. సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా వివిధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులకు క్రీడా పోటీలు నిర్వహించడం ఐతం కళాశాల విశిష్టతకు నిదర్శనమన్నారు. ఇలాంటి విద్యాసంస్థలు గ్రామీణ ప్రాంత యువత భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని ప్రశంసించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. గెలుపోటములను సమానంగా స్వీకరించే మనస్తత్వాన్ని క్రీడలు అలవర్చుతాయన్నారు. అనంతరం క్రీడా పోటీల్లో విజేతలు, రన్నరప్‌లుగా నిలిచిన జట్లకు ఎం.ఎస్.కె. ప్రసాద్ నగదు బహుమతులు అందజేసి అభినందించారు. విద్యార్థుల క్రికెట్ పోటీల్లో ఐతం విజేతగా, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రన్నరప్‌గా నిలిచాయి. వాలీబాల్‌లో రఘు ఇంజినీరింగ్ కళాశాల విజేతగా, ఐతం రన్నరప్‌గా, త్రోబాల్‌లో విగ్నాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-దువ్వాడ విజేతగా, ఎంవీజీఆర్-విజయనగరం రన్నరప్‌గా నిలిచాయి. మహిళల చెస్‌లో ఐతం విజేత, రన్నరప్ స్థానాలను దక్కించుకుంది. పురుషుల చెస్‌లో సంకేతిక విద్యా పరిషత్-విశాఖపట్నం విజేతగా, శ్రీకింజరాపు ఎర్రన్నాయుడు కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్-శ్రీకాకుళం రన్నరప్‌గా నిలిచాయి. అధ్యాపకుల క్రికెట్ పోటీల్లో సెంచూరియన్ యూనివర్సిటీ-ఒడిశా విజేతగా, జీఎంఆరఐటీ డీమ్డ్ టు బి యూనివర్సిటీ రన్నరప్‌గా నిలిచాయి. వాలీబాల్, త్రోబాల్ పోటీల్లో జీఎంఆరఐటీ విజేతగా, ఐతం రన్నరప్‌గా నిలిచాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ కె. సోమేశ్వరరావు, సెక్రటరీ ఎల్.ఎల్. నాయుడు, డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు, మధుకుమార్, నాగశేషు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్. శ్రీనివాసరావు, ఆర్ అండ్ డీ డీన్ డాక్టర్ డి. శ్రీరాములు, ప్లేస్‌మెంట్ డీన్ డాక్టర్ ఎం. సంతోష్‌కుమార్, పీడీలు లక్ష్మణ్ మూర్తి, మురళీ మోహన్, తేజేశ్వరి,తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులపై దాడికి పాల్పడిన కానిస్టేబుల్ కుమారుడు



**రాజాం, జూలై 11, ప్రభాతవార్త :**

రాజాం పట్టణంలో డోలాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న తన తల్లిని తన కారులో పాఠశాలకు తీసుకువెళ్లే తరుణంలో, కారు పాఠశాల గేటు దగ్గర అడ్డంగా పెట్టి ఉంచడంతో కారు అడ్డంగా ఉన్నది ప్రక్కకు తీయమని వ్యాయామ ఉపాధ్యాయుడు తెలపగా కారులో ఉన్న వ్యక్తి ఉపాధ్యాయులపై దాడికి పాల్పడ్డాడు. ఆ కారులో ఉన్న వ్యక్తి తన తండ్రి కె.తవిటిరాజుకు ఫోన్‌లో తెలియపరచగా, హుటాహుటిన కేటీ రాజు పాఠశాల వద్దకు చేరుకుని, తండ్రి కుమారులిద్దరూ కూడా కలిసి పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఉపాధ్యాయుడుకు గాయాలయ్యాయి. ఉపాధ్యాయులను గాయపరిచిన వ్యక్తి క్రైమ్ బ్రాంచ్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ కే.తవిటి రాజు ఉండడం సంచలనానికి దారి తీసింది. శాంతి భద్రతలు కాపాడవలసిన పోలీస్ కానిస్టేబుల్ ఉపాధ్యాయులపై దాడికి ప్రోత్సహించి పాల్పడడం ఉపాధ్యాయ వర్గాలు ఆయన తీరుపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తీరంలో పార్క్ పేరుతో జీడిచెట్లు ధ్వంసం

### సొంత పార్టీ నేతపై కక్ష సాధింపు.... టిడిపికి చెందిన మాజీ సర్పంచ్ నిర్వాకం



**సంతబొమ్మాళి, జూలై 11, ప్రభాతవార్త :**

మండలం తీరప్రాంత గ్రామమైన జగన్నాధపురంలో పార్క్ పేరుతో సొంత పార్టీ నేతకు చెందిన జీడి చెట్లను టిడిపికి చెందిన మాజీసర్పంచ్ పుక్కళ్ల శ్రీనివాసరావు ధ్వంసం చేయించారు. వివరాల్లోకి వెళితే మండలం గ్రామానికి చెందిన టిడిపి నేత కోడ షణ్ముఖరావుకు సముద్ర తీర ప్రాంతంలో గ్రామస్తులు అందరితోపాటు 2004 నుండి సుమారు 30 సెంట్లు అటవీ భూమి తన ఆధీనంలో ఉంది. ఈ భూమిలో జీడి చెట్లను సాగు చేస్తున్నారు. ఒకే పార్టీలో ఉన్న 15 సంవత్సరాలుగా సర్పంచ్‌గా పని చేసిన పుక్కళ్ళ శ్రీనివాసరావుతో రాజకీయ వైరం ఏర్పడింది. సొంత పార్టీలోనే ప్రత్యర్థులను దెబ్బ తీయడానికి శ్రీనివాసరావు కుట్రకు తెర లేపారు. పార్క్ నిర్మాణం పేరుతో షణ్ముఖరావు కుటుంబ సభ్యులు ఎవరూ లేని సమ యంలో, అటవీ శాఖ అనుమతి లేకుండా తన ఆధీనంలో ఉన్న భూమిలో జీడి చెట్లను పొక్లైన్‌తో తొలగించి వాల్టా చట్టం ఉల్లంఘించారు. దీనిపై జిల్లా అటవీశాఖ అధికారికి లిఖితపూర్వ కంగా కోడ షణ్ముఖరావు ఫిర్యాదు చేసినట్లు శనివారం తెలిపారు.చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మరోపక్క సొంత పార్టీ నేతలపైనే మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు కక్ష సాధించడం ఎంతవరకు సమంజసమని కోడ షణ్ముఖరావు, కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై పార్టీ పెద్దలు పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.



## పూడికలతీతపై స్పెషల్ డ్రైవ్

**సీతంపేట, జూలై 11, ప్రభాతవార్త :**

కాలువలో పూడికల తీతపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు డిప్యూటీ ఎంపీడీవో ఎల్ శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ శనివారం తెలిపారు. సీతంపేట గ్రామపంచాయతీలో ముందస్తుగా వ్యాధులు వచ్చే అవకాశం ఉండడంతో వీటిని దృష్టిలో పెట్టుకొని అన్ని వీధులలో కాలువలలో పూడిక తీయించి ఆ తదుపరి బ్లీచింగ్ చల్లి దోమలు నివారణ చర్యలను చేపట్టడం జరుగుతుందన్నారు. పారిశుధ్య నిర్వహణలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ వేడినీళ్లు తాగుతూ ఉండాలని గ్రామపంచాయతీ సూచించినట్లు తెలిపారు.

## వంశధారకు షట్టర్లు ఎప్పుడూ..?




**కొత్తూరు, జులై 11, ప్రభాతవార్త :**

వంశధార ప్రధాన కాలువకు షట్టర్లు బిగించకుండా చివరి ఆయకట్టు భూములకు నీరు ఎలా చేరుతుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాద్ ప్రశ్నించారు. కొత్తూరు మండల కేంద్రంలో జరిగిన పార్టీ సమావేశంలో వారు మాట్లాడారు. 2009లో షట్టర్ల కుంభకోణం తర్వాత ఇప్పటి వరకు వాటిని బిగించకపోవడంతో నీరు వృథా అవుతూ చివరి భూములకు సాగునీరు అందడం లేదని విమర్శించారు. వంశధార ఎత్తిపోతల పథకానికి రూ.200 కోట్లు కేటాయించి పూర్తి చేస్తే రెండు పంటలకు నీరు అందుతుందని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు నిమ్మక అప్పన్న, పి.రమేష్, కృష్ణ , తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా బ్యాడ్మింటన్ సెలక్షన్స్‌కు కళ్యాణి స్కూల్ విద్యార్థులు



**కవిటి, జూలై 11 ప్రభాతవార్త :**

జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ బాల బాలికల పోటీలకు కళ్యాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు నలుగురు ప్రాతినిధ్యం వహించారని జిల్లా బ్యాడ్మింటన్ వైస్ ప్రెసిడెంట్ తమరాన జయరాం తెలియజేశారు. ఈ పోటీల్లో పాల్గొని ఉత్తమ ఫలితాలు సాధించాలని తద్వారా కమిటీ మండలంలో క్రీడలకు ప్రోత్సాహం కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కవిటి సీనియర్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు ప్రసాద్ వ్యాయామ ఉపాధ్యాయులు మండల ఆనంద్, మొగలిపురి సతీష్ పాల్గొన్నారు.

## అర్థాంతరంగా నిలిచిపోయిన అంగన్వాడీ భవన నిర్మాణం



**సీతంపేట, జూలై 11, ప్రభాతవార్త :**

గత ప్రభుత్వంలో నాడు నేడు పథకం కింద మంజూరైన చిన్నపల్లంకి అంగన్వాడి భవన నిర్మాణం పనులు అర్థాంతరంగా నిలిచిపోయి దీంతో అంగన్వాడీ కేంద్రానికి వస్తున్న పిల్లలు సరైన వసతి లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు అయినప్పటికీ పనులు జరగని పరిస్థితి నెలకొంది. పునాదుల వరకు పనులు చేసి పనులు ముందుకు సాగకపోవడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి భవన నిర్మాణ పనులు పూర్తి చేసి వసతి సమస్య లేకుండా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## సర్ ప్రక్రియతో సమగ్రమైన ఓటర్ల జాబితా

**కోటబొమ్మాళి, జూలై 11 ప్రభాతవార్త:**

ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. శనివారం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో మంత్రి అచ్చెన్నాయుడును ఎసఐఆర్ బీఎల్‌వో కలిసి ఎన్యూమరేషన్ పత్రాలను అందజేశారు. మంత్రి అచ్చెన్నాయుడు తన ఓటరు పేరు, ఫోటో, గుర్తింపు కార్డు నంబరు తదితర వివరాలను ఎన్యూమరేషన్ పత్రాల్లో నమోదు చేసి సంతకం చేశారు. అనంతరం బీఎల్‌వో సంతకం చేసిన ఎక్‌నాలెడ్జ్‌మెంట్ ప్రతిని స్వీకరించారు.

# శ్రీకాకుళం వార్త



## కేజీబీవీ విద్యార్థుల అస్వస్థతపై మంత్రి అచ్చెన్న ఆగ్రహం

### -కలెక్టర్‌తో ఫోన్‌లో సమీక్ష.. బాధ్యులను తక్షణమే సస్పెండ్ చేయాలని ఆదేశం



**కోటబొమ్మాళి, జూలై 11, ప్రభాతవార్త:**

మండలంలోని శాలిగుండం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా స్పందించారు. ఈ ఉదంతంపై ఆయన శనివారం ఏపీసీతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. పౌష్టికాహారం తిని విద్యార్థులు అనారోగ్యం బారిన పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ లక్ష్యాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ జరపాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని, ఇలాంటి విషయాల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదన్నారు. నిర్లక్ష్యానికి కారణమైన బాధ్యులను తక్షణమేయ సస్పెండ్ చేయాలని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని, విధుల్లో అలసత్వం వహించిన వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

## నూతనంగా నిర్మిస్తున్న కాలువ నిర్మాణ పనులు పరిశీలన



**రాజాం, జూలై 11, ప్రభాతవార్త :**

రాజాం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గోపాలపురంలో సాధారణ 6.0 లక్షలు నిధులతో 2 అడుగులు వెడల్పు, 170 మీటర్లు కలిగిన కాలువ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం 15వ ఆర్థిక సంఘం నిధులతో సుమారుగా 39.0 లక్షల రూపాయలు వెచ్చించి కొండంపేటలో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ కాలువలు, అలాగే రామాలయం వీధిలో అప్రోచ్ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ రామచంద్రరావుతో పాటు, మిగతా సిబ్బంది పాల్గొన్నారు.

## ముదురుతున్న జర్నలిస్ట్ దాడి వివాదం



**పలాస, జూలై 11, ప్రభాతవార్త :**

పలాసలో జర్నలిస్ట్‌పై దాడి ఘటనలో వివాదం ముదు రుతోంది. పలాస జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులందరూ మూకుమ్మడిగా సర్కిల్ ఇన్స్పెక్టర్‌ని కలిసి రిపోర్టర్ ఇచ్చిన పిర్యాదుపై ఏమి చర్యలు తీసుకొన్నారని ప్రశ్నించడానికి కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని సీఐ అందుబాటులో లేకపోవడంతో సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఆదివారం పోలీసులు తీసుకొనే చర్యలను గమనించి సోమవారం ప్రజా సంఘాలు, పలు జర్నలిస్ట్ సంఘాలతో కలిసి నిరసన, ధర్నా, ర్యాలీ వంటి కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్ళడానికి సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు, సెక్రెటరీలు మాట్లాడుతూ మన కుటుంబ సభ్యుడైన జర్నలిస్ట్‌కు న్యాయం జరగాలని, లేకపోతే అమరావతిలోనైనా రాష్ట్ర సంఘాలతో నిరసన కార్యక్రమాలతో ముందుకు వెళ్తామని వెనుక్కు తగ్గే ఆలోచన లేదని తెలిపారు.

## ఉచిత హోమియో వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి



### జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఎం.రమేష్

**ఆముదాలవలస, జూలై 11 (ప్రభాతవార్త)**

ఆమదాలవలస పట్టణంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయ ఆవరణలో జనతా సహిత ఆధ్వర్యంలో శనివారం ఉచిత హోమియో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఎం.రమేష్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం రోగులకు హోమియో మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎం.రమేష్ మాట్లాడుతూ, ఆరోగ్య పరిరక్షణలో హోమియో వైద్యం కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని అన్నారు. ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్య సమస్యలకు చికిత్స పొందాలని సూచించారు. సమాజ సేవ లక్ష్యంగా నిర్వహిస్తున్న జనతా సహిత కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గీత, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్, హోమియో వైద్య నిపుణుడు డాక్టర్ వివేకానంద, జనతా సహిత కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత



**కొత్తూరు, జులై 11, ప్రభాతవార్త :**

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, దానిని కాపాడుకోవడం ప్రతి పౌరుని బాధ్యత అని కొత్తూరు మండల తెలుగుదేశం సీనియర్ నాయకులు లోతుగెడ్డ తులసీ వరప్రసాద్ రావు అన్నారు. కొత్తూరు మండలం కారిగూడ గ్రామంలో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పౌరుడు తన పేరు ఓటర్ల జాబితాలో నమోదై ఉందో లేదో సరి చూసుకోవాలన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ద్వారా ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులను సరిదిద్దుకొనేందుకు ప్రభుత్వం మంచి అవకాశం కల్పించిందని తెలిపారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి పి.సరోజనమ్మ, మండల, కేంద్ర స్థాయి అధికారులు, ప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సంతకవిటిలో ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ



**సంతకవిటి, జూలై 11, ప్రభాతవార్త:**

మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ చేసారు. జనాభా నియంత్రణ వివిధ కుటుంబ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. జనాభా సమతుల్యత కోసం సంతాన ఉత్పత్తి రేటుపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టణ సిఐగా బాధ్యతలు చేపట్టనున్న నవీన్ కుమార్

**రాజాం, జూలై 11, ప్రభాతవార్త :**

విశాఖ రేంజ్ పరిధిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బదిలీల్లో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా సిసిఎస్‌లో పనిచేస్తున్న డి.నవీన్ కుమార్ రాజాం పట్టణ సిఐగా బదిలీపై వస్తున్నారు. గతంలో నవీన్ కుమార్ రాజాం రూరల్ సిఐగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం పనిచేస్తున్న సిఐ కె.అశోక్ కుమార్‌ను విశాఖ రేంజ్ వి.ఆర్‌కు బదిలీ చేసినట్లు రేంజ్ ఐజి గోపినాథ్ శెట్టి ఉత్తర్వులు జారీ చేశారు.

## జాతీయ లోక్‌అదాలత్‌లో 693 కేసులు పరిష్కారం

**టెక్కలి, జూలై 11, ప్రభాతవార్త :**

టెక్కలి కోర్టుల సముదాయంలో సీనియర్ సివిల్ జడ్జి ఆర్.శాంతిశ్రీ, ఫుల్ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఆదేశాల మేరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో రెండు బెంచ్‌లు ఏర్పాటు చేశారు. రెండు బెంచ్‌లలో కలిపి మొత్తం 693 కేసులు పరిష్కరించారు. అందులో సివిల్ కేసులు 2, క్రిమినల్ కేసులు 394, ఎక్సైజ్ కేసులు 56, ట్రాఫిక్ చలాన్లు 235, మెంటినెన్స్ కేసు 1, డీవీసీ కేసు 1, బ్యాంకు రికవరీ కేసులు4 ఉన్నాయి. పరిష్కరించబడిన మొత్తం సొమ్ము రూ.6,65,000లు. ఈ అదాలత్‌లో సభ్యులుగా బాబూరావు, జి.కృష్ణారావు, బి. శ్రీనివాసరావు, టెక్కలి న్యాయవాదుల సంఘము అధ్యక్షులు పినకాన అజయ్ కుమార్, అసిస్టెంట్ ప్రభుత్వ న్యాయవాది డి.వి.వివేకానంద, టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏ.పి.పి. సుధారాణి, ఇతర న్యాయవాదులు మరియు పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా అమలు కావడం లేదు

**రాజాం, జూలై 11 ప్రభాతవార్త :**

రాజాం మున్సిపాలిటీ పరిధిలో అమ్మవారి కాలనీలో పలు వీధుల్లో ప్రతిరోజు జరిగే ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పలు వీధుల్లో రోజు విడిచి రోజు వస్తున్నారే తప్ప ప్రతిరోజు చెత్త సేకరణకు ఎవరూ రావడం లేదంటూ చెబుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ సిబ్బందిని వివరణ కోరగా సిబ్బంది కొరత వల్ల ఈ విధంగా చేస్తున్నామని చెప్పుకొస్తున్నారు తప్ప ఎటువంటి పని జరగడం లేదు. తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి ప్రతిరోజు ఇంటింటా చెత్త సేకరణ చేసే విధంగా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చెలి

# కీమా రుచులు

మటన్ ముక్కలో సింగిల్ ఎముక లేకుండా కీమా కొట్టడం అంటే మామూలు ముచ్చట కాదు. అంతపద్ధతిగా కొట్టిన కీమా..చేయి తిరిగిన వంటవాడి చేతిలో పెడితే.. ఎలా ఉంటుంది చెప్పండి? మసాలా దట్టించుకొని.. నూనెలో మునిగి.. కూరలో తేలి..బిర్యానీలో కుదిరి.. పళ్లెంలోకి వచ్చేస్తుంది. ముదముద్దనూ ఆస్వాదిస్తూ లాగించేయడమే మన పని. కాదంటారా! అయితే వెరైటీలు చేసి చూడండి. కీమా కథ క్లైమాక్స్‌లో ఆహా, ఒహోలు తప్ప మరే మాటలూ వినిపించవు !



## కార్జం-కీమా ..

**కావాల్సినవి :** కీమా-300గ్రా, నూనె-నాలుగు చెంచాలు, ఉల్లిపాయ-ఒకటి, అల్లం-రెండు అంగుళాల ముక్క, వెల్లుల్లి రెబ్బలు-పది, టమాటా గుజ్జు -నాలుగు చెంచాలు, పసుపు-అరచెంచా, కారం- అరచెంచా, ధనియాలపొడి-రెండు చెంచాలు, గరంమసాలా పొడి- అరచెంచా, ఉప్పు-రుచికి తగినంత, కార్జం-200 గ్రా, కొత్తిమీర కొద్దిగా.

**తయారీ :** ఒక కడాయిలో నూనె పోసి వేడిచేసుకోవాలి. తరిగిన ఉల్లిముక్కలని నూనెలోవేసి గోధుమరంగులోకి వచ్చేంత వరకూ వేయించుకోవాలి. మిక్సీలో అల్లం,వెల్లుల్లి రెబ్బలువేసి మెత్తగా మిక్సీ పుట్టుకోవాలి. ఈ మిశ్రమాన్ని వేగిన ఉల్లిపాయముక్కల్లో వేసి మూడు నిమిషాలపాటు వేయించుకోవాలి. ఆ తర్వాత టమాటా గుజ్జు కూడా వేసి పచ్చివాసన పోయేంతవరకూ వేయించు కోవాలి. ఇప్పుడు పసుపు, కారం, ధనియాల పొడి, గరంమసాల పొడి,ఉప్పు కూడా వేసుకోవాలి. ఇవన్నీ ఉడుకుతూ నూనెపైకి తేలుతుంది. అప్పుడు కీమా వేసి మూతపెట్టి పావుగంటపాటు ఉడికించు కోవాలి. చివరిగా కార్జం కూడా వేసి మరో పది నిమిషాలపాటు ఉడికించుకుంటే రుచకరమైన కీమాకార్జం సిద్ధమవుతుంది

.

## కీమా బిర్యానీ...



**కావల్సినవి :** బాస్మతి బియ్యం-350, పెరుగు-3 చెంచాలు, అల్లం పేస్ట్-చెంచా, నెయ్యి-100గ్రా, కుంకుమపువ్వు-చిటికెడు, కారం-చెంచా నిమ్మరసం-చెంచా, కీమా-400 గ్రా, ఉల్లిపాయ-ఒకటి, వెల్లుల్లి పేస్ట్ - చెంచా, పాలు-అరకప్పు, దాల్చినచెక్క-ఒకటి, లవంగాలు-నాలుగు, చికెన్ ఉడికించిన నీళ్లు-కప్పు, ఉప్పు-తగినంత.

**తయారీ:** ముందుగా బాస్మతి బియ్యాన్ని ఉప్పు వేసిన నీళ్లలో పలుకుగా ఉడికించి వార్చి పక్కన పెట్టుకోవాలి. పాలల్లో కుంకుమపువ్వు కలిపి పక్కనపెట్టుకోవాలి. కడాయిలో నెయ్యి వేడి చేసుకుని అందులో ఉల్లిపాయ ముక్కలు ముదురు గోధుమరంగులోకి వచ్చేంతవరకూ వేయించుకోవాలి. ఇందులోనే దాల్చినచెక్క, లవంగాలు వేసి వాటి పరిమళం బయటకు వచ్చేంతవరకూ ఉండాలి. ఇందులోనే కీమా వేసి గరిటెతో కలియతిప్పి.. అల్లంవెల్లుల్లి పేస్ట్ కూడా వేసి పచ్చివాసన పోయేంతవరకూ వేయించి ఉప్పు కలుపుకోవాలి. కీమా పూర్తిగా వేగిన తర్వాత.. పెరుగు, కారం వేసి తక్కువ మంట మీద మగ్గించుకుని పక్కన పెట్టుకోవాలి. కుక్కర్ కానీ, మూత ఉన్న మందపాటి పాత్రను కానీ తీసుకుని ముందుగా పలుకుగా ఉడికించిన అన్నాన్ని ఒక పొరలా వేసుకోవాలి. దానిపై ఉడికించిన కీమాని వేసుకోవాలి. ఆపైన కుంకుమపువ్వు కలిపిన పాలను సగం పోసుకుని, ఆపై కొద్దిగా నిమ్మరసం వేసుకోవాలి. ఇదే పద్ధతిలో మళ్లీ పలుకుగా ఉడికించిన అన్నం, కీమా, పాలు వేసి చివరిగా తగినంత చికెన్ ఉడికించిన నీళ్లు పోసుకోవాలి. ఆవిరి బయటకు పోకుండా మూతపెట్టేసి తక్కువమంట మీద పదిహేను నిమిషాల పాటు ఉడికించుకుని దింపుకోవాలి. కుక్కర్‌ని నేరుగా మంట మీద పెట్టకుండా ఒక పాన్ పెట్టుకుని దానిమీద పెట్టుకుంటే అడుగు మాడకుండా బిర్యాని చక్కగా పొడిపొడిగా వస్తుంది.

## తవా కీమా...



**కావాల్సినవి :** కీమా-పావుకేజీ, ఉల్లిపాయ-ఒకటి, టమాటాలు-రెండు, కసూరీమేథీ- అరచెంచా, కారం-చెంచా, పసుపు- పావుచెంచా, అల్లంవెల్లుల్లి పేస్ట్- చెంచా, సన్నగా తరిగిన అల్లం-చెంచా, పిచ్చిమిర్చి-రెండు, జీలకర్ర- చెంచా, ఉప్పు తగినంత, గరంమసాలా- అరచెంచా, నూనె-. నాలుగు చెంచాలు.

**తయారీ:** పెనంగానీ, వెడల్పుగా, మందంగా ఉండే పాన్‌గానీ తీసుకుని అందులో రెండు పెద్ద చెంచాల నూనె పోసుకోవాలి. అది వేడెక్కిన తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి అది పూర్తిగా వేగిన తర్వాత కీమా కూడా వేసి రంగు మారేంతవరకూ వేయించుకోవాలి. ఆ తర్వాత టమాటా ముక్కలు వేసి మూతపెట్టేసి మరో ఐదు నిమిషాల పాటు ఉడికించుకోవాలి. ఇప్పుడు ఉప్పు, పసుపు, కారం, కసూరిమేథి, జీలకర్రపొడి, గరంమసాలా పొడి వేసి పూర్తిగా కలిసేంతవరకూ వేయించుకోవాలి. ఆ తర్వాత ఉల్లిపాయముక్కలు, పచ్చిమిర్చి వేసి వేయించుకుని తగినన్ని నీళ్ల పోసి సన్నమంట మీద ఉంచి కీమాని పూర్తిగా ఉడికించుకోవాలి. చివరిగా సన్నగా తరిగిన అల్లం ముక్కలు పైన అలంకరించు కుంటే తవా కీమా రెడీ. పావ్ బ్రెడ్‌లకి కొద్దిగా బటర్ రాసి పెనంపై వేడిచేసి కీమాతో కలిపితింటే చాలా రుచిగా ఉంటాయి. ముంబయి స్ట్రీట్‌ఫుడ్ పావ్‌కీమా చాలా ప్రసిద్ధి. □

## చిట్కా

అర్ధరోగహరి నిద్రాహా:సరైన నిద్ర, మీ వ్యాధుల లో సగం నయం చేస్తుంది. మనిషికి ఆహారం ఎంత ముఖ్యమో, తగినంత నిద్ర కూడా అంతే ముఖ్యం. ఆరోగ్యవంతుడు రోజుకి కనీసం ఆరు గంటలు నిద్రపోవాలి. తిన్న ఆహారం జీర్ణం కావడానికి, శారీరక శ్రమ వల్ల కాళ్ళు, చేతులు, గుండె, మెదడు మొదలైన ముఖ్య అంగాలు అలసట తీరి సక్రమంగా పనిచేయడానికి నిద్ర ఉపకరిస్తుంది. అటువంటి వారికి రోగాలు దరిచేరవు. కనుక మంచి నిద్ర సగం రోగాలను హరించి వేస్తుంది అని ఈ సూక్తికి అర్థం. □

# చిరు ప్రాయంలో వ్యక్తిత్వ సూత్రాలు



దేశం ఏదైనా, ప్రేమాప్యాయతలు ఎలాంటివైనా, పిల్లల నడవడికల గురించి ఇప్పుడు తల్లిదండ్రులు ఎంతో ఆందోళన పడుతున్నారు. సోషల్ మీడియా వచ్చాక పిల్లల్ని అదుపులో పెట్టడమే కష్టమౌతోంది. మా రోజుల్లో ఇలా లేదమ్మా! ఇప్పుడే ఈ వికామంతా ! అంటూ పెదవి విరుపులు వినడం కద్దు. ఐనా కానీ వారిని నయానో భయానో దార్లో పెట్టడం కన్నా చిన్ననాటి నుంచీ వ్యక్తిత్వానికి పునాది. ప్రాధాన్యతనిచ్చి చిన్న చిన్న అలవాట్లు ను సరిదిద్దగలిగితే అవే పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతాయని జపాన్ పేరెంటింగ్ చెబుతోంది . ఈ విలువలను రోజూ ఆచరణలో చూపిస్తూ పిల్లలకు అలవాటు చేస్తారు. అందుకే గౌరవం, బాధ్యత, కృతజ్ఞత, క్రమశిక్షణ వంటి లక్షణాలు వారి వ్యక్తిత్వం లో భాగమైపోతాయి. మంచి మనుషులను తీర్చిదిద్దాలంటే ఖరీదైన పాఠశాలలు, సాంకేతిక పరికరాలు అవసరం లేదని.. సరైన విలువలు, మంచి అలవాట్లు నేర్పిస్తే చాలని జపాన్ పేరెంటింగ్ ప్రపంచానికి చెబుతోంది. భారతీయ సంస్కృతీ సాంప్రదాయాల కన్నా ఏ ఇతర దేశ ఆచార వ్యవహారాలూ గొప్పవి కాదు. కానీ ప్రాశ్చాత్య సంస్కృతి ప్రభావం పిల్లలపై ఎక్కువగా ఉంది. అందుకే ఎవరి జాగ్రత్తలో వారుండాలి. పిల్లలు బాగా చదివి మంచి ఉద్యోగం సాధించాలని ప్రతి తల్లిదండ్రి కోరుకుంటారు. కానీ మార్కులు, ర్యాంకులే జీవిత విజయాన్ని నిర్ణయించవని జపాన్ తల్లిదండ్రులు నమ్ముతారు. పిల్లలు మంచి మనుషులుగా ఎదగాలంటే చిన్నప్పటి నుంచే మంచి అలవాట్లు, విలువలు నేర్పాలని భావిస్తారు. పెద్ద పెద్ద ఉపన్యాసాలు ఇవ్వకుండా.. రోజువారీ జీవితంలోనే వాటిని అలవాటు చేస్తారు. అందుకే జపాన్ పేరెంటింగ్ విధానం ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది.. హోదా, వృత్తిని బట్టి కాకుండా ప్రతి మనిషిని మర్యాదగా చూడాలనే భావన చిన్నప్పటి నుంచే అలవాటు చేస్తారు. దీంతో ఇతరుల పట్ల గౌరవం, వినయం పిల్లల్లో సహజంగా పెరుగుతాయి.భోజనం ముందు, దైవానికి కృతజ్ఞత చెప్పే విషయంలో మనకూ ఓ మంచి సంప్రదాయం. ఉంది. వారూ అలాంటి సంప్రదాయాన్నే పాటిస్తారు. ఆడుకున్న తర్వాత బొమ్మలు సర్దుకోవడం, గదిని శుభ్రం చేసుకోవడం, ఉపయోగించిన వస్తువులను తిరిగి వాటి స్థానంలో పెట్టడం వంటి పనులు పిల్లలే చేయాలని ప్రోత్సహిస్తారు. చాలా పాఠశాలల్లో విద్యార్థులే తమ తరగతి గదులను శుభ్రం చేస్తారు. దీంతో బాధ్యత, స్వీయ క్రమశిక్షణ పెరుగుతాయి.బ్యాగ్, పుస్తకాలు, చెప్పులు, బొమ్మలు.. ఏ వస్తువైనా జాగ్రత్తగా ఉపయోగించడం నేర్పిస్తారు. కొత్తవి కొనివ్వాలని అడగడం కంటే ఉన్నవాటిని సంరక్షించ డం ముఖ్యం అని తెలియజేస్తారు. దీంతో వస్తువుల విలువ అర్థమవు తుంది. సమయానికి చేరుకోవడం అంటే ఎదుటివారి సమయాన్ని గౌరవించినట్టేనని జపాన్‌లో భావిస్తారు. అందుకే స్కూల్, క్లాస్, సమావేశం.. ఎక్కడికైనా సమయానికి వెళ్లే అలవాటు చిన్నప్పటి నుంచే పెంచుతారు. ఇది జీవితాంతం క్రమశిక్షణగా మారుతుంది. క్యూలో ఓపికగా నిలబడటం, పబ్లిక్ ప్రదేశాల్లో మర్యాదగా ఉండటం వంటి అలవాట్లు సానుభూతి, సామాజిక బాధ్యతను పెంచుతాయి. ఆహారం విలువ, సహజ వనరుల ప్రాముఖ్యత పిల్లలకు అర్థమవుతుంది. విద్య అంటే పాఠశాలకే పరిమితం కాదని జపాన్ తల్లిదండ్రులు యోచన. పుస్తకాలు చదవడం, కొత్త విషయాలు తెలుసుకోవడం, కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం జీవితాంతం కొనసాగాలని ప్రోత్సహిస్తారు. దీంతో పిల్లల్లో జిజ్ఞాస, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. బస్సులు, రైళ్లు, లైబ్రరీలు, క్యూల్లో బిగ్గరగా మాట్లాడ కుండా, ఇతరులకు ఇబ్బంది కలగకుండా ఉండటంమంటే జపాన్ ప్రజలకు పవిత్రత కార్యంగా భావిస్తారు. □

## అంతర్వాణి

# మనకన్నీ దేవుడే ఇచ్చాడు కదా..!

ఒకరోజు సొలొమోను అనే ఇశ్రాయేలీయుల రాజు వద్దకు ఇద్దరు వేశ్యలు వచ్చారు. వారిలో ఒక స్త్రీ రాజుతో ఇలా మనవి చేసింది. 'రాజా..నా యేలినవాడా! నేను ఈ స్త్రీ మేమిద్దరం ఒకే ఇంట్లో ఉంటాం. మూడురోజుల తేడాతో మేం పిల్లల్ని కన్నాం. మేం తప్ప ఇంట్లో ఎవరూ ఉండరు. అయితే రాత్రివేళ ఈ స్త్రీ నిద్రలో తన పిల్లపై పడగా ఆ బిడ్డ చనిపోయింది. మధ్యరాత్రివే ఆమె వచ్చి, బతికి ఉన్న నాబిడ్డను తనవద్ద పెట్టుకుని, మృతి చెందిన తన బిడ్డను నా పక్కన పడుకోబెట్టింది. ఉదయం నేను పాలు ఇచ్చేందుకు చూడగా అది చనిపోయింది. నిదానించి బిడ్డను పరిశీలిస్తే ఆ బిడ్డ నాది కాదు. అయితే బతికి ఉన్న బిడ్డ అని చెప్పింది. రెండవ స్త్రీ కాదు బతికి ఉన్న బిడ్డ నాది, చచ్చిన బిడ్డ ఆమెదే అని చెప్పింది. ఇలా ఇద్దరు బతికి ఉన్నది నాది అంటే నాది అని గొడవకు దిగారు. సొలొమోను రాజు మహాజ్ఞాని కాబట్టి వెంటనే ఒక పెద్ద కత్తి తెమ్మని, తమసేవకుడికి చెప్పాడు. అతడు కత్తి తెచ్చిన తర్వాత రాజు ' ఆ కత్తితో బతికి ఉన్న బిడ్డను రెండు ముక్కలుగా చేసి, చెరి సగం ఇవ్వమని' చెప్పాడు. సేవకుడు ఆ ప్రయత్నం చేసేందుకు కత్తి ఎత్తగా.. బతికి వున్న నిజమైన తల్లి కడుపులో పేగులు తరుగు కొనిపోయినదై 'రాజా! బిడ్డను మాత్రం చంపవద్దు, ఆమెకే ఇవ్వండి' అని మనవి చేసింది. రెండవ స్త్రీ మాత్రం కాదు అది నాదైననుదాని దైనను కాకుండా చెరిసగము చేయమని కోరింది. వెంటనే రాజు తల్లిని ఎంతవ మాత్రం చంపవద్దని చెప్పిన స్త్రీకే ఆ బిడ్డను ఇవ్వ..ఆమె నిజమైన తల్లి అని తీర్పు చెప్పాడు. తన బిడ్డ మరణించింది కాబట్టి, తనతోటి స్త్రీ బిడ్డ కూడా చనిపోవాలని రెండస్త్రీ ఆశించింది. కానీ నిజమైన తల్లి మాత్రం బిడ్డ ప్రాణంతో ఉంటే చాలు.. తన వద్ద లేక పోయినా పర్వాలేదని భావించింది.దేవుడు ఇంతటి జ్ఞానం సొలొమోనుకు రాజు ఇచ్చాడు. ఆ తెలివితేటలతో ఎన్నో కీర్తనలు, సామెతలను రాశాడు. కానీ వృద్ధాప్యంలో మాత్రం చాలామంది స్త్రీలను వివాహం చేసుకుని, దేవుడికి వ్యతిరేకంగా పాపంలో జీవిస్తూ, మరణింస్తారు. సొంత తెలివి తేటలతో దేవుడిని సేవించలేం. మనకు ఏదైతే ఉందో అదంతా దేవుడు ఇచ్చిన కృపగా, బహుమానంగా భావించాలి. జ్ఞానముగలవానికి ఉపదేశము చేయగా వాడు మరింత జ్ఞానము నొందును (సామెతలు 9:9). ఆస్తిపాస్తులు, తెలివితేటలు, హోదా, ఆరోగ్యం, అంతస్తులు ఏవైనా సరే ఇవన్నీ దేవుడు తన దయతో మనకు ఇచ్చాడు అనే భావనతో మిక్కిలి వినయంతోప్రభువును సేవించాలి. ఆ జ్ఞానం పరలోకానికి చేర్చేలా ఉండాలి.

**- పి.వాణిపుష్ప**

తెర

# 'ఓ.! సుకుమారి' మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. : నిర్మాత మహేశ్వర్ రెడ్డి



యంగ్ హీరో తిరువీర్, ట్యాలెంటెడ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ విలేజ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'ఓ.! సుకుమారి'తో అలరించబోతున్నారు.

**'ఓ..! సుకుమారి' ఎలా ఉండబోతోంది?**

ఇది మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఎమోషన్, కామెడీ, వినోదం అన్నీ సమపాళ్లలో ఉంటాయి. సినిమా చాలా బాగా వచ్చింది.

**ఈ సినిమా ఎలా మొదలైంది?**

మా డీవోపీ దర్శకుడు భరత్ దర్శన్‌ను పరిచయం చేశారు. ఆయన కథ చెప్పారు. కథ చాలా నచ్చింది. దాదాపు ఏడాది పాటు స్క్రిప్ట్‌పై వర్క్ చేసిన తర్వాత సినిమా ప్రారంభించాం.

**ఈ కథలో మీకు బాగా నచ్చిన అంశం ఏమిటి?**

ఈ సినిమాలో ఒక యూనిక్ పాయింట్ ఉంది.'షాక్ కొట్టడం' అనే కాన్సెప్ట్ చుట్టూ వచ్చే వినోదం, భావోద్వేగాలు చాలా కొత్తగా ఉంటాయి. ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇస్తాయి.

**తిరువీర్, ఐశ్వర్య రాజేష్‌లను ఎంపిక చేయాలనే ఆలోచన ఎవరిది?**

కథకు తిరువీర్, ఐశ్వర్య రాజేష్ అయితే బాగా సరిపోతారని అనిపించింది. ఐశ్వర్య రాజేష్ కోసం దాదాపు మూడు నెలలు వెయిట్ చేశాం. ఆమె ఓకే చెప్పిన తర్వాతే షూటింగ్ ప్రారంభించాం.

**సినిమా గురించి ప్రేక్షకులకు ఏమి చెబుతారు?**

ప్రేక్షకులు టికెట్‌కు పెట్టిన ప్రతి రూపాయికి పూర్తి స్థాయి వినోదం పొందుతారు. ఇది ప్రతి కుటుంబం కలిసి చూసే మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్.

**ఈ సినిమాను థియేటర్లను దృష్టిలో పెట్టుకునే తీశారా?**

అవును. నేను మొదట నుంచి డిస్ట్రిబ్యూటర్‌ని. అందుకే థియేటర్ ఎక్స్‌పీరియన్స్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ సినిమాను రూపొందించాం.

**పాన్ ఇండియా రిలీజ్ చేయడానికి కారణం ఏమిటి?**

తిరువీర్‌కు తెలుగులో మంచి గుర్తింపు ఉంది. ఐశ్వర్య రాజేష్ కోసం తమిళంలో కూడా రిలీజ్ చేస్తున్నాం.

**అనుకున్న బడ్జెట్‌లోనే సినిమా పూర్తి చేశారా?**

నేనే అనుకున్న దానికంటే ఎక్కువ ఖర్చు చేశాను. ఈ రోజుల్లో ప్రేక్షకులు ప్రతి రూపాయికి విలువ కోరుకుంటున్నారు. ఖచ్చితంగా విజయం సాధిస్తుంది.

# 'లెనిన్' సక్సెస్ మీట్‌లోనాగార్జున



లెనిన్‌ను ఆదరిస్తోన్న తెలుగు ప్రేక్షకులకు థాంక్స్.. సక్సెస్ మీట్‌లో అఖిల్ అక్కినేని.. అఖిల్ హిట్టు కొట్టాడు అని అందరూ అంటుంటే ఆనందంగా ఉంది..'లెనిన్' సక్సెస్ మీట్‌లో నిర్మాత. సూర్య దేవర నాగవంశీ.. అఖిల్ అక్కినేని హీరోగా అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్‌ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగ వంశీ నిర్మించిన చిత్రం"లెనిన్". భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. ఈ మూవీ జూలై 10న గ్రాండ్‌గా విడుదలై బ్లాక్ బస్టర్ టాక్‌తో సక్సెస్ ఫుల్‌గా దూసుకుపోతోంది. ..నిర్మాత కింగ్ నాగార్జున మాట్లాడుతూ అన్నమయ్య చేశాక నేను దేవుడ్ని ఏదీ అడిగింది లేదు. కానీ తిరుపతిలో ఈవెంట్ అయ్యాక.. స్వామిని దర్శించుకున్నప్పుడు మాత్రం మా వాడికి ఓ హిట్టు ఇవ్వండని అడిగాను. భాగ్యశ్రీ కూడా అదే కోరుకుందని తర్వాత నాకు తెలిసింది. ముందుగా ఆ వెంకటేశ్వర స్వామికి కృతజ్ఞతలు. లెనిన్‌కి వాయిస్ ఇచ్చిన నా పెద్ద అబ్బాయి తారక్‌కి థాంక్స్. ఏడాదిన్నర క్రితం తండేల్ సక్సెస్ మీట్‌కి వచ్చాం. ఇప్పుడు ఇలా లెనిన్ సక్సెస్‌కి వచ్చాను. ఇద్దరూ నా రెండు కళ్లలాంటి వాళ్లు. లెనిన్ టీంని చూస్తే అసూయగా ఉంది. అందరూ ఎంతో ఇష్టపడి కష్టపడి చేశారు."శివ,"నిన్నే పెళ్లాడుతా, అన్నమయ్య సినిమాలు కూడా ఇలానే అందరం కలిసి చేశాం. ఈ మధ్య నాకు మళ్లీ ఇలాంటి అనుభవం కలగడం లేదు."లెనిన్"కి పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. అని అన్నారు..హీరో అఖిల్ అక్కినేని మాట్లాడుతూ లెనిన్ ఓ డిఫరెంట్ మూవీ అని మాకు తెలుసు. కమర్షియల్‌గా ఎలాంటి నంబర్స్ వస్తాయో అని అనుకున్నాను. కానీ మా లెనిన్ చిత్రానికి ప్రేక్షకులు గొప్ప విజయాన్ని అందించారు.

# 'శ్రీనివాస మంగాపురం'తో తెలుగులో పరిచయం కావడం నా అదృష్టం. : రాషా తడానీ



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు అన్న కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని అజయ్ భుపతి దర్శకత్వంలో 'శ్రీనివాస మంగాపురం' సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానిని కూడా ఈ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నారు. .

**'శ్రీనివాస మంగాపురం' కథను ఎప్పుడు విన్నారు?**

గత ఏడాది జూలైలో ఈ కథ విన్నాను. దర్శకుడు అజయ్ భూపతి గారు కథ చెప్పిన విధానం, పాత్రలను, అందులోని ప్రేమ, ఎమోషన్‌ను తీర్చిదిద్దిన తీరు నాకు ఎంతగానో నచ్చాయి.

**మీ క్యారెక్టర్ ఇందులో ఎలా ఉండబోతుంది?**

నా పాత్రకు రెండు షేడ్స్ ఉంటాయి. ఒకవైపు చాలా బబ్లీగా, ఎక్సైటెడ్‌గా ఉంటుంది. మరోవైపు చాలా పద్ధతిగా, హుందాగా ఉండే అమ్మాయిగా కనిపిస్తుంది. నాకు తెలుగు అర్థమవు తుంది. కానీ స్పష్టంగా మాట్లాడలేను. ఈ సినిమా కోసం దర్శకుడు అజయ్ భూపతి ప్రతి డైలాగ్, అందులోని ఎమోషన్‌ను దగ్గరుండి నేర్పించారు. ప్రతి విషయంలో చాలా కేర్ తీసుకున్నారు. మంగా పాత్ర నాకు చాలా దగ్గరగా ఉంటుంది.

**జయకృష్ణ ఘట్టమనేనితో పని చేయడం ఎలా అనిపించింది?**

జయకృష్ణ చాలా స్వీట్ అండ్ కూల్ పర్సన్. సెట్లో చాలా సరదాగా వుంటారు. షూటింగ్ సమయంలో చాలా ఫన్ ఉండేది.

**మోహన్ బాబుతో పని చేయడం ఎలా అనిపించింది?**

మా అమ్మగారు కూడా మోహన్ బాబుతో కలిసి పని చేశారు. ఆయనతో పని చేయడం చాలా ఫన్ ఎక్స్‌పీరియెన్స్. సెట్లో చాలా సరదాగా ఉంటారు. ఎప్పుడూ జోకులు చెబుతూ ఉంటారు.


**ఇది తెలుగులో మీ మొదటి సినిమా. ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నారు?**

నాకు తెలుగు తెలియదు. మొదట్లో డైలాగులు అర్థం చేసుకోవడానికి కాస్త కష్టపడ్డాను. కానీ దర్శకుడు అజయ్ భూపతి నాకు చాలా హెల్ప్ చేశారు. తెలుగు, హిందీ కలిపి డైలాగుల అర్థం చెప్పేవారు.

**వైజయంతి మూవీస్ ద్వారా తెలుగులో రావడం ఎలా అనిపించింది?**

వైజయంతి మూవీస్ చాలా ప్రతిష్టాత్మకమైన సంస్థ. ఆ సంస్థ నుంచి మహేష్ బాబుతో పాటు ఎంతో మంది స్టార్స్ పరిచయం అయ్యారు. నా జీవితంలో కలిసిన బెస్ట్ పర్సన్‌లలో అశ్వినిదత్ ఒకరు.

# 'సూపర్ హీరో బాబు' ఫస్ట్ లుక్ విడుదల



అర్జున్ దాస్, శాండీ మాస్టర్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'సూపర్ హీరో బాబు' (తమిళంలో 'సూపర్ హీరో'). ఈ చిత్రాన్ని జాతీయ అవార్డు గ్రహీత నిర్మాత కె.ఎస్. సినిష్ 'సోల్జర్స్ ఫిల్మ్ ఫ్యాక్టరీ' బ్యానర్‌పై సమర్పిస్తుండగా 'రెడాక్టెడ్ స్టూడియోస్'కు చెందిన శంజన్ జి సంయుక్తంగా నిర్మించారు. తెలుగు తమిళ ద్విభాషా చిత్రంగా"సూపర్ హీరో బాబు రాబోతోంది.'బెలూన్‌ఖి చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన కె.ఎస్. సినిష్ డిక్కిలూనా. పార్కింగ్‌తో నిర్మాతగానూ మంచి పేరు సంపాదించుకున్నారు. నిర్మాతగా సినిష్ తన ప్రయాణాన్ని కొనసాగిస్తూ అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా కంటెంట్ ఉన్న కథతో 'సూపర్ హీరో'ని నిర్మించారు.అర్జున్ దాస్‌కి తెలుగులో మంచి క్రేజ్ ఉందన్న సంగతి తెలిసిందే. రీసెంట్‌గా ఓజీతో అందరినీ ఆకట్టుకున్నారు. అలాంటి అర్జున్ దాస్ సూపర్ హీరో బాబుచిత్రంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. హీరోయిన్ తేజు అశ్విని, అర్జున్ దాస్ సీన్స్ ఈ మూవీకి హైలెట్ కానున్నాయి. ఈ చిత్రంతో విఘ్నేష్ వేణుగోపాల్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఖిబెలూన్‌ఖి సినిమాకి కె.ఎస్. సినీష్ వద్ద సహాయ దర్శకుడిగా విఘ్నేష్ వేణుగోపాల్ పనిచేశారు. సూపర్ హీరో బాబు చిత్రానికి సంగీతాన్ని హేషమ్ అబ్దుల్ వహాబ్ అందించారు.ఖుషి, హాయ్ నాన్న, ది గర్ల్‌ఫ్రెండ్ వంటి భావోద్వేగభరితమైన చిత్రాలకు హేషమ్ అందించిన సంగీతం ఎంత పెద్ద హిట్ అయిందో అందరికీ తెలిసిందే.

# ఎంఆర్‌పి 'నీకెంత నాకెంత' ప్రీ రిలీజ్ ఈవెంట్.



ఈ చిత్రంలో నరేష్ అగస్త్య హీరోగా నటించగా, డోనల్ బిష్ట్ కథానాయికగా అలరించనున్నారు. అలాగే వెన్నెల కిషోర్, సుదర్శన్, కసిరెడ్డి రాజ్‌కుమార్, హర్ష వర్ధన్, చైతన్య జొన్నలగడ్డ, పృథ్వీ రాజ్, గగన్ విహారి, నంద గోపాల్, స్నేహా సింగ్ తదితరులు కీలక పాత్రల్లో నటించి సినిమాకు మరింత బలం చేకూర్చారు. శ్రవణ్ జేష్ఠ నిర్మాతగా, దర్శకుడిగా తెరకెక్కించిన ఈ చిత్రానికి రాకేష్ కొలాంచి సినిమాటోగ్రఫీ అందించగా, అజయ్ అరసాడ సంగీతాన్ని సమ కూర్చారు. మార్థాండ్ కె. వెంకటేష్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించారు. దర్శక నిర్మాత శ్రవణ్ జేష్ఠ మాట్లాడుతూ:.. మా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు విచ్చేసి మాకు అండగా నిలిచిన మీడియా మిత్రులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సినిమాను పూర్తి చేయడానికి తమ సమయం, కృషిని అంకితం చేసిన మా నటీనటులు, సాంకేతిక నిపుణులు, మొత్తం చిత్ర బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు. .హీరో నరేష్ అగస్త్య మాట్లాడుతూ:.. మా ఎంఆర్‌పి 'నీకెంత నాకెంత' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు విచ్చేసి మాకు అండగా నిలిచిన మీడియా మిత్రులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన మా దర్శక నిర్మాత శ్రావణ్ జేస్తాకి ప్రత్యేక కృతజ్ఞతలు. హీరోయిన్ డోనల్ బిష్ట్ మాట్లాడుతూ:.. ఎంఆర్‌పి నీకెంత నాకెంత నా తొలి తెలుగు సినిమా కావడం నాకు ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తోంది. ఈ సినిమాపై వస్తున్న స్పందన చూసి చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది.

# 'వెంకట్రామయ్యగారి తాలుకా' మూడో పాట 'అడుకున్న దిక్కడే' లిరికల్ సాంగ్ విడుదల



కుటుంబ బంధాలు, మానవ సంబంధాల విలువలను హృద్యంగా ఆవిష్కరిస్తూ రూపొందు తున్న వెంకట్రామయ్య గారి తాలుకా ఈ చిత్రం ఈనెల 17 న ప్రేక్షకుల ముందుకి రానుంది. ప్రమోషన్ లో భాగంగా ఈ చిత్రం నుంచి మూడో గీతం ..ఆడుకున్న దిక్కడే.. లిరికల్ సాంగ్‌ను స్టార్ దర్శకుడు వి.వి. వినాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందానికి ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తూ, సినిమా మంచి విజయాన్ని సాధించాలని ఆకాంకించారు.ఈ సందర్భంగా చిత్ర యూనిట్ మాట్లాడుతూ, "ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ఇప్పుడు విడుదల చేసిన ..ఆడుకున్న దిక్కడే.. పాట కూడా ప్రతి ఒక్కరిని హృదయానికి హత్తుకునేలా ఉంటుంది. కథలోని భావోద్వేగాలను ప్రతిబింబించే ఈ గీతం ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుంది" అని తెలిపారు.హీరో దినేష్ కుమార్ హీరోయిన్‌గా పరిచయమవుతున్న దివిజ ప్రభాకర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి సతీష్ ఆవాల దర్శకత్వం వహిస్తున్నారు. కోమలి క్రియేషన్స్ పతాకంపై కోమలి మహేందర్ తొట్టె సోమేష్ సారిపల్లి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కుటుంబ అనుబంధాలు, తల్లిదండ్రుల ప్రేమ, భావోద్వేగాలతో నిండిన ఈ చిత్రం జులై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.

12vzm15:12vzm15.qxd 11-07-2026 22:12 Page 1



## గొర్రెలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు

బలిజిపేట, జులై 11, ప్రభాత వార్త :



బలిజిపేట మండలంలోని మిర్తివలస , వంతారం గ్రామాల్లో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ సిబ్బంది గొర్రెలకు ఉచితంగా టీకాలు వేయడంతో పాటు, నీలి నాలుక వ్యాధి లక్షణాలు, వ్యాప్తి, నివారణ చర్యలపై గొర్రెల పెంపకదారులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా, బలిజిపేట మండలంలోని మిగిలిన గ్రామాల్లో కూడా 30.07.2026 వరకు గొర్రెలకు చిటుక వ్యాధి, నీలి నాలుక వ్యాధుల నివారణ టీకాల కార్యక్రమం కొనసాగుతుంది. అందువల్ల గొర్రెల పెంపకదారులు తమ మందలోని అన్ని గొర్రెలకు తప్పనిసరిగా టీకాలు వేయించుకుని పశుసంవర్ధక శాఖ సిబ్బందికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. గొర్రెలలో జ్వరం, నోటి పుండ్లు, నాలుక నీలిరంగులోకి మారడం, ముక్కు నుంచి స్రావం, కుంటుతూ నడవడం వంటి లక్షణాలు కనిపించినట్లయితే వెంటనే సమీప పశువైద్యశాలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సిబ్బంది, పశు సంవర్ధక సహకులు మరియు గొర్రెల పెంపకదారులు పాల్గొన్నారు.

## కుల, మత విద్వేషాలు రెచ్చగొడుతున్న గొడ్డలి పార్టీ : కళా



చీపురుపల్లి , జులై 11, ప్రభాతవార్త :

రాష్ట్రంలో కుల మత విద్వేషాలను రెచ్చగొడుతూ వైయస్సార్ గొడ్డలి పార్టీ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుందని చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకట్రావు అన్నారు. శనివారం నాడు చీపురుపల్లి పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల మధ్య విద్వేశాలను సృష్టిస్తూ ప్రజలను భయభ్రాంతులను చేస్తూ మళ్ళీ అధికారం చేపట్టడానికి వైఎస్ఆర్ గొడ్డలి పార్టీ పన్నాగాల పన్నుతుందని కళా వెంకట్రావు అన్నారు. ప్రజాస్వామ్య విలువల కోసం మాట్లాడే అర్హత గొడ్డల పార్టీ నేతలకు లేదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. జోసఫ్ రావణులాంటి వారికి నెలవారి కడుతూ ప్రజాస్వామ్యాన్ని కూల ద్రోయడానికి కుట్ర పన్నుతున్నారని ఆయన అన్నారు. గొడ్డల పార్టీ అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని ఆ పార్టీకి పరాకాష్ట చేయడానికి సమయం దగ్గర పడిందని ఈ సందర్భంగా హెచ్చరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచన జరిపి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్న గొడ్డల పార్టీ నేతలపట్ల చర్యలు చేపట్టవలసిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యానికి కాపాడుటకు, ప్రజలను కాపాడుకొనుటకు అటువంటి పార్టీ నేతలకు తగిన శాస్తి జరపడానికి రాజకీయవాదుల ఆలోచన జరపాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం కోసం మాట్లాడే అర్హత ఆ పార్టీ నాయకులకు లేదన్నారు. భారతీయ జనతా పార్టీ ప్రారంభ దశలో ఒక్క సీటును గెలుచుకొని ప్రజాస్వామ్యానికి విలువనిస్తూ పార్లమెంటుకు హాజరై ప్రజల సమస్యలు తెలియజేసిన రోజులు ఆయన గుర్తు చేశారు. అటువంటిది 11 సీట్లు గెలుచుకున్న వైసీపీ నాయకులు కనీసం ఒక్కరోజు కూడా అసెంబ్లీకి హాజరు కాకుండా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని కళ అన్నారు. బ్రిటిష్ కాలంలో సైతం కోర్టులను గౌరవించి భారతీయ నేతలు ఎంతోమంది జైలు శిక్షణ అనుభవించారని అటువంటిది వేల కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడిన గొడ్డలి పార్టీ అధినేత కోర్టుకు హాజరు కాకుండా ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్నారు. ప్రపంచ దేశాలలో ఎంతోమంది డాన్లు కోర్టులకు హాజరై ప్రజాస్వామ్య బద్ధంగా నడుచుకున్నప్పటికీ , ప్రస్తుత గొడ్డలి పార్టీ అధినేత.. పొలిటికల్ డాన్ సినిమా తరహాలో విలన్ గా వ్యవహరిస్తూ కోర్టుకు హాజరుకాకుండా కాలం గడుపుతున్నారు అన్నారు. గొడ్డలి పార్టీ అవినీతిని అక్రమాలను సక్రమంగా నడిపించుకోవడం కొరకు అధికార దాహంతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆయన అన్నారు. మళ్లీ అధికారం చేపట్టడానికి గొడ్డలి పార్టీ జరుగుతున్నా అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, ఆ పార్టీని పూర్తిగా భూస్థాపితం చేయడం త్వరలోనే జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన వివరించారు. సొంత చిన్నాన్ననే గొడ్డలితో నరికన కేసును నీరుగారిచే ప్రయత్నాలు చేస్తూ చిన్నాన్న కూతుర్నే ఏడిపిస్తున్నారని కళా వెంకట్రావు అన్నారు. ఐదేళ్ల గొడ్డలి పార్టీ పాలనలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి అక్రమాలకు అన్యాయాలకు దౌర్జన్యాలకు పాల్పడిన ఆ పార్టీకి 11 సీట్లతో ప్రజలు తగిన శాస్తి చేసినప్పటికీ ఆ నాయకుల్లో మార్పు రాకపోవడం విడ్డూరమన్నారు. ఇదిలా ఉండగా నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న సర్ కార్యక్రమం సుమారు 80% పూర్తయిందని, ఈ కార్యక్రమంలో అధికారులకు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఇదిలా ఉండగా ప్రజా దర్బార్ కార్యక్రమంలో భాగంగా వినతులు స్వీకరించిన కళా వెంకట్రావు వాటిని బుట్ట దాఖలు చేయకుండా అధికారులు తక్షణమే పరిష్కరించాలని హెచ్చరించారు. చీపురుపల్లి గరివిడి ప్రాంతాలకు చెందిన పలువురు క్రీడాకారులు విద్యార్థులు తమకు క్రీడా మైదానం లేక గరివిడి కళాశాలకు క్రీడల కోసం వెళుతుంటే అక్కడ అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారంటూ ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. పోలీస్ ఆర్మీ నేవీ వంటి ఉద్యోగాల కొరకు నిత్యం సాధన చేస్తున్న తమకు ఇటువంటి వస్తువులు లేకుండా క్రీడా మైదాన సౌకర్యాన్ని గరివిడి కళాశాలలో కల్పించాలని ఎమ్మెల్యే కు వినతిపత్రం అందజేశారు. టీడీపీ నాయకులు రౌతు కాము నాయుడు, దన్నాన రామచంద్రుడు, పైల బలరాం, ఆరిపాక సురేష్, కోట్ల మోతిలాల్ నాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగాన రామారావు, రౌతు నారాయణరావు, చీపురుపల్లి గుర్ల, మెరక ముడుదాం, మండలాల పార్టీ శ్రేణులు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భద్రతే కూటమి ప్రభుత్వ లక్ష్యం : మంత్రి

### - 442 మందికి రాజముద్రతో కూడిన పట్టాదారు పుస్తకాలు పంపిణీ

గజపతినగరం, జులై 11 ప్రభాతవార్త:



ప్రజల భద్రతే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గంలోని సాలిపేట గ్రామంలో 442 మందికి ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హక్కుదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కొండపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రీ సర్వే పేరుతో వైసీపీ ప్రభుత్వం అనేక అవకతవకలను చేసిందన్నారు సాగు రైతులకు, సరిహద్దుదారులకు ఆఖరికి కుటుంబ సభ్యులకు సైతం గొడవలు సృష్టించి విధ్వంసం చేశారన్నారు. తాతల నుండి వచ్చిన ఆస్తులతో హక్కుదారులు ఒకరైతే, సాగులో మరొకరు ఉండటంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందారన్నారు. రీ సర్వే పేరుతో గత ప్రభుత్వం గందరగోళం సృష్టించిన మోసాన్ని ముందే గమనించిన చంద్రబాబునాయుడు హక్కు దారుడు ఫోటోతో రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు అందించడం జరుగుతుందని ఎన్నికల హామీ ఇవ్వడం జరిగిందన్నారు. తాతల నుండి వచ్చిన ఆస్తి కి సంబంధించిన ప్రభుత్వం నుంచి అందించే పాసు పుస్తకంపై నాటి ముఖ్యమంత్రి జగన్ ఫోటో చూసి ప్రజలు విస్మయం చెందారన్నారు. అలాగే 700 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి ఫోటోలతో సర్వే రాళ్లు వేయించిన మహా మోసగాడు జగన్ అన్నారు. రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన విధానానికి అద్దం పడుతుందన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరికి పాస్ పుస్తకం అందించేలా పనిచేసిన రెవెన్యూ సిబ్బందికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు అభినందనలు తెలిపారు. ఎన్నికల హామీలను అమలు పరుస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి మాట్లాడుతూ గ్రామంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి హక్కుదారులందరికీ పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వడం శుభ పరిణామం అన్నారు గ్రామస్తుల దశాబ్దాల కల నెరవేరిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, కూటమి నాయకులు రెడ్డి పావని, దుగ్గి దేవుడు, భాస్కరరావు, రొంపిల్లి అరుణ, చిన్నం నాయుడు, బంగారు నాయుడు , తదితరులు పాల్గొన్నారు.

## మురుగుతో అనారోగ్య సమస్యలు.. పట్టించుకోని అధికారులు

చీపురుపల్లి , జులై 11, ప్రభాతవార్త :



చీపురుపల్లి మండలం కరకం గ్రామంలో పాఠశాలకు సమీపంలో మురికి నీరు నిల్వ కావడంతో విద్యార్థులు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. పాఠశాలకు వెళ్లే రహదారిలో పాఠశాలకు సమీపంలోనే మురుకు నీరు నిలువ కావడంతో ఆ ప్రాంతం గుండా రాకపోకలు సాగించడానికి విద్యార్థులు నిత్యం నరకాన్ని చూస్తున్నారు. కరకం గ్రామంలో మురికి నీటి వలన అనారోగ్య సమస్యలు చిన్న పిల్లలు తల్లిదండ్రులు వాపోతున్నారు. స్కూలుకి అనుకొని మురికి కాలువ వలన ఉండటంతో పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మురికి నీటి నిల్వల కారణంగా దోమలు ఈగలు చెలరేగి రోగాల బారిన పడుతున్నారంటూ పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా అర్హులైన ప్రయాణించే వృద్ధులు సైతం అవస్థల పడుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. హాహాకారాక అనుకొని మురికి నీటి సైతం జ్వరాలు, దగ్గులతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురికి నీటి నిల్వలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదం... వృద్ధుడికి గాయాలు

చీపురుపల్లి , జులై 11, ప్రభాతవార్త :

చీపురుపల్లి మండలం పిఎస్ లక్ష్మీపురం సమీపంలోని పోతాయి వలస గ్రామ జంక్షన్ వద్ద శనివారం నాడు జరిగిన రోడ్డు ప్రమాదంలో పిఎస్ లక్ష్మీపురం గ్రామానికి చెందిన జగ్గురోతు లక్ష్మినాయుడు ( 62) అనే వృద్ధుడు తీవ్రగాయాలు పాలయ్యాడు. పోలీసుల సమాచారం మేరకు పిఎస్ లక్ష్మీపురానికి చెందిన జగ్గురోతులక్ష్మినాయుడు తన మోటార్ సైకిల్ పై పోతాయి వలస గ్రామం నుండి వస్తుండగా పోతాయి వలస జంక్షన్ వద్ద మీసాల నరసింహనాయుడు తన ద్విచక్ర వాహనంతో వేగంగా వచ్చి లక్ష్మినాయుడుని బలంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో లక్ష్మినాయుడుకు బలమైన గాయాలు అయ్యాయి. గాయపడిన వ్యక్తిని చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం పరిస్థితి విషమంగా మారడంతో విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించి చీపురుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రూర్బన్ పంచాయతీతో మారనున్న కొండపాలెం స్వరూపం

### జిల్లాలో 6 మేజర్ పంచాయతీలు రూర్బన్ పంచాయతీలుగా అప్‌గ్రేడ్

గరివిడి, జులై 11,ప్రభాతవార్త:



కొండ పాలెం(గరివిడి)మేజర్ పంచాయతీ రూర్బన్ పంచాయతీ గా రూపాంతరం చెందడంతో పంచాయతీ స్వరూపం మారే అవకాశాలు సాక్షాత్కరిస్తున్నాయి. రాష్ట్రంలో 359 మేజర్ పంచాయతీ లు రూర్బన్ పంచాయతీ లుగా అప్ గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఈ నెల 8న జీఓ జారీ చేసింది. జిల్లా లో ఆరు మేజర్ పంచాయతీ ల్లో కొండ పాలెం పంచాయతీ కూడా రూర్బన్ జాబితా లో చోటు చేసుకోవడంతో పంచాయతీ అభివృద్ధి దిశగా పరుగులు పెట్టే అవకాశం ఉంటుంది. ప్రత్యేక నిధులు మంజూరు అయ్యే అవకాశం ఉండటం, ప్రత్యేక ఉద్యోగ నియామకాలు జరుపుకునే అవకాశం ఉండటంతో పంచాయతీ సర్వతో ముఖాభివృద్ధి సాధనకు అవకాశం ఏర్పడుతుంది. అలాగే అధికారులు హోదాలు మారనున్నాయి. రాష్ట్రంలో 13,351 పంచాయతీ ల్లో 359 పంచాయతీలు రూర్బన్ పంచాయతీలుగా మార్చుతూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కాంతి లాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం జిల్లాలో చీపురుపల్లి, కొండ పాలెం(గరివిడి),కొత్తవలస, రామభద్రపురం, జామి,శృంగవరపుకోట పంచాయతీలు రూర్బన్ పంచాయతీలుగా మార్చుతూ పంచాయతీ రాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో మాదిరిగానే ప్రాదేశిక సభ్యులు కొనసాగుతారు,వార్డు సభ్యులు ఉంటారు. నగర పంచాయతీ కి సమానంగాను,దీటుగాను రూర్బన్ పంచాయతీ కనిపిస్తుంది. అలాగే అదనపు నిధులు మంజూరు అయ్యే అవకాశం ఉంటుంది, వివిధ శాఖల్లో అదనపు సిబ్బంది నియామకం, అధికారులు పదోన్నతులు కలిగే అవకాశం ఉంటుంది. పంచాయతీ లు పునర్వ్యవస్థీకరణ తో రూర్బన్ పంచాయతీ గా మారిన కొండ పాలెం లో కొత్త సొగసులు తో,సరికొత్త అభివృద్ధి తో ముందుకు సాగనుండటం పంచాయతీ వాసులకు అభివృద్ధి ఫలాలు చేరువయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే అధికారులు, అదనపు సిబ్బంది నియామకం జరగనుండటంతో నిరుద్యోగ యువతకు ఉపాది ఉద్యోగావకాశాలు కూడా మెరుగయ్యే అవకాశం ఉంటుంది. పంచాయతీకి అదనపు నిధులు,అదనపు సిబ్బంది మంజూరు తో రూర్బన్ పంచాయతీ లు స్వరూపం మారే అవకాశం ఉండటం ముదావహం.

## ఆలయ నిర్మాణానికి రూ.1,20,000 విరాళం

చీపురుపల్లి , జులై 11, ప్రభాతవార్త:



చీపురుపల్లి పట్టణంలో గల జి అగ్రహారంలో నిర్మాణం జరుగుతున్న పైడితల్లి అమ్మవారీ ఆలయ నిర్మాణానికి సిరియాల భాస్కర్ రావు అతని కుటుంబ సభ్యులు ఒక లక్ష 20000 రూపాయల ఆర్థిక సహాయంను శనివారం నాడు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు విజ్ఞప్తి మేరకు భాస్కరరావు స్పందించి ఆలయం పై పలు దేవతామూర్తులకు విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు లక్ష్మణ, రాము భాస్కర రావు కుటుంబీకులను అభినందించారు. ఆలయ నిర్మాణమునకు మరి కొంతమంది దాతలు ముందుకు రావాలని ఈ సందర్భంగా వారు కోరారు. కార్యక్రమంలో పలువురు కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## నాటు సారా తయారీ కేంద్రాలపై దాడులు : సిఐ

కురుపాం, జులై11, ప్రభాతవార్త :



ఆంధ్రా, ఒడిస్సా సరిహద్దు గ్రామాలలో నాటు సారా తయారీ కేంద్రాలపై ఒడిస్సా ఎక్సైజ్ పోలీసుల సహకారం తో సంయుక్త దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం నవోదయం 2.0 కార్యక్రమంలో అమలు లో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ కె. సహదేవ్ ఆధ్వర్యంలో ఆంధ్రా - ఒడిస్సా సరిహద్దులో గల నాటు సారా తయారీ స్థావరం కలిగిన రెంగల్పాడు గ్రామంలో ఒడిస్సా ఎక్సైజ్ అధికారులతో కలిసి సంయుక్త దాడులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. నాటు సారా తయారీ కోసం సిద్ధంగా ఉంచిన 6,500 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. నాటు సారా బట్టిలలో తయారు చేసి డ్రమ్ములలో నిల్వఉంచిన 620 లీటర్ల నాటు సారాను, సారాయి తయారీ కోసం సిద్ధంగా ఉంచిన 1000 కేజీలు అమ్మోనియా, 600 కేజీల నల్లబెల్లం, 300 కేజీల ఇప్పపువ్వును స్వాధీనం చేసుకొని అధికారుల సమక్షంలో ధ్వంసం చేశామన్నారు. ఈ దాడుల్లో పార్వతీపురం టాస్క్ ఫోర్స్ ఏ ఇ ఎస్ ఎ. సంతోష్,ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వివిఎస్ శేఖర్ బాబు సిబ్బంది, విజయనగరం ఎన్ఫోర్స్ మెంట్ ఎ ఇ ఎస్. గోపాల కృష్ణ సిబ్బంది, రాయగడ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ బాలక బిషి, రాయగడ మొబైల్ ఇన్స్పెక్టర్ కె పి సింధూర్, శేష్కల్ పోలీస్ స్టేషన్ ఎ ఎస్ ఐ దమేశ్వర్ మహేజీ, కురుపాం ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ జె. రాజశేఖర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. నాటు సారా పై సరిహద్దులో నిరంతర నిఘా పెడుతున్నామనిన్నారు, ఒడిస్సా పోలీస్ , ఎక్సైజ్ అధికారులు సహకారంతో నాటు సారాయి తయారీ కేంద్రాలపై నిరంతర నిఘా ఉంచామని తెలిపారు.

## ఏరియా ఆసుపత్రిలో స్వచ్ఛంద రక్తదానశిబిరం : మంత్రి

సాలూరు , జులై11, ప్రభాతవార్త :



రక్తదానం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని అలాగే ప్రాణదానంతో సమానమని మంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు. శనివారం ఉదయం సాలూరు ఏరియా ఆసుపత్రిలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే రక్తదాన శిబిరంతో పాటుగా ప్రధానమంత్రి టిబి ముక్తిభారత్ అభియాన్‌లో హ్యాండ్ హెల్డ్ ఎక్స్-రే మిషన్ ఇంకా ప్రత్యేక టీబి స్క్రీనింగ్, ఎక్స్-రే యూనిట్స్ ఆమె చేతులు మీదుగా ప్రారంభించారు. అంతేకాకుండా ఈ రక్తదాన శిబిరంలో ఎందరో యువకులతో పాటుగా టౌన్ సీఐ అప్పలనాయుడు స్వచ్ఛందంగా రక్తదానం చేయడంతో షేక్ హ్యాండ్ ఇచ్చి మంత్రి థాంక్స్ చెప్పారు. అలాగే ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేసి సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ మీనాక్షి, డాక్టర్స్,వైద్య సిబ్బంది ఇంకా ముఖీ.సూర్యనారాయణ, అక్యాన.అప్పారావు,హర్షవర్ధన్ , తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లోనే మొబైల్ ఎక్స్‌రేతో రోగ నిర్ధారణ పరీక్షలు

### ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.మీనాక్షి



సాలూరు, జులై11, ప్రభాతవార్త :

గతంలో గ్రామాలు అలాగే గిరిజన శిఖరగ్రామాల నుండి ప్రజలు ఇంకా గిరిజనులు టీబి రోగనిర్ధారణ పరీక్షలకు ఆసుపత్రికి రావలసి ఉండేదని కానీ ఇప్పుడు మొబైల్ ఎక్స్-రే మిషన్ అందుబాటులోకి వచ్చిందని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి స్థానిక విలేకరులకు తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మేడికల్ ఆఫీసర్ ద్వారా హైరిస్క్ గ్రామాల్లో (గిరిశిఖర గ్రామాలు)టీబి స్క్రీనింగ్ చేసి హ్యాండ్ హెల్డ్ ఎక్స్-రే మిషన్ ద్వారా అక్కడే ఎక్స్-రే తీయడం జరుగుతుందన్నారు. అలాగే కఫ పరీక్షలు చేసి రోగనిర్ధారణ చేయడం ఇంకా టీబి పరీక్షల్లో నిర్ధారణ అయితే 6 నెలల పాటు దగ్గరలో ఉన్న ఆసుపత్రిలో ఆశ వర్కర్ పర్యవేక్షణలో మందులు అందజేస్తారని డాక్టర్ మీనాక్షి స్పష్టం చేశారు.

## శివాలయ నిర్మాణానికి విరాళం



మెరకముడిదాం,జులై 11, ప్రభాతవార్త :

మండలంలో గరుగుబిల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి మాజీ సర్పంచ్ ఆవాల అప్పలనాయుడు కుమారుడు ఆవాల నరేంద్ర 1,11,111 రూపాయలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి చిరంజీవి నాయుడు, మాజీ ఎంపిటిసి ఆవాల సన్యాస అప్పలనాయుడు, ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## సర్ ప్రక్రియపై బిఎల్‌వోలు దృష్టిసారించాలి : బొబ్బిలి ఆర్డీవో

రామభద్రపురం, జులై 11, ప్రభాత వార్త :



మండలంలో సర్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయడానికి బిఎల్వోలు దృష్టిసారించాలని బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావు సూచించారు. మండల కేంద్రం లో శనివారం బీఎల్ వోలు, బూత్ లెవిల్ ఆఫీసర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో మూడు రోజుల సమయం మాత్రమే ఉండడంతో అధికార ఎలు వందశాతం డిజిటలైజేషన్పై దృష్టిసారించి వేగవంతం చేయాలని తెలిపారు. అలాగే మండలంలో వివిధ గ్రామాల్లో ఇప్పటివరకు ఎంత శాతం సర్వే ప్రక్రియ జరిగిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సర్వు వేగవంతం చేయడంలో ఉన్న కష్టాలు ఏంటని ప్రశ్నించారు. మండలంలో ఈ సర్వు శతశాతం పూర్తిచేయడానికి అధికారులు అన్ని చర్యలు తీస ఏకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తహసిల్దార్ అజారఫీజాన్, ఎంపీడీవో రత్నం, ఎలక్షన్ డీటీ బలివాడ గౌరీశంకరరావు పాల్గొన్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం
వార్త 25

## పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ

దత్తిరాజేరు, జులై 11, ప్రభాతవార్త :

మండలంలోని పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ దామోదర్ శనివారం సాయంత్రంసందర్శించారు పోలీస్ స్టేషన్ పరిసరాలను రికార్డులను పరిశీలించారు ఈ సందర్భంగా పోలీసులకు పలు సూచన తెలియజేశారు రోడ్డు భద్రత గంజాయి నియంత్రణ మహిళల భద్రత సైబర్ నేరాలు వంటి సమస్యలపై ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు గ్రామాల్లో ప్రజలకుమత్తు పదార్థాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు ప్రయోగమూర్తి కళాధర్ సిబ్బంది పాల్గొన్నారు.

## తోటపల్లి ఆలయాల హుండీలు లెక్కింపు

### దేవస్థానం ఈవో వి.వి. సూర్యనారాయణ వెల్లడి

గరుగుబిల్లి, జులై 11, ప్రభాతవార్త :



ఉత్తరాంధ్రలో చిన తిరుపతిగా ప్రసిద్ధి చెందిన తోటపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి, కోదండ రామస్వామి ఆలయాల హుండీలు లెక్కింపు కార్యక్రమంను దేవస్థానం అధికారులు శని వారం చేపట్టారు. శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు శ్రీకోదండ రామస్వామి ఆలయంలో భక్తులు కానుకల రూపంలో హుండీలలో నుంచి వచ్చిన ఆదాయమును లెక్కింపు చేపట్టడం జరిగిందని దేవస్థానం కార్య నిర్వహణ అధికారి వి.వి.సూర్యనారా యణ పేర్కొన్నారు. ఈమేరకు శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి 8,00,192 రూపాయలు అదే విధంగా శ్రీకోదండ రామస్వామి ఆలయం నుంచి 9,712 రూపాయలు ఆదాయం వచ్చిందని దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వి.వి.సూర్యనారాయణ వెల్లడించారు. శ్రీవెంకటేశ్వర స్వామి, కోదండ రామస్వామి ఆలయాల హుండీలు లెక్కింపు కార్యక్రమమును బొబ్బిలి దేవా దాయ శాఖ ఇన్స్పెక్టర్ సమక్షంలో చేపట్టడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ మార్కొండ పకీరు నాయుడుతో పాటు పలువురు సభ్యులు, స్వామివారి సేవకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది గంట శ్రీధర్ నాయుడు పాల్గొన్నారు.

## మేలు రకమైన పశుగ్రాసాల సాగుపై దృష్టిసారించాలి



వేపాడ, జులై 11, ప్రభాత వార్త:

అధిక పోషక విలువలు కలిగిన మేలు రకమైన పశు గ్రాసాల సాగుపై దృష్టి సారించాలని మండల పశు వైద్యాధికారిని డాక్టర్ కోరాడ గాయత్రి కోరారు. వేపాడ మండలం బర్తవానిపాలెం గ్రామంలో శనివారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు గ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులకు ఏడాది పొడవునా నాణ్యమైన పచ్చిమేత అందుబాటులో ఉండేలా రైతులు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. అలాగే వర్షాకాలాన్ని సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడి ఇచ్చే మేత పంటలను సాగు చేయడం, సైలేజ్ మరియు హే తయారీ ద్వారా మేతను నిల్వ చేసుకోవడం, సమతుల్య పోషకాహారం అందించడం వల్ల పాల ఉత్పత్తి పెరగడంతో పాటు పశువుల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. అనంతరం రైతులకు నేపియర్, జొన్న, మొక్కజొన్న, గినియా గడ్డి వంటి మేత పంటల సాగు విధానాలు, మేత నిర్వహణ, పోషక విలువలు పశు గ్రాస ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పశు ఆరోగ్య , గర్భ కోస వ్యాధుల చికిత్సా శిబిరం నిర్వహించి పశువులకు వైద్యం అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షులు పి వెంకటరమణ, పశు వైద్య సిబ్బంది , నీలకంఠరాజపురం గోపాలమిత్ర పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సూచనలతో ప్రజాదర్బార్ : మంత్రి

విజయనగరం, జులై 11, ప్రభాత వార్త:



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచనలతో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేద రిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం విజయనగరం మంత్రి క్యాంప్ కార్యాల యంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గజపతినగరం నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన 32 మంది వద్ద నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ నేరుగా ప్రజల సమస్యలను పరిష్కరించటం కోసం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో ముఖ్యంగా లోఓల్టేజ్ సమస్యకు సంబంధించిన దరఖాస్తులు అందటం జరిగింది. ఇప్పటికే నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 200 ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. లో వోల్టేజ్ సమస్య పరిష్కరించడం కోసం అధికారులు నివేదిక ఆదేశించడం జరిగిందన్నారు. ముఖ్యంగా మౌలిక వసతులకు సంబంధించి పది వినతులు అందినట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు తెలిపారు. ఎదురు వాడ పంచాయతీలో రోడ్డు నిర్మాణం కోసం దరఖాస్తు చేయడం జరిగిందన్నారు. ప్రజా దర్బార్ లో వచ్చిన వినతులను సంబంధిత అధికారులతో త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. మీడియా మిత్రులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు సమాధానాలు ఇచ్చారు. గోవా గవర్నర్ అశోక్ గారికి చెందిన స్థలంలోనే వైసీపీ నాయకులు పార్టీ కార్యాలయాన్ని నిర్మించారనే విషయంపై ఎమ్మార్వో స్థాయిలో చెరువుగా ఉన్న భూమిని మార్పిడి చేశారా లేదా అనేదానిపై వైసీపీ నాయకులు సమాధానం ఇవ్వాలన్నారు. చెరువు ఆక్రమణ పై నిబద్ధత కలిగిన నాయకులు నైతికతతో నిజాలు మాట్లాడాలని వైసీపీ నాయకులకు హితవు పలికారు. ఉత్తరాంధ్రలో అనేక దానధర్మాలు చేసిన కుటుంబంగా పూసపాటి వారి మాన్సాస్ ట్రస్ట్ కు చరిత్ర ఉందన్నారు. గతంలో జరిగిన జిల్లా సమావేశాలకు బొత్స సత్యనారాయణ గారు ఎన్ని మీటింగులకు వచ్చారో జడ్పీ చైర్మన్ తెలియజేయాలన్నారు. కేంద్ర సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు మంత్రివర్యులు జితన్ రామ్ మాంఝీ గారు తిరుమల దర్శనానికి వస్తే ఆయనను స్వాగతించటానికి వెళ్లవలసి వచ్చిందనీ, దీంతోపాటు అమరావతిలో ప్రజా దర్బార్ నిర్వహణ మరియు క్యాబినెట్ మీటింగ్ లో మంత్రులు గా పాల్గొనడం జరిగిందన్నారు. నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## డిజిటలైజేషన్ కోసం

## బిఎల్‌ఓను సంప్రదించండి : కలెక్టర్

విజయనగరం, జులై 11 ప్రభాతవార్త:

జిల్లాలో డిజిటలైజేషన్ ప్రక్రియ ముమ్మరంగా జరుగుతోందని, ఇప్పటివరకు సుమారు 85 శాతం పూర్తి అయ్యిందని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. తమ ఛాంబర్లో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, సర్ ప్రక్రియ పురోగతిని వివరించారు. జిల్లాలో 15,78,949 మంది ఓటర్లు ఉండగా, వీరిలో ఇప్పటివరకు 13,25,000 మందికి డిజిటలైజేషన్ పూర్తి అయ్యిందని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్‌లో కొన్ని ఇబ్బందులు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అందువల్ల ఎవరైనా మిగిలిపోయి ఉంటే, డిజిటలైజేషన్ ను పూర్తి చేసేందుకు వెంటనే తమ బిఎల్‌ఓను సంప్రదించాలని సూచించారు. ఈ నెల 14 లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉందని, అందువల్ల ప్రజలు కూడా సిబ్బందికి తమవంతు సహారాన్ని అందించాలని కోరారు. ఎన్యూమరేషన్ ఫారాన్ని నింపి తమ ఆధార్ నంబరును నమోదు చేస్తే చాలని చెప్ప అర్హత ఉన్న ప్రతీఒక్కరికీ ఓటుహక్కు కల్పించడం, డూప్లికేట్ ఓట్లను నివారించడం, ఖచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే లక్ష్యంగా సర్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించడం జరుగుతోందని చెప్పారు. అందువల్ల ఓటర్లు తమ ఆధార్ సంఖ్యను కూడా నమోదు చేయాలని సూచించారు. అలాగే ఒక కుటుంబ సభ్యుల ఓట్లన్నీ ఒకే పోలింగ్ కేంద్రంలోకి రావాలంటే, తప్పనిసరిగా వారంతా ఒకే డోర్ నెంబరును నమోదు చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఒక ఇంటిలో ఎవరైనా సభ్యులు ఉద్యోగ, ఉపాధి నిమిత్తం వేరే ప్రాంతానికి వలస వెళ్లిన పక్షంలో, వారి వివరాలను కుటుంబ సభ్యులు ఎవరైనా బిఎల్‌ఓలకు తెలియజేయవచ్చునని అన్నారు. 18 ఏళ్లు నిండినవారంతా కొత్తగా తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకొనేందుకు ఫారమ్ 6 ద్వారా ధరఖాస్తు చేయాలని సూచించారు. డిజిటలైజేన్ పూర్తి అయిన అనంతరం ఈ నెల 21న ముసాయిదా జాబితాను ప్రచురించడం జరుగుతుందన్నారు. దీనిపై అభ్యంతరాలను ఆగస్టు 20 వరకు స్వీకరించి, ఆగస్టు 21 నుంచి సెప్టెంబరు 18 వరకు అభ్యంతరాలను పరిశీలించి, పరిష్కారం అనంతరం సెప్టెంబరు 22న ఓటర్ల తుది జాబితాను ప్రచురించడం జరుగుతుందని వివరించారు. ముసాయిదా జాబితాలో పేరు లేని ఓటర్లు, తమ బిఎల్‌ఓ లేదా తాహసీల్దార్, ఎంపిడిఓ, ఇఆర్ఓ కార్యాలయాన్ని సంప్రదించి తమ పేరును నమోదు చేసుకొనే అవకాశం ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు.

12-07pg10.qxd:12-07pg10.qxd 1/1/02 6:31 AM Page 1





స్పెయిన్‌కు రెండో గోల్ అందించిన మైఖేల్ మెరినో

# బెల్జియంపై గెలుపుతో సెమీస్‌లో స్పెయిన్

**లాస్‌ఏంజిల్స్, జులై 11:** యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్... ఫిఫా వరల్డ్ కప్‌లో మరోసారి ఆధిపత్యాన్ని చెలాయించింది. సెమీస్ బెర్త్ అందుకుంది. లాస్‌ఏంజిల్స్‌లో జరిగిన రెండో క్వార్టర్ ఫైనల్లో బెల్జియంపై 2-1 గోల్స్ తేడాతో స్పెయిన్ విజయం సాధించింది. 88వ నిమిషంలో బెల్జియం గోల్ కీపర్ సెన్నె లామెన్స్ చేసిన చిన్న పొరపాటును అందిపుచ్చుకున్న స్పెయిన్ ఆటగాడు మెరినో.. బంతిని నెట్‌లోకి పంపి స్పెయిన్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. రెండోసారి సాకర్ వరల్డ్‌కప్ సెమీఫైనల్లో చేర్చాడు.

ఈ సాకర్ వరల్డ్‌కప్‌లో స్పెయిన్ అద్భుతమైన ఆట తీరు కొనసాగిస్తోంది. బెల్జియం కఠినమైన డిఫెన్స్‌తో అడ్డుకుంటున్నా, స్పెయిన్ ఆటగాళ్లు ఎక్కడా తొందరపాటు ప్రదర్శించలేదు. తమ సహజసిద్ధమైన పాసింగ్ గేమ్‌ను విడిచిపెట్టకుండా, గోల్ చేయడానికి సరైన అవకాశం వచ్చేంతవరకు ఓపికగా వేచి చూశారు. చివరికి వారు నమ్మిన వ్యూహమే వారిని గెలిపించింది. ఈ విజయంతో స్పెయిన్ అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో వరుసగా 36 మ్యాచ్‌ల పాటు అజేయంగా నిలిచి సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పింది.

**కీలకంగా మారిన యమాల్**

18 ఏళ్ల యువ సంచలనం లామిన్ యమాల్ హైలెట్‌గా నిలిచాడు. తొలి అర్ధభాగమంతా బెల్జియం డిఫెండర్లను యమాల్ ముప్పుతిప్పలు పెట్టాడు. కుడి వైపు నుంచి పెడ్రో పోర్రోతో కలిసి దాడులు చేయడం... డిఫెండర్లను ఛేదించుకుంటూ బాక్స్ వైపు దూసుకెళ్లడం ద్వారా బెల్జియంపై తీవ్ర ఒత్తిడి పెంచాడు. 30వ నిమిషంలో స్పెయిన్ సాధించిన తొలి గోల్‌లో యమాల్ చక్కని అసిస్ట్ ఉంది. అతని వైపు నుంచే ప్రారంభమైన దాడిని పెడ్రో పోర్రో లోక్రాస్‌గా మార్చగా, డాని ఓల్మో దాన్ని గోల్ చేయడానికి ప్రయత్నించాడు. బెల్జియం గోల్ కీపర్ కోర్టియోస్ తాకి రిబౌండ్ అయిన బంతిని రూయిజ్ అత్యంత చాకచక్యంగా గోల్ పోస్ట్‌లోకి పంపాడు. దీంతో స్పెయిన్ 1-0ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే మరో 11 నిమిషాలకే చార్లెస్ కెటెలెరే గోల్ చేసి బెల్జియంను 1-1తో సమవుజ్జీగా నిలిపాడు.

**బెల్జియంకు శాపంగా గోల్ కీపర్ తప్పిదం**

స్పెయిన్ దూకుడును తట్టుకుని బెల్జియం మ్యాచ్‌లో యమాల్, మైకెల్ ఓయర్‌జబల్, డాని ఓల్మోలు కొట్టిన ప్రమాదకరమైన షాట్లను స్పెయిన్ గోల్‌కీపర్ తిబో కోర్టియోస్ అద్భుతమైన డైవ్‌లతో అడ్డుకున్నాడు. రెండో అర్ధభాగం డ్రింక్స్ బ్రేక్‌కు ముందు కోర్టియోస్ తొడ గాయంతో మైదానం వీడాడు. కోర్టియోస్ స్థానంలో మైదానంలోకి వచ్చిన సెన్నె లామెన్స్ ఒత్తిడిని తట్టుకోలేకపోయాడు. 88వ నిమిషంలో స్పెయిన్ డిఫెండర్ పాకుబార్సి కొట్టిన సాధారణ షాట్ లామెన్స్ ముందు విచిత్రంగా బౌన్స్ అయింది. దాన్ని సరిగ్గా నియంత్రించలేకపోయిన లామెన్స్ బంతిని సిక్స్ యార్డ్ బాక్స్ వైపు పుష్ చేశాడు. అక్కడ అలర్ట్‌గా ఉన్న స్పెయిన్ సబ్‌స్టిట్యూట్ మైఖేల్ మెరినో మెరుపు వేగంతో బంతిని నెట్‌లోకి పంపాడు. ఈఒక్క పొరపాటు బెల్జియం ప్రపంచకప్ కలలను కల్లలు చేసింది. 2010లో ప్రపంచకప్ గెలిచిన తర్వాత స్పెయిన్ జట్టు మళ్లీ సెమీఫైనల్‌కు చేరడం ఇదే తొలిసారి. సెమీస్‌లో స్పెయిన్‌కు అసలైన పరీక్ష ఎదురుకానుంది. మంగళవారం ఆర్లింగ్టన్‌లో జరిగే సెమీఫైనల్లో ఫ్రాన్స్‌తో తలపడనుంది.

# మెస్సీ మాయాజాలమా.. స్విస్ సంచలనమా?



## నేటి క్వార్టర్ ఫైనల్లో అర్జెంటీనా-స్విట్జర్లాండ్ అమీతుమీ

## ఉదయం 6.30 గంటలకు మ్యాచ్ ప్రారంభం

**కాన్సాస్‌సిటీ, జులై 11:** ఫిఫా ప్రపంచకప్ సెమీస్ స్టేజ్‌కు చేరుకుంటోంది. ఇప్పటికే మూడు క్వార్టర్ ఫైనల్స్ ముగిశాయి. మూడు సెమీస్ బెర్త్‌లు ఖరారయ్యాయి. చివరి క్వార్టర్ ఫైనల్ ఈ రోజు కాన్సాస్‌సిటీ స్టేడియంలో జరగనుంది. ఫిఫా కప్ వేటలో ఉన్న డిపెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా.. పోరాట పటిమకు ప్రతీకగా నిలిచిన స్విట్జర్లాండ్‌తో క్వార్టర్ ఫైనల్లో తలపడనుంది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ పోరులో విజేత సెమీఫైనల్‌లో అడుగుపెడుతుంది. ఒకవైపు లియోనెల్ మెస్సీ అనుభవం, అర్జెంటీనా దూకుడు... మరోవైపు స్విట్జర్లాండ్ క్రమశిక్షణ, సమిష్టి ఆట. దీంతో ఈ మ్యాచ్ టోర్నీలో అత్యంత ఉత్కంఠభరిత పోరుగా మారనుంది.

**అపజయం లేకుండా మెస్సీ టీమ్**

అర్జెంటీనా ఈ ప్రపంచకప్‌లో ఇప్పటివరకు తన స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరిచింది. గ్రూప్ దశలో ఆధిపత్యం చాటిన ఆ జట్టు, నాకౌట్ మ్యాచ్‌ల్లోనూ ఒత్తిడిని అధిగమిస్తూ ముందుకు సాగింది. లియోనెల్ మెస్సీ నాయకత్వంలోని అర్జెంటీనా ఈ టోర్నీలో ఇప్పటివరకు అపజయం ఎరుగకుండా కొనసాగుతోంది. నాకౌట్ దశలో కేప్ వెర్దే, ఈజిప్ట్‌లపై కష్టపడి నెగ్గిన అర్జెంటీనా ఇప్పుడు మరింత మెరుగైన ప్రదర్శన ఇవ్వాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. అర్జెంటీనా విజయాల్లో కెప్టెన్ లియోనెల్ మెస్సీ కీలక పాత్ర పోషిస్తున్నాడు. బంతి అతని కాళ్ల వద్ద ఉంటే ప్రత్యర్థి రక్షణలో అలజడి చెలరేగడం సహజం. గోల్స్ చేయడమే కాకుండా సహచర ఆటగాళ్లకు అవకాశాలు సృష్టించడంలోనూ మెస్సీ తన ప్రత్యేకతను మరోసారి చాటుతున్నాడు. అతనికి తోడుగా మార్టినెజ్, జూలియన్ అల్వారెజ్, ఎంజో ఫెర్నాండెజ్, అలెక్సిస్ మెక్ అలిస్టర్ వంటి ఆటగాళ్లు అద్భుత సమన్వయంతో జట్టును ముందుకు నడిపిస్తున్నారు. అర్జెంటీనా బలం కేవలం స్టార్ ఆటగాళ్లే కాదు. మిడ్‌ఫీల్డ్‌లో బంతిపై ఆధిపత్యం సాధించడం, వేగంగా దాడులు నిర్మించడం, అవసరమైన సమయంలో ఆట వేగాన్ని నియంత్రించడం ఆ జట్టు ప్రత్యేకత.

**పటిష్ట డిఫెన్స్‌తో స్విటర్లాండ్**

మరోవైపు స్విట్జర్లాండ్‌ను తక్కువ అంచనా వేయడం ప్రమాదకరం. ప్రపంచ ఫుట్‌బాల్‌లో భారీ జట్లను ఇబ్బంది పెట్టిన చరిత్ర ఆ జట్టుకు ఉంది. ఈటోర్నీలోనూ సమిష్టి ఆటతో క్వార్టర్ ఫైనల్‌కు వచ్చింది. నాకౌట్‌లో అల్జీరియాపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన స్విస్ జట్టు. ప్రిక్వార్టర్ ఫైనల్లో కొలంబియాపై పెనాల్టీ షూటౌట్‌లో అద్భుత మానసిక ధైర్యాన్ని ప్రదర్శించింది. స్విస్ కెప్టెన్ గ్రానిట్ షాకా మిడ్‌ఫీల్డ్‌లో జట్టుకు వెన్నెముకగా నిలుస్తున్నాడు. ఆటను నియంత్రించడం, ప్రత్యర్థి దాడులను అడ్డుకోవడం, వేగంగా కౌంటర్ అటాక్స్ ప్రారంభించడం అతని ప్రత్యేకత. ప్రత్యర్థికి అవకాశాలు ఇవ్వకుండా మ్యాచ్‌ను నియంత్రణలో ఉంచడం స్విస్ ఆటగాళ్ల నిపుణులు.

**మెస్సీ పైనే అందరి చూపు**

ఈ మ్యాచ్‌లో ప్రధానంగా అందరి దృష్టి మెస్సీపైనే ఉంటుంది. ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌ల్లో అతని అనుభవం అర్జెంటీనాకు అతిపెద్ద బలం. కీలక సమయాల్లో మ్యాచ్‌ను మలుపు తిప్పే సామర్థ్యం అతనికి ఉంది. అయితే మెస్సీని అడ్డుకునేందుకు స్విట్జర్లాండ్ ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది. ఒక్క ఆటగాడితో కాకుండా సమిష్టిగా ఒత్తిడి తీసుకొచ్చి అతనికి ఖాళీలు ఇవ్వకుండా చూడాలని స్విస్ జట్టు భావిస్తోంది. మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించడంలో మిడ్‌ఫీల్డ్ పోరు కీలకం కానుంది. బంతిపై ఆధిపత్యం సాధించిన జట్టుకే ఎక్కువ అవకాశాలు లభించే అవకాశం ఉంది. అలాగే సెట్‌పీస్‌లు, కార్నర్లు, ఫ్రీకిక్స్ వంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం కూడా విజయంలో కీలక పాత్ర పోషించవచ్చు. మెస్సీ మరోసారి తన మాయాజాలంతో అర్జెంటీనాను సెమీఫైనల్‌కు చేర్చుతాడా? లేక స్విట్జర్లాండ్ మరో సంచలన విజయంతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తుందా? అన్నది ఆసక్తిగా మారింది.

# వింబుల్డన్ ట్రోఫీ నెగ్గిన నోస్కోవా



**లండన్, జులై 11:** అన్‌సీడెడ్ చెకొస్లోవేకియా ప్లేయర్ లిండా నోస్కోవా సంచలనం కొనసాగింది. మహిళల సింగిల్స్ ఫైనల్లో చెకొస్లోవేకియాకు చెందిన 8వ సీడ్ కరోలినా ముచోవాపై మూడు సెట్ల పోరులో 6-2, 5-7, 6-3తో ఓడించింది. ఫైనల్ చేరిన తొలిసారే వింబుల్డన్ ట్రోఫీ అందుకుంది. కాగా రెండోసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫైనల్ చేరినా ముచోవా ట్రోఫీ ఆశలు కల్లలయ్యాయి. తొలి సెట్‌ను అలవోకగా నెగ్గిన నోస్కోవాకు రెండో సెట్‌లో ముచోవా పుంజుకుని గట్టి పోటీ ఇచ్చింది. సెట్‌ను నెగ్గి సమవుజ్జీగా నిలిచింది. ఫలితం తేల్చే మూడో సెట్‌లో నోస్కోవా.. ప్రత్యర్థి సర్వీసును రెండు సార్లు బ్రేక్ చేసి 6-3తో సెట్‌ను, గేమ్‌ను ముగించింది. 2024 ఆస్ట్రేలియా ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ వరకు వచ్చిన నోస్కోవా... ఈ సారి ఏకంగా వింబుల్డన్ ట్రోఫీ పట్టేసింది.

# టీ20 సిరీస్‌లో టీమిండియా వైట్‌వాష్



**సౌథాంప్టన్, జులై 11:** టీ20 ప్రపంచ ఛాంపియన్లు టీమిండియా.. వరుసగా రెండో సిరీస్ కోల్పోయింది. అయిదో టీ20 మ్యాచ్‌లో ఇంగ్లాండ్ 56 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించి అయిదు మ్యాచ్‌ల సిరీస్‌ను 4-0తో క్లీన్ స్వీప్ చేసింది. 258 పరుగుల భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా ఈ మ్యాచ్‌లోనూ తడబడింది. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 201 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఓపెనర్ అభిషేక్ శర్మ(3) నిరాశపరచగా, వైభవ్ స్థానంలో తుది జట్టులోకి వచ్చిన సంజూ కూడా 27 రన్స్ చేసి అవుటయ్యాడు. ఇషాన్ కిషన్(35 బంతుల్లో 56), తిలక్ వర్మ(25 బంతుల్లో 53) అర్ధసెంచరీలతో రాణించారు. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ 28 రన్స్, శివమ్ దూబే 14 రన్స్ చేశారు. ఇంగ్లాండ్ బౌలర్లలో కుర్రాన్ 3 వికెట్లు, అదిల్ రషీద్ 2 వికెట్లు పడగొట్టాడు.

మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 257 పరుగుల భారీ స్కోరు చేసింది. ఫిల్ సాల్ట్(6)ను ప్రసిద్ధ్ కృష్ణ అవుట్ చేశాడు. జోస్ బట్లర్(64 బంతుల్లో 131), కెప్టెన్ హారీ బ్రూక్స్(45 బంతుల్లో 95 నాటౌట్) చెలరేగి ఆడారు. సిక్స్‌లు, ఫోర్ల వర్షం కురిపించారు. రెండో వికెట్‌కు రికార్డు స్థాయిలో 233 రన్స్ జోడించారు. భారత బౌలర్లలో దూబే రెండు వికెట్లు తీశాడు.

# ఫెడ్‌రిజర్వులో భారత సంతతి ప్రముఖులు!





**వాషింగ్టన్,జులై 11:** అమెరికా ఫెడరల్ రిజర్వ్ (ఫెడ్) ఛైర్మన్ కెవిన్‌వార్ష్ ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధాన (మానిటరీ పాలసీ)వ్యవస్థను సమీక్షించి, కీలక సంస్కరణలను సూచించేందుకు ఏర్పాటు చేసిన ఐదు టాస్క్‌ఫోర్స్ ప్రముఖుల పేర్లను ప్రకటించారు. ఈ టాస్క్‌ఫోర్స్‌లలో అకడమిక్ నిపుణులు, మాజీ కేంద్ర బ్యాంకు గవర్నర్లు, కార్పొరేట్ రంగ ప్రముఖులతో పాటు భారత సంతతికి చెందిన ముగ్గురు ప్రముఖులకు కీలక బాధ్యతలు అప్పగించారు. మాజీ ఆర్‌బీఐ గవర్నర్ రఘురామ్ రాజన్, హార్వర్డ్ విశ్వవిద్యాలయ ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్ రాజ్ చెట్టి, మైక్రోసాఫ్ట్ ఎక్స్‌బాక్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆశా శర్మ ఈజాబితాలో ఉన్నారు. టాస్క్‌ఫోర్స్‌ల నాయకత్వాన్ని ప్రకటిస్తూ కెవిన్ వార్ష్, "ప్రస్తుత కీలక సమయంలో ఫెడరల్ రిజర్వ్ తన లక్ష్యాలను మరింత సమర్థంగా సాధించేలా సంస్థను తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం" అని తెలిపారు.

భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్, కేంద్ర ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు రఘురామ్ రాజన్‌కు "బ్యాలెన్స్ షీట్ పాలసీ" టాస్క్‌ఫోర్స్‌కు సహనాయకత్వ బాధ్యతలు అప్పగించారు. ఫెడరల్ రిజర్వ్ అమలు చేస్తున్న ప్రస్తుత బ్యాలెన్స్ షీట్ విధానం వల్ల కలిగే ప్రయోజనాలు, వ్యయాలు, సంస్థాగత ప్రభావాలను ఈ బృందం సమగ్రంగా పరిశీలించి మార్పులపై సిఫార్సులు చేయనుంది. ప్రస్తుతం చికాగో విశ్వవిద్యాలయం బూత్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో కేథరిన్ డుసాక్ మిల్లర్ డిస్టింగ్విష్డ్ సర్వీస్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రాజన్, 2005లో జాక్సన్ హోల్‌లో జరిగిన ఫెడరల్ రిజర్వ్ సమావేశంలో అమెరికా బ్యాంకుల సబ్‌ప్రైమ్ రుణాల ప్రమాదాన్ని ముందుగానే హెచ్చరించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపుపొందారు. అనంతరం 2008లో సంభవించిన ప్రపంచ ఆర్థిక సంక్షోభానికి సంబంధించిన ఆయన హెచ్చరికలు నిజమయ్యాయి. భారత సంతతి ఆర్థికవేత్త రాజ్ చెట్టిని "లిక్విడిటీ డిపెండెన్స్"ప్యానెల్‌కు ఎంపిక చేశారు. హార్వర్డ్ యూనివర్సిటీలోని "ఆపర్చునిటీ ఇన్‌సైట్స్" సంస్థకు డైరెక్టర్‌గా ఉన్న చెట్టి, వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలు జీవితంలో విజయవంతం కావడానికి అవసరమైన విధానాలపై పరిశోధనలు చేస్తున్నారు. హార్వర్డ్ ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్ జెరెమీ స్టెయిన్, వాల్‌మార్ట్ మాజీ అధ్యక్షుడు, సీఈఓ డగ్ మెక్‌మిలన్, చికాగో విశ్వవిద్యాలయ ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్ కెవిన్ మర్ఫీతో కలిసి ఫెడరల్ రిజర్వ్ ప్రస్తుత బ్యాలెన్స్ షీట్ విధానం ప్రభావాలను ఈ కమిటీ అధ్యయనం చేయనుంది. మైక్రోసాఫ్ట్ గేమింగ్ విభాగం ఎక్స్‌బాక్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఉన్న భారత సంతతి ఆశా శర్మకు "ప్రొడక్టివిటీ అండ్ ఎంప్లాయ్‌మెంట్" టాస్క్‌ఫోర్స్ నాయకత్వం అప్పగించారు. ఇటీవల మైక్రోసాఫ్ట్ గేమింగ్ విభాగంలో భారీ స్థాయిలో ఉద్యోగుల తొలగింపులు జరిగిన నేపథ్యంలో ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. భారత సంతతి అమెరికన్ ఆశా.. మెటా, ఈకామర్స్ సంస్థ కూపాంగ్, గ్రోసరీ డెలివరీ సంస్థ ఇన్‌స్టాకార్ట్, హోమ్ ఇంప్రూవ్‌మెంట్ సంస్థ హోమ్ డిపో వంటి కంపెనీల్లో కీలకబాధ్యతలు నిర్వహించారు. ఈటాస్క్ ఫోర్స్‌లో హోరోవిట్జ్ సహ వ్యవస్థాపకుడు మార్క్ ఆండ్రీసెన్, స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ చార్లెస్ "చాడ్" జోన్స్ సహఅధ్యక్షులుగా వ్యవహరించనున్నారు.

# 1.7 కోట్లకు పైగా ఐటి రిటర్నులు దాఖలు



**ముంబయి, జులై 11:** ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అసెస్‌మెంట్ ఇయర్ 2026-27 కోసం ఇప్పటివరకు 1.7 కోట్లకు (17 మిలియన్లు) పైగా ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలైనట్లు ఆదాయపు పన్ను శాఖ శనివారం వెల్లడించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సంపాదించిన ఆదాయానికి సంబంధించిన ఐటీఆర్1 సహజ్, ఐటీఆర్2 రిటర్నులు దాఖలు చేయడానికి జులై 31చివరితేదీ అని శాఖ మరోసారి గుర్తు చేసింది. ఈ సందర్భంగా ఆదాయపు పన్ను శాఖ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో స్పందిస్తూ, అసెస్‌మెంట్ సంవత్సరం 2026-27 కోసం ఇప్పటికే 1.7 కోట్లకు పైగా పన్ను చెల్లింపుదారులు తమ ఐటీఆర్‌లను దాఖలు చేసి ముందడుగు వేశారు" అని పేర్కొంది. ఇప్పటివరకు దాఖలైన రిటర్నుల్లో శుక్రవారం ఒక్కరోజే 10 లక్షలకు పైగా ఐటీఆర్‌లు దాఖలుచేసినట్లు వెల్లడించింది. ఐటీఆర్1 (సహజ్) చిన్న, మధ్యతరహా పన్ను చెల్లింపుదారుల కోసం రూపొందించిన సరళమైన రిటర్న్ ఫారమ్. ఏటా రూ.50 లక్షల వరకు ఆదాయం కలిగిన నివాస భారతీయ వ్యక్తులు, జీతం ద్వారా ఆదాయం పొందేవారు, ఒకే ఒక్క గృహ ఆస్తి నుంచి ఆదాయం ఉన్నవారు, అలాగే వ్యవసాయ ఆదాయం సంవత్సరానికి రూ.5,000 వరకు ఉన్నవారు ఈ ఫారమ్‌ను ఉపయోగించి రిటర్నులు దాఖలు చేయవచ్చు. ఇక ఐటీఆర్2ను వ్యాపారం లేదా వృత్తి ద్వారా లాభాలు, ఆదాయం లేని వ్యక్తులు మరియు హిందూ అవిభక్త కుటుంబాలు దాఖలు చేస్తారు. అయితే, వీరికి మూలధన లాభాల ఆదాయం ఉన్నప్పుడు ఈఫారమ్ వర్తిస్తుంది.

# డీమార్ట్ నికరలాభం రూ.936 కోట్లు




**ముంబై,జులై11:** డీమార్ట్ నిర్వహణ సంస్థ అవెన్యూ సూపర్‌మార్ట్స్ లిమిటెడ్ తొలి త్రైమాసికంలో నికరలాభం వార్షిక ప్రాతిపదికన12.8 శాతం పెరిగి 936కోట్లకు చేరినట్లు ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ.830 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. మార్కెట్ విశ్లేషకులు రూ.964 కోట్ల లాభాన్ని అంచనా వేయగా, కంపెనీ ఫలితాలు దానికి స్వల్పంగా తక్కువగా నమోదయ్యాయి. కంపెనీరాబడులు కూడా 15.1శాతం పెరిగి రూ.18,343 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో ఈ ఆదాయం రూ.15,932 కోట్లుగా ఉంది. కంపెనీ విస్తరణతో పాటు వినియోగదారుల కొనుగోళ్లు పెరగడం ఆదాయ వృద్ధికి దోహదపడినట్లు తెలిపింది. వడ్డీ, పన్నులు, తరుగుదల, రుణ విమోచనకు ముందు లాభం 16.2 శాతం పెరిగి రూ.1,526 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.1,313 కోట్లుగా నమోదైంది.

మార్కెట్ అంచనా రూ.1,517 కోట్లుగా ఉండగా, కంపెనీ దానిని స్వల్పంగా అధిగమించింది. కంపెనీ ఎబిడిటా మార్జిన్ 8.2 శాతం నుంచి 8.3 శాతానికి స్వల్పంగా మెరుగుపడింది. కంపెనీ లైక్‌ఫర్‌లైక్ విక్రయాల వృద్ధి తొలి త్రైమాసికంలో 5.5 శాతంగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో ఇది 7.1 శాతంగా ఉండటం గమనార్హం. ఈ త్రైమాసికంలో డీమార్ట్ స్టోర్లలో మొత్తం 11 కోట్ల బిల్లులు ప్రాసెస్ చేయగా, గత ఏడాది ఇదే కాలంలో ఈ సంఖ్య 9.7 కోట్లుగా ఉంది. అదనంగా, కంపెనీ రూ.1,000 కోట్ల వరకు నాన్‌కన్వర్టిబుల్ డిబెంచర్లు జారీ చేసి నిధులు సమీకరించేందుకు ఆమోదం తెలిపింది.




# స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌కు తొమ్మిది నోటీసులు

**న్యూఢిల్లీ, జులై 11:** దేశ ఆహార భద్రత నియంత్రణ సంస్థ ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా శనివారం స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌కు 9నోటీసులు జారీ చేసింది. కస్టమర్లనుంచి వచ్చిన పలుమార్లు ఫిర్యాదుల ఆధారంగా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్-2006 నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు గుర్తించిన ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ, ఈ చర్యలు చేపట్టింది. వినియోగదారులకు గడువు ముగిసిన, పాడైన, కుళ్లిపోయిన, కలుషితమైన, మానవ వినియోగానికి అనర్హమైన ఆహార ఉత్పత్తులు సరఫరా చేసినట్లు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో, సంబంధిత ఫుడ్ బిజినెస్ ఆపరేటర్ సమగ్ర వివరణతో పాటు నిబంధనల అమలుపై నివేదిక సమర్పించాలని ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ఆదేశించింది. నిర్దేశిత గడువులో స్పందించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. విక్రయించిన గుడ్లు, సంస్థకు ఉన్న ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ లైసెన్స్‌లో అనుమతి పొందిన ఉత్పత్తుల జాబితాలో లేకపోయినప్పటికీ మార్కెటింగ్ చేసినట్లు గుర్తించింది. చెల్లుబాటు అయ్యే లైసెన్స్‌లో ఆ ఉత్పత్తి చేర్చే వరకు విక్రయాలు నిలిపివేయాలని, అవసరమైతే లైసెన్స్ సవరణకు దరఖాస్తు చేయాలని ఆదేశించింది. (1 కిలో) మరియు హోంస్టైల్ మద్రాస్ మిక్చర్ పీనట్స్ ఉత్పత్తులు గడువు ముగిసిన తర్వాత కూడా వినియోగదారులకు సరఫరా చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. గడువు ముగిసిన, కుళ్లిపోయిన, దుర్వాసన వెదజల్లుతున్న, కలుషితమైన గుడ్లు సరఫరా చేసినట్లు ఆరోపణలు నమోదయ్యాయి.

# వచ్చే రెండేళ్లలో 210 కంపెనీల ఐపిఓలు




**ముంబయి, జులై 11:** భారత స్టాక్ మార్కెట్లకు వచ్చే రెండేళ్లలో టాప్‌కంపెనీలు మార్కెట్లోకి ఐపీఓ ద్వారా ఎంట్రీ ఇవ్వనున్నాయి. కన్సల్టింగ్ సంస్థ రెడ్సీర్ అంచనా ప్రకారం వచ్చే రెండేళ్లలో సుమారు 210 కొత్త కంపెనీలు ఐపిఓలకు రెడీ అవుతున్నాయి. కొత్త తరం లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ జులైలో ఉన్న 150 బిలియన్ డాలర్ల నుండి 2030 నాటికి 1 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని తెలిపింది. వచ్చే దశాబ్దం చివరి నాటికి కొత్త లిస్టింగ్‌ల వల్ల భారతదేశ ఈక్విటీ మార్కెట్లో కొత్త తరం కంపెనీల వాటా 3 శాతం నుండి 11.5 శాతానికి పెరుగుతుందని ఆ సంస్థ ఒక నివేదికలో అంచనా వేసింది. దీనితో ప్రధాన ప్లాట్‌ఫామ్‌లపై సమీకరించిన నిధుల విషయంలో భారతదేశం ప్రపంచవ్యాప్తంగా మూడవ స్థానంలోను, వృద్ధి రేటు విషయంలో మొదటి స్థానంలో నిలుస్తుంది. గతంలో ఐపీఓ మార్కెట్ అటువంటి కొత్త తరం కంపెనీల వృద్ధికి ప్రతిఫలమిచ్చిందని కానీ ఇప్పుడు అది లాభదాయకమైన వృద్ధిని కోరుకుంటోందని, లిస్టింగ్ అయిన 20 కంపెనీలలో 14 లాభదాయకంగా ఉన్నాయి. వారి ఐపీఓల ధరలను, గత ప్రైవేట్ రౌండ్ల ఆధారంగా కాకుండా.. అదే తరహా లిస్టెడ్ కంపెనీల ఆధారంగా నిర్ణయిస్తున్నారు.

దీనివల్ల, లిస్టింగ్ సమయంలో ఒక కంపెనీ చేసుకునే సన్నాహాలు.. భవిష్యత్ రాబడులను మరింత మెరుగ్గా అంచనా వేయడానికి వీలవుతుందని నివేదిక తెలిపింది గత ఏడాది మొత్తం కంటే 2026 క్యాలెండర్ సంవత్సరం ద్వితీయార్థంలోనే ఎక్కువ నిధులు సమీకరించబడతాయని కేవలం ఆరు నెలల్లోనే 19 నుంచి 22 బిలియన్ డాలర్లు సేకరిస్తాయని నివేదిక అంచనా వేస్తోంది. 200కుపైగా కంపెనీలు పబ్లిక్ మార్కెట్లలో నిధులు సమీకరించడానికి సిద్ధమవుతుండగా వాటిలో 150కి పైగా కంపెనీలు మార్కెట్ నియంత్రణ సంస్థ అయిన సెబీ నుండి ఇప్పటికే ఆమోదం పొందాయి. దశాబ్దంలో భారత్‌లోని ప్రధాన ప్లాట్ఫారమ్లపై ఐపీఓలు 8 రెట్లు పెరిగాయని.. ఇందులో ఐదేళ్లలో 300కి పైగా కొత్త లిస్టింగ్లు కూడా ఉన్నాయని నివేదిక పేర్కొంది. బలమైన దేశీయ మూలధనం, అధిక కార్పొరేట్ ఆదాయాలు, మెరుగైన నిష్క్రమణ అవకాశాలు, అనుకూలమైన నియంత్రణ వంటివి ఈ వృద్ధికి తోడ్పడ్డాయని కన్సల్టింగ్‌సంస్థ రెడ్సీర్ నివేదిక తెలిపింది.

# 20వేల కోట్లకు పెరిగిన హిండాల్కో అల్యూమినా పెట్టుబడి




**ముంబయి, జులై 11:** ఆదిత్య బిర్లా గ్రూప్ ఒడిశాలో తన పెట్టుబడులను మరింత విస్తరించింది. రాయగడ జిల్లాలోని కన్సరిగూడలో నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ అల్యూమినా రిఫైనరీ ప్రాజెక్టు విస్తరణ కోసం అదనంగా రూ.12,000 కోట్ల పెట్టుబడి పెట్టాలని నిర్ణయించింది. ఈ ప్రతిపాదనపై శనివారం ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీతో ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్మన్ కుమార్ మంగళం బిర్లా సమావేశమై చర్చించారు. ఈ విస్తరణతో రిఫైనరీ సామర్థ్యం ప్రస్తుతం ప్రతిపాదించిన సంవత్సరానికి 10 లక్షల టన్నుల నుంచి 30 లక్షల టన్నులకు పెరగనుంది. దీంతో ప్రాజెక్టులో మొత్తం పెట్టుబడి రూ.20 వేల కోట్లకు చేరనుంది.

ఆదిత్య బిర్లా గ్రూప్‌కు చెందిన లోహ రంగ ప్రముఖ సంస్థ హిండాల్కో ఇండస్ట్రీస్ ఈ గ్రీన్‌ఫీల్డ్ అల్యూమినా రిఫైనరీని అభివృద్ధి చేస్తోంది. తొలుత ఈ ప్రాజెక్టును సంవత్సరానికి 10 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో, సుమారు రూ.8,000 కోట్ల పెట్టుబడితో ఆమోదించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం, ప్రాజెక్టు దీర్ఘకాలిక అవకాశాలను దృష్టిలో ఉంచుకుని సంస్థ ఇప్పుడు మరో రూ.12,000 కోట్ల పెట్టుబడితో అదనంగా సంవత్సరానికి 20 లక్షల టన్నుల శుద్ధి సామర్థ్యాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. ఈ విస్తరణ వల్ల ప్రత్యక్ష, పరోక్షంగా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు ఏర్పడటంతో పాటు స్థానిక పారిశ్రామికవేత్తలు, సేవల రంగ సంస్థలు, అనుబంధ పరిశ్రమలకు కొత్త అవకాశాలు లభిస్తాయని కంపెనీ పేర్కొంది. అలాగే ఈ ప్రాజెక్టు విస్తరణతో ఒడిశాలో అల్యూమినియం డౌన్‌స్ట్రీమ్ పరిశ్రమల అభివృద్ధికి ఊతం లభించనుంది. అల్యూమినియం విలువ ఆధారిత ఉత్పత్తుల శ్రేణిలో రాష్ట్రం మరింత వాటాను దక్కించుకునేందుకు ఇది దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.